సాహిత్య వ్యాకరణ వ్యాసావళి

రచయిత :

దువ్వూరి సూర్యనారాయణ శాస్త్రి

విషయ సూచిక

1. ఛందశ్శాస్త్రము – షట్ప్రత్యయములు – భారతి – ఫాల్గుణ మాసం – ప్రజోత్పత్తి సం॥

2. తారకాపచయ విమర్శనము – ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక సంచిక – 1; సంపుటి 21 (1931)

3. దీపాలవారి జితకాశి – ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక సంచిక 2; సంపుటి 23

4. కొన్ని వృత్తములు : తన్మత్తభేదములు – ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక సంచిక 3; సంపుటి 21

5. అప్పకవీయము – యతిప్రాసలు – భారతి; ఫాల్గుణ మాసం అంగీరస సం॥ (1932)

6. అప్పకవీయము – యతిప్రాసలు – భారతి; చైత్రమాసం శ్రీముఖ నామ సం॥ (1933)

7. ఛందోలంకారములు – దోష ప్రకరణము – భారతి ఆషాఢమాసం; శ్రీముఖ నామ సం॥। (1933)

8. ఛందోదర్పణము – గిడుగువారి పీఠిక (1934) – భారతి; కార్తీకమాసం భావ నామ సం॥

9. నాటకాలు – పాత్రలు – భాషలు – ప్రభుద్ధాంధ్ర – 1935

10. కొత్త పాత కవిత్వములు – ప్రభుద్దాంధ్ర – 1935

11. రసరాద్ధాంతం – భారతి 1935 భాద్రపదమాసం

12. రసవాదోపసంహృతి – భారతి 1935 – పుష్యమాసం

13. ఆంధ్రవాచస్పత్యము (కొన్ని సందేహాలు) – హిందూసుందరి

14. మురారి – అనర్ఘరాఘవము – సమాలోచనము – హిందూసుందరి

15. మురారే స్తృతీయః పంథాః – చంద్రిక

16. వ్యాసపరిశీలనము – చంద్రిక

17. శంకరాచార్యులు – మండన పండితుడు – ఉభయభారతి – హిందూసుందరి

18. వ్యావహారికాంధ్రము కూడా కృతకమే అగుచున్నది – ఆంధ్రభూమి

మున్నుడి

శ్రీ దువ్వూరి సూర్యనారాయణ శాస్త్రి & శ్రీమతి సుబ్బలక్ష్మి దంపతులు

జననము - బాల్యము :

ఈయన, గోదావరి తీరం ఆత్రేయ, భారద్వజ, గౌతమి నదుల సంగమ స్థానము, తూర్పు గోదావరి – ద్రాక్షారామానికి సుమారు 7 కి॥మీ దూరములో ఉన్న "మసకపల్లి" (మస్కరపల్లి) గ్రామంలో జన్మించినారు. దువ్వూరి పెదశేషయ్య, శేషమాంబ వీరి జననీ జనకులు.

విద్యాభ్యాసము :

ప్రాధమిక విద్య స్వగ్రామములోను, మిగిలిన విద్యాభ్యాసము ద్రాక్షారామము, కొవ్వూరు, విజయనగరము మహారాజా కళాశాలయందు జరిగినది. "ఉభయ భాషా ప్రవీణ" ఆంధ్ర విశ్వవిద్యాలయము ద్వారా నందినారు. శ్రీ ఆకుండి వెంకటశాస్త్రి, పేరి వెంకటశాస్త్రి, దువ్వూరి వెంకట రమణ శాస్త్రి గారులు వీరి గురువులు.

ఉద్యోగపర్వము & సాహిత్యసేవ పర్వము :

❖ కాకినాడలో 1933-39 వరకు శ్రీమతి బాలాంత్రపు శేషమాంబ వారి మహిళా సంస్కృత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయునిగా పనిచేసినారు.

❖ 1940-1946 సిబిఎన్ ప్రాధమిక బాలికోన్నత పాఠశాలలో తెలుగు పండితునిగా పనిచేసినారు.

❖ 1947 సం॥లో "మల్లాది సత్యలింగ నాయకర్ ఛార్టీసు నందు" సీనియర్ తెలుగు పండితునిగా నియమితులై 1972 సం॥లో పదవీ విరమణ చేసినారు.

❖ "ఆంధ్రసాహిత్య పరిషత్తు" కాకినాడలో పుస్తక ప్రచురణ – ప్రచారములో సహకారమునందించిరి. "ఆంధ్ర సాహిత్య పరిషద్పత్రిక" ప్రచురణలో సహకరించినారు.

❖ ఈ కాలములోనే ""సూర్యరాయ ఆంధ్రనిఘంటువు 3,4,5,6,7 సంపుటముల నిర్మాణములో పాల్గొన్నారు.

❖ 7వ సంపుటము అనుబంధ శుద్ధ ప్రతిని శ్రీ ఆకెళ్ళ శేషాద్రి, సామవేదం శ్రీరామమూర్తి గార్లతో కలసి 1972లో పూర్తి చేసిరి. – ఆంధ్ర సాహిత్య పరిషత్తు సహాయ కార్యదర్శిగా కూడా పనిచేసినారు.

- 1966లో శ్రీ జటావల్లభుల పురుషోత్తముగారి ఆధ్వర్యములో ప్రారంభించిన "శ్రీ వేణుగోపాల సంస్కృత ప్రచారసభకు" తమదైన సహాయ సహకారములు అందించిన పండితులలో వీరొకరు.
- కాకినాడ – జగన్నాధపురములో చాలాకాలము "మల్లాది వెంకట రామయ్యగారి" పేరిట జరిపించిన "సంస్కృతగోష్ఠి" కార్యక్రమాలను వీరు నిర్వహించినారు.
- 1966లో ఆంధ్ర విశ్వ విద్యాలయ భాషా ప్రవీణ ప్రవేశ పరీక్ష శిక్షణకు స్థాపించిన పాఠశాల నిర్వాహణలో వీరు తోడ్పాటు నందించిరి. తదనంతరము అది ""పైండా సత్యనారాయణ మూర్తి సంస్కృత విద్యాపీఠముగా ప్రసిద్ధి నొందినది.

సారస్వత రంగము :

ఈయన రచనలలో ఖండ కావ్యములు, చంపూ ప్రభందములు, జీవిత చరిత్రలు, చిన్నకథలు, ఉపవాచకములు, శతకములు కలవు.

వీరి సాహిత్య విమర్శనావ్యాసములు ఆనాటి "కృష్ణాపత్రిక", "భారతి", "ప్రభుద్ధాంధ్ర", "హిందూసుందరి", "ఆంధ్రపత్రిక", "ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక" మొ॥ వాటియందు ప్రచురించబడినవి.

రచనలు, ఖండకావ్యము:

- **"హారతి"** (1937) (అలభ్యం)
- **"జీమూత వాహనుడు"** (1940) – 1941–46 వరకు బి.ఎ., ఇంటరు పాఠ్యముగా మద్రాసు, ఆంధ్ర, ఉత్కల విశ్వవిద్యాలయ ములలో
- **"జడభరతుడు"** (1950) – 1950–1955 వరకు బి.ఎ. పాఠ్యముగా ఆంధ్ర విశ్వవిద్యాలయములో
- **"అహల్య"** (1956) – 1957–1960 వరకు బి.ఎ. పాఠ్యముగా ఆంధ్ర విశ్వవిద్యాలయములో
- **"భక్త శబరి"** (1957) – 1968 – పి.యు.సి. పాఠ్యము ఉత్కల విశ్వవిద్యాలయము.

చంపూ ప్రబంధములు : **(నీలకంఠ దీక్షిత కవి సంస్కృత ప్రబంధములకు అనువాదములు)**

- **"నీలకంఠ విజయము"** (1959)
- **"శివలీలార్ణవము"** (1968)

జీవిత చరిత్రలు :

- శ్రీమతి బాలాంత్రపు శేషమాంబ జీవితచరిత్ర (1953)
- శ్రీ వ్యాకరణాచార్య పేరి వెంకటశాస్త్రి జీవిత చరిత్ర (1958)

శతకములు :

- **"శ్రీ మల్లేశ్వర శతకము"** (1930)
- **"హనుమత్రింశతి"** (సంస్కృతము) (1975)
- **"దుర్గాశతి"** (1975)

ఇతర రచనలు :

- “ఋతుచర్య” (1970)
- “ప్రబోధసుధ” (1972)
- “కుందమాల” (1978)
- “శతరుద్రీయము” (1980)

ఉపవాచకములు :

- ధన్యజీవులు, మణిమంజీరము, నాలుగు కథలు, మణిమాల, బుద్ధ బోధలు, మూడు నక్షత్రములు, భాస నాటక కథలు.

తొలికథలు :

- ధనమ్మ గుడి (1937 హిందూసుందరి)
- ఉదుకుమోతు (1937/9 హిందూసుందరి)
- రాదారి పడవ
- అగ్గిపెట్టెలవాడు

ఛందశ్శాస్త్రము

షట్ప్రత్యయములు

ఆంధ్ర వాఙ్మయరచనము ౧౧-వ శతాబ్దిని ప్రారంభమైనదని విమర్శకమహాశయుల యాశయము. అందు పద్యప్రబంధరచనమునఁ గల గణ యతి ప్రాసాది నియమములఁ దెలుపు గ్రంథము లాది నున్నట్టు లగపడదు. ౧౨-వ శతాబ్దమున భీమన కవిజనాశ్రయ మను నాంధ్రచ్ఛందోలక్షణమును రచించియున్నాఁడు. ఇందు కొన్ని విశేషాంశములు దప్ప నితరములెల్ల సాంస్కృతికములే గ్రహింపఁబడినవి. భీమన్నపిదపఁగూడ ననేకు లించుక విశేషమును జూపుచు పెక్కులక్షణగ్రంథముల రచించిరి. ఇం దన్నిటను ప్రతిపాదితాంశ మొక్కటియే యైనను నుత్తరోత్తర మించుక వైలక్షణ్యమును జూపసాగిరి. ప్రతిచ్ఛందోగ్రంథమునను విభాగ మొకేరీతిగ నున్నది. అందు ప్రకృతమున షట్ప్రత్యయవిభాగవిషయము నించుక విమర్శింతము.

ఈషట్ప్రత్యయవిభాగముకూడ సంస్కృతలక్షణముల ననుసరించియే యాంధ్రమునఁ జేర్చిన ట్లగపడుచున్నది. కాని వీనిలోని కొన్ని ప్రత్యయములవిషయమున సంస్కృతాంధ్ర లక్షణములకును, నాంధ్రలక్షణములలో వానిలో వానికిని మతభేదము కానవచ్చుచున్నది. అట్లు వచ్చుటకు కారణ మేమో తెలియదు.

సంస్కృతలక్షణకర్తలలో నెల్ల ప్రాచీనుఁడు పింగళమహాముని. ఈతఁడు విశేషముగ వైదికమును సంబంధించినవిషయములఁ దెలుపుచు సూత్రరూపమున తన గ్రంథమును వ్రాసియున్నాఁడు. ఈకవి తనగ్రంథమున నీ ప్రత్యయవిభాగమును జేసియున్నాఁడు. కాని వాని నారింటిని జెప్పియుండలేదు. సూత్రములఁబట్టి నాలుగే ప్రత్యయములఁ జెప్పినట్లు స్పష్టమగుచున్నది. కాని పింగళుఁడు వృత్తసంఖ్యా విషయమునఁ జెప్పిన "పరే పూర్ణమ్" అనెడు సూత్రమునకు వ్యాఖ్యానకర్తలు విశేషార్థము తీసి యద్దానిచే మేరులగ్రక్రియనుగూడ కృతార్థము చేసియున్నారు. ఈ మేరుప్రస్తారలగ్రక్రియ[illegible] మనకు ప్రయోజన ముంటచే దీనిని గ్రహింతము.

ఈప్రత్యయము లన్వర్థములుగా నున్నట్లు వాని నామములే చెప్పఁగలవు. కాని తెనుఁగులక్షణకర్తలు, సంస్కృత లక్షణకర్తలలో నిటీవలివారు చెప్పిన "అధ్వము" అనునారవప్రత్యయమును, శకటలగ్రక్రియను గూడ నీతఁడు చెప్పియుండలేదు. తక్కిన ప్రస్తారము, నష్టము, మేరులగ్రక్రియ యనునవి యిటీవలి లక్షణకర్తల లక్షణములతో సరిపడియే యున్నవి. ఉద్దిష్టప్రత్యయమునఁగూడ ఫలము సమమే గాని చేయువిధమందు కొంత విలక్షణము జూపియున్నాఁడు. అది యెట్లన—

UUIUIU—ఈగురులఘు సముదాయ మెన్నవ ఛందమున నెన్నవవృత్త మగునని యడిగిన నాపంక్తిని తుదినుండి చూచునపు డేలఘువు ముందుగా నుండునో దానిపై రెండంకెను వేసి తరువాతిది గురువైన, నారెండంకెను రెట్టించి యందొకటి దీసి మిగిలినసంఖ్య నాగురువుపైని వైచుచు, తరువాత మరల లఘు వుండెనేని యీ యొకటి తీయఁగా వచ్చిన యంకనే రెట్టించి యంతయును దానిపై వేయుచుఁ బోవ కొస కెంతసంఖ్య వచ్చునో యదియే యావృత్త మెన్నవదో చెప్పును. గురులఘువుల లెక్కించి ఛందము గ్రహింపవచ్చును.

21. 11. 6. 3. 2.

ఉదా:— U U | U | U; ఆరవ ఛందమున ననఁగా గాయత్రీచ్ఛందమున నియ్యది యిరువదియొకటవ వృత్త మగును.

దీనిని కవిజనాశ్రయుఁడు కించిద్భేదపురస్సరముగ చెప్పియున్నాఁడు. ఎట్లన, గురులఘువులపై మొదటినుండి యేకాదిద్విగుణములుగ నంకెలను వేసి, యందు

లఘువులపైనున్న సంఖ్యలను కూడి యం దొకటి కలిపిన నెంతసంఖ్య వచ్చునో యన్నవవృత్త మగును.

1. 2. 4. 8. 16. 32.

ఉదా:— U U | U | ౧;...౧౬+౪+౧= ౨౧—ఇన్నవవృత్త మగును.

ఇట్లీవిషయమున నిరువురి మతమునను ఫలము సమమే.

ఇంక వృత్తసంఖ్యావిషయమును పింగళుఁడు నాలుగుసూత్రములచేఁ మూఁడువిధములుగఁ జెప్పియున్నాఁడు.

“ద్విరర్ధే”—౮ అధ్యా. ౨౭ సూ. “రూపే శూన్యమ్”—౨౮ సూ. “ద్విః శూన్యే,”—౨౯ సూ. “తావదర్ధం తద్గుణితమ్”—౩౦ సూ.

అందు మొదటివిధము:—౬-వ ఛందమునఁ గల వృత్త సంఖ్య తెలిసికొనవలె నన, నాయారును అర్ధస్థితిగాఁ జేయవలెను. (అనఁగా ఆసంఖ్యలో నెంతెంతపరిమితిగల భాగములు రెండున్నవో చూచిన) ౩ లభించును. అర్ధసంఖ్య ౨ లభించును. ఈరెండు నొకచో వేరుగ నుంచవలెను. మనకు లభించిన ౩ వ అర్ధస్థితిచేయ వీలులేదు గాన (అనఁగా విషమసంఖ్యగాన), దానినుండి యొకటి తగ్గించి సమసంఖ్యగాఁ జేయవలెను. ఇట్లు చేసినప్పుడు పూర్వము వేరుగా నుంచిన రెండంకెక్రింద సున్న నుంచవలెను. మిగిలినరెంటిలో నర్ధసంఖ్యను తెలిసికొనఁగా ౧ మిగులును. రెండర్ధము లట్టివి రెండునఁ గలవు గాన మరల ౨ లభించును. ఈరెండును మరల నిదివర కుంచిన సున్న క్రింద నుంచవలెను. మిగిలిన యొకటి విషమసంఖ్య గాన తీసివైచి మరల నారెంటిక్రింద సున్న నుంచవలెను. అట్లుచేయ నిట్లు సిద్ధించును:—

ఛందస్సు	అర్ధభాగము	సిద్ధములు
౬	౩	౨
ఆమూఁడువిషమముగాన		౦
౧ తీసివేయఁగా	౨	౨
ఆరెంటిలో నర్ధము	౧ ఇదివిషమముగాన	౦

ఈస్థితిలో సిద్ధస్థానములలో నున్నలస్థ[illegible] నఁగా శూన్యస్థానముల) రెట్టింపుచు సంఖ్యాస్థలముల శూన్యస్థానములయొద్ద సిద్ధించిన సంఖ్యనుంచి యంతే సంఖ్యచే దానిని రెట్టించవలెను.

పైసిద్ధములు ౨...౮ × ౮ = ౬౪ ఇది యాఛందమునఁబుట్టు
౦...౪ × ౨ = ౮ వృత్తముల సంఖ్య.
౨...౨ × ౨ = ౪
౦...౨

ఇది స్పష్టపరుచుటవలన నింత విస్తరమైనది గాని తెలిసికొనినవెనుక నంతకష్టముగా నుండదు. ఇట్లే యేఛందమునకైనను వృత్తసంఖ్య చెప్పవచ్చును. ఇంక రెండవ విధము:—ఇన్నవఛందమున నెన్నివృత్తములో తెలిసికొనుటయే గాక ఇన్నవఛందమువఱకుఁ గడచినవృత్తము లెన్నో తెలిసికొనుటయుఁగూడ పైదానిభేదమే అని చెప్పినాఁడు. “ద్విర్యూనం తదంతానామ్”-అధ్యా ౮, ౩౧ సూ. ఈసూత్రముచే నద్దానివిధమును స్పష్టపరచినాఁడు. వక్త యేఛందమువఱ కెన్నివృత్తములని యడిగెనో యాఛందమున పుట్టువృత్తసంఖ్య రెట్టించి దానిలో ౨ తీయఁగాఁ గడచినవృత్తసంఖ్య వచ్చును. ఉదా:— ఛందము ౬; దీనిలో వృత్తములు

౬౪ × ౨ = ౧౨౮ − ౨ = ౧౨౬

ఇన్నివృత్తము లాఛందమువరకుఁ గడచినవని తెలియును. మూఁడవవిధము:— పైని ఇనుమడించినవృత్తసంఖ్యలో నుండిరెండును తీయకున్న నెంతసంఖ్య యుండునో యది వక్త చెప్పినఛందముతఱువాతిదాని వృత్తసంఖ్య యగును. అనఁగా నేడవఛందమున ౧౨౮ వృత్తము లుద్భవించు నని తేలును. ఈవిషయమును “పరే పూర్ణమ్” అనెడి ౩౨-వ సూత్రముచే స్పష్టపరిచియున్నాఁడు. ఈరీతిని వృత్తసంఖ్యాప్రత్యయము మూఁడువిధములుగాఁ జెప్పియున్నాఁడు. మొత్తముమీఁద పింగళచ్ఛందమున నున్న ప్రత్యయములును, కవిజనాశ్రయమునఁ గల ప్రత్యయములును ప్రస్తార నష్ట ఉద్దిష్ట వృత్తసంఖ్యామేరులగక్రియలలో నైక్యము నందియున్నవి. విశేష మేమన, నీతఁడు శకటలగక్రియను గాని, యధ్వప్రత్యయమును గాని చెప్పి

యుండలేదు. పింగళచ్ఛందమునకు వ్యాఖ్యను వ్రాసిన భట్టహలాయుధుఁడుమాత్రము తనవ్యాఖ్యలో "వృత్త ప్రత్యయో అధ్వపరిచ్ఛిత్తి రిత్యేకే, సోత్యల్పత్వా త్పురు షేచ్ఛానిధాయిత్వే నానియతత్వాచ్చ నోక్తః" అని వ్రాసియున్నాఁడు. పింగళునితరువాతి లక్షణకర్తలుగూడ వానిని పేర్కొనియుండలేదు.

౧. వాణీభూషణమ్: దామోదరమిశ్రవిరచితము. ఈతఁడు షట్ప్రత్యయవిభాగమే స్పష్టముగాఁ జేయ లేదు. "మాత్రాప్రస్తారః మాత్రోద్దిష్టం మాత్రానష్టం వర్ణమేరుః" అని యింకను కొన్ని విశేషవిభాగములుగా జెప్పియున్నాఁడు. శకటాధ్వములవిషయ మెత్తలేదు. ౨. శ్రుతబోధ: మహాకవి కాళిదాసకృతము. దీనియందు వృత్తములలక్షణములు తప్ప మరేమియు లేవు. ౩. ఛందో మంజరి: గంగాదాసకృతము: దీనియందుఁగూడ నీవిభా గము చెప్పఁబడలేదు. ౪. వృత్తరత్నాకరము: భట్ట కేదారవిరచితము. ఈతఁడు స్పష్టముగ నాప్రత్యయము లనుగూడ చెప్పియున్నాఁడు:

"ప్రస్తారో నష్ట ముద్దిష్ట మేకద్వ్యాదిలగక్రియా,
సంఖ్యాన మధ్వయోగశ్చ" అని.

ఈతఁ డీయాఱింటిని విషమ సమాది భేదములచే ననేకవిధ ములుగా విభజించియున్నాఁడు. అవన్నియు ప్రకృత మున కనవసరములు గాన వానిని చెప్ప పనిలేదు. కవి జనాశ్రయమునను, పింగళచ్ఛందమునను గల వృత్తసంఖ్య యనుప్రత్యయమున కీతఁడు "సంఖ్యానమ్" అని పేరు పెట్టినాఁడు. కాని ప్రక్రియ సమానమే. మఱియు మేరు శకటలగక్రియావిషయమున నించుక చేయువిధమున భేదము చెప్పియున్నాఁడు. ఫలము సమమే. ఆవిధ మంతయును స్పష్టపరుపవలెనన్న గ్రంథవిస్తర మగునను భీతిని వానిస్వరూపములమాత్ర మిందు చూపుచున్నాను. మఱియు, శకటలగక్రియ కీతఁడు "పతాకాప్రస్తారః" అని పేరుపెట్టియున్నాఁడు. దానియాకార మా రెంటిని అనుకరించుచుండుటచే వచ్చిననామభేద మంత చర్చ నీయము గాదు. చూడుఁడు—

భీమన చెప్పిన శకటచక్రము, ౫ ఛందమునకు—

౧	సర్వగురువృత్తము.										
౨	౩	౫	౯	౧౭	ఏకలఘుకములు.						
౪	౭	౧౩	౨౫	౬	౧౧	౨౧	౧౦	౧౯	౧౮	ద్విలఘుకములు.	
౮	౧౫	౨౯	౧౪	౨౭	౨౬	౧౨	౨౩	౨౨	౨౦	త్రిలఘుకములు.	
౧౬	౩౧	౩౦	౨౮	౨౪	చతుర్లఘుకములు.						
౩౨	సర్వలఘువృత్తము.										

భట్టకేదారుఁడు చెప్పిన పతాక, ౫ ఛందమునకు—

౧	౨	౪	౮	౧౬	౩౨
సర్వగురువృత్తము.	౩	౬	౧౨	౨౪	సర్వలఘువృత్తము.
	౫	౧౦	౨౦	౨౮	
	౯	౧౮	౧౪	౩౦	
	౧౭	౭	౨౨	౩౧	
	ఏకలఘుకములు.	౧౧	౧౬	చతుర్లఘుకములు.	
		౧౯	౧౫		
		౧౩	౨౩		
		౨౧	౨౭		
		౨౫	౨౯		
		ద్వి.	త్రి.		

ఈరీతి నాయావృత్తములు రెంటను సమానములే.

భీమన చెప్పిన మేరువు, ౪ ఛందమునకు—



కేదారుఁడు చెప్పిన మేరువు ౪ ఛందమునకు—



ఈరీతిగ వ్రాయాక్రియా భేదములే గాని ఫలితము సమము గానే యున్నది. ఇఁక వృత్తరత్నాకరమందలి ప్రస్తార నష్ట ఉద్దిష్ట వృత్తసంఖ్యలు భీమనమతప్రకారము సరి పడియే యున్నవి. అధ్వవిషయమున నీతఁడు,

"సంఖ్యైవ ద్విగుణైకోనా సద్భి రధ్వా ప్రకీర్తితః,
వృత్తస్యాంగులికే వ్యాప్తి రధః కుర్యా త్తథాంగులిమ్"

అని చెప్పియున్నాఁడు. అనఁగా నీవృత్తప్రస్తారమున కెంతభూమి కావలసియుండునని యడిగిన వక్త చెప్పిన ఛందోవృత్తసంఖ్యను ద్విగుణించి దానిలో నొకటి త్రోయ మిగిలిన దెంతసంఖ్యయో యన్నియంగుళముల భూమి యాఛందఃప్రస్తారమునకు కావలెనని యర్థము. ఉదా:—ఛందము 3; దానివృత్తములు

$$౮ \times ౨ = ౧౬ - ౧ = ౧౫$$

ఇన్నియంగుళములభూమి మూఁడవఛందఃప్రస్తారమునకు కావలెనని తేలుచున్నది. ఛందము ప్రస్తరింపవలె నన్న పూర్వులు భూమిపై బూడిద వోసి వ్రేలితో గురులఘువుల వ్రాసి ప్రస్తరించుకొనెడి యాచారము గలదని పెద్దలిప్పటి కిని చెప్పుచున్నారు. అందువలననే యీప్రత్యయమున గ్రంథకర్తలు చేర్చియుందురు. అట్లనుకొన్నను, ఒక్కొక్క గురులఘువొక్కొక్క చతురపుటంగుళమునఁబట్టఁజాలును. అట్టియెడ మూఁడవఛందము ప్రస్తరింపవలెనన్న 3 అంగుళముల వెడల్పు, ౮ అం. పొడవు గలభూమి (అనఁగా ౨౪ చతురపుటంగుళములభూమి) కావలెను. పైరీతిని జూడ, ౧౫ అంగుళముల భూమిమాత్రము చాలు నన్నట్లు చెప్పిరి. ఈవిషయము భట్టకేదారుం డతిచమత్కారముగ వ్రాయుచు పూర్వమతముల ఖండించుచు తమ మతమును ప్రతిపాదించినాడు. మఱియు ప్రస్తారగురులఘు పంక్తులనడుమ నొక్కయంగుళము విడువవలెనని చెప్పియున్నాఁడు. ఆరీతిఁ జేయువారిరీతిని పై ౧౫ అంగుళములభూమి మూఁడవఛందఃప్రస్తారమునకు సరిపడును. గాని యాయంగుళ మెంతవైశాల్యము కలదియో, ఒకొక్క యంగుళమున నెన్ని గురులఘువు లుంచవచ్చునో యయ్యాది స్పష్టముగాఁ జెప్పియుండలేదు. ఈతనిమతముప్రకారము 3వ ఛందము ప్రస్తరింప 3 గురులఘువులు పట్టెడియంగుళమును, ౧౦ వ ఛందము ప్రస్తరించునపుడు ౧౦ గురులఘువులు పట్టునట్టియంగుళమును కావలెనని తేలుచున్నది. అట్లెన్నఁడైన సంభవించునా? అప్పుడు వీ రొకసమాధానము చెప్పకొందురు. ప్రస్తారార్థ మెంతపొడవుభూమి కావలెనో యద్దానినే చెప్పితిమి గాని చతురమును జెప్పియుండలేదని. అట్లు చెప్పుటవలన లాభమేమి? ఒకచోట ౨ అంగుళములవెడల్పు ౧౦౨౩ అంగుళములపొడవును కల భూమి యున్నదనుకొన్న దానిలో తమ మతముప్రకారము ౧౦ వ ఛందము ప్రస్తరింప సరిపడుపొడవు గలదు గదా యని ప్రస్తరింప నెంచిన, వానిలోని వృత్తస్వరూపము స్పష్టపడునా? స్పష్టపడదు. అట్లయిన క్రియా

కల్పనముయొక్క ముఖ్యోద్దేశమే పోవుచుండ నింక నా ప్రత్యయమును జెప్ప నేల? మఱియు భూమిమీఁద ప్రస్త రించినపుడు గురులఘుపరిమాణ మొకప్పు డున్నతముగా నుండవచ్చును; చిన్నదిగా నుండవచ్చును. అట్టియెడ నీ ప్రత్యయప్రయోజన మంతగా కనుపడదు. కావుననే పింగళచ్ఛందోవ్యాఖ్యానకర్తలలో "శ్రీ వేచారామ సార్వభౌమ" అనునతఁడుగూడ "అధ్వపరిచ్ఛిత్తిరూపస్య ప్రత్యయ స్యాంగులిఘటితత్వేన అననుగతత్వాత్ సూత్ర కారేణ నోక్తః అత్యంతజ్ఞానహేతుత్వా దితి. తదాధా రాంగులిజ్ఞాన మంతరేణాపి ఛందోజ్ఞానం, ప్రస్తారజాత జ్ఞానంచ సంభవతీతి" అని వ్రాసియున్నాఁడు. కాన నియ్యది యనవసరమని తోఁచుచున్నది.

ఈ సంస్కృతమర్యాద లిట్లుండ కవిజనాశ్ర యుఁడుగూడ దీనిని జెప్పియున్నాఁడు. కాని యాతని లక్షణమునకు రెండువిధములగు నర్థములు చెప్పవచ్చును. "అను వధ్వ మేకరహిత ద్విగుణితసంఖ్యాంగులి కృతివ్యాప కము." అని చెప్పియున్నాఁడు. ఇట సంఖ్యాశబ్దము నకు వృత్తసంఖ్యయని యనుకొన్న ఛందము 3, దీనివృత్త ములు ౮, ఏకరహితము చేయ ౭, ద్విగుణితముచేయ ౧౪-ఇన్ని యంగుళములభూమి 3 వ ఛందఃప్రస్తారము నకు కావలెననియు, రెండవరీతిని ద్విగుణితవృత్తసంఖ్యలో నేకరహితముచేయ ౧౫ అంగుళములనియు, మూఁడవ రీతిని సంఖ్యాశబ్దముచే ఛందస్సంఖ్యయు, వృత్తసంఖ్య యును గూడ గ్రహించి యొక్కొక్కటి తీయ ౧౮ అంగుళములనియు దేలుచున్నది. ఇది యెట్లు వేయ వచ్చునో స్పష్టముగా లేదు. ఇట్లే యీకవిజనాశ్రయుని తరువాతివారును నీవిభాగములఁ జేసియున్నారు. కాని ప్రత్యయము లన్నియు సరిపడియే యున్నవి. ఈయధ్వ ప్రత్యయవిషయమే వారివారిమతముల భిన్నభిన్నముగా నున్నది.

(౧) కావ్యాలంకార చూడామణి: విన్నకోట పెద్దనకృతము:

"వృత్తసంఖ్యనిడుపు వెడలుపు రెట్టించి
నాని నొక్క డొకఁడు వరుస నెన్న
నెన్ని యయ్యె నన్ని యొసఁగు నంగుళు లని
ప్రస్తరింప నిడుపు వరఁగు విప్పు."

3 వ ఛందము.

C	C	C
|	C	C
C	|	C
|	|	C
C	C	|
|	C	|
C	|	|
|	|	|

అనగా "వృత్తసంఖ్య పొడవును వెడలుపుచే రెట్టింపఁగా నెంత సంఖ్య వచ్చునో యయ్యది యంగుళము లను కొని, వానిని వరుసగా వేసి ప్రస్తరించిన" అని యర్థము చెప్పిన ౨౮ అంగుళములు 3 వ ఛందమునకు కావలసివచ్చును. కాని పై పద్యమునుండి యీయర్థ మతిక్లిష్ట ముగా వచ్చుచున్నది. ఈరీతి ౨౮ అంగుళ ములను గడి ౧ కి ఒక్కొక్క అంగుళ మనుకొనిన సరిపడును. అప్పు డంగుళములలో నొక్కొక్క గురులఘువు పట్టును. ఇఁక రెండవరీతి చూతము. వృత్తసం ఖ్యయు, ఛందస్సంఖ్యయుఁ గూడ నిమడింపఁబడినవై వానిలో నొక్కొక్కఁడు తొలఁగ నీఛందమునకే ౧౫ అం. పొడవు, ౫ అం. వెడల్పు వచ్చుచున్నది. ఈరీతిని యెట్లు సరిపడునో తెలియకున్నది.

౨. ఛందోదర్పణము: అనంతకృతము.

"తిరముగ ఛందోక్షరములు
గురుతరముగ వృత్తసంఖ్యయును ద్విగుణములై
పొరి నొక్కొక్కఁడు తొలఁగఁగ
పరిశిష్టాంగుళము లధ్వభాగ మువేంద్రా!"

ఇయ్యదియు పైఁ జెప్పిన రెండవరీతి ననుసరించి యున్నది. కాని చూడామణియందు "నిడుపు, విప్పు" అనుశబ్దములచే పొడవువెడల్పులు స్పష్టపడినవి. దీనియం దట్లేమియు లేదు. "పరిశిష్టాంగుళములు" అనుటచే అన్నియు మొత్తము చేయవలెనని ధ్వనించుచున్నది. అట్లనుకొన్న ఛందోక్షరములు 3 × ౨ = ౬—౧ = ౫ వృత్తసంఖ్య, ౮ × ౨ = ౧౬—౧ = ౧౫ + ౫ = ౨౦ ఇన్ని యంగుళము లాఛందఃప్రస్తారమునకు కావలెనని తేలుచున్నది. ఇది యెట్లు సరిపుచ్చునగునో యయోమయ ముగా నున్నది.

3. ఆనందరంగరాట్ ఛందము: రంగయరచితము.

"అమర నుక్తాది యిన్ని ఛందములవలనను
నెన్ని వృత్తంబు లెఱఁగింపు మన్న దాని
లెక్క రెట్టించి యందులోఁ రెండుత్రోయ
తక్కినది యధ్వ మగు"

అని యీతఁడు విషయమునే మార్చి యితర లక్షణకర్తలకంటె భిన్నముగాఁ జెప్పియున్నాఁడు. ఇతఁడు భూమికొలఁతలలోఁబడక పింగళుని వృత్తసంఖ్యా విభాగములలో నొకభేదమునే యధ్వముక్రింద వాడి యున్నాఁడు. తక్కినప్రత్యయము లన్నియు సమములే.

౪. అప్పకవీయము: కాకునూరి అప్పకవికృతము.

ఈతఁడే రంగరాట్ఛందమునఁ జెప్పిన యధ్వ క్రియను పింగళునివలె వృత్తసంఖ్యాభేదముగనే చెప్పియున్నాఁడు. మఱియు నీతఁడు ప్రస్తారమున "ప్రస్తారద్విగుణ" మను భేదమును జెప్పియున్నాఁడు. ఇద్దానిని నిదివఱ కెవ్వరును జెప్పియుండలేదు. అదెట్లన, ఏదియో యొక ఛందము ప్రస్తరించినపుడు దానినే పైఛందఃప్రస్తారము చేయావలెనన్న మరల ప్రస్తరించిన ఛందమునే దాని క్రింద వరుసగా ప్రస్తరించి కుడివైపున మీఁదినుండి సగము వఱకు గురువులును, తక్కినసగము లఘువులును వేయ నది పైఛందమగునని చెప్పియున్నాఁడు. దీనివలన నేమియు ప్రయోజనము లేదు. ఏదియో మూఁడవదో, నాల్గవదో ప్రస్తరించుకొనియున్నప్పుడు వక్త దాని పైవృత్తమే కావలెనని యడుగునో, ౯ వ దో, ౧౦ వ దో కావలెనని యడుగునో? మఱియు కొంచె మాలోచించిన నీవిషయ మందరకు తెలియును గాన నిట్టిభేదముల కల్పించుట యనావశ్యకము. ఇంక నధ్వభాగవిషయమున—

"నందసుతె యధ్వభాగము
ఛందస్సంఖ్యయును వృత్తసంఖ్యయు రెంటన్,
పొందుగ గుణించి యొక్కటి
యిందుఁ దిగియ నెన్ని యన్ని యంగుళము లగున్."

అని చెప్పి తానే క్రింద తన యభిప్రాయమును స్పష్టముగా వ్రాసియున్నాఁడు. ఈతనిమతముగూడ భూపరిమితినే చెప్పుచున్నది. ఎన్నవఛందమును గుణించి ప్రష్ట యడిగెనో యాఛందస్సంఖ్యయు, దానివృత్తసంఖ్యయు కూడి యినుమడించి వానిలో నొకటి తీయ నెంతయో అన్ని యంగుళములభూమి యాఛందః ప్రస్తారమునకు కావలెనని చెప్పియున్నాఁడు. ఉదా:—ఛందము 3, వృత్తసంఖ్య ౮ + 3 = ౧౧ × ౨ = ౨౨—౧ = ౨౧ ఇన్నని తేలుచున్నది. దీనినిబట్టి చూడ నీఛందఃకర్త లేని యమముగూడ లేకుండ నెవరియిచ్ఛ వచ్చినట్లు వారు చెప్పినట్లు తోఁచుచున్నది. కొందఱు పొడవు వెడల్పును గూడ జెప్పినారు. కొందఱు పొడవునే చెప్పియున్నారు. కొంద ఱస లీప్రత్యయమునే మానివేసిరి. కొందఱీయధ్వభాగమునకు భూపరిమాణార్థమును చెప్పియుండక విషయమునే మార్చివేసినారు. ఎట్లు చూచినను వీరిలో వీరి కైక్యము సిద్ధింపలేదు. చూడుఁడు—

	అంగు. పా. వె.
౧. వృత్తరత్నాకరుని మతమున 3 వ ఛందఃప్రస్తారము.	౧౫............
౨. కవిజనాశ్రయుని మతానుసారము ,,	౧౪............
	౧౫............
	౧౮............
3. కావ్యాలంకారచూడామణి మతానుసారము.	౧౫........౫...
	౨౪............
౪. అనంతునిఛందోదర్పణ మతానుసారము	౨౦............
౫. అప్పకవిమతానుసారము	౨౧............

ఈరీతిగ నీయధ్వభాగవిషయమున లక్షణకర్తల యభిప్రాయములు వేరువేరుగా నున్నవి.

అస లీషట్ప్రత్యయములు తత్తత్క్రియాకరణముల కనుగుణము లైన నామములు కలిగియున్నవి. వీనిలో ప్రాచీనులు చెప్పిన ౫ ప్రత్యయములుమాత్ర మత్యంతోపకారకములు. వృత్తరత్నాకరకర్త యింకను తన యధ్వప్రక్రియాసందర్భమున కొన్నియుక్తులను జెప్పి, "ఏతేన త దపాస్తమ్" అని పూర్వమతముల ఖండించి యున్నాఁడు. అవి యంతసారవంతములుగా లేవు. అందు ముఖ్యముగా తాను ప్రత్యయప్రకరణమున కంతకును లక్షణసమన్వయము చెప్పుచు గీసి చూపుచు, నీయధ్వమును తాను చెప్పినంతభూప్రదేశమున నాయాఛందముల

నీప్రకారము సరిపడునట్లు వ్రాసికొనుఁడని ఏదియో చిన్న ఛందమును కాకితముపైఁ జూపియున్న చాల బాగుండె డిది. అట్లు చేయకపోవుటకు కారణ మేమో? మఱియు ప్రస్తారగురులఘుపంక్తులనడుమ నొక్కొక్క యంగుళ పరిమితమగు ప్రదేశమును విడువవలెనని చెప్పి, ప్రస్తరించిన వరుసలలో ని దెన్నవవృత్త మగునని యడిగిన నావరుసపై నేకాదిద్విగుణములుగ నంకెలను వేసి (అనఁగా ఉద్దిష్ట మను ప్రత్యయము ప్రకారము వేసి) నావృత్తమెన్నవదో చెప్పుట కుపయుక్త మగుననియు, అందులకే కేవలము నా ప్రదేశమును విడువవలెననియు యుక్తి చెప్పియున్నాఁడు. ఈయుక్తి నిరుక్తి. ఏమందురా, ప్రస్తారముచేసినవరుసలలో వక్త యొద్దాని నడిగెనో యాచాలును ఈవల నెచ్చోటనో వ్రాసికొని పైరీతిని తత్సంఖ్య చెప్పఁతగదా? ప్రస్తారగురులఘుపంక్త్యభ్యంతరాంగుళప్రదేశమందే యుద్దిష్టము చేయవలయు ననుయుక్తి యేల? అట్లు వేరుగా వ్రాసి తెలిసికొనినను మేము చెప్పెడి యనుపపత్తికూడ రానోపదు. ఎట్లన పెద్దపెద్ద ఛందఃప్రస్తారముల (అనఁగా ౮౦, ౫౦, గుఁ ప్రస్తారముల) పంక్తులనడుమ విడిచినయంగుళప్రదేశమున వక్త చెప్పిన చ్ఛందోద్యోతనార్థ మేకాదిద్విగుణితములుగ సంఖ్య వేయునపుడు ఒక్కొక్కగురులఘువుపై గాను గాను లక్షలతరబడి యంకెల వేయవలసివచ్చును. అపుడు వరుసలనడుమనే కాక లఘుగురుమధ్యమందుఁగూడ మూఁడునాలుగంగుళముల అంతరువు విడువవలసివచ్చును. కాన నాతెనియుక్తి సరిపడలేదు. మఱియు తా నీవిడువ మనినంగుల కేదియో కారణ మున్నదనియు, నట్లులేనిచో శాస్త్రసిద్ధము గాదనియు, నేనే నియమించి యీయధ్వ ప్రత్యయమునకు శాస్త్రీయత సిద్ధింపఁజేసితి ననియుఁ గూడఁ జెప్పియున్నాఁడు. చూడుఁడు: "అంగుళన్యూనాధికపరిమాణానాం గురులఘూనా ముద్దిష్టాంకానాంచ లేఖనసంభవేఽపి అననుగత స్యాశాస్త్రార్థత్వ దగుణమితి, తత్సిద్ధ్యర్థ మంగులినియమనం కృతం, నతు వ్యసనిమాత్రతయా" అని చెప్పినాఁడు. అంత యుక్తిదూరమై ముఖ్యముగ ప్రయోజనశూన్యమైన దానిని తా నేల నింత శ్రమించి సమర్థింపవలెనో చదువరులే గ్రహింతురుగాక.

మఱియొకవిషయము. అనంతుని ఛందమునకు పీఠిక వ్రాసిన శ్రీ గిడుగు సీతాపతిగారు కూడ నీషట్ప్రత్యయసందర్భమున నైదింటిని లక్షణ సమన్వయముగఁ జెప్ప యీ యధ్వమునుమాత్రము విడిచిపెట్టినారు. మఱియు నప్పకవీయపీఠికలోఁగూడ నీ కేమియు నీవిషయమై యెత్తియుండలేదు. కవిజనాశ్రయ పీఠికయందు శ్రీ జయంతి రామయ్య పంతులుగారుకూడ నీవిషయమును త్యజించియున్నారు. మొత్తముమీఁద సంస్కృతచ్ఛందఃకర్తలలో పూర్వుఁడైన పింగళుడు దీని చెప్పకుండుటచేతను, దామోదరమిశ్రుఁడు మొదలగువారుకూడ నీవిషయమును తెలుపకునికిని, ఇటీవలి తెనుఁగు ఛందఃకర్తలుగూడ నీయధ్వప్రత్యయవిషయమున నొకయర్థము నఁ పొసఁగుటచేతను రంగరాట్ఛందఃకర్త అసలీయధ్వస్వరూపమే మార్చియుండుటచేతను, నిప్పటికాలమున నిట్టివి తెలిసికొన కాకితములు మొదలగు సామగ్రులుండుటచేతను నీయధ్వమును తీసివేయవచ్చునని నాయభిప్రాయము. ఈవిషయమున నా యభిప్రాయభేదమే వెల్లడించితిఁ గాని యన్యథాభావన కాదు. కాన చదువరు లెవరైన నీవిషయమున సరియగు నుపపత్తులను జూపుచు నీప్రత్యయ మావశ్యకమని వెల్లడించిన నాయభిప్రాయమును మార్చుకొందునని మనవి.

తారకాపచయవిమర్శనము.

—దువ్వూరి సూర్యనారాయణమూర్తిగారు, కొవ్వూరు—

శ్రీమంత మైనమనయాంధ్రదేశమునఁ బెక్కుభాషలు వాడఁబడుచుండుట సర్వవిదితము. అట్టిభాషలలోఁ బలువురచే వాడఁబడుచు జీవద్భాషయని పేరందినది యాంధ్రభాష. ఇయ్యది యించుమించు, ఎ. డి. 11 వ శతాబ్దము కంటెఁ బూర్వమందు లేదనియు నీవలనే భారతాదిగ్రంథము లుత్పన్నము లై తెనుఁగునకు మెఱుఁగుపెట్టె ననియు విమర్శకుల యాశయము. నాఁటినుండియు ననేకశాఖలతోఁ బెంపొందుచున్న యీవాఙ్మయమునఁ బ్రబంధములు, గద్యకావ్యములు, నాటకములు మొదలగు వివిధగ్రంథము లుద్భవించుచునేయున్నవి. ఇందు, ప్రాచీనములగుకొన్నిగ్రంథరాజములు ముద్రణాదిసదుపాయములు లేక నశించుచున్నవి. ఆధునికకృతులలోఁ గూడ ననేకప్రబంధము లుదయించుచున్నవి. వీనిలో "తారకాపచయ" మనునది యొకప్రబంధము. తారకాసురనాశనమే ముఖ్యోద్దేశ మగు నియమమున నిద్దాని కీనామ మంకించియుండును. ఇయ్యది రాజవోలుతాలూకా కొత్తపేటవాస్తవ్యుఁడగు ఇవటూరి సూర్యప్రకాశకవిమణిచే రచింపఁబడినది. ఈకవికులతిలకుఁడు సంవత్సరము క్రిందటనే దివంగతుఁ డయ్యెను, గావ్యశరీరావశిష్టుఁడై యచ్చటచ్చట దాఁగియేయుండె ననఁదగును. మఱియు దీన నితివృత్తము కృత్తికలార్వురకుఁ, బార్వతీపరమేశ్వరులకు, నగ్నికి, గంగకు నిందఱి కెట్లుగా స్కందుఁ డొక్కరుఁడు పుత్రుఁ డయ్యెనో యావిషయమును దెలుపుచుఁ దారకహననము గూడఁ జెప్పఁబడినది. ప్రకృతమున నీప్రబంధవిషయమున గుణాగుణములఁ గొంచెము విచారింతము.

ప్రథమమున నీతనికవిత్వశైలి యతిగంభీరమై యుండును. కొన్నిచోటుల నోజోగుణయుతముగను, గొన్నిపట్టుల జాను తెనుఁగుపదములలోను, గొన్నిపట్టుల శబ్దాలంకారభూయిష్ఠముగను, రసోచితపదరచనగలిగియుండును. అల్లికయందలి జిగిబిగి యతిస్తుత్యము కాని యచ్చటచ్చట ఝడిత్యర్థస్ఫూర్తిలేని పదముల విస్తారముగాఁ బ్రయోగించియున్నాఁడు. వర్ణనలవిషయమున నలంకారములతో, నతిహృద్య మగునుత్ప్రేక్షాతిశయోక్తులతో వర్ణించియున్నాఁడు.

"ఓజస్సమాసభూయస్త్వమ్" అనునట్లు క్రిందిపద్యములలో దీర్ఘసమాసము లుండియున్నవి.

"నిశ్శేషమానుష్యకాంతరంగికవ్యథావకరాత్తుల్లకప్రవర్తమానసమ్మార్జనీభవన్నలయమారుత"

"అంచితసౌందర్యవిశేషసంహననరోచిస్మారితోద్యత్ప్రసాంపతి ...."

"తామరసజన్మశచీదయితాదినిర్జరేశ్వరమకుటోపలద్యుతిపిశంగితమంగళపాదపీఠుఁడు"

"ప్రసూతితనూజసభాస్థితాహిభుగ్ధోరణవాసవాద్యమరకూటము......"

"సురసారంగవిలోచనానుతతనూశోభ, స్మదభ్యస్తభాసురసాహిత్యరుగీతికాదికకళాసూద్దామ నభ్యంచితాసురసామ్రాజ్యరమావతారన్ ...."

ఇట్టివనేకము లీప్రబంధమునఁగలవు. దీనివలన నీతనిపాండిత్యము స్పష్టపడుచున్నది. ఈ క్రిందిపద్యములలో జాను తెనుఁగుపదములే తప్ప సంస్కృతపదము వెతకుటకుఁ గూడఁ గానరాదు. చూడుఁడు-

"మొగములతిగ యగపడకుం,డఁగఁబుడమికి దిగినపల్లునవలాయొడయం
డగుతబిసిచేఁజదువులె,ల్లఁగఁజెచినవలంతి వీవలఁతివె తలఁపన్."
"ప్రాచియగు నీమాటి పడమటినేస్తకత్తియకుఁ బంపిన కెంపుతెలె యనంగ
హాదనుపాన్నారిరేయతివసొమ్ములకుఁ గాఁ గరఁగిన యపరంజికరుడనంగ
... ...
తమ్మితీవియబోఁడికి నెమ్మెకాఁడు, నిగ్గుపుంజీఁకటికిఁ దీరనిపగవాఁడు
తొవలయుల్లాస మడఁగించుదుండగీఁడు ....పవలుతేఁడు."

ఇత్యాదిపద్యములు కేవలము నచ్చతెనుఁగుపదములతో వ్రాసియున్నాఁడు. ఇంక నిట్టి వనేకము లున్నవి, విస్తరభీతిను దాహరింపమానితి. ఈ క్రింది పద్యములలో శ్రుతికటు వగుశబ్దాలంకారములు రసహీనములై వ్యర్థపదయుతములై యున్నవి, చూడుఁడు-

"మట్టుమీరినట్టి యిట్టలంపువిరాళి పుట్టునట్టికొట్ట కొట్టువెట్టి
గట్టినట్టుదిట్టఁజెట్టవట్టుటకట్టు గట్టిపట్టుపట్టి గట్టుపట్టి"

పైపద్యమున ద్విత్వటకారములు ప్రోగుగాఁ జేసినట్టు లగపడుచుఁ జదువుట కెంతయో యసహ్యము కలిగించుచున్నవి. మఱి యొక చిన్నపద్యమున "సాటి, యేటి, జోటి, నిశాటి, తాటి, మేటి, మాటి, మాటి, చేటి"యని వర్ణావృత్తింజేసి ప్రాణము దీసువున్నట్లు చెప్పియున్నాఁడు. మఱియొకచోట,

"వాహాయువాహాయమానవాగాహితాయ
వృజినకలంకాయ లంకాయతాక్షీ........."

ఇట్లే నాలుగుసీసపాదములందు నావృత్తియగు పదమే మరల నావృత్తిఁ జేయుచు యమకములఁ జెప్పినాఁడు.

"లోకనాయక............లోచనాయ
లోచనాయతినిక్కృత............నలినాయ"

అనుచు ముక్తపదగ్రస్తముగా వ్రాసియున్నాఁడు. ఇట్టి వింకను గలవు- కొన్నిటినే చూపినాను.

ఇంక ఝడిత్యర్థస్ఫూర్తిలేని పదము లీతనికృతియందు కుప్పతిప్పలుగ నున్నవి. అవి వ్యాకరణము చదువుకొనిన వారికిని రెండుమూఁడు నిఘంటువులు కంఠాగ్రమందున్నవారికేగాని యితరుల కర్థమగుట దుస్సాధ్యము, చూడుఁడు.

"వాచంయమ, చైరకాలికైకత్రవాస, ఓతువాఖువు, క్షేపిష్ఠపాతంబు, ద్వయాతిగప్రవేశుఁడు, వికుర్వాణ, నైర్ఘృణ్యా, ప్రామాణిక, సంస్ఫోట, ప్రత్యాలీఢ, ఖామరాఘస, జగ్ధ, క్ష్వేళ........."

ఇత్యాదులు పద్యమున కథమము రెండు మూఁడుండును. కాని యిట్టి పదములు కవికున్న జ్ఞానమునే తెలుపును గాని రసమును బాడుచేయుటయే గాక సర్వజనసాధారణముగా నుండవు. కావ్యము రచించుట ముఖ్యముగాఁ బరుల నానందమునందించుటకుఁగదా ?

"కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే సద్యః
పరనిర్వృతయే..........."

అని యలంకారజ్ఞుల యాశయము. పైపదప్రయోగముల సద్యఃపరనిర్వృతి కలుగ దని యనుకొనుట కష్టము కాని కవి తనశక్తిఁ జూపుట కట్టివి ప్రయోగించె ననుకొన్నఁ బ్రకృతమున కంతగా నాక్షేపణ కలుగదు.......

మఱియు నీతని కవిత్వమందు జాతీయతగూడ నచ్చటచ్చట నున్నది...
"పాలన్ముంచిన నీటముంచినను" "దేశముగానిదేశముల" "ముక్కులపచ్చలారకుండినన్" "శ్రీతాన యేతేర మోఁకాలడ్డంబిడి" "గోచిపాతరాయఁడయిన వృద్ధతాపసుఁడు"

మొదలగు సామెతలు ప్రయోగింపఁబడి ప్రకృతార్థమున కెంతయో సహాయములై యుత్కటప్రేమను నీతిని నైరస్యమును దెలుపుచుఁ గవియొక్క

హృదయవైశాల్యమును దెలుపుచున్నవి. మఱియు వర్ణనలవిషయమున మంచి మంచి యలంకారములతో హృదయంగమము లైన భావరాసుల గ్రుమ్మరించినాఁడు. సూర్యాస్తమయవర్ణనావసరమున—

"పతివచ్చు నని నిశావాసకసజ్జిక కట్ట విప్పిన కావిపుట్టమేమొ ?
ప్రొద్దుతో నైనపోరున నింగిఁబాఱు మందేహదేహాసృక్ప్రవాహ మేమొ ?
సవితతో దినలక్ష్మి సహగమించుటకుఁ బేర్చిజ్వలింపఁజేసిన చిత్యయేమొ?"

ఈసమయముననే చీఁకటిని హృదయాహ్లాదముగఁ బొగడినాఁడు.

"అసదృశమున్ స్థిరంబు నగునంబరరత్నమువోవుటన్ బిత్ప
ప్రసువను సంతివంతగదురన్ విలపించుటయున్ దదీయశో
కసమయమందు జొబ్బిలుసకజ్జలరోదనవర్షమో యనన్
విస్మృమరమయ్యె నల్లెడల వెగ్గలమై తిమిరమ్ము రోదసిన్."

ఇట్టివర్ణనము లింక రెంటి నుదాహరింతును. అట్లే నక్షత్రములతోఁ గూడిన యాకసమును గూడఁ జక్కగ వర్ణించియున్నాఁడు.

"......రాజువచ్చునని......నింగి చం, దువకల దిష్టముండనుఁడు తోల్తగఁ గట్టిన ముత్తియంపు చే, రువ లన నొప్పె ఋక్షనికురుంబము లాకసమందు"

మఱియుఁ జంద్రోదయమును వర్ణించుచు—

"మిత్రుని జాడలేమికిఁ బొక్కుచుఁదలెత్తి నెనుకుచుండిన తూర్పునెలఁతయేమొ?
హేలకై శచిబిడ్డఁ డెగురవైచుచుఁ బూర్వగిరిపైఁ బడిన బంతివిరులచెండొ
సమయమాంత్రికుఁడు ధ్వాంతముమాపమంత్రవిభూతికై తెచ్చినబూదిపండొ?"

అని యచుంబితార్థసంపత్తిగాఁ జమవరులహృదయకమల వికసనశీలము గ వర్ణించియున్నాఁడు. ఇంక ననేక స్థలముల నీతని గభీరభావతరంగ లానంద సముద్రమున నోలలాడింపఁగలవు.

ఇంకొక విషయము-ఈకవితల్లజుని గ్రంథమం దచ్చటచ్చటఁ గొన్ని భావచౌర్యములు గనవచ్చెడి-స్వల్పముగా ననుకరించినవి విడిచి యనుగతములగు వాని నుదాహరింతును. సురస యనురాక్షసకాంత చేయఁబోవు ఋషిసేవను వర్ణింపుచు-

"కడువాఁడిమైనట్టి కౌక్షేయకమువాయి నాల్కయంతయుఁ జాదినాకినట్లు,
త్యక్తనిర్మోకంబు దారుణంబును నైన కోడెచిల్వను ముద్దుగొనినయట్లు,
గళముదాఁక శిరంబు ఘాతుకంబైన శార్దూలంబునోటిలోఁ దూర్చినట్లు"

అని చెప్పియున్నాఁడు. ఈపాదత్రయము కువలయానందమున నిదర్శనాలంకారమునకు గ్రంథాంతరమునుండి లక్ష్యముగా నుదాహరించిన శ్లోకమునకు సరిపడు తెనుఁగుపద్యము లాగున్నది.

"రాజసేవా మనుష్యాణా మసిధారావలేహనం
పంచాననపరిష్వంగో వ్యాలీవదనచుంబనమ్"

ఈశ్లోకమును జూచిన చదువరులు తప్పక నిద్దానిని తెనుఁగున మార్చి రేమో యని యనుకొనక మానరు. మఱియొక స్థలమున నడవిని వర్ణింపుచు నిట్లు వాక్రుచ్చియున్నాఁడు -

"క్రాలు గాలవశాండిల్యకౌశికాదు, లైన ఘనతరుల్ గలిగి యక్కాననంబు
క్రాలు గాలవశాండిల్యకౌశికాదు, లైన ఘనతరుల్ గలిగి యక్కాననంబు"

ఈపైపద్యము చక్రనిశ్లేషతో నిమిడియున్నది. ఒకపక్షమున మునీశ్వరపరముగను మఱియొకపక్షమున వృక్షపరముగను నర్థము చెప్పుకొనవలెను. ఇట్టిశ్లేషయే గలిగి రెంటను సమానమగు నర్థము నిచ్చుపద్య మొకటి రామరాజభూషణుని హరిశ్చంద్రనలోపాఖ్యాన మనుద్వ్యర్థికావ్యమున నున్నది. అచ్చటప్రకృతవర్ణనావిషయములు- నదియు సెలయేఱును.

"గాలవశాండిల్యకౌశికాదిపరార్థ్యతరులక్షవటయుక్తి దరులనెసఁగ"

ఇచ్చటఁగూడ నొకపక్షమున నాయాపేరులు గలఋషులును రెండవపక్షమున వృక్షములును వాచ్యార్థములు. ఇట్టి సంపూర్ణమైన పోలిక గలపద్యములఁ జూచిన భావచౌర్యమే గాక పద్యచౌర్య మని కూడఁ జదువరు లనక మానరు-మఱికొన్ని పట్టుల,

"నెమ్మొగమువర్ణనముసేయ నెలయగుంగ్ర, శావలగ్నముపొగడఘనాయనమగు
తత్ప్రిశోణినుతింప నబ్దంబగు పద,ములను శ్లాఘింప దొరకొనఁబుష్కరమగు.

తత్తన్నాయికాంగముల వర్ణింప దీర్ఘకాల మగు ననియు నుపమానభూతచంద్రపద్మాదుల శ్లేషచేఁ జెప్పియున్నాఁడు. ఇంకను బ్రాచీనతమములయి యిక్కాలమున నామమాత్రావశిష్టములు గానున్న భద్రక మదన తరలి శుద్ధవరాటి మొదలగు బహువిధవృత్తములు చాల వాడినాఁడు. ఛందఃకర్త లెట్టిప్రాసల దుష్కరప్రాస లని చెప్పిరో యట్టిప్రాసల ననఁగా ష్ట, స్త్రీ, న్ద్ర, శ్చ- మొదలగు రెండుమూఁడు హల్ సముదాయములు గలవాని వాడి నిరాటంకముగాఁ బద్యముల వ్రాసినాఁడు. దీనినిబట్టి చూడ నీతనియకలంకకవితాప్రవాహమున కద్దు

లేదని తెలుచున్నది. ఈతఁడు తఱచుగా శత్రర్థచువర్ణమందలి యుకారమున కు సంధిచేయుచు గొన్నిరూపముల వాడినాఁడు. ఇది వ్యాకరణసమ్మత మైనను శ్రుతికటు వగుస్థలముల నిట్టిసంధి చేయరా దని నాయభిప్రాయము-ఉ:—"అనుచతఁడు, అంచభయంబొసంగి, ఒనర్చుచచ్చటిదానిన్" అని ప్రయోగములున్నవి. వీనిలో మూఁడవదానియందలి మొదటి మూఁడక్షరములు తీసివైచిన నెంతయపార్థ మిచ్చుచున్నదో! కాన నిట్టివి జాగ్రత్తగా వాడిన బాగుండును. మఱియు, అట్టి యిట్టిశబ్దములపైఁ దచ్ఛబ్దవకారలోపరూపముల "అట్టేఁడు, ఎట్టేఁడు" ప్రయోగించినాఁడు. ఇట్టివి సర్వజనగోచరములు గాక బంధపారుష్యమును గలిగించుచుండును. తనజ్ఞానసూచకముగా కవివాడినాఁడు, కానిచో-

"కలరె యిట్టిరు సౌందర్యఖనులు మహిని"

అనెడి గీతపాదమును,

"కలరె? యిటువంటిసౌందర్యఖనులు మహిని"

అని ప్రయోగించుకొన్నఁబై పాదసారస్యము రాదా? తప్పక కవితన పాండిత్యము చూపుటకే యట్టిపదముల వాడినాఁడు-

ఇఁక రసవిషయమును విచారింతము. ఈవిషయమున విపులముగ రసనిష్పత్తిని జూపిన నధమ మిరువది పేజీలవఱకు గ్రంథ మధిక మగును గానఁ గొన్నిపట్టుల వాని నెత్తి స్పృశింతును—

ఇందుఁ బ్రథమద్వితీయాశ్వాసములలో సురసను ఋషిసేవనిమిత్తము పంపునపుడు శోకము స్థాయిగాఁ గలకరుణరసము నాటఁబడినది-

"విద్యకై యాచార్యునొద్ద కేగినయప్డె చాలసేపుంటకు జలదరింతు,
బోటికత్తియలతో నాటలకై పోవ తడవుగాన్పడమికిఁ దల్లడిలుదు,
ఎటకైన పయనమేగుట తటస్థంబైన నినుబాసి చనుటకు నెగులుపడుదు,
... .
మామకతపఃఫలమ! నీవు మగిడి వచ్చి,కంటఁబడుదాఁకనీప్రతీక్షణమహాయుగంబులెటువలె యాపింపఁగలుగువాఁడ,నక్కటా! యెంతనిర్దయుఁడయ్యెనియతి"
"నీవు లేనన్నినాళ్లను నావసథము, గహనభూప్రాయమై యుండుఁగద వెతల్లి"
"గోచిపాతరాయఁడయినవృద్ధతాపసునకక్కటయివాలసేఁ ద్వితీయగాఁ"
"ఎదలోని బెంగనెవ్వతె మఱపించునింక, ముద్దు పలుకుల నెవ్వతె తెలుపునింక, విస్మయంబెవతె గావించు నింక."

ఇత్యాదివాక్యములచేతను, "హార్ద్రమున నశ్రువులొల్కైడితండ్రిఁజూచి" అనెడి సురసవాక్యముచేతను గరుణకు స్థాయియైన శోకమును కవినిబద్ధించెను. కాన, కరుణమనవచ్చును—

అచ్చటచ్చట శృంగారరసస్పర్శలు గూడ నున్నవి. సురసకుమారులఁ జూచుటకు వచ్చెడినగరకాంతలఁ గొందఱినివర్ణించినాఁడు. ఇచ్చట శృంగారోద్దీపనవిభావనాదులు లేశములు గా నున్నను వర్ణనమాత్రము పూర్వకవుల ననుసరించుచున్నది.

ఇఁక వీరరసమును గుఱించి వేఱె చెప్పనక్కఱలేదు. చాలచోట్టుల యుద్ధారంభము లుండుటచే రౌద్రరసము ముఖ్యముగా దీన నంగిరస మనవచ్చును. ఈరౌద్రరసమందు మహాస్రగ్ధరాదివృత్తములచేఁ బ్రకృతపాత్రమేతానోతానేప్రకృతపాత్రమో? యనునటుల వర్ణించినాఁడు. ఇతరము లగు రసములచ్చటచ్చట నుండి యంగిని బోషించుటచే నియ్యది నవరసభరిత మగుకావ్యమనఁదగును, గ్రంథవిస్తరభీతిని రౌద్రాదిరసముల కుదాహరణముల నీయనైతి.

మఱియొక సర్వకవివిలక్షణ మగుసుగుణ మీతనియొద్ద నున్నది. ఏమన పూర్వకవిశ్రేష్ఠులు తామేదియో కలలోఁ దమతమతాతతండ్రులు గాని భగవంతుఁడుగాని ప్రబంధరచన చేయు మని చెప్ప మొదలుపెట్టితి ననునాచారము వారివారిప్రబంధములఁ గనఁబడుచున్నది. ఈయాచారము నీతఁ డనుసరించియు నిట్టిమహాప్రబంధమున నన్నృత ముండరా దని మద్దలదానిని తగ్గించినట్లు తన పీఠికలో వ్రాసికొనియున్నాఁడు. ఇదియే యీతని యందలి స్తోత్రార్హమైన గుణము. మనపూర్వులు శతాంధన్యాయమునఁ దమతమగ్రంథముల వ్రాసిరి గాని యిట్టిస్వతంత్రబుద్ధిని వినియోగింపరైరి. ఇన్నిసుగుణములు గలిగి సాహిత్యజ్ఞానమునకుఁ గేలూఁత యొసఁగు నీప్రబంధము ప్రపంచాకాశమున నక్షత్రమువలెనున్నది. ఇట్టిగ్రంథము నుచ్చదశలోనికిఁ దెచ్చిన మనయాంధ్రభాషామతల్లికిఁ గోటియలంకారమనలొసఁగుటయేయని యింతటితో ముగింపుచుఁ బైనావ్రాసిన విషయము లన్నియు నీయుద్గ్రంథమునఁ గల్గు గుణములలో కణము లని తెలుపుచు నింతటితో విరమించుచున్నాను.

దీపాలవారి 'జితకాశి'

దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి.

జితకాశి యనునది శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు చేమకూర వెంకటకవి సారంగధరచరిత్రమునకు వ్రాసినవ్యాఖ్యానగ్రంథము. లోఁగడ వేదము వేంకటరాయశాస్త్రిగారు వ్రాసినవ్యాఖ్యానమునందలి ప్రమాదములను సరిచేయుచు వీరు వ్రాసినగ్రంథము 500 ల పేజీలకు మించినది. ఇం దనేకనూతనవిచిత్రవిషయములు పాఠకులు గ్రహింపఁగలరు. శబ్దస్వరూపము నిర్ణయించుతఱి శ్రీ పిచ్చయ్యగారు కొన్ని చోట్ల శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువును గూడఁ బ్రమాణీకరించుచు వచ్చిరి. కాని యచ్చటచ్చట శ్రీసూర్యరాయాంధ్రనిఘంటువుపైఁ గొన్ని లోపములు ఉన్నట్లు వీ రారోపించి చూపిరి. ప్రకృత మావిషయము లనుమాత్ర మెత్తి సూర్యరాయాంధ్రనిఘంటుహృదయమును వెలువఱింపఁబూనుటయే యీవ్యాసమునకు ముఖ్యోద్దేశము.

(1) "శా. పా. కొండఁజేయు, ఇవితప్పు. కొంపజేయు అని క్రియ. గొప్పచేయు అని యర్థము. కొండచేయుట యనఁగా కొండంత (గొప్ప) చేయుటగాని కొండను చేయుటగాదు. చూ. జితకాశి 313 పుట.

ఇట సారంగధరలోని పద్య మిది.

"గట్టిచన్గవ చేత ముట్టి చూచెద నన్నుఁ
జెలి యది రొంకకొండ చేసికొనదు. 2-226."

N. B. ఈవ్యాసమున సూ. ని. అనఁగా శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువును, శ. ర, అనఁగా శబ్దరత్నాకరమును, బ్రౌ. అనఁగా బ్రౌనుదొరగారి నిఘంటువును. పూ. ము. పా. అనఁగా పూర్వముద్రితపాఠము అనియు, శా.పా. అనఁగా. వేదం వేంకటరాయశాస్త్రిగారి పాఠమనియు గ్రహించునది.

పై పద్యమునఁ బిచ్చయ్యశాస్త్రిగారిమతప్రకారము 'కొండ చేయు, ఏకముగాఁ జేసికొనినచో "ఒక" పదమున కన్వయమేది? శా. పా. యే బాగున్నది. అప్పుడు 'ఒక' కు కొండతోనే సంబంధము, అంతేకాక వీరిమతప్రకారము తక్కినపాదములందలి క్రియలు "గగనంబుచేయు, బంగారుచేయు" మున్నగు నవేకక్రియ లనఁ జెల్లునా?

"కొండఁజేయ" అనియే సూ. ని. పా. మఱియు నందు "కొండఁ జేయు=పెద్దచేయు, అనికూడా ఉన్నది. పెద్దఁజేయు అనమి యొదున నోళి" అనియుఁ బ్రశ్నించి యున్నారు. చూ. జితకాశి. 343 పుట. ఇది విక్రమార్కచరిత్రయందలిపద్యవిషయము.

"కొండలెల్లను దను గొండఁజేయు" అని యందలి పద్యము. కొండఁజేయు, కొండ చేయు లెట్లున్నను, ఇందలి కర్మపదమగు 'కొండ, జడవాచక మగుటచేఁ బ్రథమయుఁ గావచ్చును. ద్వితీయయుఁ గానగును. ఇందు తప్పేమి? మఱియు,

"గొప్పంజేయు, అనుటలోఁ గల దోషమెట్టిదో 'కొండంజేయు' అనుటలోఁగల దోషమును నట్టిదే" అన్నారు. వీరిదృష్టిలో 'కొండ, గొప్ప అనునవి, యొకజాతివా? మఱియు.'

"కొండచేయుట అనఁగా కొండంతచేయుట గాని కొండనుచేయుట కాదు." అని వ్రాసియున్నారు. ఇట కొండశబ్దము గౌణలక్షణచే "అగ్నిర్మాణవకః" ఇత్యాదులందువలె 'పర్వతసదృశము' అను నర్థమిచ్చును. ఇఁక నేకపదముగా గ్రహించినవీరిపక్షమున 'ఒక కొండ చేయు, అను సముదాయము నేకపదముగా గ్రహింపవలెను. ఒక పదమును పృథక్కుగా స్వీకరించినవీరిమతమున అభేదసంబంధముచే నేకదేశాన్వయము సంభవించును. 'కొండన్' అనునది పృథక్పద మనిన యెడల దోషము కనుపట్టును. పెక్కుగుణము లున్నవి.

(2) "శా. పా. మీఁది నమ్మకముచేత వావిళ్లవారే కాదు సూ. ని. కూడ 'మరుబాముల' అనియే అన్నది. చూ. ఉటియు. చూ. జితకాశి 347 పుట."

ఇట వీరి యాక్షేపణ మేమియన—

"మరుబాములనఁగా మన్మథబాధలు. పరపురుషుఁడు తన్నంటిన యవమానమున కోరువఁజాలక గొంతు కోసికొనఁబోవుచున్న స్త్రీ, నేను మరుబాముల బడలేనను నా? 'మఱిబాము' లని సరియైన పాఠము. పూ. ము. న నున్నది." అని వివరించియున్నారు. శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారిట ప్రకరణము గమనింపరైరి. ఇట వీరి పాఠముకన్న ప్రాఁత పాఠమే సర్వథా పరిపుష్టము. ఎట్లన రెండవయాశ్వాసము 235 వ పద్యము చిత్రాంగిది. 236 వ పద్యము ప్రకృతము. ఇందు అని, అని, అను పదములు రెండున్నవి. ఇందు మొదటి అని, పైపద్యార్థమును బరామర్శించును. మిగిలినపద్యమంతయుఁ గవి చెప్పినది ఇది గమనింపక 'గొంతుకోసికొనుస్త్రీ......నేను పడలేనను నా?" అని పిచ్చయ్యశాస్త్రిగారు వ్రాయుదురు. ఇట అనునది స్త్రీయా? కాదు కవి.

ఇఁక "మరుబాములఁ బడలేనని కైదువుదుస్సిదాఁటు నాయితము బలెన్" అనునది కవ్యుక్తిలో నుత్ప్రేక్ష. మన్మథుని బాములు పడలేనని కత్తి లాగుకొనిపోవు సన్నాహమో యనునట్లు పెనఁగు నామెచేకత్తిని విడిపించి రాజరును. అని యన్వయము. ఇట 'మఱిబాములు' ఏల? ఈసందర్భమును గమనించియే సూ. ని. నిర్దుష్టపాఠమును గ్రహించినది. మరుబాము లనుటలోనే స్వారస్యమున్నది.

(3) "N.B. స్థానిలో 'దొంగలానఁ బొడిచిన' అని ముద్రితమైనది. ప్రమాదము. 'దొంగలానవొడిచిన, కళాపూర్ణోదయము 3 ఆ. శ, ర. అని వ్రాసిరి. చూ. జితకాశి 411 పుట"

ఈవిషయము సూక్ష్మముగాఁ బరికింపవలసినది. ఆసపొడుచు అను పదమునకు ఆజ్ఞాపించు, అను నర్థమునఁనే కవులప్రయోగము లున్నవి. ఇది

శబ్దపల్లవము. ఇదియు సూర్యరాయాంధ్రనిఘంటువునఁ జూపఁబడినది. ఇఁక సూ. ని. లో 'ఆన' అను దానికిఁ గళాపూర్ణోదయపద్య మిచ్చి 4 వ యర్థము, ఆజ్ఞాముద్ర, అని వ్రాయఁబడినది. అట "ఆనఁబొడుచు" అనియే పాఠము. ఇది ప్రమాదమని విమర్శకుల యభిప్రాయము ఇట 'ఆన, పొడుచు, అను నవి వ్యస్తపదములుగా గ్రహించినప్పుడే ప్రకృత పద్యార్థము ప్రకరణానుకూల్యము నందును. అట్లుగాక యేకపద మనుకొని 'ఆజ్ఞాపించు, అను నర్థమున గతార్థము చేసినచో, ఆజ్ఞాపించుట వాగ్రూప మైనదిగాన, ఆయాన దొంగిలించుటయం దప్రయోజకము. అట్టియాజ్ఞ యున్నను లేకున్నను దొంగకుఁ దెలియునదిగాదు. ఇఁక ముద్రారూపకాజ్ఞ యున్నచో సజాతీయుల కది గ్రహించుటలో నిపత్రకముగా నుండును. ప్రకృత మదియున్నను దొంగిలించువానికి బాధకము కానేర దనునభిప్రాయ మీప్రకరణమున కనుగుణము. దానిని స్ఫుటముఁ జేయుటకే సూ. ని. కళాపూర్ణోదయపద్యములోని దానిని పదద్వయముగా నిశ్చయించి 'ఆన' లోఁ జూపినది. కళాపూర్ణోదయము నందలి ప్రకరణమును బరిశీలించుచో నిది యెట్టులున్న నచటిసందర్భము నరిపడునో తెలియఁగలదు.

(4) "N.B. సూ. ని కరకర (=కఱకఱ)=వ్రాయుట నమలుట మున్నగువానియందగు ననుకరణము. అని యర్థము చెప్పి అందు క్రింద సారంగపద్యమును 'అసూయఁగరకరమంచు అను పాఠముతోనే యుదాహరించినది. ఆ 'కరకర, కు ఆకోశ ముద్దేశించినయర్థ మేమో ?" చూ. జితకాశి 449 పుట"

అని వ్రాసి కోపమును దెలుపుపదము 'కొఱకొఱ, గాని 'కర కర, కఱకఱ,లు గావన్నారు. సూ. ని. ఈప్రయోగము 'అసూయచే పండ్లు గీటుట యందలిధ్వని కనుకరణమునకు లక్ష్యముగా గ్రహించినది. అట్లున్నను వీ రర్థము చేసికొనక చుక్కలు పెట్టుటయేందులకో తెలియదు. శాస్త్రిగా రిచ్చిన 'ద్వేషించు, అనునర్థము 'అంచు, పదసమభివ్యా

హారము చేతను "తునుము నంతకోపముతో" అను దానిచే 'ద్వేషించుచు,' అనునర్థము గతార్థమగుటచేతను పొసఁగదు. అవ్యక్తానుకరణములగుటచే నట్టిపదము లెట్లున్నను నుండవచ్చును.

(5) "శాస్త్రిగారిపాఠమును జదివియే కాఁబోలు సూ. ని. కంఠీతులు 'కమ్మకంజు=కంజులకమ్మ' రత్నములు కూర్చుటచే దివిటీల వలె వెలిఁగెడికమ్మ. అనివివరము వ్రాసిరి." చూ. జిలకాశి 457 పుట.

కంజునకు దివ్విటీ యనునర్థము ప్రసిద్ధముగా నున్నది. కమ్మ అనఁగా కర్ణాభరణము. ఇట 'నెమ్మోముకు రేరాజు సన్నిధానము గాన కర్ణభూషణము లనెడిదివ్వటీలు రాజచిహ్నములుగా నుండవలసినవే. ఇట వేదమువారిపాఠమే యేమి? ఈరెండుస్థలములలోనివి రూపకములు కావా? ఇట పెద్దప్రమాదమఁట. ఆప్రమాద మేమో? ఇఁక "దివిటీల కాంతిని మెఱుఁగు లనుటయు లోకమున లేదు" అని వీరి యాపత్తి. ఇట రత్నసంబంధ ముండుటచే మెఱుఁగు లనుటలో విరోధ మేమియు లేదు. అదియుఁగాక దీపకాంతిని మెఱుఁగనుట యాక్రిందిప్రయోగమునఁ గలదు.

"ధూమంబు వోదివినఁ దుఱఁగలి మెఱుఁగులు
నలఁగి మాసినదీపకళికవగిది. విరాట్పర్వము 1 ఆ.

దీనినిబట్టి దివిటీకాంతిని మెఱుఁగనవచ్చునేమో.

"శాస్త్రిగారికి కంజుతత్త్వము తెలియలేదు" అని యొకమాట. కంజుతత్త్వము పూర్తిగాఁ దెలిసిన శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారు 'కమ్మ'తో సంబంధములేని 'కంజు' నకు వారు వ్రాయించిన 'కమ్మలో పొదిగిన రత్నాలముత్తము' అను నర్థముగల ప్రత్యేకప్రయోగమును జూపింపరేలొకో? వీ రుదాహరించిన యాంధ్రపదపారిజాతమును బట్టి కంజునకే 'రత్నములు చెక్కినతాటంకములు' అను నర్థ మున్నచో నిఁక 'కమ్మకంజు' నకు వీరేమియర్థము చెప్పుదరో? ఇది యిట్లుండ వీరిటీకలో "కమ్మకంజులమెఱుంగు=కమ్మలయందలిదుద్దులకాంతి" అని వ్రాయిం

చి. ఈవ్రాఁత పూర్వవిరుద్ధముకాదా? వీరి మతమున వంజానకే దుద్దు అని యర్థమా? అట్లైన వ్యవహారమున రతనములు పొదిగిన కర్ణాభరణములకే 'దుద్దులు' అని యున్నదే. అప్పుడు కమ్మ అనుదాని కేమియర్థము చెప్పుదురో? తత్త్వమేమన 'కమ్మవంజు' అను పదమునకు సూర్యరాయాంధ్రనిఘంటువు వ్రాసినయర్థము యౌగికము. కాఁబట్టియే (— —) Hyphen, లో నున్నది. మొత్తముపై వచ్చునర్థము "రత్నములు చెక్కినకమ్మ, రత్నతాటంకము" అని వ్రాసియే యున్నది. ఈ వ్రాఁత వంజునకున్న ప్రాచీనప్రయోగములను బరిశీలించియే సూ. ని. వ్రాసినది. ప్రకృతము సారంగధరలోని 'కమ్మవంజు' అను రెండు పదములు ఏకార్థములు గావు. నిఘంటుపద్ధతిని బట్టి సూ. ని. వ్రాఁత నిష్ప్రమాదము. నిశ్చయదృష్టిలేక తొందరత్రొక్కిడిగా వ్రాయించిన శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారివ్రాఁత యిట పూర్వాపరవిరోధముగలది.

(6) "శా. పా. గ్రచ్చుకొని. గచ్చుకొని, పూ. మ. పా. ప్రాణ్యమునను శ. ర. లోను 'గచ్చుకొను' అను రూపమేగాని గ్రచ్చుకొను, అను రూపములేదు. సూ. ని. లో ఏరూపమును లేదు. అని వ్రాసిరి. చూ. జితకాశి. 491 పుట"

గ్రచ్చు, గచ్చు, లకుఁగలయర్థ మీసారంగలోని 3-216 వ గద్యమునకుఁ బొసఁగదు. కాఁబట్టి యీరెండుపదములకు ననుప్రయుక్తమగు 'కొను' కాదిది. సూ. ని. ఈపదమును బరుసాదిగా గ్రహించినది. పాపము!! శాస్త్రిగా రాపదమును జూచియుండరు. అందలియర్థ మీప్రకరణమునకుఁ జక్కఁగ సరిపడఁ గలదు.

(7) "కలయంగన్, క్రియావిశేషణము. శ. ర. లో, సూ. ని. లో గూడా లేదు. చూ. జితకాశి 507 పుట"

కన్, అనునది షష్ఠ్యంత మగునగుధాతువు. ఇది క్రియావిశేషణములకును షష్ఠ్యంతక్రియలకును ననుప్రయుక్తమగును. కన్ విరహితమయ్యును క్రియకు విశేషణమగుదానినే క్రి. విశే. అని యనుట

సూ. ని. పద్ధతి. 'కలయుంగన్' అనునది సుబ్యంతక్రియగాని క్రియా విశేషణము గాదు. (చూ. సూ. ని. అల్ల[2].) మఱియు నీవిషయము బాలవ్యాకరణక్రియాపరిచ్ఛేదము 115, 116, సూత్రములు, వాని వివరణమును బరికించినఁ దెలియును.

(8) "మఱిక అను నర్థమున శ. ర. లో, కఱ, శకటరేఫముతో నే యున్నది. కాని, వ్రాను 'కర' అన్నాఁడు... సూ. ని. లో ఈ 'కర' వరేఫముతోనూ లేదు." అని వ్రాయించిరి. చూ. జితకాశి. 496 పుట.

ఇది శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారి సాహసము. ఇట్టి ప్రసిద్ధపదమును, ఈపదమునకు సారంగధరలోని పద్యమును సూ. ని. ఎన్నఁడును విడుపదు. ఇది రెండవసంపుటమున "కఱ్ఱ (ఱ)" అను పదములోనున్నది నాలుగు పాదములతో పూర్తిగా నీసారంగపద్యమునే చూపినది. (చూ. సూ. ని. 2 సం. 167 పుట.) ఈపద్ధతి వీరు 'కరకర, లో గమనించియే యుందురు. ఐనను బొరపడిరి.

(9) "చనుమానము, నిఘంటువులలో లేదు. వ్యవహారమున నున్నది". అని వ్రాసిరి. చూ. జితకాశి. 196 పుట" ఇంతేగాక పునస్సమీక్షలో చనుమాన మనుపదమున కొకయాధునిక ప్రయోగము చూపి దానికి గతి కల్పించిరి. సూ. ని. మూఁడవసంపుటములో 47 వ పొరట వేంకటనాథుని పంచతంత్రము, దశావతారచరిత్రము, నిరంజనోపాఖ్యానములనుండి ప్రయోగములఁజూపి యీపద మెత్తియున్నది. ఈసంపుటము వీరెఱుంగరు కాఁబోలు. ఇట్టిదే 'చీరచిక్కుట, యును. (చూ. సూ. ని. 3 వ సంపుటము)

(10) "కొమిరె, పాఠము అసాధువే యగుచున్నది. సూ. ని. యీపాఠమునే గైకొన్నది." చూ. జితకాశి 233 పుట. కొమిరె అను పాఠముతో సూ. ని. ఈపద్యము నెక్కడ నుదాహరించినదో శ్రీ శాస్త్రిగారు తెలుపకుండుటకుఁ గారణమేమో ?

పై విషయములఁ బరామర్శించి సూ. ని. లో గ్రహింపఁబడిన పాఠములు పదపదార్థములు నవిరుద్ధములని పాఠకు లెఱుఁగుదురు గాక. మొదటినుండియుఁ బ్రామాణికులగు పెక్కురు పండితు లేకాభిప్రాయముగ నిర్ణయించిన పదపదార్థములనే పూర్వోత్తరవిరోధములు లేకుండ గ్రహించుట, సూ. ని. పరిపాటి. నాఁటికి నేఁటికి నీనిఘంటు నిర్మాణమున ఆసరణియే గ్రహింపఁబడుచున్నది. ఇట్లుండ సూ. ని. హృదయము సాకల్యముగ నెఱుఁగకయే దోషముల నారోపించుట శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారి సాహసమాత్రమే యనియు, ఇట్టి యారోపణలు ప్రామాణికనిఘంటువుపై అనాలోచితముగ ఇతరులు చేయకుండురనియు నెఱింగించుటకే యింతవఱకు సమాధానమీయవలసి వచ్చినదని మనవి.

కొన్నివృత్తములు : తన్నతభేదములు

— దువ్వూరి సూర్యనారాయణమూర్తిగారు, కొవ్వూరు. —

వాఙ్మయము వేదకాలమునుండియు గద్యాత్మకముగను బద్యాత్మకముగను విరాజిల్లుచుంట సర్వలోకవిదితము. దాన నొకశాఖగా నుండి చిరకాలమునుండియు వాడఁబడుచు గద్యపద్యాత్మకముగఁ బెంపొందుచున్నది యాంధ్రభాష. ఇయ్యది పద్యాత్మకముగా వాడుకలోనికి రాకమున్న కొన్నిరకములగు దరువులవలెను జిన్నచిన్న గేయములవలెను దాళానుగుణముగఁ బాడుకొనఁబడుచు నుండెడి దని విమర్శకులు తెలిపియే యుండిరి. రాను రాను గద్యమునకన్నఁ బద్యమున శ్రుతిసుఖము హెచ్చుగ నుండుటచేఁ గొన్నివిధము లగు నియమములచేఁ గొన్ని పద్యములు బయలుదేఱినవి. ఇయ్యవి గానార్హము లై హృదయరంజకముగ నుండుటచే జనుల కత్యంతప్రేమపాత్రము లై ప్రబంధరూపములుగను దృశ్యకావ్యరూపములుగను నభివృద్ధి నందినవి. అట్టికావ్యముల నుండువృత్తములు బహువిధము లై నడకలు గలిగి నామాంతరముల నందినవి. వానినామముల ననుసరించి యావృత్తమున కిన్నిపాదము లనియుఁ బాదమున కిన్నియక్షరము లనియుఁ గూడ నేర్పఱుపఁబడినవి. ఆయానియమప్రకారము కూర్చుటలో నడక చెడిపోకుండునట్లును, సుకరముగ నావృత్తముల వ్రాసికొనఁగోరువా రీనియమానుసారముగా నడువవలె ననియుఁ గొన్ని గణము లేర్పడినవి. గణ మనఁగాఁ గొన్ని గురులఘువుల సమూహము. ఈయవి యక్షరముల నాశ్రయించి యుండును. వీనినే "హ్రస్వం లఘు, సంయోగే గురు, దీర్ఘంచ" అని పాణిని మొదలగువారు చెప్పియున్నారు. ఇట్టిగురులఘువులతోఁ గూడినగణములయొక్క నడక నాశ్రయించిన కూర్పే వృత్త మనఁబడును. ఈవృత్తపాదమున కెన్నియక్షరము లుండునో యది యన్నవఛంద మని కూడ మనవారు పేరు వెట్టిరి. ఆఛందము లిరువదియాఱు అని లక్షణకర్తలు విభజించియున్నారు- ఈఛందములఁ బుట్టినవృత్తసంఖ్య కొన్నికోట్లతరబడి కలదు. ఈఛందములలోఁ జేరినవియే సమవృత్తము లనియు నీఛందముల దాఁటినవి విషమవృత్తము లనియు వీనవిభాగము. ఇట్టివృత్తములలో ననేకవిధము లగు వర్ణావృత్తులు రానురాను బయలుదేఱినవి. అట్టియావృత్తిలో ననిర్వాచ్యమైన సుఖము శ్రవణమునకు గలుగు నని మనపూర్వులు తలఁచి యుండుటచే

నిట్టియావృత్తి చేయవలయు ననునొకనియమము కొంతకాలమునకు బయలు దేఱినది. మఱి కొంత నాగరికకాలము రాను శ్రుతిసుఖార్థము నిలుపువర్ణసంతతి నియమబద్ధమై తప్పక యాయావృత్తములఁ బరిగణింపఁబడుచు శాసనమైనది. ఈశాసనము లనేకరీతు లగునామములతో లక్షణగ్రంథముల నుదయింపఁజేసినవి. అట్లగుచు మఱికొంతబలమును సంపాదించినవై యట్టినియమముల దాఁటరా దనియుఁ బద్యకవితల నల్లువా రందఱీనియమములనే పాటింపవలె ననియు నట్లుచేయక పుస్తకముల వ్రాసిన నట్టికృతి నందినవారికి గొప్పగొప్ప కష్టములు వాటిల్లు ననియు నట్టిగ్రంథము కుగ్రంథమగు ననియుఁ గవి కుకవి యనిపించుకొను ననియుఁ జాటినవి. నాఁటినుండియు భాషాసాంప్రదాయము మాఱుటతప్ప పూర్వనియమములు నిలిచియే యున్నవి. కాని రానురాను గొన్నిబిగింపులు సడలినవి. భీమన పదియతులనే చెప్ప నప్పకవి నలువది యొక్కయతిని, మఱికొందఱిరువదియొక్కయతులను చెప్పియున్నారు. వారిలో వారే యఖండాదియతులవిషయమునఁ బూర్వమతముల ఖండించుచు స్వమతధ్వజముల నాటియుండిరి. ఇట్లే వృత్తములలోఁ గూడ లక్షణకర్తలు కొన్నిభావభేదముల నంది యున్నారు. ప్రకృతమున నావృత్తములఁగూర్చి కొన్నియస్పష్టవిషయములను వారివారిమతభేదములను నీక్రిందఁ బొందుపఱుతును.

1. జలదరవవృత్తము:—“నననననసలునలనొడఁబడినయవినయవిధివిసుమురేచన మనుయతిని నిలుపఁగ మహిని జలదరవముగురువులోనే.”

పైవృత్తమున రెండుపాదము లని గ్రహింపవలెను. లక్షణము లక్ష్యము గూడ నదియే. దీనిలో యతిస్థానము “మను” అనఁగాఁ, బదునాలుగక్షరములు దాఁటినవెనుక నని చెప్పఁబడినది. ఇయ్యది యప్పకవీయమున “ధరణిధరగతి” అను నామాంతరము నంది యీలక్షణముగనే యున్నది. యతులు మాత్రము పాదమునకు రెండేసి గలవు. ఎనిమిదియక్షరముల తరువాత నొకయతియుఁ, బదునాలుగక్షరములు దాఁటినవెనుక నొకయతియు నున్నది. కవిజనాశ్రయమునఁ బాదమున కొక్కయతియే నిలుపఁబడినది. తక్కినలక్షణము లన్నియునసమములు.........

2. మానిని:—తారకముల్ క్రియ గన్గొన నేడుభకారము లొక్కగకారముతో గారవమై చనఁగా యతిపంక్తిటఁగల్గినమానిని.........”

పైపద్యపాదమునకు/ మూఁడుస్థానముల యతి కనుపించు చున్నది,

గాని, "వండ్రెట" అని స్పష్టముగాఁ బాదమున త్రయోయతియే యని కవి చెప్పి నాఁడు. ఈవిషయ మప్పకవీయమున స్పష్ట మగును. అనఁగా నందు పాద మున విచ్ఛేదత్రయము గానుపింపలేదు. ఇఁక ఛందోదర్పణమున నేతద్భిన్న మార్గ మంగీకరింపఁబడినది చూడుఁడు.

"...............అద్రిభసేవ్యగురుప్రవిలసిల్లురసత్రయచిత్రయతుల్
　　　　బన్నుగ నొందత్రిభాసురవిశ్రమభంగిగమానిని........."

పై పద్యమున "రసత్రయ" అనుశబ్దముచే షడ్రసములు గాన నాఱక్ష రముల వ్యవధానముగా మూఁడుయతు లని కవి స్పష్టపఱచినాఁడు. ఆశబ్దముచే పదునెనిమిది యనుటకు వీలు లేదు, "చిత్రయతుల్" అని బహువచన ము న్నది గాన-ఉదాహరణను, చూడుఁడు.

"వన్నె యొనర్చిన, వాహినియాతని, వామపదంబున, వాలెనసర్" ఇట్లే నాలుగుపాదములందును నాఱక్షరములు వ్యవధానముగా యతిత్రయము నిలు పఁబడినది. తక్కినవిషయములలో లక్షణకర్తల కైక్యము లేకపోలేదు. పదు నెనిమిదియక్షరములు దాఁటిన వెనుక యతియన్నను నితరులకన్న భిన్నమే.

3. లయగ్రాహి:—

ఇంబడరఁగా భజసనంబులకడన్ భజసనంబులుభకారమునొడంబడలయగ్రా
హింబరఁగఁజెప్పుకలశోంబిడినయట్లియగణంబుకృతిమీఁదనమరుంబరహితార్థీ.

పై పద్యమున గణములు తప్ప మఱేవిషయము చెప్పఁబడియుండలేదు. వృత్తమునకువలెఁబ్రాసకనఁబడుచున్నది. ప్రాసయతులే తత్తత్ స్థానములనిలుపఁ బడినవి, కాని, యవెన్నిపట్టుల నిలుపవలెనో తెలియదు, పాదమునకు మూఁడు పట్టుల కనఁబడుచున్నవి. అనంతునిఛందమున "ఏకోనచత్వారింశన్మాత్రాగర్భి తంబు త్రింశదక్షరంబులైన లయగ్రాహి యగు" నని మాటలతోఁ జెప్పఁబడి నది. లక్షణమున యతులవిషయము కవిజనాశ్రయమునే యనుకరించుచున్నది. "ప్రాసముల్ గ్రందుకొని" యనుటవలన వృత్తప్రాసములు ప్రాసయతులుంగూడ గ్రహింపవచ్చును. అప్పకవీయమున నగన్యము లన్నియు వాచ్యములైనవి, గాన, దానిప్రకారము చూచుకొనినఁ బైవన్నియు సరిగనుండును.........

4. లయవిభాతి:—పైవృత్తవిషయమున నందఱును నేకీభవించియే యుండిరి. అప్పకవీయము ననుసరించి చూడ నాల్గుయతులు పాదాంత మగు వఱకు నిలుపవలె నని తేలుచున్నది. కాని యప్పకవి లక్షణపద్యమును గొంత

దిద్దవలసియున్నది. "ననసద్వయము వెరుక ననగంబులను నిలిపి" అని యున్నది. ఇది కేవలము లక్ష్యవిరుద్ధము. ద్వయ మనుచోట త్రయ మని యుండవలెను. ఇయ్యది యచ్చుతప్పో పరిశీలనకర్తలలోటో యయియుండవలెను గాని అన్యథా కాదు.........

5. త్రిభంగి:—ఈవృత్తవిషయమై భిన్నాభిప్రాయము లున్నవి. కవిజనాశ్రయకర్త నాలుగునగణములును రెండుసగణములపై భమసగలు పాదమునకుఁ గలిగి యీవృత్త ముండు నని చెప్పెను. మఱియు "వడి దప్పక ప్రాసము లొప్పక" అని యతి లేదనికూడఁ జెప్పియున్నాఁడు. అనంతునిఛందమున నాలుగునగణములును ననమసగలనుగణములు పాదమునకు లక్షణ మని చెప్పఁబడినది. ఇతరవిషయము లేమియుఁ జెప్పఁబడియుండలేదు. లక్ష్యదృష్టిని జూడ మొదటి రెండుపాదముల రెండుప్రాసయతు లున్నవి. మూఁడునాలుగుపాదముల మూఁడేసి ప్రాసయతు లగపడుచున్నవి. ప్రాసము కలదు. ఈలక్షణమును గవిజనాశ్రయ లక్షణమును జూడ నేమియు సంబంధ మున్నట్లగుపడదు. ఇఁక, అప్పకవీయమును జూచిన, ఆలునగణములును రెండుసగణములును భమసగములు పాదమునకు లక్షణ మన్నట్లు తెలియుచున్నది. కాని పద్యమునందు నగణము లాఱును ససభసగములును బాదమునకు లక్షణ మని చెప్పఁబడినది. ఇది లక్ష్యవిరుద్ధము. ససభమసగలని దిద్దిన విరోధ ముండదు. తక్కినవిషయముల నియ్యది యస్పష్టముగ నున్నది. రెండుపద్యము లుపయోగించి లక్షణము చెప్పినను నీతఁడు స్పష్టముగా నియమింపలేకపోయినాఁడు. "షడ్యతిసంగిక" అని పద్యమునఁ జెప్పినపదమునకు సరియగు నర్థము గనఁబడదు. ప్రాస కలదు. పాదమునకు రెండుప్రాస యతులైన ట్లగపడుచున్నది. కవిజనాశ్రయమున "వడి దప్పన్" అనెడినియమము దీనిచే బాధింపఁబడెను. ఎనిమిదింట యతిస్థానము-అక్షరములలెక్కనుబట్టి యప్పకవిది నీతనిది నొకఛందముననే పుట్టిన వని మాత్రము చెప్పవచ్చును. కవిజనాశ్రయుని త్రిభంగి త్రిభంగిగానే యున్నది. ఇయ్యది విజాతీయమైన నామమాత్రసాదృశ్యముగా నున్నది... ......

6. విషమసీసము:—ఇయ్యది కవిజనాశ్రయమున నుత్సాహవృత్తము క్రింద గీతిగాని యాటవెలఁదిగాని రచించిన పైవృత్త మగు నని లక్షణము చెప్పఁబడలేదు. ఈయర్థము స్పష్టముగా లక్షణమునుండి వచ్చుటలేదు. గీతి విష

యము పద్యమున లేనేలేదు. దీని నన్యలక్షణకర్తలమార్గ మారసి కొందఱు చిన్నమార్పు చేసిరి.

"ఉత్సాహ మయ్యె నిదియు నుం బ్రశస్తముగ నొనర్పఁగన్" అనెడిచోట, ఉత్సాహమయ్యె గీతియును బ్రశస్తముగ నొనర్పఁగన్" అనిదిద్దినారు. అప్పుడు గీతివిషయము స్పష్టపడును. అనంతుఁ డీక్రిందిగీతిలో వృత్తమునకువలెఁ బ్రాస గూడ నుండవలె నని చెప్పియున్నాఁడు. చూడుఁడు.

"ప్రాసములును వడులు భాసురంబుగ నిట్లు విలసితముగ నాటవెలఁదియందు
నుత్సుకతనొనర్చి యుత్సాహమది నిల్ప విషమసీస మమరు... ... ..."

చెప్పటయే గాని తాను జేసి యుండలేదు. మఱియుఁ గవిజనాశ్రయ మున నుత్సాహతుదను గీతియే యుండవలయు నని తేలుచున్నది. అచ్చటచ్చట నీతఁ డాటవెలఁదికిని గీతికిని యభేదము కల్పించి యున్నాఁడు. అనంతుఁడు గూడ నన్నిసీసలక్షణములకుఁ గుప్తముగా నొకపద్యమునఁ జెప్పుచు, ఉత్సాహ తుదను గీతి పరఁగ విషమసీసం బగు భానుతేజ"అని చెప్పుట పైవిధిని బలపఱు చుచునేయున్నది. కవిజనాశ్రయుని సర్వసీసలక్షణపద్యమున విషమసీసము నకు "తుదనుగీతి పరఁగవిషమసీసం బగు భానుతేజ" అని లక్షణము చెప్పెను. దేనితుదనో చెప్పకపోవుటచే,

"అది యె సమసీస ముత్సాహ తుదను గీతి, పరఁగవిషమసీసం బగు... ... ..." అని దిద్దిరి. అప్పకవి యీవిషయమును స్పష్టముగాఁ జెప్పియున్నాఁడు. గీతమందు ప్రాస యనవసర మని లక్ష్యమునుబట్టి తేలుచున్నది. ఈవిష యమున ననంతుఁడే మార్గాంతరస్థుఁ డైనాఁడు.

7. వడిసీసము:—కవిజనాశ్రయమున "మున్నైకొన్న యతి పాదమందెల్ల నడరిన వడిసీసమనఁగఁ బరఁగు" అని లక్షణము చెప్పఁబడినది. లక్ష్యముగూడ లక్షణవిరోధముగ లేదు. అనంతుఁడు గూడ నీమతముననే చేరినాఁడు. అప్పకవి మాత్రము "ఆది నేవడి నిల్పి రావడే పదమెల్లఁ జేయనయ్యది వడిసీస మయ్యె" అని లక్షణమును జెప్పి లక్ష్యము తద్భిన్నముగా నిచ్చినాఁడు. చూడుఁడు:—

"విజయసారథిఁగాని, వినుతింపఁగానొల్ల, గిరినాయకునిగాని, కీరిసేయ"

పైపాదాదిని ప్రాణియతి నిలిపి రెండవయర్ధమందు వర్గయతి నిలుపఁ బడినది. మూఁడవపాదము మాత్రము స్పష్టముగా నున్నది.

"పద్మనాభునిగాని, పాటింపఁ గానొల్లఁ, బాణిపతిఁగాని, ప్రస్తుతింప"

ఈపాదమున నభిన్న మగు వర్గయతి నిలుపఁబడినది. దీనినిబట్టి చూడ లక్షణమందలి పదశబ్దాభిప్రాయ మెంతవఱకు సార్థకమో తెలియకున్నది. సీస పాదార్థమే పద మని తాను గ్రహించినట్లు తేలుచున్నది. అట్లు చెప్పుట యనవసరము. అట్టి ఖండమందు నిలుపవలసిన యతి యెుక్కటే గాన నిట్టివిషయము న నన్యోన్యము భేదము కనుపించుచున్నది.

8. ప్రాససీసము:—కవిజనాశ్రయంబున నిద్దానిలక్షణ మిట్లున్నది.

"వృత్తంబునకువలె వెలయ నాల్గుగుల వెసఁ బ్రాసములు నిల్పి
విరతు లునుప .... ప్రాససీసంబగు"

ఈపాదచతుష్టయద్వితీయతుల్యాంశత్వము గీతియందుఁ గూడఁ బొడకట్టుచున్నది. ఇచ్చట, అనంతునిమతమున గీతమందు ప్రాసనియమ మగపడదు. ఈతనిలక్షణమునఁగూడ గీతివిషయమునే చెప్పియుండ లేదు. ఈనియమము ననుసరించియే కొందఱుప్రాససీసలక్షణమునందే కలిపి యక్కిలిప్రాససీసమునకు లక్షణము నుభయలక్ష్యభూతదృష్టితోఁ జెప్పిన కవిజనాశ్రయుని పద్యమును గొంచెము సవరించిరి. "దీనిపశ్చిమార్థంబున ప్రాసంబు వేఱొక్క ప్రాస మైన" అను చోట దీని, అనుదానిని తీసివైచి గీతి అని నిలిపిరి. అప్పు డర్థము గీతిన్=గీతియందునను, పశ్చిమార్థంబునన్=ప్రాససీసపాదద్వితీయభాగమునను, వేఱొక్క ప్రాసమైనన్=ప్రాససీసమం దేప్రాసనిలుపఁబడెనో తదభిన్నమై తదధిక మైన మఱియొకప్రాసమును నిలుపఁగా నని చెప్పుకొనవలెను. ఇట్లు చెప్పుకొన్నచో, ప్రాసాక్కిలిప్రాససీసములలో ననంతుఁడును సీతఁడును సఖ్యపడుదురు. అప్పుడు కవిజనాశ్రయమందలి పద్యలక్షణమున గీతియందలి ప్రాసనియమమును నాల్గవ సీసపాదఖండద్వయమందలి ప్రాసనియమమును నక్కిలిప్రాససీసమున కుదాహరణములు గాని ప్రాససీసమున కుదాహరణములు గావని గ్రహింపవలెను.

కవిజనాశ్రయునికన్న విశేషముగ వృత్తప్రాస, సర్వతఃప్రాస లనుసీసద్వయములను, అప్పకవి యనంతులు చెప్పినారు. అందప్పకవీయమున "ప్రాసమారంభ్రులఁ 'బదిలంబుగానిల్ప, నక్కిలిప్రాససీ సాఖ్యమగును' అని లక్షణము చెప్పఁబడినది. వృత్తప్రాససీసమునకే పూర్వముద్రణప్రతిలో నక్కిలిప్రాససీస మనుపే రుండెడి దని యాపేజీలోఁ గ్రిందిభాగమున వ్రాయఁబడియున్నది. అట్లైన నియ్యది పైలక్షణకర్తలతో భిన్న మగుచున్నది. గీతపాదచతుష్టయమందును ప్రాసనిలుపవలె నని వారిరువురమతము. గీతప్రథమచతుర్థపాదము

లలో నే యీనియమ మున్నఁజాలు నని యప్పకవిమతము. ఎట్లైనను భేదము తప్పలేదు. అనంతుఁడు గూడ నీవృత్తప్రాససీసమును జెప్పెను గాన నప్పకవీయమందలి నామమును మార్పక చూతమన్న ననంతుఁడు గీతిలో నేపాదమందునను గూడఁ బ్రాస కావలె నని చెప్పియుండలేదు. లక్ష్యమునఁ గూడ లేదు. కాన నీవిషయముల భీమనరంగరాజులే కలసిరి గాని యప్పకవిమతము వేఱైనది. సర్వతఃప్రాససీసమున నిద్దఱు నేకీభవించిరి. ఇయ్యది కవిజనాశ్రయమందలి ప్రాససీసమం దంతర్భవింపదు. దీన, పాదచతుష్టయమందునను వృత్తమునకువలెఁ బ్రాస నిలుపవలెను. సర్వతఃప్రాసమునఁ బ్రాసయు యతిస్థానమునఁ బ్రాసయతులును నయి యుండవలెను.........

9. త్రిపద :—ఇయ్యది మూఁడుపాదములతో నున్నది గాన నా నామము నందినది. దీనికిఁ బ్రాస మున్నది. యతి లేనట్లున్నది. ఈవిషయ మప్పకవి చెప్పినాఁడు. "వళి లేక నలరారుఁ ద్రిపద" యని, కాని ప్రథమపాదమధ్యమున యతిస్థానమందువలె గుర్తునిలుపఁబడినది. అయ్యది యచ్చుతప్పయి యుండనోపును. లక్షణకర్తలు సందేహముగాఁ బద్యముల వ్రాయుట యిట్టిప్రమాదములఁ గలిగించుట సహజమే. మఱియు నది పాదచతుష్టయభ్రమ కలుగఁజేయుచున్నది. ఈ ప్రథమపాదయతివిషయమున నప్పకవీయమున నే గాకతక్కిన వారిగ్రంథములఁగూడ నిట్టిభ్రాంతియే కనఁబడుచున్నది చూడుఁడు.

కవిజనాశ్రయము :—త్రిదశేంద్రులాఱగు । పదియగు నెడనకుఁ.

ఛందోదర్పణము :—సరవిఁబ్రాసమునంది । సురపతుల్ నలువురు.

అప్పకవీయము :—తొలుతను నల్వు రిం । ద్రులు రెంటమూటను.

పై వారు యతివిషయమును గూర్చి చెప్పకున్నను గూడ దని చెప్పిన యప్పకవిగూడ నిట్టిసందేహమునకుఁ దావులేకుండ వ్రాయలేకపోయినాఁడా ? కాదు. ఇది కేవలము మనస్సంకోచమే. కవిజనాశ్రయమున యతియున్నదా? లేదా? అనునిర్ధారణ లేక యతి కనుపించుచుండుటచే ననంతుఁడుఁగూడ గోడపైపిల్లివాటముగ నె ట్లనుకొన్నను బాధకలుగ దని సందిగ్ధముగాఁ జెప్పి యున్నాఁడు. మఱియొకసంగతి. కవిజనాశ్రయుని లక్షణలక్ష్యములకు విరోధమున్నది. దానికి సరియగునర్థము కుదురకున్నది. పై వారిలక్షణమైన నావృత్తము నకుఁ బట్టలేదు. అందువలనఁ దప్పనుటకువీలు లేదు. ఏమందురా? అయ్యది.

"బినరుహోద్భవగణం బనదళస్థానదొళ్

బిసరుహనేత్రతే గణమెబర్సులిదవు
బిసరుహనేత్రతేత్రిపదిగే''

అనెడి కన్నడలక్షణమునకు సరిపడి యున్నదని క్రింద వ్రాయఁబడినది. పై పద్య ప్రథమపాదమందుఁ గూడ యతి కల దనియే సూచించుచున్నది, గాని, యీ భేదముల నేది నిశ్చయమో ప్రమాణగ్రంథలక్ష్యము దొరకువఱకును నిర్ణయింపఁజాలము. ఈపై వారిలక్షణమునకుఁగవిజనాశ్రయునిలక్షణపద్యముల సరిపుచ్చవలెనన్న రెండవపాదమును-

"గదియరెండిటను మూడిటను" అని సరిచేసిన భేదమువాటిల్లక గణములు మాత్రము సరిపడును.........

10. చౌపద:—దీనిలక్షణ మన్నిటియందునను సమముగానేయున్నది. అనంతుఁడు మాత్రము పాదాంతమందు లఘువునే నిలిపినాఁడు. తక్కినవారి లక్ష్యముల గురువున్నది.........

11. షట్పద :—ఇయ్యది రంగరాట్ఛందమున స్పష్టముగా నున్నది. ఆఱుపాదములచే నుండుట యిద్దానికి సార్థకనామము. ఆఱింద్రగణములు నొక చంద్రగణమును బాదత్రయ మగు నని దీనిలక్షణము. ప్రాస గలదు. వడి లేదు. చంద్రగణము మూఁడాఱుపాదములనే యుండును. కవిజనాశ్రయమున నీ యర్థమే చెప్పఁబడెను గాని పద్యము ప్రభ్రష్టమైనది. ముద్రణ పాదవిభాగముగా లేదు. ప్రాసము కొన్నిపట్టులఁబోయినది. గణములకూర్పు పోలేదు. దానిని

"త్రిదశేంద్ర గణములు
కుదురనిర్మాడిడి
కదియనంత్యంబునఁ జంద్రుఁగూర్చి
తుది యిట్లుగాకూర్ప
నది యతిలేక ష
ట్పద మగు మల్లియరేచనాఖ్య''

ఈరీతిగా సవరించిన లక్ష్యలక్షణసమన్వయముగా నుండును. ఇంక నప్ప కవీయమున నీలక్షణ మంతయు సరియగురీతినే యున్నది గాని లక్ష్యపద్యమున "పాద మీసూటితో నాల్గుఁజేసిన" అని యున్నది. ఈనాల్గు అనుదాని కర్థ మున్నట్లు లగపడదు. కొంచెము మార్చిన సరిపడును, గాన, దీనిమైదాఱు పాదముల

"భాసిల్లమూఁడగు, నీసాటిరెట్టించి"

అను చిన్నమార్పుఁ జేయవలెను..........

ఇట్లు లక్షణకర్తలలో ననేకభేదము లనేకస్థలములఁ గనఁబడుచున్నవి. ఇంకను గొన్నివృత్తములలోఁగూడ నున్నవి. గ్రంథవిస్తరభీతిని ముగించితి. ఈ యిక్కట్లు సామాన్యముగాఁబూర్వలక్షణముల దిద్దుటవలన వచ్చుచున్నవి. రాను రాను మూఁడునాల్గుశతాబ్దముల నాఁటికిఁ గవి తనగ్రంథమునఁ బ్రయోగించిన పదములు నశించి, అధికపాఠమయము లగుచున్నవి. ఇట్టే కొంతకాలమునకు నిరర్థకములు గూడ నగుచున్నవి. ఈదిద్దులు పూర్వమునుండియు వచ్చుచునే యున్నవి. నూతనముగ వ్యాకరణ మొకటి వ్రాయవలెనన్న పండితుఁడు కొన్ని ప్రయోగములఁ బ్రమాణగ్రంథముల మార్చుచేసి యిట్టివిశేషములు తత్పూర్వులు చెప్పియుండలేదని నేనే క్రొత్తగాఁ బరిశీలించితి ననియుఁ గూడఁ జెప్పుట మనము ప్రౌఢవ్యాకరణాదులలోఁ జూచుచునే యున్నాము. ముఖ్యముగా నతి కష్టతరములగు నిట్టిపెద్దవిషయముల నొకపద్యమున నిమిడింపవలె నన్న నప్పటత లెక్కువగానే యుండును; గాని యేకచ్ఛందోజాతములై నామసాదృశ్యము ను గూడ నందుచు వానివానినియమములలోను గణములలోను భేదము లక్షణ కర్తలలోఁ గననగుట వింత. ఇయ్యది వారివారి స్వతంత్రములను దెలుపుచున్నవి, గాని, నియమప్రకార మనుసరించుట లేదు. ఇట్లు వృత్తములలోనే గాక యతులలోఁ, బ్రాసములలో మఱియు ననేకవిషయములలో నిట్టిమతభేదము లుంటచేతనే శాస్త్రము కఠినమై బహుమార్గములఁ ద్రొక్కుచున్న దనుట సర్వవిదిత మని విరమించుచున్నాను.

అప్పకవీయము : యతిప్రాసలు

దువ్వూరి సూర్యనారాయణమూర్తిగారు

నేఁటికాలమున నాంధ్రచ్ఛందోగ్రంథములలో నెల్ల గౌరవస్థానము నలంకరించి వన్నెకెక్కినది యప్పకవీయ మొక్కటియే. ఇటీవలి కవు లందఱును సామాన్యముగ నిద్దానినే ప్రమాణముగ నంగీకరించుచున్నారు. కాని యప్పకవి తాను ఛందోగ్రంథమును రచింపవలెనను తలంపున నిద్దానిని వ్రాసినట్లు లగపడదు. ఏమన నాంధ్రశబ్దచింతామణి యను నన్నయకృత వ్యాకరణము సంస్కృత రూపమున నుండ నద్దానిని భగవదాజ్ఞానుసారము తెనిఁగించి పలువురకు సుబోధముచేయ తలపెట్టె నని యాతని గ్రంథమువలన సర్వులకు విదితమే యగుచున్నది. అట్లయ్యు వ్రాసినంతలో ఛందోవిషయ మెక్కుడుగాను, పూర్వలక్షణ కర్తలకంటె విశేషముగాను నుంటచే నిద్దానిని ఛందోగ్రంథముగానే పరిగణింపుచున్నారు. దీని తృతీయాశ్వాసమున "ఆద్యో వళి ర్ద్వితీయో వర్ణః ప్రాసోత్ర పాదపాదేషు" అనెడి సూత్రమునకు విపులవ్యాఖ్య రచింపఁబడి యతిప్రాసల విషయమై విపులముగఁ జెప్పఁబడినది. ప్రకృతమున వీనిని గుఱించి నా యభిప్రాయములఁ గొన్నింటి వెల్లడింతును.

ఈ యతిప్రాసల విషయమున నప్పకవి పూర్వలాక్షణికుల యతిసంఖ్యలఁ జెప్పుచు "విశ్రమంబు లేను విరచింతు నాలుగుపదులమీఁద నొకటి" అని తాను ౪౧ యతులఁ జెప్పియున్నాఁడు. బాగుగ విచారించిన వీనిలో కొన్ని గతార్థములు కాఁదగియున్నవి. అట్టివాని నీ క్రిందఁ బొందుపఱతును.

౧. ఈతఁడు ముविభక్తియతియనియు, ముకారయతియనియు రెండు యతులను జెప్పియున్నాఁడు. భాషాపరిణతిచే నాయా మువర్ణకములు వు, బు లుగా మారుచుండుటయే యా యతిని జెప్పుటకు బీజము. ఈ రెంటిలో ముविభక్తియతి యనిన పున్నపుంసక తత్సమాంధ్రదేశ్యశబ్దముల తుదను కలయు ముకారమునకు పు, ఫు, బు, భు-లు యతి నంగునని చెప్పియున్నాఁడు. లక్ష్యపద్యమును జూడ ఒ ఓ లతోఁ గూడిన ప ఫ బ భ లుగూడ నీ ముకారముతో యతిఁ జెందవచ్చునని తేలుచున్నది. ముకార యతి యనఁగా ఉ ఊ లతోఁ గూడిన ప ఫ బ భ లు శబ్దనిష్ఠముకారముతో యతి నందు నని చెప్పియున్నాఁడు. ఏతద్వ్యతిరేకముగా లక్ష్యములుగూడ లేవు. దీనినిబట్టి చూడ, విభక్తి ముకారముతో ఒ ఓ లతోఁ గూడిన ప ఫ బ భ లు గూడఁ జెల్లు ననియు, శబ్దస్థ ముకారమున నట్లు చెల్ల వీలు లేనట్లును స్పష్టపడుచున్నది. కాని విభక్తిశబ్దనిష్ఠము లగు నెల్ల ముకారములతోను ఉ ఊ ఒ ఓ లతోడఁ గూడిన ప ఫ బ భ లు యతి నందుచున్నట్లు కవిప్రయోగముల తెలియుచున్నది. ఇట్లనుకొన్నను ఏయచ్చులతోఁ గూడినను పవర్గమునకే గాని ముకారమునకుఁ గూడునా? అనువిషయ మీతఁడు చెప్పియుండలేదు. చూడుఁడు—

"మ్రొక్కులు గైకొను సమస్త-భువనాధీశా!"

సు. సా.

"పొలుపుగ మితి లేనిమాడ్కి-మొలబంతై—"

రామ. భూ.

ఇట్టి ప్రామాణికులప్రయోగము లెన్నో యున్నవి. ప్రకృతమున నీ శ్రమ నంతను వీడి ఉత్వోత్వవిశిష్ట ముకారమునకు తాదృశ ప ఫ బ భ లు యతి నందు నని చెప్పిన సర్వలక్షణ సమన్వయముగ నుండెడిని. ఇట్లు చెప్పుకొన ముविభక్తియతి మాననగును. మఱియు విభక్తి ముకారమునకు శబ్దస్థ ముకారమునకు భేద మేమియు లేకున్నను నీతఁ డిట్లు భేదము కల్పించినఫల మంతగా కానుపింపదు. లక్షణకర్తలలోఁ బ్రథముఁడైన కవిజనాశ్రయుఁడుగూడ,

క. "పోలఁగ పుష్పంధులకు మా
పోలికవడి శీల మల్ల-మున కెన యనఁగన్
శీలం బుల్లం బనఁగా
భూలోకం బమర లోక-మున కెన యనఁగన్."

అని మకారమాత్రమునకు పవర్గు చెల్లునని చెప్పియున్నాఁడు. అప్పకవి స్పష్టప్రతిపత్త్యర్థము విభేదించి చూపెను గాని, యీరెండుయతులు నొక్కటియే గాన విభక్తియతి యనవసరము.

౨ మఱియు ఋజుయతిసందర్భమున హ, య లు పరస్పరము యతిఁ జెందునని చెప్పియున్నాఁడు. ఇయ్యది సరసయతియం దంతర్భావ మందును. అసలు యతివిషయమున హ, య ల కచ్‌త్వమే గాని హల్త్వము లేదని ఋత్వసంబంధయతిసందర్భమున,

"సారిది కాదులఁ గల వట్రుసుడుల కెల్ల
ఋత్వమిత్రంబులగు నచ్చు లెనయ నైనఁ
జెల్లు యహలును స్వరమైత్రిఁ జెందునపుడు
వెలయు నివి..............."

అని చెప్పియున్నాఁడు. అనఁగా హ, య లు తత్స్వజాత్యస్వరయుతము లగుతఱి నని యర్థము. అప్పుడు వీని హల్త్వ మవివక్షితము. ఇతరలక్షణకర్తలు గూడ నీరెంటికి నచ్‌త్వ మిచ్చి,

"అయహలు చఛజఝశషసలు
నయసంయుతనణలు............
............................ని
శ్చయముగ వళ్లయ్యె............"

అని పరస్పరము అయహలు యతి నందునని చెప్పియున్నారు. మఱియు హరిదలమ్=అరదళము, హంసః=అంచ, ఇత్యాదులందు హకార మచ్చగుటచేతను, పది + ఆఱు = పదియాఱు, నా + అది = నాయది, ఇత్యాదులం దకారము యకారరూపము నందుటచేతను హైహయాల కచ్‌త్వము స్పష్టము. కాన సరసయతి లక్షణపద్యమున "హయ లత్వమునకు" అనుచోట ఇతరలక్షణకర్తల వలె "అయహ"లఁ పరస్పరము యతిఁ జెందునని చెప్పకొన్న హైఋజుయతి గతార్థము కాఁగలదు.

3. మఱియు ప్రత్యేకయతి సందర్భమున, అది ఇది మొదలగు పదములు మఱియొక పదముతో కలిసినప్పుడు హల్లునకును, కలయక యడాగమము వచ్చినపు డచ్చునకును యతి నిలుపనగునని చెప్పియున్నాఁడు. స్వరప్రధానయతి చొప్పున నుత్తరపదాద్యచ్చు సంధివశమున లోపించెను గాన నద్దానికే యతి నిలుపవలసినన్యాయ ముండ నట్లు నిలుప వీలు లేదని నియామకమువలన కాఁబోలు నిద్దానికి నామధేయము పెట్టియుండును. కాని "చేతి + ఇది=చేతిది" అనియున్నపుడు "తి" అనుదానికి యతి నిలుపునపుడు వర్గప్రాణియతులలో నెద్దియో యొకటి యగుటచేతను, "చేతియది" అని యున్నపుడు యకారమునకే యతి నిలిపిన సరసయతియం దంతర్భవించుటచేత నీయతిప్రాముఖ్య మంతగా కనుపట్టదు. మఱియు పూర్వకవిప్రయోగముల నప్పకవి చూపించి యుండనందునఁ గూడ నిద్దాని ప్రాశస్త్య మంతగాఁ గానుపింపదు.

౪. మఱియు నేకతరయతి సందర్భమున సాధురేఫమును శకటరేఫమును సవర్ణము లయ్యును యతి చెందరాదని చెప్పియున్నాఁడు. అసలీరేఫశకటరేఫలయతిప్రాసలవిషయమున పూర్వకవు లెవ రింతపట్టుదల నూని చెప్పినట్టు లగపడదు. కాని యేదోషము నూహించి యీరెంటికిని యతిప్రాసలు చెల్లవనెనో తెలియకున్నది. ఈనియమమును బట్టి యనేకు లిట్టిప్రయోగముల సాధ్యమైనంతలో దిద్దివైచి యున్నారు అప్పటికిని కొన్ని మిగిలిన వానికి రత్నాకరాదినిఘంటుకర్తలు ద్వైరూప్యముల కల్పించి యున్నారు. కేవల ముచ్చారణలోను, పూర్వవాఙ్మయము లోను భేదము లేని వీని నిట్లు భేదించిన మహాత్ము లెట్టి ప్రయోజనముల నొడిగట్టిరో తెలియదు. రేఫశకటరేఫములకు యతిప్రాసలలో సంబంధము కూడదని బోరున పాలముఁకేక వేసి చెప్పినయప్పకవియే కొన్నిపట్ల వీనిని వాడినట్లును, వానిలో కొన్నిటికి పాఠాంతరములు లేవనియుఁగూడ పీఠికాకారులు ఘంటాపథముగఁ జెప్పియున్నారు. మఱియు ప్రాచీనప్రమాణకవుల గ్రంథములలో ననేకప్రయోగము లున్నవి. చూడుఁడు—

పారిజాతాపహరణము, తృతీయాశ్వాసము, ౪౦-వ పద్యమున—కందము.

నృసింహపురాణము, ద్వితీయాశ్వాసము, ౫౬-వ పద్యము: రేఫద్వయప్రాసయతి.

భాగవతము— (ధ్రువోపాఖ్యానము) ౯౯-వ పేజీ, ౧౧౦-వ పద్యము: రేఫద్వయప్రాసము.

భాగవతము— (ధ్రువోపాఖ్యానము) ౫౯-వ పేజీ, ౭౦-పద్యము; ౬౯-పద్యమునఁ గూడను.

చంద్రికాపరిణయము, ద్వితీయాశ్వాసము, ౨౬-వ పద్యము: ప్రాసము, వృత్తము.

చంద్రికాపరిణయము, ద్వితీయాశ్వాసము, ౬౦-వ పద్యము: ప్రాసయతి, రేఫద్వయానకు.

మనుచరిత్ర, ౯౯-పే. ౧౨-వ పద్యము; తృతీ. ౧౯-పద్యము: యతిప్రాసములు రెండును.

కళాపూర్ణోదయము, తృతీ. ౨౪౫-పద్యమునఁ గూడఁ గలదు.

శృంగారశాకుంతలము, ద్వితీ. ౧౧౫-పద్యము: రేఫద్వయమైత్రి గలదు.

ఇంక ననేక ప్రబంధములఁ గలవు. ఉన్న నేమి? విమర్శకమహాశయులు, లక్షణకర్తలుఁగూడ తామేసిద్ధాంతముల మనమున నిడికొనిరో యామార్గము వీడక సందిని పంది చేయ నెంచిన వారి నెవ రడ్డుదురు? కానిచో,

"శబ్దశాసనముఖకవీశ్వరకృతప్ర
బంధముల లక్ష్యములు కనుపట్టుకతన."

"క్రమత శబ్దానుశాసన ప్రభృతి పూర్వ
కవిజనంబులకృతుల లక్ష్యములు కలిమి"

"...గ్రంథము లెల్లను
వెదకి వెదకి సారమెల్ల వివరింపంగ."

అని యాశ్వాసమునకై దేసిసారులు తనయుత్కర్షను గొనియాడుకొన్న యప్పకవి రామరాజు వసుచరితమందలి రలయతివిషయము గాని, కళాపూర్ణోదయమందలి ౫౩. ౧౦౪. గల రలప్రాసమును గూర్చి గాని, నృసింహపురాణమందలి తృతీ. ౧౫౫ప. గల రలప్రాసమును గూర్చి గాని యిసుమంత లక్షణమును కల్పింపఁ గలిగెనా? లేదు. పట్టుదలయే ప్రధానము గాన నవి చెప్పలేదు. ఈతని దృక్పథమున పైవారికృతులు తాను ప్రమాణముగా గ్రహించిన గౌరన, పుల్లన, ఎల్లన మొదలగువారి చాటుధారలపాటి చేసినవి కావు. ఇది తప్పక యప్పకవి సాహసించె నను దానినే తెలుపుచున్నది. అథవా యీయతిని చెప్పఁ దలకొన్న, లఘ్వలఘురేఫములు పరస్పరము యతి నందరాదని చెప్పిన చాలును. తాను జెప్పిన ప్రాణియతి రీతి నేయక్షరమున కాయక్షరమే నిలుపుకొనవచ్చును. యతినియతివిషయమున తాను జేసిన నియమమురీతి నందముగ నుండెడిది. యతి కూడదను నిషేధవాక్యముగూడ నొకయతిగా నంగీకరింప ననవసరము. ఇట్టిని సంఖ్యాబాహుళ్యార్థమే యనఁ దగును. ఆధునికకవులలో ననేకులుఁగూడ నీనియమమును పాటింపకుండుట తత్తద్గ్రంథముల విదితమగుచునే యున్నది. ప్రాచీనుఁడగు కవిజనాశ్రయుఁడుగూడ నీయతి కూడునని చెప్పిన ట్లితఁడే యొప్పుకొని,

"వికటకవులు కొన్ని వింతల కల్పించి
కవిజనాశ్రయమున కలిపినారు".

అని చెప్పుచు నామతమును ఖండించియున్నాఁడు. చూడుఁడు:—

"నణ లను రెండక్షరముల
కును వడి ప్రాసంబు పెట్టుకొనవచ్చుఁ గృతిక్షా
విను రఱల కిట్లు పెట్టం
జను.................. ...."

ఇయ్యది నేఁటి పరిమద్రితప్రతులలో కనఁబడుట లేదు. ఆధునికులలోఁ గొందఱు కవిజనాశ్రయమందలి ఎక్కటియతిసందర్భమున చెప్పిన లక్షణమును "మరయలవ" అనెడిచోట "మరఱలవ" అని దిద్ది యీ రేఫద్వయమైత్రిని వారించిరి గాని కవిమతము రేఫద్వయమైత్రి యంగీకరించినట్లే తేలుచున్నది.

౫. అభేదయతి సందర్భమున "వబయో రభేదః" అనుటవలన, వబ-లడ-లళ లు తమలో తాము యతిబం

ధము నందుని చెప్పియున్నాఁడు. వబలకుఁ జెల్లుబడి యభేదవర్గయతిలో నంతర్భావము. దానిలక్షణ మేమన, వకారము ప ఫ బ భ ల తో యతి నందుట, వీనిలో పై యక్కరము లున్నవి గాన వీనిని మరల విడఁదీయుట యనవసరము. ఇఁక ల ళ లకు, ల ళ లకుఁ దానిచ్చిన లక్ష్యము లన్నియు రూపాంతరములు గలపియే గాని స్వచ్ఛములైనవి గావు. చూడుఁడు :—

"...ఇతఁ, డే కడలక జలధి పవ్వళించె ననఁగ..." ఇచ్చట పవ్వళించె ననుక్రియకు 'పవ్వడించె' నని రూపాంతర మున్నది. ఇఁక ల ళ ల కాదిపర్వము నందుఁ జెప్పిన లక్ష్యములందలి పదము కూడ "మిలిత" అనెడి లఘులకారరూపముతో నున్నది. ఇంతియె గాక సంస్కృతవర్ణసమామ్నాయమందు ళకారము గూడ లేదు. ఇట్లే యప్పకవి యుదాహరించిన "కాళ" ఇత్యాదులు లకార విశిష్టములుగా కూడ నున్నవని యెఱుఁగునది. అట్లయిన పై రేఫ శకటరేఫల విషయమున రూపాంతరము లంగీకరింపక యిట్టిచోట్ల రూపాంతర సహాయమున నీ యతిని త్రోసివేయుట కూడునా యని చదువరు లనక మానరు. కాని దానికి సమాధాన మల్పము. ర ఱ ల విషయము నడుమంత్రపు కలిమి యగు తెనుఁగు భాషాసంబంధమైనది. ల ళ డ ల విషయము ప్రాచీన మైన సంస్కృతభాషాసంబంధము. మఱియు నియ్యది వేదకాలమునుండియు వచ్చుచున్న బేధమే గాన తత్తత్సందర్భముల నియ్యది గ్రాహ్య మని నా యభిప్రాయము. చూడుఁడు—

"రుమ్పామి, లుమ్పామి; ఇరయః, ఇలయః; ఇరజ్యంతి, ఇలజ్యంతి"—ఇట్టి వైదిక ప్రయోగములు ర ల ల కభేదమును చాటుచున్నవి.

"అగ్ని మీళే, ఈడే; ఈళుషే, ఈళ్హుషే" ఇత్యాదిప్రయోగములు డ ళ ల కభేదమును చాటుచున్నవి. మఱియు ప్రాకృత వ్యాకరణమునఁగూడ "డో లః" అనెడి సూత్రముచే డలల కభేదాధ్యవసాయ మున్నటులు స్పష్టము. కాన పై యప్పకవి యుదాహరణపద్యస్థ పదములు తద్రూపముల వీకి రూపాంతర ములుగానే ప్రయోగముల నున్న వనుకొన్న శ్రమ తగ్గును. కాన యభేదయతి యనవసరము.

౬. మఱియు సూక్ష్మవిశ్రాంతి సందర్భమున "శషస" లన్యోన్యము యతిఁ జెందవచ్చు నని చెప్పియున్నాఁడు. ఇయ్యదిగూడ సరసయతివలన గతార్థ మగును. ఎట్లన, కవిజనాశ్రయరీతిని, "చ ఛ జ ఝ శ ష స" లన్యోన్యము యతిసాధర్మ్యము నందవచ్చు నని యే యీతఁడుగూడఁ జెప్పియున్నాఁడు. కాన మరల శ ష స లను వీనినుండి విడఁదీసి కల్పనాంతరము చేయుట యముఖ్యము. అసలీ యతికి బీజ మేమన నా వర్ణము లుచ్చారణములో కించిద్భేదముగా పలకబడుచున్నను, "ఖరిచ, వావసానే. ఝులాంజశు ఝుసి, ఝులాంజశోంతే; ఆదేశప్రత్యయయోః. వ్రశ్చ భ్రశ్చ...షః" ఇత్యాది సూత్రోపనిర్దిష్ట మగు పరిణతి నందుటయే. మఱియు, తద్భవరూపమున, ఆశా–ఆస; ఇచ్ఛా–ఇచ్చ; వేష–వేస ; దిశా–దెస ఇత్యాదులలోఁగూడ నాయా రూపముల నంగుటయే కారణము. మఱియు ప్రాకృతాదిభాషలలోఁగూడ, "శషోస్సః", "శ్చత్సప్సాం ఛః" ఇత్యాదు లీ నియమమునే తెలుపుచున్నవి. కాన పైఁ జెప్పిన యక్షరము లన్నియు సరసయతిరీతిని పరస్పరము యతిని బొందుచుండ సూక్ష్మవిశ్రాంతి యనునది యనవసరము.

౭. అంత్యోష్మసంధివడి విషయమున,—

"................అని యిట్లు వర్గహల్లు
పొల్లులకు పై హకారము పొందునపుడు
..............అంత్యోష్మసంధి విరమ
ణాఖ్యచే దాని కెయ్యదియైన చెల్లు"

అని చెప్పియున్నాఁడు. అనఁగా కచటతప వర్గీయ వ్యంజనాక్షరము లన్నియు (అనునాసికములు తక్క) హకారాదిపదములతోఁ గలియునప్పుడా హకారమునకును బైకలసి రూపటిన వర్గీయవ్యంజనమునకును గూడ సాజాత్యములు యతిగా నిలుపవచ్చు నని యర్థము. లక్ష్యము చూడుఁడు :

"కైరవకామఘు-గ్ఘరవాహకవికుంఠ
హైరణ్యగర్భనా-గ్ఘరిసబృంద."

పైలక్ష్యమున "కామధుక్ + హర" అనియు, "వాక్ + హరి" అనియును ఛేదము. ఇట్టిపట్టుల సంధి పాణినీయరీతిని వికల్పము. "ఝయోహోఽన్యతరస్యామ్" అని యుండుటచే హకారమునకు యతి నిలిపినచోట సంధ్యభావమును, పర్గీయవ్యంజనమునకు యతి నిలిపినచోట సంధివివక్షయుఁ జేసిన నీ యతి ప్రత్యాఖ్యానయోగ్య మగును. ఇట్టి వివక్షవలన ఛందమున గణభంగము గాని ఛందోభంగము గాని వాటిల్లదు. ఉచ్చారణలోమాత్రము కొంత కష్టము లేకపోలేదు; అయినను ప్రక్రియాలాఘవ మూహ్యము. దిద్దినపుడు లిపి యీరీతి నుండును: "వాగ్ఘరిః" అనెడిచోట "వాగ్ హరిః" అని యుండును. మఱియు నిట్టివి పూర్వకవిప్రయోగములలో లేమిఁ గాఁబోలు లక్ష్యముల నిచ్చియుండలేదు. కాన నీ యతిగూడ ననవసరము.

౮. పైరీతినే వికల్పవిరమణము గూడ తీసి వేయవచ్చును. "గూఢపాన్మదవిహార" ఇత్యాదిస్థలములలో "యరోఽనునాసికేఽనునాసికో వా" అనెడి పాణినీయసూత్రముచే, సంధి వైకల్పికము గాన, సంధిని వివక్షావివక్షాధీనము చేసిన, నియ్యది ప్రాణియతియం దంతర్భావ మందును. అట్టితఱి,

"నందసుకుమార గూఢపా-న్మదవిహార
దళితశిశుపాలగోత్రభి-న్మణివినీల"

అని నకారమునకు నకారమును, దకారమునకు దకారమును ప్రాణియతిచొప్పున సరిపోవును. ఇట్టితఱి ఛందమున కేభంగమును రాదు గాన నియ్యతి గూడ ముఖ్యముగా నుండ తగినది కాదని నానమ్మకము. మఱియు "మయటి నిత్యం వాచ్యమ్" అనెడి వార్తికమువలన, "చిన్మయుఁడు" అని రూప మొక్కటియే యగుచుండ నప్పుడిద్దానికి యతివిషయ మీయతి దిగువఁ జెప్పవలసిన యగత్యము లేదు—ఇతర యతిలో నంతర్భావమే గాన.

ఇఁక నుభయయతుల సందర్భమున నప్పకవి యనవసరమయిన వన్నియుఁ జెప్పి నామము లంకించియున్నాఁడు. సామాన్యముగ నేకపదభ్రాంతిజనకములగు సమాసస్థలములమాత్రమే యాభ్రాంతినివారణార్థ ముభయమునకు యతి నిలుపవచ్చునని, యాయా సమాసముల పదద్వయ మిమిడియున్నదనియుఁ జెప్పిన యుక్తముగా నుండెడిది. మఱియు నితర పూర్వలాక్షణికులు చెప్పియున్న యఖండయతి నంగీకరించినచో వీనిలో కొన్ని ప్రత్యాఖ్యానయోగ్యము లగును. ఆయఖండయతి నీతఁడంగీకరింపక పోవుటచే వాని కన్నిటికి వేరువేరు నామధేయములఁ బెట్టి గత్యంతరము కల్పింపవలసి వచ్చినది. చూడుఁడు. యుష్మదస్మచ్ఛబ్దయతి సందర్భమున నీశబ్దములతో పై నజాదిపదములు కలయునపు డచ్చునకును హల్లునకును గూడ యతి నిలుపవచ్చునని చెప్పియున్నాఁడు.

౯. ఉ :—"అతిపావన మయ్యె నస్మ-దన్వయ మెల్లన్." ఇచ్చట "అస్మత్ + అన్వయము" అని యుండ నుత్తరపదాద్యచ్చు సంధివశమున కలిసిపోవ నద్దానికే యతి నిలుపఁబడెను గాన నచ్చో నియ్యది స్వరప్రధానయతియం దంతర్భవించును.

"సర్వత నయ యుష్మ-దాజ్ఞానిగళ విని
బద్ధము సమఁ జిక్కు-వడియెఁ గాక."

ఇచట యతిస్థానముల యందలి హల్ సాజాత్యముండి యొకచోట యుష్మత్ + ఆజ్ఞా అని దకారోత్తరవర్తి యకారము విలుఁచుండి పదాద్యస్థ ధకారముపై నున్న యచ్చు విలుగకుండుటచే నియ్యది యన్యలక్షణకర్తలు చెప్పిన యఖండ యతియం దంతర్భవించును. ఇట్లే యఖండ యతి నంగీకరించిన కొన్ని గతార్థము లగును.

౧౦. మఱియు దేశ్య నిత్య సమాస విరతి ప్రసంగమున నాయా సమాసములఁ గల అజ్ఝల్లులు రెండును యతి నందవచ్చునని చెప్పి తాను చెప్పిన దేశ్యసమాసముల కన్నిటికి నుదాహరణల నిచ్చియున్నాఁడు. అందు నొక యుదాహరణను చూచుకొందము.

"...ఉ, కన్నఱ తద్వన మెల్ల నద్రువ-నార్చుచు కడిమిన్."

ఇచ్చట "ఉక్కు + అలు" అని సమాసాంత ద్యోతకమ్మగుటను, "అధ్రువక్ + ఆర్చుచు" అనెడి విగ్రహస్థమ్మునకును యతి నిలుపంబడెను గాన నియ్యది స్వరయతియం దంతర్భావము నందును.

"......ఉ, క్కు లరభసంబునై నడర-కవ్వడి."

ఇచ్చట సమాసస్థ కకారమునకు యతిగా కకారమే నిలుపంబడినది. ఇది హల్లు కుదాహరణము. మఱియు పై రీతినే యిచ్చటం గూడ నొకచో ఖండముగాను మఱియొకచో నఖండముగాను నుంటచే నిదిగూడ నఖండ యతియం దంతర్భావ మందును. తక్కిన ప్రయోగములు గూడ నన్నియు నీరీతినే చూచుకొన్న సరిపడును. కొందఱ్ "యజు" అను నాశార్థకధాతువునకు ప్రత్యేక ప్రయోగము లేమి పదత్వసిద్ధి కలుగదని యనుకొందురు. ప్రయోగము లుంటచే నాసందేహ మనవసరము

౧౧. ఇట్లే నిత్యయతియు, ౧౨. విభాగయతియు, ౧౩. నామాఖండయతియు, ౧౪. రాగమసంధియతియుం గూడ గ్రాహ్యములు. ఈ యతు లన్నియుం బ్రత్యాఖ్యానయోగ్యములే యని గ్రహించునది. రాగమయతిసందర్భమున ఆలను పదము మొదల వచ్చు రాగమునకే యతి నిలుపుపక్షమున నుభయము చెల్లునని యే గాని మఱే విషయమును చెప్పియుండలేదు. కాని "వాలు + అమ్ము = వాలురమ్ము" మొదలగు నాచ్ఛిక సమాసముల నిత్యముగా ప్రాప్తించు రాగమునులమాట తలపెట్టలేదు. అట్టిచో యతిస్థానముల వచ్చిన నుభయమున కేల నిలుపరాదు? ఆతని సమాసములలోను, పైచోటను వచ్చిన రాగమునకు సమమే గాని దానివలన ఫలాధిక మేమియు లేదే? శాస్త్రకర్త వీనిని గ్రహింపలేదు గదా యని విడుచుట అంత సమంజసముగా లేదు. మఱియు కాకుస్వరయతిగూడ పై రెండు యతులలోను నంతర్భవించుటకు సందియము లేదు.

అప్పకవి తాను చెప్పిన యతులలోం బనునేను వఱకు గతార్థము లైనవి. ఉభయయతులవిషయమై యఖండయతి నంగీకరించిన నెంత గ్రంథము తగ్గునో యూతం డూహింపక వట్టి పట్టుదలనె ప్రధానముగం దీసికొని ప్రతిజ్ఞాభంగము రాకుండ గ్రంథమును విస్తరించినాండు. లేనిచో భాషాసముద్రమున కాదిభూత మైన భారతమందును, మఱియు ననేక గ్రంథరాజములయందును అఖండయతులు గల ప్రయోగము లనేకము లుండ వాని కన్యథా కల్పన చేయ నేల? తావన్మాత్రమే గాక యన్యలక్షణకర్తలు తమ గ్రంథములలో భారతోద్ధృతములగు నఖండయతుల నుదాహరింప నవన్నియు తప్పులని యూ, తాను దివ్యచక్షుస్సులతో తేఱిపాఱంజూచిన అత్యంత ప్రాచీన శిథిలీభూత తాళపత్రమాతృకలలో నట్లు పాఠములు లేవనియు, పూర్వు లమాయకత్వమున తెలియక తప్పుల నుదాహరించి రనియు దూషణపరముగా తనయాధిక్యమును వెల్లడించి వానిని తద్భిన్నములుగా దిద్దినాండు. అట్లు చేసినం గాని తనమత ప్రకారము ౪౧ యతియు సరిపడదు. సరిపడినం గాని పూర్వగ్రంథకర్తల కీర్తి తాహరింపంజాలండు. ఇంతియె గాని యఖండయతి నంగీకరించినం గల తప్పేమో? దాని యందుం గల శ్రుతికటుత్వ మేమో? అట్లంగీకరించిననే గణాధిదేవత క్రోధోద్రిక్తయై మనగొంతుల కోయునో? తెలియం జెప్పనే లేదు. హల్సాజాత్య ముండి యొకచోట స్వరము విఱిగి మఱియొకచోట విఱుగకున్నంత మాత్రముననే ఈ యతి త్యాజ్య మైనచో నిక తద్భవాదియతులలో వర్ణములకు పోలికయే లేనప్పుడు, బాహ్యప్రయత్నసాదృశ్య మైన లేనప్పుడు నియ్యదిమాత్ర మెట్లు యతులలో పరిగణింప తగునో తెలియదు. తనస్వరూపమునే నమ్మనితఱి తనయపత్యమును మాత్ర మెట్లు నమ్మనగును? మఱియు నీయతిప్రాస లనునవి మనపూర్వులు బంధించిన చివుకుతాళ్లబంధనలే గాని పరమేశ్వర ప్రోక్తములు గావు. పూర్వ మున్న యతిసంఖ్యను ఇప్పటియతిసంఖ్యను పరిగణించిన పైవిషయము సుబోధమై యెవరిచ్చనవారు నువువుచుండి రనుట స్పష్టమగును. ప్రధానమగు రసము లేనితఱి కావ్యమున ప్రతిపద్యమునందును మైలురాళ్లవలె యతిప్రాసల నిలిపినంత నా ప్రబంధరాజము చిరస్థాయి యగునా? అప్పకవివంటి మహాశయు లున్న దాని నేతావా నస్య చేయుదురేమో? మఱి యొకమాట. "యతి ర్విచ్ఛేదసంజ్ఞకః" అనెడి వాగ్రత్నమును శిరసా

వహించి రసము భ్రష్టము కాకుండ సంస్కృతమున గ్రంథముల వ్రాసిన కాళిదాస భవభూత్యాదుల కేమైన కించిత్తు లోటు వాటిల్లెనా? వాటిల్లునా? మఱి యేభాషలోనైన నిట్టినిబంధము లుండియుండెనా? అట్టితఱి నీ తెనుఁగు భాషయందే యిట్టినియమము లుండ పని యేమి? మనపండితులయు, పూర్వకవులయు, తదనుసారులయు కటాక్షవీక్షణమే గాని మఱేమియు కాదు. మఱియు విమర్శకాగ్రేసరులగు శ్రీయుత వఝ్ఝల చినసీతారామస్వామి శాస్త్రులవారుగూడ తమ వసుచరిత్ర విమర్శనమందు యతులవలనఁ గలుగు కవిత్వనష్టములఁ జెప్పియున్నారు చూడుఁడు:

"ఆంధ్ర పద్యవాఙ్మయమునకుఁ బ్రాసవిశ్రమనియమ మలంకారార్థమే కల్పింపఁబడినను కొన్నియెడల నది శోభావహము గాక శోభాభంజకమే యగుచున్నది.

1 'శబ్దార్థయోరస్థిరా యే ధర్మాశ్శోభాతిశాయినః రసాదీనుపకుర్వంతోఽలంకారాస్తేఽంగదాదివత్'

అను విశ్వనాథపంచాననుని సూక్తిచొప్పున నలంకారము లస్థిరములై యుండఁగా శబ్దాలంకారములవంటివే యైన యీప్రాసవిశ్రమములు లేల నియతములై యుండవలెనో తెలియకున్నది. మఱియు నివి దుర్ఘటములగుటచే నక్షరముల పరస్పరసంబంధ మీవిషయమున నంగీకరింపఁబడుట నివి కల్పించుటలోఁ గల యుద్దేశము విఫలమే యగుచున్నది. మఱియు నీ నియమము కవిత్రయమువారి పద్యములందు సైతము అనేకస్థలములందు వ్యర్థపదప్రవేశమునకు బీజమగుచున్నది."

కాని మహానుభావు లెందరెంత చెప్పినను నాదరము జనింపలేదు. రావు సాహెబ్ గిడుగు వేంకటసీతాపతిగారు అప్పకవీయపీఠికలో నీయఖండయతిని గుఱించి నిరాటంకముగా వ్రాసియున్నారు. అనేక అఖండయతుల నిచ్చియున్నారు. కాన పైయఖండయతి నంగీకరించిన కొన్ని యుభయయతులు తీసివేయవచ్చును. ఈ యతుల విషయమున నప్పకవి చెప్పిన వానిలోఁ గల నాభేదాభిప్రాయమునే చెప్పితిఁ గాని యన్యము గాదు.

స - కై

1 శబ్దార్థయో రస్థిరా యే ధర్మాశ్శోభాతి శాయినః...

అప్పకవీయము : యతిప్రాసలు

దువ్వూరి సూర్యనారాయణమూర్తిగారు

(తరువాయి)

ఇఁక ప్రాసలవిషయము విచారింతము. ప్రాసమన ప్రపూర్వకమగు "ఆస ఉపవేశనే" అనెడి ధాతువు ననుసరించి ప్రకృష్టముగా వర్ణముల నాయా నియమిత స్థానములనుంచుట యని తేలుచున్నది. ఇయ్యది రెండువిధములుగా విభజింపఁబడినది. అందొకటి ఛందఃప్రాసము, రెండవది యలంకారప్రాసము. ఛందఃప్రాసమనునది రెండు తెరంగులు. వృత్తాదుల సమానద్వితీయ హల్ సముదాయముగనున్నది. రెండవది ప్రాసయతి యని చెప్పఁబడుచున్నది. పైప్రాసమే యతిస్థానమున నిలుపఁబడెను గాన నిద్దానికీనామధేయము యుక్తము. ఉపాధిభేదమువలన నియ్యది యనేకవిధములుగా మారినది. ప్రకృతమున నప్పకవి యీప్రాసముల పదునేడింటిని చెప్పియున్నాఁడు. అందు కొన్నిటియందుఁ గల నాభేదాభిప్రాయముల నుగ్గడింతును.

౧. సంయుతాక్షరప్రాసము —

ద్విత్రిహల్ సముదాయము ప్రాసస్థలముల నుండిన తదభేదహల్ ప్రాసమే నిలుపవలెనని దీనియభిప్రాయము.

ఉదా:—"గర్గుఁ డర్చించుదైవము భర్గుఁడనఁగ
పక్ష్మలేక్షణకా నలిసూక్ష్మమనఁగ."

పైపద్యమం దధోరేఖాంకిత స్థలములలో నద్దానిని స్పష్టపరచినాఁడు. ఈవిషయము తన ప్రాసరూపప్రతిపాదనమునందే స్పష్టమైయుండ మరల ప్రత్యేకముగా నిద్దానికి లక్షణము కల్పించుట యనవసరము. ప్రాసనిర్వచనమేమన "ద్వితీయో వర్ణః ప్రాసోఽత్ర పాదపాదేషు కించ ప్రాస స్సర్వేషు చైకఏవ స్యాత్" అనెడి చింతామణి సూత్రము ననుసరించి యీతఁడును

"ప్రాసముల కెల్ల తుల్యాక్షరంబులైన
చాలు స్వరభేదమైన దోషంబులేదు."

అని సామాన్యలక్షణము చెప్పియున్నాఁడు. ఇట్లు చెప్పినప్పుడే తద్వ్యతిరేకములయి విశేషము లున్న వానినే చెప్పిన బాగుండునుగాని పైలక్షణముచే స్పష్టముగా ప్రాసస్థలమున నెన్నిహల్లులుండునో యవన్నియు తప్పక పాదచతుష్టయు ప్రాసస్థానముల నిలుపవలెనని తెలియుచుండ మరియొకలక్షణలక్ష్యకల్పన మనవసరము. ఇట్లు చెప్పుట సంఖ్యాబాహుళ్యార్థము గాక పాఠకుల కేమి యుపయోగ మున్నది?

౨. సంయుతాసంయుతాక్షరప్రాసము—

దీనికి:

"రలలు తమక్రింద జడ్డలై క్రాలుచ్రాలు
ప్రాసవర్ణంబులై వానిఁ బాసియైనఁ
గూడియైనను పెరయడుగులను నిలుచు"

అని లక్షణమును జెప్పి దీనికి

"పాఁడి దప్పఁగనిమ్మ నాతండ్రి కృష్ణ
వేఁడుకొనియెద నందాఁకఁ బండ్లు దినుము
దుండగపుచేష్టలను కోడిగాండ్రగూడి
మెండుగా వచ్చె నీకు నైదేండ్లు కృష్ణ"

అని లక్ష్య మిచ్చియున్నాఁడు. ఇయ్యది యప్పకవిస్వీయమే కాని ప్రామాణిక ప్రయోగము కాదు. పైపద్యమున మూఁడునాలుగుపాదములలో లక్షణము సమన్వయించుచున్నది. మొదటిరెండుపాదముల సమన్వయించుటలేదు. సరిగదా, తాఁజెప్పిన ప్రాసలలో నెద్దానిలో నంతర్భావ మందునో తెలియుటలేదు. తాను ఖండాఖండములకే ప్రాసను చెప్పెనుగాని పూర్ణఖండములకు ప్రాస చెప్పలేదు. మరియు ప్రాసపూర్వాక్షరనియమమున నీతఁడొనరించిన నియమమునఁగూడ నీవిషయము లేనేలేదు. చూడుఁడు—

"క్రింద జడ్డలును విరుండ బిందువులును
నూది ప్రాసములకు నుండ దేని
హ్రస్వ మొకటి నిశువ యక్కరం బొక్కటి
నాని మొదల నిలుపవచ్చున్..."

అని ప్రాసస్థానమున బిందుపూర్వాక్షరము గాని జడ్డక్కరము గాని పరముగా నున్నపుడే యాద్యక్షరములు హ్రస్వదీర్ఘములున్నను బాధకము గాదని చెప్పెను గాని పైరీతిఁ జెప్పియుండలేదే? సంయోగము పరమందుండుట మీఁది హ్రస్వమునకు గురుత్వము వచ్చును గాన నాద్యక్షరగురుత్వమునకు భంగము లేదందురేమో? అప్పుడు బిందు వేమియగును? దీనికి సమాధానము లేకున్నది. కొందరిద్దానిని సమర్థింప భాష ప్రాచీనశాసనములలోఁ జూచిన నేటి సిద్ధసాధ్యార్ధానుస్వారపదములు పూర్ణబిందుకములే యనియు నాగుర్తు తెలుపుటకే యిప్పుడు గూడ నర్ధానుస్వార మున్నదనియుఁ గాన,

"పాండి............తండ్రి...
వేండి............బండ్లు..."

అని యున్నట్లనుకొని యప్పకవి యుదాహరించెననియుఁ జెప్పుదురు. అప్పుడు "దీర్ఘాచ్చే త్రండ ఏవ సజ్ఞేయః" అనెడి చింతామణిసూత్రమును మరచెనా? ఈ సమాధానము సుసంగతము కాదు. శాసనముల నాఁటి భాష లిపిలోను, పదములలోనుగూడ పెక్కుమార్పుల నంది యుండ ఈ యొక్క నియమమును గ్రహించుటలోఁ గల స్వాతంత్ర్యమేల? తానిచ్చిన ప్రయోగము ప్రాచీనమైన శాసనములలోనిదా? కాదు. ప్రయోగము లీయలేదు గాన నియ్యది స్వతంత్రమనక తీరదు. ఈవిషయమున రంగరాట్ ఛందమునఁ గూడ నుభయప్రాస మను నామమున లక్ష్యమీయఁబడినది.

"పాఁడి............వాండ్రిల...
వాండ్ర............తండ్రి...
పండు............ఇండ్లు...
కృష్ణుండు............పండ్లు..."

అని యుదాహరింపఁబడినది. పైలక్ష్యమునందు మొదటిపాదమునఁ గూడ నిట్టియూ తేపణ గలుగుచున్నది.

కాని అయ్యది లక్ష్యము గాదు. పవలక భేదయతి నిలుపఁబడెను. ఇఁక రెండవపాదమునఁ గూడ ప్రాసయతి గాని సంయుతాసంయుతము గాదు. మూఁడు నాలుగు పాదములే దీని కుదాహరణములు. కాని యీతని పక్షమున రేఫశ్లిష్టమున కుదాహరణ మీఁబడలే దనవలెను. లేనిచో అప్పకవీయమందలి చిక్కు ఇచ్చటఁ గూడ వచ్చును. ఇట్టి యభిప్రాయభేదమే నాకు దీనియందుఁ గలదు.

3. రేఫయుతప్రాసము—

దీనికి లక్షణము:-

"సుడులు తెలుఁగునందుఁ బొడమ వాకైవడి
వ్రాలు కొమ్ము క్రారవడులు గాన
రేఫయుతసమాఖ్య కృతులఁ బ్రాసములగు
సారిది తమకుఁ దాము సుడులఁ బాసి"

అని చెప్పియున్నాఁడు. ఈప్రాసను కల్పించి తాను తెలిపలుకఁబడునను విశేషాంశముతప్ప మరే క్రొత్తవిషయమును నప్పకవి చెప్పియుండలేదు. ఇయ్యది గూడ ప్రాసనియమముచే గతార్థము కాఁగలదు. ఇందు "సుడులఁబాసి" యనుపదమున కర్థము స్పష్టముగా తెలియుటలేదు.

౪. వికల్పప్రాసము.—

ఈవికల్పప్రాసవిషయమై యతులలోనే చాలవఱకు వికల్పములన్నియు ననవసరములని చెప్పఁబడినవి. రూపద్వయప్రసిద్ధియందు నీప్రాసమును జెప్పుటంతయు నావశ్యకము కానేరదు. ఇట్లే యనునాసికప్రాసముగూడ గ్రహించునది. మఱియు వీనికి ప్రామాణ్యప్రయోగములైనను మృగ్యములే. తనప్రాస సంఖ్యాబాహుళ్యమే ప్రధానముగాన చెప్పవలసి వచ్చినది.

౫. ప్రాసవైరము.—

సాధుశకటరేఫములు రెండును అన్యోన్యము ప్రాసమైత్య్రము నందరాదని దీనికి లక్షణము. ఈయతి యందే దీనివిషయమై నాయభిప్రాయభేదమును, పెద్దల ప్రయోగములనుగూడ నున్నవని చెప్పుట. ప్రకృతమున విరమణమే యుక్తము. విస్తరభీతి లక్ష్యముల నీయనైతిని.

౭. ఋప్రాసము—

యణాదేశముచే ఋ రకారరూపము నందును గాన నారేఫమునకును ఋకారమునకును ప్రాస వేయ వచ్చునని చెప్పియున్నాఁడు. కాని ప్రయోగ మొక్కటియు నిచ్చియుండలేదు. ఉండిన తప్పక యిచ్చియే యుండును. భారతారణ్య పర్వమునందు మాత్రము కలదని యొకపద్య మీయఁబడినది. "నైకముదాహరణం యోగారంభం జనయతి" అనెడి న్యాయానుసార మూరకొన్నచో నీబాధయే లేకపోయెడిని. కొంద ఱీలక్ష్యము నగల "ఋషి" యనునది "రుసి"యని ప్రాచీన ప్రతులలోనున్నదనియు చెప్పిరి. నిఘంటుకర్తలుగూడ ఋషి శబ్దభవము "రుసి" అని వ్రాసియేయున్నారు. భారతకర్త యెచ్చటనో యొకమూల నతనికై ప్రత్యేకముగా వాడినాడనుటగూడ భావ్యము కాదు. ఆతనిదృష్టిపథమున రెండు మూఁడుచోటులనైన వాడుచో నద్దానికి లక్షణము కల్పించినను సమంజసము గాని యిట్లీతఁడు చెప్పుట యనావశ్యకమే యనఁదగును.

౮. లఘుయకారప్రాసము—

"ప్రకృతిభావంబుఁ జెందిన ప్రాణములకు
మొదలియంతస్థములు ప్రాసములకు నిలుచు"

అని లక్షణమును చెప్పియున్నాఁడు. దీనిసార్థక్యముగూడ నంతగాఁ గనుపింపదు. సంధివశంబున యకారములోనికి మారినను శబ్దనిష్ఠములైన యకారములైనను ప్రాసస్థానమును జేరుసరికి యద్రూపహల్ సముదాయమున్నచో అయ్యది తప్పక తత్తత్ స్థలముల నిలుపవలెనని చెప్పినయప్పకవి యీవిభాగము విశేషమనుచు మరల చేయనేల? ప్రాసనియమమునుబట్టియే గతార్థమగును. ఇట్టిదే సంధిగతప్రాసమొకటి చెప్పియున్నాఁడు. చూడుఁడు—

"సంధిఁ గూడిన వ్రాలు ప్రాసంబులైన
అవియె సంధిగతాఖ్యల నలరుచుండు."

ఈయతి విషయమున "గసడదవాస్స్యుః ప్రథమాద్ధాత్వాత్మస్మదో ర్ద్విస్త్రైవైతే" అనెడి సూత్రము వలననే గసడవాదేశము వచ్చుచుండ నిట్టిస్థలముల ప్రాస నియమముచే గతార్థమగుచుండ మరల నిట్టిసంధివచ్చిన వ్రాలతో సిద్ధములు చెల్లుననుట యనవసరము. మఱియు నిద్దానిక్రింద నిచ్చిన యుదాహరణ పద్యముల విశేషము లరయుదము. మొదటిది శల్యపర్వమునందున్నదని

"కవఁదొనలును గాండీవము
నవల నిడంబనుపు ముందరరదము డిగు మే
ను విదప డిగియెద శుభకర
మవు నివ్విధము......"

ఈపద్యమును జూపియున్నాఁడు. ఇచ్చట "ఏను + విదప = ఏనువిదప" అని సంధియగుట పైచింతామణి సూత్రమునకు విరుద్ధము. 'తాను' 'నేను' పదములపై పరుషములకు గసడదవలు రావలెనుగాన. ఈమతము నీయప్పకవి యంగీకరించినట్టి పంచమాశ్వాసమందలి—

"తాను నే ననుపదములలోని ద్రుతము
లడఁగుచో మీఁదఁ బరుషంబు లసురదమన
సరళలిపులగు తద్ద్రుతాక్షరము లర్ధ
బిందులగుఁ దాఁజనంగ నేఁ బిలిచితనఁగ."

ఈపద్యముచే "వాత్మాస్మదో ర్ద్రుతస్య స్యాల్లుక్" అనెడి సూత్రార్థకథనము నస్పష్టమగుచున్నది. అట్టితఱి పైయతిసందర్భమున "ఏనువిదప" అని తన ప్రాసకనుగుణముగా నిచ్చుట సంభవింపదు. "ఏను" అనునది ద్రుతప్రకృతికముగాన దానిపైనున్న పరుషములకు గసడదవ లెట్లు వచ్చును? రెండవలక్ష్యము కళాపూర్ణోదయమునం దీయఁబడినది. ఇందు వకారప్రాసము నిలిపి యొకపాదమున "ఆహోవుట్టింపదె" అని చూపియున్నాఁడు. ఇచ్చట వకారము చింతామణిరీతిని స్పష్టముగా సిద్ధింపనందున "కాకా సంబోధనే చాపి హ్యాక్షేపే కర్మధారయే" ఇత్యాది భూషణాదులప్రకారముగా నవ్యయముపైఁగూడ వాదేశము రావచ్చునని గ్రహింపవలెను. మఱియు లకారప్రాసమునకు 'కాకుత్స్థవిజయము' నందుఁ గల

"మారుండద్భుత.............క
స్మారీ..................రే

ఖాలిప్సన్..............ఇం
పారన్.................."

ఈపద్యము నుదాహరించియున్నాఁడు. మఱియు ౨ంవలి 'లిప్సన్' అనునది "రభ్ రాభస్యే" అనెడిధాతువు నుండి నిష్పన్నమయినదిగాన దీనికి లక్ష్యమునని చెప్పియున్నాఁడు. రభధాతువునుండి పుట్టినదనుటకన్న లభధాతునిష్పన్నమే యన్న నయ్యాది రలప్రాస మనునని యేమో తా నట్లుచెప్పుట. లేనిచో రభధాతువునుండి లభ పుట్టుటయేల? పాణినీయరీతి "సనిమీమాఘురభలభశకపతపదామచఇత్" ఇత్యాదులవలన లభధాతువుగూడ నున్నదని తేలుచున్నదిగదా? ఇట్లనుకొన్న నీపద్యమీతనిప్రాసనియమములకు లొంగదు. అట్టితఱి నిద్దానిని లక్ష్యముగా నంగీకరింపక "రేఖారిప్సన్" అనియేయున్నదనుకొన్న నేచిక్కునుగూడ నుండనేరదు.

౮. అభేదప్రాసము—

ఈప్రాసవిషయముఁ గూర్చి యిచ్చట చెప్పవలసినపని లేదు. దీన చాలవఱకు విషయము యతివిషయమునందే చెప్పఁబడినది. స్వచ్ఛములైన 'డలళ' లకు ప్రయోగములఁ జూపువఱకును నీప్రాసకల్పన మనవసరము. కవిజనాశ్రయకర్తగూడ రూపాంతరము లున్న పదములే సిద్ధములతోఁ జెల్లునని చెప్పెఁగాని యితరమైన వానివిషయ మేమియుఁ జెప్పియుండలేదు. "తాళము-తాలము; చోళుఁడు-చోడుఁడు; వ్యాలము-వ్యాళము, వ్యాడము" అని స్పష్టముగా పైవిషయమునే యాతఁడు మనమున నిడికొనెనని చెప్పవచ్చును. ప్రకృతమున నప్పకవియిచ్చిన యుదాహరణస్థపదము లన్నియు ద్వైరూప్యము గలవియే. శబ్దరత్నాకరాది గ్రంథములవలన, నస్వాభావికములవలె నున్నను రూపద్వయాశ్రయణము తేలును. కాన నీప్రాస మంతప్రాముఖ్యము కలది కానేరదు.

ఇఁక శబ్దాలంకారప్రాసము లనేకములు గలవు. సులభాక్షరమును ప్రాసగాఁ జెప్పిన నయ్యది సుకరప్రాసమనియు, కఠినములగు నక్షరములుగాని రెండు మూఁడు హల్లులుగల వర్ణములకు ప్రాసగాని దుష్కరప్రాసమనియు, ప్రాసాక్షరము మొదలు రెండువర్ణములు పాదచతుష్టయమందును నిలుప నయ్యది ద్విప్రాసమనియు, ఇట్లే త్రిచతుర్వర్ణముల ప్రాసస్థలముల నిలిపిన నయ్యవి త్రిప్రాసచతుఃప్రాసలనియు, పాదాంత్యాక్షరమజ్ఝల్సాజాత్యము కలిగి హ్రస్వదీర్ఘము లున్నతదక్షిన్నములుగానే నిలిపిన నయ్యది యంత్యప్రాసమనియు చెప్పఁబడినవి. మఱియు నీప్రాసలలోనే కొన్నిటిని అలంకారకర్తలు చెప్పియున్నారు. శబ్దాలంకారప్రాసల నన్నిటిని జెప్పుచు నీక్రిందిమూఁటిని యప్పకవి చెప్పకపోవుటకు కత మేమో? తెలియదు. అయ్యవి మూఁడు విధములు:

i. ఛేకానుప్రాసము:—

ఛేకములనఁగా గృహచరములగు పక్షిమృగములని సర్వస్వకారాదులు, "ఛేకాః=విదగ్ధాః తదుపలాలితో ప్రాసః ఛేకానుప్రాసః" అనియు నర్థము చెప్పియున్నారు. దీనిలక్షణ మేమన:—

"భవే దవ్యవధానేన
ద్వయోర్వ్యంజనయుగ్మయోః,
ఆవృత్తి ర్యత్ర స బుధైః
ఛేకానుప్రాస ఇష్యతే"—ప్రతాపరుద్రీయము.

ఎచ్చట ఇతరపదములతోఁగాని, వర్ణములతోఁగాని వ్యవధానములేని వ్యంజనముల జంటలయొక్క జంట పునరుక్తమగునో, నద్చి ఛేకమని యర్థము.

ఉదా:—"మహీం మహీనవిభవే ధత్తే క్షేమంకరే కరే,
రాజన్యజన్యవిజయీ రాజా రాజద్గుణోదయః."

ఇచ్చట మహీంమహీ, కరేకరే, ఇత్యాదిజంటలు అవ్యవధానముగ నుండెనుగాన నిచ్చట ఛేకానుప్రాసమని భావము. నరసభూపాలీయమున నిట్లే చెప్పఁబడినది.

ii. వృత్త్యనుప్రాసము:—ప్రతాపరుద్రీయమున—

"ఏకద్విప్రభృతీనాంతు
వ్యంజనానాం యదా భవేత్,
పునరుక్తి రసౌ నామ
వృత్త్యనుప్రాస ఇష్యతే."

వృత్తులనఁగా వైదర్భీ గౌడీయాదులు. అట్టిపట్టుల నుపయోగింపవలసిది గాన నిద్దాని కిట్టినామము గలిగినది. అనఁగా నొకటిగాని, రెండుగాని, మూఁడుగాని, వ్యంజనముల పునరుక్తియే వృత్త్యనుప్రాసమనఁదగు లక్షణము. ఈయావృత్తికి పైదానివలె నవ్యవహిత మనవసరము. ఛేకమున "ద్వయోః" అనుటవలన సంఖ్యానియమ మున్నది. ఇం దట్టిది లేదు. దీనికి విద్యానాథుఁడు ఏకాక్షరావృత్తిగల లక్ష్యము నొక్కదానినే యిచ్చియున్నాఁడు. "ఏవ మితరే ద్రష్టవ్యాః" అనియైనను నని యుండలేదు. వ్యాఖ్యానకర్తమాత్రము "ఏవ మన్యే భేదాః సూర్యశతకాదౌ ద్రష్టవ్యాః" అని చెప్పియున్నాఁడు. ఇందేమియు ననుపపత్తిలేదుగాని దీని ననుసరించిన నరసభూపాలీయములో మాత్రము పైదానికి లక్షణము వేరుగా చెప్పఁబడినది.

"ఒక్కవర్ణంబు కడదాఁక నుద్ధరింపఁ
బరగు జృంభణ వృత్త్యను ప్రాస మయ్యె."

అని యేకవ్యంజనావృత్తికే పైపే రంకించినాఁడు. ఇయ్యది ఆతని స్వతంత్రమో? ప్రతాపరుద్రీయలక్ష్యపద్యమే కారణమో? తెలియదు. ఉభయత్ర క్షకారప్రత్యావృత్తలక్ష్యపద్యమే ఈయఁబడినది. కాని చాలవిషయములలో నాతఁడు స్వతంత్రించుటయు కూడఁ గలదు. అప్పకవీయమందు దీనికి అనుప్రాసమని పేరుపెట్టి లక్షణము చెప్పకయే లక్ష్య మేకాక్షరావృత్తి నియమముగా నీయఁబడినది. అనంతుఁడుగూడ నప్పకవినే యనుకరించినాఁడు.

iii. లాటానుప్రాసము:—

లాటదేశీయులగు జనులచే నాదరింపఁబడునదిగాన నిద్దానికీనామము వచ్చినది. ఎట్లన—

"శబ్దార్థయోః పౌనరుక్త్యం
యత్ర తాత్పర్యభేదవత్,
స కావ్యతాత్పర్యవిదాం
లాటానుప్రాస ఇష్యతే."

అనఁగా నెచ్చట శబ్దార్థములకు స్వరూపభేదము లేకయే కేవలతాత్పర్యభేదముతో నావృత్తిఁ జెందునో అచ్చట లాటానుప్రాసమని తాత్పర్యము. తాత్పర్యభేదనియమము పునరుక్తిదోష నివారణార్థము. దీనికి లక్ష్యము:

"గుణాగుణా స్తేగణ్యంతే యే రుద్రనృప మాశ్రితాః,
నీత స్నీతిరసౌ తస్య లక్ష్మీ ర్లక్ష్మీశ్చ కథ్యతే."

ఇచ్చట "గుణాగుణాః" అనెడి స్థలములలో శబ్దార్థపౌనరుక్త్యమును, ఉత్కర్షయుక్తమైనవని రెండవగుణశబ్దమునకు తాత్పర్యభేదమును స్పష్టములు.

ఇట్లు వృత్త్యనుప్రాసము లనియు, ప్రాసయతులనియు శబ్దాలంకారప్రాసలనియు మూఁడువిధములప్రాసలు తత్తన్మతమున నాయభిప్రాయములు వివరించితిని. కాని లక్షణకర్తలలోఁ గల తప్పు లెన్నుటకు కాదని మనవి చేయుచున్నాను.

---

౬. నివేదన—

చావలి బంగారమ్మగారు

ఇది యేమి యని నాథుఁ డిట్టె నను లేప
త్రుళ్లిపడి నే నతని కళ్ల జూచితిని:
పణతి, నా బాహువులు పతికంఠసీమ
బంధించియుండుట బహువింత దోఁచె.
అతని జూడఁగ సిగ్గు అధికమై తోఁచె
కథను జెప్పఁగ నాకు కదలదే పెదవి

అదను చిక్కినదంచు హాస్యమాడగను
వదనంబులో నేను వంచింపబడితి.
నేను గాంచిన వెల్ల నాలోన గలసె
చూచుచుండిన దెల్ల శూన్య మనిపించె
నానాథులో నేను లీనమైనాను
ఆత డొక్కఁడె నిజం బఖిలంబు కల్ల.

ఛందోలంకారములు – దోషప్రకరణము

దువ్వూరి సూర్యనారాయణమూర్తి

"ముఖ్యార్థనిహతి ర్దోషః"

"దోషః కావ్యాపకర్షస్య హేతు శ్శబ్దార్థ గోచరః."

ఈరీతిని దోషస్వరూపమును బూర్వులు నిరూపించియున్నారు. సామాన్యముగా గుణదోషము లనునవి సర్వకవిసామాన్యములు, సర్వగ్రంథసామాన్యములు నని యనవచ్చును. వాఙ్మయమున దోషములేని గ్రంథము లుంట యసంభవము. అట్లని కావ్యము రచించు కవి తన యిష్టానుసారము పోరాదనియు, ముందట్టివాఁడు దోషగుణముల బాగుగఁ దెలిసి దోషముల త్యజింపవలెననియు, తన కావ్య ముత్కర్షవహించి చిరస్థాయి కావలెనన్న నయ్యది నిర్దుష్టముగా నుండవలెనని యూహించి యీదోషముల పూర్వులు నిరూపించి యున్నారు. ఈదోషము లనునవి కావ్యాశ్రయములగుటచే తన్నిరూపణమువిషయమున ఛందోలంకార కర్తలకు సమానమగు హక్కుండుట నీదోషములవిషయము గూడ నిరువురకు నిరూపింపవలసివచ్చినది. ఇట్టి కావ్యాపకర్షకు హేతువులైన కొన్ని దోషములు దెలిసియు, కవులు తమ గ్రంథముల నిశ్శంకముగాఁ బ్రయోగించి యుంటను, కొన్నిదోషములవిషయమున లక్షణకర్తలలో మతభేదము లుండుటను, శాసించిన లక్షణకర్తలే యీదోషముల వాడుటను, మూర్తికవి చెప్పిన దోషములలోఁ గొన్ని యనవసరములగుటను ప్రకృతమున నావ్యాసము తన్నిరూపణమే ఫలముగా వ్రాయఁబడుచున్నది.

వీనిలో దోషములు పదియే యని దండి చెప్పియున్నాఁడు. విద్యానాథుఁడు "శబ్దగతత్వే నార్థగతత్వేన ద్వైవిధ్యం, శబ్దగతానామపి పదవాక్యగతత్వేన ద్వైవిధ్యమ్" అని విభాగించి ౫౬ దోషములవఱకు నిరూపించియున్నాఁడు. కవిజనాశ్రయకర్త దండిమతమునే యంగీకరించి దశవిధదోషముల నిరూపించి యున్నాఁడు. మూర్తికవి తన కావ్యాలంకారసంగ్రహమున ప్రతాపరుద్రీయానుసారముగాఁ జెప్పియున్నాఁడు. ఇందు దండిభీమనమతములఁ గొన్నిదోషములు గుణములగు. నరసభూపాలీయమతమున నదిలేదు. మఱియు విరోధమనెడి దోషమును దండ్యాదు లనేకభేదములఁ జేసియున్నారు. ఈతఁడొక రెండుభేదములుగానే విభాగించెను.

౧. నరసభూపాలీయకర్త నేయార్థమనియు, నసమర్థమనియు, రెండు దోషములఁ జెప్పియున్నాఁడు. "ఇల తన సంకేతంబున నిలిపిన పద మెంచిచూడ నేయార్థం బౌ", "ధర నప్రసిద్ధయోగం బరసి ప్రయోగించు పదమ యసమర్థంబౌ." అని వాని లక్షణములు గూడఁ జెప్పఁబడినవి. ఈరెంటిని నొక్కటిగా పరిగణింపవచ్చును. ఏమందురా, తనకుఁదప్ప మఱియొకరికర్థముగానిరీతి స్వసంకేతప్రసిద్ధార్థముగా కవి యొకపదము నెప్పుడు ప్రయోగించెనో యయ్యది యప్రసిద్ధమే యగునుగాని పదుగురకు సుబోధముగాదు. తన సంకేతమున నిలిపిన పదమైన దన కర్థము దెలియును. అప్రసిద్ధయోగపదమున కర్థము కవికే తెలియదన వీలులేదు. తన కర్థము తెలియనిపదమును కవి ప్రయోగించుననుట యనుభవవిరుద్ధము. కాఁగాఁ బై రెండుదోషములలో నెద్దియే నొక్కదాని నంగీకరించినఁ జాలును.

౨. నిరర్థకమనఁగా:—"ఇలఁ బదపూరణమాత్రం బలవడిన పదంబు కృతి నిరర్థక మయ్యెన్" అని లక్షణము సెప్పియున్నాఁడు. ఈదోషము ముఖ్యముగాఁ జెప్పఁదగినదైనను మహాకవిప్రయోగానుసారము శాస్త్రమునురీతినిఁ జూడ నియ్యది యనవసరమే. సంస్కృతమున నియ్యది నాతివిస్తరముగా నున్నది. "తుహిచస్మహవై పాదపూరణే" ఇత్యాదులవలన నేకైకాక్షర

10. 7- 1-౨ 3

రూపముననే దాన నిరర్థకపదము లున్నవి. అట్టియక్షరముల రెంటిమూటినిఁ గలిపి యొక్కచోఁ బ్రయోగించుట యసంభవముగావునను, నట్టిప్రయోగములు సంస్కృతవాఙ్మయమున మృగ్యములగుటను నేకాక్షరనియమ మట్టిపట్టులఁ బ్రయోగింపఁబడినను బెద్దలోటుగా నుండదు. మన యాంధ్రవాఙ్మయమందుననో యతిప్రాస నియమములవలన లేనిపోని పడికట్టురాళ్లనేకములు పాదపూర్తియతిప్రాసల స్థానముల వాడుచుండు టరుదు. అట్టితఱి నొక్కపదముగాదుగదా, రెండుమూఁడు పదము లేయప్రసిద్ధప్రాస నిలిపినప్పుడో వేసి నిర్వహింపక తప్పదు. కాఁగా నీదోష ముండవలసినదే. కాని కవిత్రయమువారి కబ్బములసైత మీదోష మున్నదని యంగీకరింపకతప్పదు.

3. గ్రామ్యము:—"పామరుల భాష గ్రామ్యము భామినికటిగల్లములు విభాసిల్లు ననన్, కోమలికన్నులు చన్నులు" ఇత్యాదిపదప్రయోగములను నీదోషమని లక్షణము చెప్పఁబడినది. ఇయ్యదిగూడఁ బైరీతి ననవసరమే యనఁదగును. ఏమనఁ, బ్రయోగములే ప్రమాణములు. పైపదముల వీడి మన కవు లొక్కనిమిషమైన నిలువలేరు. మన ప్రబంధవాఙ్మయమంతయు పైపదములమీఁదనే నిలిచియున్నది. లక్షణగ్రంథముల వ్రాయునపుడు నిరర్థకదోషము లున్నను దోషముగాదుగాని గ్రామ్యపదప్రయోగము దోషమని యొకమూలఁ జెప్పుచు మూర్తికవియే యీపదము లచ్చటచ్చట వాడియున్నాఁడు. చూడుఁడు:—"బింకపుం జన్నులమీఁదఁ జేర్చుకొని" (3 ఆ. ౪౫ ప.), "చనువున నేప్రుఁ జూపఁగల చన్నులు చన్నులు" (౪ ఆ. ౭౦ ప.). మఱియు ౫ ఆ. ౧౧౩-వ పద్యము స్వభావోక్త్యలంకారముగా వర్ణింపఁబడినదఁట. కొసకు "వలుద వలిగుబ్బచన్నులోవలపులాడి" అని తన యసభ్యత వెలిఁబుచ్చియున్నాఁడు. ఇట్టి వింకను బ్రబంధములఁ జూపవలెనన్న నయుతము లున్నవి. కవిత్రయగ్రంథములలోమాత్రము గానరావు. మన ప్రబంధకర్త లీమాత్రపు గుహ్యాంగములేగాక ఇంకను రహస్యాంగవర్ణనము, తన్నామోచ్చారణముగూడ జేసియుంట నీదోషము నంతగా పాటించిరనుట కల్ల. దండి యీదోషము కేవలపదాశ్రయమేగాక యర్థాశ్రయముగఁగూడఁ జూపియున్నాఁడు. "కన్యే కామయమానం మాం న త్వం కామయసే కథం" ఇత్యాదులలో నట్లు భాషించుటయే దోషమని చెప్పియున్నాఁడు. పదవిషయమునఁగూడ యభిన, నిష్ఠ్యూత, ఉద్గీర్ణ, వాంత-ఇత్యాదులయం దీదోష మున్నదనియు, వీనికి గౌణవృత్త్యాశ్రయమువలన దోష ముండదనియుఁ జెప్పి,

"ఉష్ణరశ్మి మయూఖంబు లుమియుచుండె
నిప్పుతుంపురులను దావినీరజములు,
రక్తరేణువుల్ గ్రక్కు వక్త్రములనుండి
మరల వెడలంగఁ గ్రక్కెడు మాడ్కి" (తె. కా.)

ఇత్యాదులు జూపియున్నాఁడు. శృంగారనైషధాదిప్రబంధములసైతము "గల్లపాళీలసత్కామముద్రాంకురా" అని గల్లశబ్దప్రయోగ మున్నది. మఱియు నీగ్రామ్యమున కన్నిపట్టులను దోషము లేదు. పాత్రముఖభాషణములలో నీచపాత్రయైన తక్కువభాష లోనే మాట్లాడింపవలెను. అట్లుగాక యేగొడ్డుగ్రాంథికమో మాట్లాడించిన నయ్యది పరిహాసాస్పదముగా నుండి స్వభావసిద్ధముగా నుండదు. కాఁబట్టియే "గ్రామ్యంబు తత్తజ్జాతివర్ణనములం బ్రయోగార్హంబు" అని "మొక్కెముసామి" (రామా) "ఇతని నూసినా మేలుబాగెము నేసినాము" (యయాతిచరిత్ర) అనియు ప్రౌఢవ్యాకరణకర్త సాధించియున్నాఁడు. రానురాను నేఁటియుగమున గ్రామ్యమునకే ప్రాధాన్యము వచ్చుట తటస్థించినది. కాఁగా పైపదప్రయోగములమాత్రమే దోషమని చెప్పిన నిది యనవసరము.

౪ చ్యుతసంస్కారము:—అనఁగా వ్యాకరణదుష్టమగు భాషయే యీ పేరుగలది. ఈదోషమును సామాన్యముగ నందఱు పాటించియే యున్నారు. ఈ దోషము ముఖ్యముగా సంస్కృతభాషకుసంబంధించినది. ఏలయన నయ్యది వ్యవహారభ్రష్టత నంది నిలిచిపోయిన భాషగాన నద్దానిని వైయాకరణులు శాసించినరీతిఁ బ్రయోగింపనిచో నప్పు డీదోషముండుట యుక్తము.

కావుననే కాళిదాసాదిమహాకవులలోఁగూడ నీచ్యుత సంస్కారము లుండుట మన మెఱుఁగుదుము. తెనుఁగు భాషగతి యిట్టిదిగాదు. దినదినము నూతనాంకురములతో వేఁదలెత్తి పెరుఁగు భాషాలతికకు సంస్కార మొక్కపరి చేసి యీపందిరిగలుగు మేఱలోనే నీవు ప్రాకులాడవలెనుగాని దీనిని దాఁటరాదనిన నం దెట్లిమిడి యుండును? కాన నొక్కకాలమున సంస్కరించిన భాష కొన్ని వత్సరములకు నశింపవచ్చును. అప్పటికిఁ గొన్ని క్రొత్తపదములు, క్రొత్తప్రయోగములు నాఁటి జనుల రుచిభేదము ననుసరించి మారనగును. అప్పుడు పూర్వవ్యాకరణానుసార మీప్రయోగము లన్నియు దోషయుక్తము లనుట యసంభవము. భారతకాలము నాఁటి భాషలోని పదములు చాలవఱకు నేఁడు నశింప లేదా? ఆ ప్రయోగములప్రకారము నేఁడున్న నర్థమగుటగూడ దుర్ఘటము. కాఁగా జీవద్భాషయగుట మనవాఙ్మయమున కీదోషసంపర్కము లేదు. కాని యొక వ్యాకరణముచే నియమింపఁబడినవెనుక కొంతకాలమువఱకును మారని భాషాసంప్రదాయముల వీడి నాఁటివారు తద్వ్యతిరేకముగాఁ బ్రయోగింపనప్పుడీ దోషమునకు స్థానము దొరకును. ప్రకృతమున దోషమని శాసించిన తత్తదలంకారచ్ఛందోగ్రంథములలోనే యీ సంస్కారచ్యుతు లున్నవి. చూడుఁడు—"దేహి యనం గనీక మనుచుం బ్రజలన్" (కావ్యాలం. సం.). ఇచ్చట 'దేహి'యనునది సంస్కృతధాతువు. ఇయ్యది యనుకరణాదులేమియు లేక నాంధ్రమునఁ బ్రవేశించుట యెట్లు? ఇది వాడుక ననుసరించి యద్దానియం దంద మున్నదని వ్యాకృతుల నొకచో నుంచి కవి ప్రయోగించి యున్నాఁడు. "దివిజేంద్రతటినియో యన"—ఇచ్చట 'ఓ' యను నూహార్థకశబ్దము త్వ్రిషావాచిగాని యుపమావాచి గానేరదు. ఐన నుపమావాచిగా కవి ప్రయోగించియున్నాఁడు. ఇటీవలి వ్యాకృతు లీనియమమును జెప్పినవి. ఇట్లే చ్యుతసంస్కృతులు తీసిన ప్రతిప్రబంధమునందును కొల్లలుగా నున్నవి. మఱియు నీ చ్యుతసంస్కృతి సరియగు నర్థముతో గ్రహించి లక్షణము చెప్పిన ఛందోభంగ, యతిభంగ, శబ్దహీన, విరస, అస్థానసమాస, గ్రామ్యాదు లనేకము లిం దంతర్భవింపును. వీని విషయమున వ్యాకరణఛందోలంకారగ్రంథములే సంస్కరించి నియమించినవు డానియమము నుల్లంఘింప నవన్నియు చ్యుతసంస్కారములే యగునుగాని యన్యములు గావు. అయినను కక్ష్యావిభాగమున భిన్నభిన్ననామములఁ బెట్టి గ్రంథవిస్తృతిఁ జేయ లక్షణకర్తలు పూనుకొనిరి. కొందఱు లాక్షణికులు "విరోధ" మనెడి దోషమును జెప్పి యయ్యది దేశ, కాల, కలా, న్యాయ, ఆగమ, శాస్త్రాదివిరోధములుగా విభాగించి యింక నెన్ని గలవో యవన్నియు విరోధ మొక్కటిచే గతార్థము చేయలేదా? అట్లే యీచ్యుతసంస్కృతి విషయమునఁగూడఁ జేసిన యుక్తముగా నుండెడిది. లేనిచో ననేకవిధము లింకను జెప్పి క్రొత్తపేరులు బెట్టవలసివచ్చును.

౫. అశ్లీలము:—"వ్రీడజుగుప్సామంగళ, శీలములగు పదము లొకటఁ జేర్చిన నది యశ్లీలము" అని లక్షణము చెప్పఁబడినది. ఇట్టి దోషముల ముఖ్యముగా కవులు పాటింపవలసినదే? దీనివలన నొకొక్కస్థలమున విపరీతార్థస్ఫూర్తి కలిగి సామాజికుల కసహ్యము గలిగించును. ఇట్టిదోషము లరుదుగ వాఙ్మయమున నున్నవి. "వారలలో లక్కాంబ కుమారుఁడు"—ఇయ్యది కందపద్యపాదము. ఇందు, కుమారుఁడనెడి పదమందలి యాదిమవర్ణము మొదటిపాదమున మిగులుటచే లక్కాంబకు మారుఁడు—లక్కాంబకు మన్మథుఁడై అనఁగా మన్మథునివంటివాఁడై, భర్తయై అను నశ్లీలార్థము గలుగుచున్నది. "పండువెన్నెలఁ జిమ్మి పైరులఁ బండించి ధరణి కన్నముపెట్టు ధర్మరాజు" ఇచ్చట భూప్రజకు నన్నదానము చేయువాఁ డనునర్థము చెడి "భూమికే కన్నముత్రవ్వు మహాత్ముఁ" డను నశ్లీలార్థము వచ్చుచున్నది. మఱియు "ఈకలహంసయాన నను నెక్కడి కెక్కడినుండి తెచ్చె" ఇత్యాదులలో వివరింప నవసరములేకయే యేకపదాభాసమువలనఁ గలుగు నశ్లీలార్థము సర్వవేద్యము. మఱియు, "కుడువన్ కుడువన్", "ప్రాంచద్భూషణబాహుమూలరుచితో", "గుట్టసియాడ","మూడువలపుల్ వలచెన్...కన్యకన్"–

ఇత్యాదులలో నపారమను దురర్థము స్ఫురించుచున్న యది. ఇట్లీదోషముగూడ సర్వసామాన్యముగనే యున్నది. ఈయవి తత్తత్కాలములఁ గల కవుల రుచి భేదముఁబట్టి నిర్దోషము లగుచున్నవి. మఱియు నర్థదోషములలోని పరుషమను దోషముగూడ నిద్దానియం దంతర్భవించును. "ఈరాజు సౌందర్యము మంటబడ్డ మదనుని సౌందర్యమువంటిది" అని దాని లక్ష్యము. ఇట్లనినతోడన నమంగళప్రదమగు నర్థము స్ఫురించుట నిదియు నొకవిధమగు నశ్లీలమేయగునుగాన నియ్యది యనవసరము.

౬. అప్రతీతము:—శాస్త్రపురాణ ప్రసిద్ధపద మప్రతీతము. "వృషాకపి", "అజావృతము" ఇత్యాదులు. పురాణమాత్రప్రసిద్ధత యిట్టివాని కెప్పుడు గలిగెనో యప్పుడే కవిప్రయోగములనుండి విశీర్ణమైనవని తేలుచున్నది. లేనిచో నాయాపదములకు వాఙ్మయమున స్థాన ముండెడిదే. ఇట్టితఱి "కవులు ప్రయోగింపని పదమవనిం దగ నప్రయుక్తమగు" అని మరల శాస్త్రపురాణప్రసిద్ధములు గొన్ని, కవిప్రయోగసిద్ధములు గానివి కొన్ని యని విభాగింప నవసరములేదు. ఈగణమంతయు నొకటిగాఁ జేర్పవచ్చును. శాస్త్రమాత్రప్రసిద్ధములగు ౧౦ సకారములతోఁగూడిన "సంస్కర్తా" యనునదియు, "పుపుత్రీయియిషేమతి", "రామాత్ త్" "రామాన్ ద్" ఇత్యాదులు ప్రథమమున నప్రతీతములై యట్టివి కవులు ప్రయోగింపమి యప్రయుక్తములు కావుటలో సందేహమా? కాన నీరెంటిని భేదింప ననవసరము.

౭. అప్రయోజనము:—ఒకపదము విశేషవిధాయిగాక యనవసరముగా కదిసిన నది యప్రయోజనము. "భూతి విభాధవళిత హారసుతుఁ గొలుతును"—ఇచ్చట హారసుతు సేవనమునకు భూతివిభాధవళితత్వ మున్నను, లేకున్నను నొక్కటియే. వ్యర్థదోషముగూడ నిట్టిదియే. దీని లక్షణముననే నీరెంటికి నైక్య మున్నట్లు విదితము. చూడుఁడు: "అప్రయోజనంబు వ్యర్థమా" అని చెప్పియున్నాఁడు. ఇచ్చటఁగూడఁ బ్రయోజనములేని విశేషణమే వ్యర్థము. "ఫేనిలంబైన జలధి దాఁటె యనిలతనయుఁడు" అని దీని లక్ష్యము. ఇచ్చట అనిలతనయ జలనిధితరణమునకు ఫేనిలత్వ విశేషణ మున్న, లేకున్న నొక్కటియే. ప్రకృతమున కావిశేషణము వలన పరిపోషాతిశయ మేమియు లేదుగాన నిదిగూడ పైయప్రయోజనమువంటిదే యగును. కాఁగా నిందొకటి యనవసరము. ఈ వ్యర్థదోషమువిషయమున కవిజనాశ్రయకర్తమతము వేరుగ నున్నది.

"మొదలఁ గ్రియతో నమర్పక
విదితవిరుద్ధార్థయుక్తి విపరీతంబై
తుదఁ గ్రియ రాఁ జెప్పిన, వ్య
ర్థదోషము............"

అని చెప్పెను. అనఁగా ప్రథమమున నేవాక్యమును ప్రారంభించెనో ఆవాక్యమును గ్రియతో సమాప్తినందింపక నడుమను ప్రారంభవాక్యార్థవిరుద్ధముగా మఱియొక వాక్యమును జొనిపి మొదటివాక్యమును దదనంతరము సరిపుచ్చుట యని దాని యర్థము. చూడుఁడు—

"పొడిచి యొడుసంగఁ బగరను
గడుఁ గరుణాపరుఁడ వీవు గావున నీక
ల్గెడువారు లేరు పగరె
క్కడ........."

అని లక్ష్యము. ఇందు ప్రారంభవాక్యము "శత్రువులను బొడిచి యోడింపఁగా నీకల్గెడి పగ రిఁక నెక్కడను లేరు" అనెడిది. దీని నిట్లు కొనసాగకుఁ జెప్పక నడుమను "కడుకరుణాపరుఁడ వీవు గావున" అనెడి వాక్యమును జొనిపియున్నాఁడు. దయాపరత యున్న శత్రుహననక్రియోపయోగి యగుట యసంభవము గాన నీ వాక్యము విరుద్ధార్థయుక్తము. ఇట్టిది వ్యర్థమని యాతని మతము. ఇయ్యది విరోధము లేనిచో నరసభూపాలీయమతమున వాక్యగర్భితమగును. ఇయ్యది విరహిణీవాక్యములలో గుణత్వ మందుననిగూడఁ జెప్పియున్నాఁడు. దండిగూడ గుణత్వవిషయమున నేకీభవించినను లక్షణమును భేదముగాఁ జెప్పియున్నాఁడు. చూడుఁడు—

"ఒకప్రబంధంబునందైన నొక్కవాక్య
మందునైనను బూర్వాపరార్థములు ప
రాహతిం గాంచినను విరుద్ధార్థము లయి
వ్యర్థమనుచు దోషంబుల పల్కఁబడియె"

ఇందు విరుద్ధములైన యర్థములు గలుగుటయే వ్యర్థమని చెప్పఁబడినది. ఈ విషయమున మతభేదము లిట్లున్నవి.

ఇఁక వాక్యదోషములు—

౮ విసంధి:—

"అపగతలక్షణమును గ్రా
మ్యపు సంధియుఁ దగ విసంధి యనఁదగు"

అని లక్షణముఁ జెప్పి "అరిగె న్నపరగిరి కినుఁడు" అని లక్ష్య మిచ్చియున్నాఁడు. ఇది యీతఁడు సెప్పుట యనవసరము. ఇయ్యది వ్యాకృతులే చెప్పెడిని. అట్టి వ్యాకృతినియమము దాఁటెనా, చ్యుతసంస్కృతాఖ్య దోషమే సిద్ధమగును. మఱియు నీలక్ష్యము సరిగ లేదు. ఇచ్చట పాదాంతము గాన "అరిగెన్" "అపరగిరి కినుఁ డనంగా" అని కందపద్యపాదారంభ మనుకొనిన నీ దోషము వారించును. కాని పైదోషము ద్రుతద్విత్వస్థలములనని కవిదృష్టి గలదు. అట్లయ్యు నట్టి ద్రుతద్విత్వము నంగీకరించి వ్యాకరణకర్తలు ప్రమాణత నిచ్చియుండుట నీదోషమును దీసివేయనగును. ఈవిషయమున దండి,

"సంహితావివక్ష జనునంచుఁ బాదవా
క్యముల మన్యభాగమందు సంధి
పదములకు నొనర్పఁబడకుండుటను విసంధి."

అని చెప్పియున్నాఁడు. అనఁగా నియ్యది తెనుఁగున "అలసగతులఁ దిరుగు-అనిలంబుచేతను" అని యుండరా దనియే యీతనిమతమని ప్రామాణికులు చెప్పియున్నారు. ఇట్టివే న్యాయమైన విసంధిలక్ష్యములు. మూర్తికవి లక్ష్యము వ్యాకృతిసమ్మతిగానివాఁడు దుస్సంధి యగును గాని విసంధి గానేరదు. పాదాంతవిసంధివిషయము వ్యాకృతు లొప్పుకొన్నదే.

౯. పునరుక్తి:—"ఎనయఁగ శబ్దార్థంబులు పునరుక్తములయిన నదియె పునరుక్తి", "చక్రాంచలమునఁ జక్రధరుఁడు శత్రుల ద్రుంచె" అని లక్షణలక్ష్యములు జూపెను. ఇది సరిపడదు. ఏమన చక్రధరశబ్దము కేవలవ్యక్తిగతమై, యావ్యక్తి చక్రాంచలమున శత్రువుల ద్రుంచెనను నర్థము వచ్చుచున్నది. అంతియెగాని యిందు పునరుక్తి లేదు. దీనికి భీమన "దినకరుఁడని మఱి దినకరుఁ డనఁగా శబ్దపునరుక్తి, దినకరుఁడని యాదిత్యుం డన నర్థపునరుక్తి" యని స్పష్టముగాఁ జూపెను. మూర్తికవిమతమున నర్థపునరుక్తిలక్ష్యము లేదు. దీనిని దండి ఏకార్థ మనునామమున వాడియున్నాఁడు. గుణత్వకల్పనమందు వీరిరువురకు భేద మున్నది. దండి,

"అక్కటిక మాదిగాఁగల యట్టివారి
యతిశయమ్ము వివక్షిత మైనయెడల
.........దోసమ్ముగాదు
అరయగ నీదృశం బలంకార మగును"

అని చెప్పి కనికరముగలవా రీపునరుక్తిగ మాట్లాడిన దోషము లేదని చెప్పెను. ఇఁక భీమన "వీప్సాభీక్ష్ణక్రియాసమభిహారమైన క్రియలన్ గృతులన్" అని చెప్పి,

"వినువసతివసతిదప్పక
వనమునఁగా వీప్సవచ్చి వచ్చిచనుం దా
నఁగను నభీక్ష్ణ మిమ్మి
మ్మనఁగాఁ గృతులఁ క్రియాసమభిహార మగున్."

అని చూపియున్నాఁడు. ఈగుణత్వకల్పనము స్వభావసిద్ధముగా నున్నది. మూర్తికవి యీదోషమునకు గుణత్వకల్పన చేయనేలేదు.

౧౦ అధికపదము:—

"తలఁపఁగ మిక్కిలి పదములు
గలిసిన నది యధికపదము కమలారికలా
కలితవిలాససముల్లస
దలఘుయశోవిభవశాలి........."

అని లక్ష్యలక్షణములఁ జూపియున్నాఁడు. ఇచ్చటఁ గమలారికలాకలితుఁడనఁగా తేజశ్శాలి యనునర్థము వెంటనే స్ఫురించుచున్నది. మిగిలినపదము లధికముగా నుండి యా యర్థమునే చెప్పుచున్నవి. కాన నధికపదయుక్తమగుట నీదోషము సార్థకము. ఇయ్యది వ్యర్థముకన్న భిన్నముగాదు. ఆయధికపదమువలన ప్రకృతార్థమున

కాధిక్యము లేదు గానఁ దక్కిన పదములు వ్యర్థములు. కాఁగా నధికపదవ్యర్థాప్రయోజనములలో నొక్కదాని నంగీకరించినఁ జాలును. ఇట్టి యధికపదములు చాల చోటుల ప్రయుక్తములై యున్నవి. "నళినాళీకమృణాలనాలలతికానవ్యప్రణాళీమిలల్లలనాలాపకథాసుధానురసలీలాలోలచేతస్కులై"—దీన నెన్ని వ్యర్థపదము లున్నవో స్పష్టమే.

౧౧ అస్థానసమాసము:—"అపదస్థసమాసం తత్సమాసో యత్ర నోచితః" అని లక్షణము. ఎచ్చట సమాస మనుచితమో యచ్చో నీదోషముండును. అనఁగా నట్టిపట్టుల కవి సమాసవచనముగాఁ జెప్పరాదు.

"కుతో వై ముఖ్య మస్మాసు బ్రహ్మణః పరమాత్మనః,
ఇత్యుదగ్రతరభ్రామ్యద్భ్రుకుటీకుటిలాననాః"

ఇచ్చట దైన్యభావము జూపుటకు బదులుగా రౌద్రరసమున నుపయోగించు ఖరసమాసము నుపయోగించియున్నాఁడు. దీనికి నరసభూపాలీయకర్త చూపిన లక్ష్యము సరిపడియుండలేదు. "రిపుల నని దునిమెద నే నిపు డని వికటభ్రుకుటీవిపులక్రోధాంధుఁ డయ్యె వీరుండు" అని యిచ్చినాఁడు. యుద్ధసన్నద్ధుఁడగు వీరుని లక్షణము వర్ణ్యము. అట్టిసమయమున నైరీతి యవస్థ సంభవమే యగును. ఎట్లన "ఈమాత్రపు శత్రుసేనల మీరు సమయఁజేయలేకపోయితిరా?" అని తనసైన్యముపై కోపపడుచు "నేనే పోయెదను లెం"డని తాదృశకోపాదిభావములఁ జూపించుట సంభవించును గాన నయ్యది సమంజసముగా లేదు. మఱియు నీదోషమును జెప్పునపుడు అస్థానవృత్తకల్పన అనెడి దోషముగూడ జెప్పవలసినదే. ఈదోషముగూడ నచ్చటచ్చట నున్నది. చూడుఁడు శృం. నై. ద్వి. ఆ. ౮౩ పద్యము. ఇచ్చట పురవర్ణన సందర్భమున మహాస్రగ్ధరావృత్తమును వాడియున్నాఁడు. నన్నయ యిట్టివృత్తముల వీరరససమయముల నుపయోగించును. మఱియు నందే ద్వి. అ. ౩౨ పద్యమున నీయస్థానసమాసదోషము పట్టును.

౧౨. యతిచ్ఛందోభంగములు:—ఈనియమము నతిజాగరూకతతో కవు లందఱు పాటించియున్నారు. పొరపాటున నేగ్రంథమునందైనను పొసగిన నయ్యది దోషమున వీలు లేదు. అట్టివి మూర్తికవిప్రయోగముల నే గానుపించె శిని. "అస్థానపటుసమాసంబు రిపుల నని దునిమెద"—ఇందు తా నంగీకరింపని యఖండయతి నిలుపఁబడినది. ఇయ్యది యతిభంగమే. పూర్వలాక్షణికుల మతమే యంగీకరించిన, నీతని గ్రంథములయం దెచ్చటనైన నీయతు లుండకుండునా? కాన నాతని కసమ్మతయతిగాన నియ్యది యతిభంగమే యగును. "పొలుపుగ మితిలేని మాడ్కి మొలబంటై"—ఇది లక్షణవిరుద్ధముగాన యతిభంగము. "అవధరింపును దోషంబులను వచింతు"—ఇచ్చటఁగూడ యతిభంగమే. కాని కొందఱు "అనువచింతు" అనెడి దంతయు సోపసర్గధాతువని యందురు. వచింతుననుదానికి "అను" అనెడి యుపసర్గతో ప్రయోగము లెచ్చటను గానరావు. అట్టి వున్నను ప్రచురప్రయోగములు లేమి మఱి యే యప్రసిద్ధదోషమునకో గుఱియగును. కాన సవరించుట కన్న ప్రమాదమనుట యుక్తము. ఇట్టిదోషములు ప్రాచీనగ్రంథములలో దిద్దని ప్రతులలోఁ గానఁగును. చూడుఁడు:

"మొదల సంఘటియించిన బొందికార్యము"
"బొడ్డుపల్లెను గొడ్డేరి మోసపోతి"
"చర్లాటఁకును శలవులు మధురాపురిచెంతన్"
"డీకొనివచ్చు......... దిక్ప్రవమానను"
"తగవుగాదిందులోన నేకతర గర్హా"
"రాయంచకాళ్లు దౌలకయమున్న"
"కోలంబాలక యోర్తు...బిసవల్లుల్ దున్మి"
"ఎండకు వాన కోర్చి తనయిల్లు......నా
కొంటి నలంగితిన్" (ఇచ్చట ప్రాస చింత్యము)

ఇట్టివనేకములు ప్రమాణగ్రంథముల యతిప్రాసభంగరూపమున విరుద్ధము లున్నవి. మఱియు రేఫ,శకటరేఫల విషయమై చెప్పనక్కఱనే లేదు. ఇవన్నియు దోషము లనవచ్చు. వారి మతములు వాని నంగీకరింపమి దోషములని గ్రహించునది. ఛందోభంగదోషముమాత్ర

మెచ్చుటను గానరాదు. మూర్తికవి ఛందోయతిభంగము లనియే జెప్పెనుగాని ప్రాసభంగముగూడ జెప్పవలసిదే; మఱచిపోయినాఁడు. ఈవిషయము కవిజనాశ్రయుఁడు గూడ మఱచిపోయినాఁడు.

౧౩ అశరీరము:—"క్రియాపదేన రహిత మశరీరం ప్రకీర్త్యతే" అనఁగా క్రియాపదములేని వాక్యమశరీరమని యర్థము. ఇట్టిక్రియ యధ్యాహారమనుకొన్న నీదోషము చెప్పుట యనవసరము. ఈవిషయము వ్యాకరణకర్తలు చెప్పియున్నారు. "కొన్నియెడల కర్తృకర్మక్రియ లధ్యాహార్యంబులగు" (ప్రౌఢ. వాక్య. ౧౪ సూ.) ఇట్టి యధ్యాహారప్రక్రియ మన వాఙ్మయమునకుఁ గూడ స్వభావమగుట నీదోషమును జెప్పనక్కరలేదు.

౧౪ వాక్యగర్భితము:—"తద్వాక్యగర్భితం యస్య మధ్యే వాక్యాంతరం భవేత్" అనఁగా వాక్యము వాక్యాంతరగర్భిత మగుట యని భావము. ఇదిగూడ దోషముగా నంగీకరింప నవసరములేదు. ప్రామాణిక ప్రయోగము లుంట వ్యాకృతికర్తలే వీనిని సాధించియున్నారు. "కొన్నియెడల వాక్యము వాక్యాంతర గర్భితంబై యుండు" (ప్రౌఢ. వాక్య. ౨౧ సూ.) "ఇందుల కెంత కాలం బయ్యో రానికారణం బేమి" అని లక్ష్యము. ఈ వాక్యమున 'ఎంతకాలంబయ్యో' ననెడి వాక్యాంతరముతో "ఇందులకు రానికారణం బేమి" అనెడి వాక్యము గర్భితమయ్యెను. కాన నీదోష మనావశ్యకము.

మఱి యర్థదోషములు:—ఇందు నరసభూపాలీయమున హీన, అధిక, అసమ, అఖ్యాత- అనెడి యుపమలును మరల వాక్యదోషములలోఁగూడ న్యూనాధికోపమలును మొత్తము ౬ విభాగములుగా నుపమాదోషముల విభాగించియున్నాఁడు. ఇందాదోషములు వాక్య, అర్థ గతములగుట నిన్నిపేరులు వచ్చెఁగాని వాక్యగతములలోఁ జెప్పి యవ్వియే మరల నర్థగతములలోఁ జెప్పుట యనవసరము. కాఁగా న్యూనాధికోపమ లెచ్చటనో యొక్కచోట నుండిన చాలును. కాన రెండు తగ్గింపనగును. ఇంక నసమోపమయన వర్ణ్యముకన్న నుపమాన మెక్కుడో, తక్కువయో యగును. అప్పుడధికమైన నధికోపమయు, హీనమైన హీనోపమయు నగుచుండ మరల నసమోపమాదోషకల్పన మనవసరము. మిగిలిన, హీన, అధిక, అఖ్యాతోపమలలోఁ జివరిదానిని గూడఁ జెప్ప నక్కఱలేదు. "నీమోము కలువవలెనున్నది" అని ఖ్యాతముగాని యుపమానము చెప్పిన ప్రాకరణికమునకు ప్రకర్ష తగ్గినది. కాఁగా పతత్ప్రకర్షమనెడి దోషమం దిది యంతర్భవించును. హీనాధికోపమలును నరసభూపాలీయవాక్యగతములలోని భిన్నలింగవచనములును దండి యుపమాదోషములే యనియు, నీనాల్గును ప్రయోగనైపుణిచే గుణత్వముగూడ నందవచ్చుననియు చెప్పియున్నాఁడు. చూడుఁడు:

"షండుఁ డీతఁడు స్త్రీవలెఁ జనుచునుండె
ఈయమ పురుషువలె వచియించుచుండె

—భిన్నలింగోపమలు

ఇతఁడు ప్రాణములవలె నాకిష్టుఁడగును
విద్య లార్జింపఁ బడియెను విత్తమువలె

—భిన్నవచనోపమలు

దేవతాసార్వభౌముండు తేజరిల్లు
నీవలెన్ ధరణీరమణీకళత్ర

—హీనోపమ

ఉర్వినేత తేజంబున నుష్ణభాను
కక్ష్య నారోహణముచేయఁ గలిగియుండె

—అధికోపమ

ఇట్టిపట్టుల నాయాదోషంబులు రమ్యముగా నుండునని చెప్పి దోషస్థానములఁగూడఁ జూపియున్నాఁడు. విస్తరదృష్టి నుదాహరింపమానితి. ఇట్టి యధికోపమను శ్రీనాథుఁడు వాడియున్నాఁడుగాని యది దండి నిర్దుష్టాధికోపమవలె లేదు.

"మనము గారానఁ బోషించి కనకపంజ
రమున నిడ్డ కేళీచకోరవ్రజంబు
నీనివెన్నెల తెగఁ గ్రోలుఁగాని విడువుఁ
డొక్కగ్రుక్కను కుంభజుఁ డుదధివోలె"

ఇచ్చట కుంభజుఁ డుదధి నెట్లు త్రావెనో యట్లే చకోరము వెన్నెలఁ దినివేయునని యన్వయము. ఉపమేయభూతచకోరమునకును నుపమానభూతుఁడగు నగస్త్యునకును నుపమానోపమేయభావము గాన నధికోపమాదోషమే యనవలెను.

ఇట్లు నరసభూపాలీయమున మూర్తికవి చెప్పిన దోషములలో ౧౩ వఱకు గతార్థములు, ననవసరములు గూడ నయ్యెను.

కావ్యకన్యకకు జీవితము రసము; గుణములు సౌశీల్యాదిగుణములవంటివి; శబ్దార్థము లుజ్జ్వలశరీరమువంటివి; అలంకారములు సువర్ణమయాలంకారములు. ఇట్టి సౌందర్యఖనియగు కావ్యకన్యను సృజించిన కవిబ్రహ్మ దోషములనెడి శ్విత్రకాణత్వలనిడిన నాకన్య నిర్భాగ్యయై, అయోగ్య యగును గాని సర్వాంగసుందరియై సర్వజనాహ్లాదిని కానేరదు. కాన సాధ్యమైనంతలో నిట్టి దోషములఁ జొరనీకుంట యుచితము. అట్లయ్యు "ప్రమాదో ధీమతామపి" అన్నరీతి నెవ్వరికైన పొరపాటు సహజము. కాళిదాసాదిమహాకవులకే యీప్రమాదములు తప్పినవి గావు. సామాన్యముగా నీదోషములలో నెద్దియో నొక దోషము జొరని గ్రంథమొకటి యున్నదనుట సాహసము. అట్లయ్యు దండిభీమనాదులు చెప్పిన రీతిని కొన్ని దోషములు గుణము లగుచున్నవి. ఈగుణత్వవిషయము ధ్వనికావ్యము, సాహిత్యదర్పణము మొదలగునవి చెప్పియున్నవి. లేనిచో నీదోషము లెల్లపుడు దోషములే యైన వాఙ్మయమంతయు దోషదూషితమే యగును. ప్రకృతమున నరసభూపాలీయదోషముల విషయమునఁ గలుగు నాయూహ తేటపఱచితిని. మఱియు శ్లేషాదికావ్యములందును, రెండుమూఁడర్థములు జోడించి చెప్పు కావ్యములందును ననేకదోషము లుండవచ్చును. అట్టివన్నియు దోషము లనఁగూడదని "స్యాతా మదోషౌ శ్లేషాదౌ–నిహతార్థాప్రయుక్తతే" ఇత్యాదివాక్యములవలన తేలుచున్నది. ఇట్టివానిని సోదాహరణముగాఁ జూపిన విపుల మగునను నూహతో విరమించితిని.

ఛందోదర్పణము—గిడుగువారి పీఠిక

దువ్వూరి సూర్యనారాయణమూర్తి

ఛందోగ్రంథములలో ననంతామాత్యుఁడు వ్రాసినగ్రంథ మొకటి ఛందోదర్పణమనెడి పేరున నున్నది. ఇందు తత్పూర్వలాక్షణికులకన్న విశేష ముగా యతులు, వృత్తములు ముఖ్యములగు వ్యాకరణ విషయములు ననేకములు చెప్పఁబడినవి. సామాన్య ముగా నీవిమర్శకయుగమున ప్రతిగ్రంథమునకును పీఠి కలు వ్రాయఁబడుచునే యున్నవి. చిరకాలమునుండి తాటాకులపై లేఖనములు తప్ప నితరవిధముగ ముద్ర ణాదిసదుపాయములు లేమిని అట్టివ్రాత ప్రతులలో ననేకదోషములుంటను, వాని ననుసరించియే నేఁడు ముద్రణము జరుగుటనుబట్టియు మూలగ్రంథస్థగుణదోష ముల నిర్ణయించుటకై పండితులచేఁ బీఠికలు వ్రాయింపఁ బడుట ముఖ్యకర్తవ్యమైనది. అందు లక్ష్యలక్షణవిరోధ ములు లక్షణమునందలి పొరపాటులు కవిప్రమాదములు మొదలగు ననేకవిషయములు నిర్దుష్టముగాఁ జూపఁబడు చుండును. ప్రకృతముపయి ఛందోదర్పణమునకు శ్రీ గిడుగువేంకటసీతాపతిగారు పీఠికను వ్రాసియున్నారు. అందు వారనేకవిషయములను విమర్శించి చూపి ఛందోదర్పణమను నామమును సార్థకము చేసియున్నారు. కాని యందొకచిన్నవిషయమై తెనుఁగునకు మూల మైన సంస్కృతలక్షణమును వీరిచేఁ దిద్దఁబడినపీఠికా లక్షణమును, మూలమును గూడ సమన్వయించుకొనలేక పోయితిని. ఆవిషయమున "ప్రమాదో ధీమతామపి" అన్నరీతిని సీతాపతిగారు పొరపడిరా? లేక మనకు పరమార్థ మగోచరమైనదా అనుసందేహము నావ్యాస మునకు తావొసంగినది. అందువలన నావిషయమును నాకు తోచినరీతిని తన్నివృత్తికై వ్రాయుచున్నాను.

సీతాపతిగారు పీఠికయం దార్యాప్రకరణమును గూర్చి వ్రాయుచు "నేటిఛందోదర్పణ ప్రతులలో ఆర్యాగీతుల లక్ష్యపద్యములు కనపడవు. లాక్షణికుల ఆచారమును అనుసరించి లక్ష్యలక్షణములను ఒకపద్య మందు ఇతరస్థలములలో చూపిన అనంతుడు ఆర్యా గీతులందుమాత్రము చూపించడా? అజ్ఞానముచేత కొం దరు లేఖకులు అనంతుని ఆర్యాగీతులను కందములవలె నడిచేటట్లు "సవరించి" రూపుమాపినారు. అనవసర ముగా అతికినమాటలు తీసివేసినయెడల వాటిలో లక్ష్య లక్షణములు రెండున్ను స్పష్టముగా కనపడగలవు చూడండి." అని చెప్పి వానిని సవరించి వానినన్నిం టిని వ్రాసియున్నారు. అందు విపులచపలలవిషయమై నాకు విప్రతిపత్తి కలుగుటచే వానివాని సంస్కృతలక్ష ణములఁ జూపి వివరింతును.

"లక్ష్మైతత్ సప్తగణా గోపేతా భవతి నేహ విషమే జః;
షష్ఠోఽయం చ నలఘువా ప్రథమేఽర్ధే నియతమార్యాయాః.

షష్ఠే ద్వితీయలాత్పరకే న్లే ముఖలాచ్చ సయతిపదనియమః;
చరమేఽర్ధే పంచమకే తస్మాదిహ భవతి షష్ఠో లః."

అని యార్యాలక్షణము. అనఁగా నార్యాప్రథమార్ధము నకు గాభజసనలములలో నేడున్ను, పైనొకగురువుండవలె ననియు ౧, ౩, ౫, ౭, తావుల జగణ ముండరాదనియు నుండిన నారవస్థానమున నాజగణముగాని, నలముగాని యుండవలెననియు లక్షణము. ఇఁక యతిస్థానమన్న నో నలము షష్ఠమందున్న ద్వితీయలఘువుకంటెను సప్తమ గణము నలమైన మొదటి లఘువుకంటెను నిలుపవలెనని ప్రథమార్ధ లక్షణము. కాని "షష్ఠోఽయం చనలఘువా" అని చెప్పి వెంబడినే "షష్ఠే ద్వితీయలాత్ పరకే న్లేముఖలాత్" అని చెప్పిన నియమము చొప్పున నలఘువున్న పుడే యతినియమమును జెప్పెనుగాని జగణమున్నపుడు షష్ఠ స్థానమున యతినియమ మెట్లో చెప్పియుండ

లేదు. అది యూహ్యము. రెండవపాదమున నారవగణము నకు బదులుగా లఘు వుండవలెననియు, నైదవ స్థానమున లఘు వున్న మొదటి లఘువుకంటె యతి నిలుపవలెన నియు లక్షణమును చెప్పియున్నాఁడు. ఈ సంస్కృతమందలి "యతి ర్విచ్ఛేదసంజ్ఞకః" అనునట్టి విచ్ఛేద రూపయతికిన్ని తెనుఁగునఁగల యక్షరసాజాత్యరూపయతికిన్ని సంబంధము లేనందున ననంతుఁడే యతినియమమును బాటింపక వృత్తమును మాత్రమే గ్రహించియున్నాఁడు. పైరీతిని పథ్య ముఖ చపలజఘన చపలలు వాని వాని సంస్కృత సామాన్య విశేష లక్షణలక్షితములై దిద్దఁబడినవి. ఇఁక విపులార్యాలక్షణమును జూతము. దీని లక్షణమున్ను వృత్తరత్నాకరమున "ఉల్లంఘ్య గణత్రయ మాదిమం శకలయో ర్ద్వయో ర్భవతి పాదః, యస్యాస్తాం పింగళనాగో విపులామితి సమాఖ్యాతి."

అని చెప్పఁబడినది. అనఁగా నార్యయొక్క రెండుపాదములందును మొదటిశకలమునందుండెడిగణత్రయమునకు విచ్ఛేదముకాక అనఁగా తృతీయగణభూతయతిక్రాంచిత్పదము సమాప్తినందక సగము మూడవ గణములోను, తచ్ఛేషము నాల్గవగణములోను జేరి శకలద్వయమునకు నవినాభావసంబంధమును దెలుపుచున్న నయ్యదియే విపులార్య యనఁబడును. చూడుఁడు.

"ఉల్లంఘ్య గణత్రయ, మా
దిమం శకలయోః."

పైలక్ష్యమున మూడవగణస్థానమందు నిలిచిన 'ఆదిమం' అనెడిపదమునందలి 'ఆ' యనునది పైశకలమందు మిగిలి తక్కినది రెండవశకలమందు కలిసినది. ఇట్లే రెండవపాదమందునను జూచుకొననది. దీనిలక్షణము సంస్కృతమున నిట్లుండ ననంతునిఛందమున నిట్లున్నది—

"ప్రకటసమపాదముల నిలు
వక శబ్దమునవలఁ జొచ్చివచ్చెననంద
క్రొక్క విపులార్యయగును నే
వకజనమందారధీర వనజదళాక్ష."

ఇయ్యది యార్యాలక్షణమయ్యు కందపద్యములో నుండు టాచారము గావుని శ్రీగిడుగు సీతాపతిగారు పత్రికలో దీనిని

"ప్రకటసమపాదముల నిలు
వక శబ్దము నవలఁ జొచ్చివచ్చిన ద
క్కక్క విపులార్యయగును నే
వకజనమందార వనజాక్షా"

ఈరీతిని సవరించి లక్ష్యలక్షణయోజనఁ జేసియున్నారు. పైవృత్తరత్నాకరనిలక్షణమురీతి నిందు సమపాదముల శబ్దము నిలువక నీవలకు రావలెననులక్షణము స్పష్టముగా లేదు. ఉన్న సమపాదములు రెండే. అందున్ను మొదటిసమపాదమునుండి శబ్ద మీవలకు వచ్చుట సంభవించునుగాని రెండవసమపాదమునుండి (నాలవపాదమగుటను) శబ్ద మీవలకువచ్చుట సంభవింపదు. కావున నచ్చట "ప్రకటాసమంబులను" అని దిద్దుకొని అసమంబులను = విషమపాదములను, అనువర్థమును గ్రహించిన విరోధ ముండదు. మఱియు సంస్కృతమున ప్రథమశకలములోనిపదము రెండవశకలమున జేరుట, మూడవశకలముందలి పదము నాల్గవశకలమందు జేరుటయే నియమముగాని, యీ తెనుఁగున దర్పణమందును, పత్రికయందునుగూడ రెండవపాదాంత్యమందలి పదము మూడవపాదముతో కలిసి మొత్తముపై నాలుగు శకలములును గొలుసుకట్టుగ నుండవలె నను నియమము లేదు. ఇది తెనుఁగున యతినియమమును వీడి వేరురీతిని గ్రహించినట్లు స్వతంత్రనియమమా, లేక పాఠపాటా? లక్ష్యములుగూడ ప్రకటితములు తెనుఁగున నాతిబహుళములు. ఒకవేళ నదుమకలుపు ద్వైచ్ఛికమని యనినచో నదియే యొకవిశేషలక్షణముగాఁ జెప్పనవుడ ట్లితరపాదములలో నిట్లు సందేహము కలుగునట్లుగా వ్రాయుట యితరుల కద్దియు నొకనియమమువలెనే కనపింపకపోదు. అప్పకవీయమందుగూడ నీవిషయమును గూర్చి......

"క్షమ జేసికాలు సమపా
దములోఁ జొర శబ్ద మొకటి తనరింపన్"

సమధికపథ్యాకందము
గమనిక విపులయన నలరు కందమునున్."

ఇట్లు చెప్పఁబడినది. ఇందు రెండుమూడుపాదములు ఖండముగ నేయుండి పైకలిసియుండవలె నను వారినియమమును బాధించెడిని. కాని మూడవశకలము నకును నాల్గవశకలమునకును సంబంధము లేదు. ఆసంబంధము ప్రథమపాద శకలద్వయముననే పైలక్ష్యమునఁ జూపబ్బెడి. ఇట్టిభేదములతో నున్న నిద్దానివిశేషలక్షణమేమో దుర్గ్రాహ్యముగా నున్నది.

ఇఁక చపలార్యనుగూర్చి విచారింతము. దీని లక్షణము రత్నాకరమున—

"ఉభయార్థయో ర్జకారౌ, ద్వితీయతుర్యౌ గమధ్యగౌ యస్యాః, చపలేతినామ తస్యాః ప్రకీర్తితం నాగరాజేన" అనికలదు. అనఁగా రెండు పాదములలోను ద్వితీయ చతుర్థములు జగణములై యుండవలెననియు, నవి గురుమధ్యగతములై యుండవలెననియు నద్దానిలక్షణము. చూడుఁడు. మొదటి శకలమందలి రెండవ గణము 'ర్థయోర్జ'-ఇయ్యది మధ్యగురువు గాన జగణము. ఇయ్యది వెనుకనున్న 'యా' అనుగురువు తోడను, ముందు 'కా' అనుగురువుతోడను నాక్రమింపఁబడి గురుద్వయమధ్యగతమైనది. ఇఁక నాల్గవగణము 'ద్వితీయ' ఇదియు మధ్యగురువే కాన జగణమైనది. ఇదియు వెనుకను 'రౌ'అనెడి గురువుయొక్కయు, "సంయోగేపరే హ్రస్వం గురుః" అను సూత్రముచే "తుర్యౌ" అనునప్పుడు రేఫయకారసంయోగముపరమగుటచే 'తు' గురువగునుగాన పైజగణ మీగురుద్వయమధ్యగత మైనది. ఇట్లే రెండవ పాదమందునుగూడ "తినామ" జగణము. ఇది వెనుక 'లే' అనుగురువుయొక్కయు, ముందు 'త' అను గురువుయొక్కయు మధ్యగతమైనది. కాన నియ్యది చపలార్య యగుటలో సందియము లేదు ఈవిషయమనంతుఁడు

"వరుసను ద్వితీయ మంత్యము
స్ఫురణ మధ్యగజకారములును దగన్ రెం
డరయఁగఁ దనర్చు నేనిన్
సరవి నదియ హరి మురారి చపలార్య యగున్."

అని చెప్పఁగా దానిని పూర్వమువలెనే సీతాపతిగారు పీఠికలో,

"వరుసను ద్వితీయ మంత్యము
స్ఫురద్గమాధ్యగ జకారములు దగ రెం
డరయఁగఁ దనర్చు నేనిన్
హరీ మురారి చపలార్య యగున్."

ఈరీతిని దిద్ది చూపియున్నారు. ఇది కేవలము సంస్కృతలక్షణముతో విరోధించుచున్నది. చూడుఁడు. "ద్వితీయతుర్యౌ" అని వృత్తరత్నాకరము. దీనికి "ద్వితీయ మంత్యము" అని తెనుఁగునఁ గలదు. తుర్యమనఁగా చతుర్థము; నాలుగవది యని యర్థము. అంత్యపదమున కట్టిచతుర్థార్థకత్వము లేదుగదా? సరిగదా దేని యంత్యము? పాదాంత్యమా? లేక పద్యాంత్యమా? మఱియు సంస్కృతమున 'గమధ్యగౌ' అనుదానికి "స్ఫురద్గమాధ్యగజకారములు దగ రెండు," అని తెనిగింప. దీని కొకగురువుతోఁగాని పెక్కింటితోఁగాని కూడిన మొదటిజగణములు, అనునర్థము స్ఫురించుచున్నదిగాని గురుద్వయమధ్యగతజగణ మనునర్థము స్ఫుటముగా వచ్చుటలేదు. ఇది యిట్లుండ లక్షణమేమైన పొరపడిన దనుకొన్నను లక్ష్యదృష్టికైనను సీతాపతిగారు దిద్దినది చపలార్య కాలేదు. ఏలనన మొదటిపాదమందలి రెండవది 'ద్వితీయ' జగణము. దీనికి వెనుకటిది 'ను.' ఇది లఘువుగాని గురువు కానే కాదు. ఇఁక ముందున్న 'మం' అనునది సానుస్వారము గాన గురువైనది. కాఁగా గురుమధ్యజగణము రెండవది కాలేదు. నాల్గవదన్నో 'స్ఫురద్గ' అనునది జగణము. దీనికి వెనుక 'ము' అని లఘువున్నదిగాని గురువు లేదు. అది సమాసముకామిని పదాంశమగుటను సంయోగపరమైనను గురువు కానేరదు. ముందుమాత్రము—'మా' అనునది గురువయ్యెను. ఐన నిదియు గురుమధ్యజగణము కాలేదు. ఇఁక రెండవపాదమందుగూడ 'తనర్చు' అనుజగణము గురుమధ్యస్థము కాక వెనుక 'గ' అను లఘువుతోఁ గూడియున్నది. నాల్గవజగణము 'హరీము' అనునదిమాత్రము వెనుక 'నిన్' అనుగురువుయొక్కయు, ముందు 'రా' అను గురువుయొక్కయు మధ్యగ

మైనది. కావున నీదద్దినపద్యము నీరీతి కొంచెము సవరించిన సరిపోవునని నానమ్మకము—

"వరుసగ ద్వితీయతుర్య
స్ఫురద్గమధ్యగజకారములు దగ రెం
డరలం దనర్చు నేని
హరీ మురారి చపలార్య యగున్."

ఇట్లు సరిపోవునో యాక్రింద వివరించి చూపుదును—

'సన్—ద్వితీయ—తు' సంయోగము పరము గాన గురుమధ్య ద్వితీయజగణము.

'ర్య—స్ఫురద్గ—ము' రెంటికిని సంయోగము పరమం దున్నది గాన గురుమధ్యచతుర్థజగణము.

'లన్—తనర్చు—నే.' రెండవపాదమందలి గురుమధ్య ద్వితీయ జగణము.

'నిన్—హరీము—రా.' రెండవ పాదమందలి గురుమధ్య చతుర్థ జగణము.

ఈపై రీతిని దిద్దిన సర్వలక్షణ సమన్వయముగా నుండును. అప్పకవిగూడ నీచపలార్యవిషయమున

"సమపదముల మొదలం జగ
ణము దగ యను సునను ద్విగణలఘువు పై
సమకొను విరతియు పదియేన్
లముల్ ముకుంద చపలకు నమరున్."

అని లక్ష్యలక్షణములఁ జూపియున్నాఁడు. ఇది గూడ సంస్కృతలక్షణముతో విరోధించుచున్నది. ఏమన సమపాదములలో మొదట జగణమైన చాలునట. అది గురుమధ్యము కా నవసరము లేదనియే యాతని మతమున్న. లక్ష్యము గూడ "ణముంద" అని రెండవ శకలప్రారంభమును, "లముల్ము" అని నాలవపాద ప్రారంభమును జగణముతో సాగినవి. కాని మూలమునఁగల "గమధ్యగౌజకారౌ" అనుదానికి వ్యాఖ్యాతలు "ప్రథమ గణాంత్య తృతీయ గణాద్యయోః తృతీయగణాంత్యపంచమగణాద్యయోశ్చ గుర్వక్షరయోర్మధ్యం ప్రాప్తౌ జగణౌ వితర్కః" అనియు, "ద్వితీయ చతుర్థౌ జగణౌ ద్వయో ర్గుర్వో ర్మధ్యగతౌ పూర్వాపరయో ర్ద్విగురుగణయోర్వా సగణభగణయోర్వా మధ్యస్థితౌ వితర్కః" అనియుఁ వ్రాసియున్నారు. ఈలక్షణ మెంతమాత్రమును దీనుఁగున కనఁబడదు. వీ రిట్లుమార్చుకొనుటకు కత మేమో తెలియదు. ఈరీతినే సీతాపతిగారుగూడ ద్వితీయాంత్యపాదములు జగణ మాదియందు గలవైన చాలునని యన్వయించుకొని దిద్దియున్నారు. దిద్దుటలో కందము మాత్రము మారినది. లక్షణముమాత్రము పూర్వులను సంస్కృతప్రామాణికలాక్షణికులమార్గము నంటక వేఱ దారిని పట్టెననుటలో సందియము లేదు.

మఱియు గ్రంథమందలి రెండుమూడుచిన్నలోటులనుగూర్చి వీరు పీఠికలో వ్రాయవలసియున్నది. వ్రాయలేదు. వాని నీక్రిందఁ జూపెదను.

త్రిపద:—"సరవి బ్రాసము నంది సురపతుల్ నలువురు
హరియు గై కార్కులు కలియ
జరుగు నిప్పగిది నొప్పు త్రిపద"

అని లక్షణము అనఁగాఁ త్రిపద మొదటిపాదమునకు నాలు గింద్రగణములును, రెం డింద్రగణము, లొక సూర్యగణముచొప్పున మిగిలిన రెండుపాదములకు లక్షణ మని యర్థము. ఇది లక్ష్యసృష్టికి విరుద్ధము, దీని మూఁడవపాదము—

'జరుగని 'సంయోగముపరముగాన 'ని 'గురువు కాఁగా 'నగ' ము.

'ప్పగిదినొ '—సంయోగము పరముగాన 'నొ' గురువు. ఇదియు 'నగ' మే.

ఈపైనవచ్చుగణము సూర్యగణము కావలెను. అట్లుగాక 'ప్పుత్రిపద' అను 'నల' మైనది. నలమింద్రగణముగాని సూర్యగణము కాదు. కాన నంతిమ పాదమునను 'జరుగని,' 'నగ' 'ప్పగిదిని,' 'నల,' 'త్రిపద,' 'న' ఈరీతి సవరించిన సరిపడును.

వితాళమనుచౌపద:—చౌపదలలో నంత్యనియమమున్నట్లు తల్లక్షణమునఁ జెప్పియున్నాఁడు. ఆనియమ మీవితాళ మనుచౌపదలో "రెండు, ట్లుండు,"

పిండు" అనివచ్చు ౧-౨-౪ పాదాంత్యనియమము మూడవదానికోసము రాలేదు. "అందు" అని పడినది. మఱియు మూడవపాదమందు గణభ్రష్టమైనది. కొంచెము దిద్దవలెను. లక్షణమున "హరిబిరుదులపిండు" అని యున్నది. పిండు = సమూహము. అనఁగా చాలగా నుండవలెనని యపార్థము రాకుండ "రెండు" అని యనిన చాలును. ఈవిషయములు పీఠికలో లేవు.

మఱియు వృషభగమనమనురగడ:—దీనికి నొకసూర్య గణము, తరువాత నొకభగణము రీతిని పాదమున కెనిమిది గణములు. ఈలక్షణము మూడుపాదములలో సరిపడి క్రమముదప్పక వచ్చుచు నాల్గవపాదమందుమాత్రము పోయినది. చూడుఁడు. 'అనిమి' 'న' 'షాధప' 'భ' 'లఘుయు' 'న' 'తినిడగ' 'నల' 'నలరు' 'న' 'వృష భగ.' 'నల'

ఇందు నాల్గవది క్రమప్రకారము భగణము కావలసి యుండ నలమైనది. ఆరవదిగూడ నిట్లే నలమైనది. తక్కినదంతయు సరిపడియే యున్నది. మూలమున "భగణముల" అనునో 'భసనల' అను నధికపాఠము నా పేరిక్రింద వ్రాయఁబడినది. అనఁగా భగణముగాని, నలముగాని, అనునర్థము వచ్చును. ఈరీతినున్న సరి పోవును.

మఱియు హరిణగతిరగడ:—ఇందు పాదమునకు రెండుయతులవంతున వచ్చునియమము మూడవపాద ములో పోయినది.

"నిరవుగానిరు మారులఘువుల
నెల్లవారును నొగిగణింపఁగ."

అని యధోరేఖాంకితస్థలముల నిర్యతిగా నున్నది. "భానుయుతనలభసగగంబులు" అను లక్షణములోని 'గగ'మునకు లక్ష్యమున తావు లేదు. గగముతో నున్నను నడక చెడదు. ఇట్టివిషయము లింక నచ్చటచ్చట స్వల్పములు కలవు. కాని పీఠికాకారులు గ్రంథమంతయు బాగుగ పరిశీలించి విశేషవిషయముల విమర్శించియే యున్నారు. ఇట్టిస్వల్పముల విడుటన్న నంతయిబ్బంది లేకున్నను మూలభూతములై ప్రాచీనములైనట్టి యాంధ్ర సంస్కృతలక్ష్యములవిషయమై లాక్షణికులలో భేదము లుండుటచే వ్రాయవలసివచ్చెనని విరమింతును.



విక్టోరియా మెమోరియల్ హాల్-కలకత్తా G. V. S. M.

నాటకాలు—పాత్రలు—భాష

ఉభయభాషా ప్రవీణ—దువ్వూరి సూర్యనారాయణమూర్తిగారు

నేటి కాలంలో చాలామంది నాటకాలే రాస్తున్నారు. ఇప్పుడు చాలా మంది దృష్టి "నాటకరచనాంతం పాండిత్యం" అనే దారిలో పడింది. అన్నిటికంటె రాయడంలో కష్టం గలిగించేది నాటకమే అని మన పెద్దల నమ్మకం. కాని నాటక నియమాలన్నీ మానిపోవడంచేతనున్నూ, ఆ నియమాలమీద ప్రేక్షకలోకానికి ఆదరం తగ్గడంవల్లను ఇప్పుడు నాటకం రాయడమంత సుఖం దేన్లోనూ కనపడదు.

ఈనాటకాలని మూడు రకాలుగా విభజించొచ్చు. పౌరాణికాలు, చరిత్రాత్మకాలు, సాంఘికాలు, అని. ఈమూడు రకాల్లోనూ సాంఘికాలకున్నంత చలామణీ ఈరోజుల్లో వేటికీ లేదు. ఏరోజు కారోజు చక్కని పేర్లతో ఈరకం నాటకాలు బయిలుదేరుతున్నాయి. ఓమూల "రంగూన్ రౌడీ" బయల్దేరితే మరోమూల "రౌడీలకి రంకుమొగుడు" అనేది బయటబడుతోంది. ఓమూల "కాలేజీ గరల్" అని ఒకరు రాస్తే దాన్ని అణగతొక్కడానికి "కాలేజీ స్కాండ్రెల్" అని మరోటి చలాయిస్తోంది. తాత్కాలికంగా నటప్రేక్షకలోకంలో దేనికేనా "సక్కుబాయి" లా కాస్త పేరొచ్చిందంటే దాని కనేక ఫొటోలు మర్నాటికే తీసేస్తున్నారు మారు పేరులతోటి.

ఇప్పటి లోకంలో చాలామందికి దేవుళ్లమీదా పురాణాల మీదా నమ్మకం తగ్గడంవల్ల, అల్లాటి నాటకాలెంతటి మంచివైనా వెకటిస్తున్నాయి. అందువల్లే సావిత్రి లాటి పతివ్రత మొగుడి ప్రాణాలకోసం "యముడి దగ్గిరసా మూడు రాత్రుళ్లు పడుక్కుని ముచ్చం మూడు ముద్దులిస్తాను" అన్నదనిన్నీ, వేదకాలంలోంచీ ప్రసిద్ధిలో వున్న హరిశ్చంద్రుణ్ని కొడుకు "ఏమిటి శిధవ నాన్నా! అమ్మని నిప్పుమంటల్లో దిగమంటావు? నువ్వు దిగుకళ్లు మూసుకుని మేం ఇంకో నాన్నని తెచ్చుకుంటాం" అని హూంకరించినట్టున్న రాసే ప్రబుద్ధుల్ని చూసేంగదా? ఈరకంగా కంగాళీలు బయల్దేరుతున్నాయి. నానాటికి ప్రజల నమ్మకాలు అంతరించి ఇల్లాటి వాటి మీదే ఎక్కువ నమ్మకం ఆదరం కలుగుతోంది. ఇంకా యీ కశ్మలం చాలక కొన్ని బూతుల సంచికలు పబ్లిసుగా బయల్దేరడం కూడా చూస్తున్నాం. ఎక్కువమంది చందాదార్లు కూడా దీనికే. నిజమే మరి. "మనుసేన" మీద ఉండే అప్యాయం మరో శాకుంతల మీద వుండదు. "చింతామణి" మీద వుండే కౌతుకం శ్రీరామాయణం మీద కలగదు గదా! ఇల్లా వుంది లోకానికి నాటకీయాభిరుచి......

సంస్కృతం వాళ్లు నాటకం రాయాలంటే దానికి బోలెడు నియమాలు చెప్పేరు. అంకాలు ఎక్కువుండకూడదని, సంధులుండాలని, నాందీ సూత్రధారులుండాలని, విష్కంభాదులు తప్పవని బిగించేరు. ఇంకా యిల్లాగే, కథ మాత్రం ఎల్లా వున్నా సరేగాదా లేదన్నారు. వాళ్లని పట్టి మన తెనుగువాళ్లు కూడా ఈనియమాలని పాటించేరు పెద్దలు. రాను రాను వాటిలో కొన్నింటికి ఫ్రాంచికట్టు చేసేరు. ఇహ రాసే వాళ్లే యిలా వుంటే ప్రదర్శించే వాళ్ల విషయం చెప్పేదేమిటి? ఇప్పటి నటులు కొందరు తమకు కావలసిన చోట పద్యాలని తీసి ఇష్టం వొచ్చిన వాటిని వేసుస్తున్నారు. "నాన్సెన్సు, ఇది చాలా ఎఫెక్టుగా వుంది" అని దాన్ని వోమెట్ చేసి కొత్త సాంగ్సు నడుమ నడుమ "అసంపూర్ణరామాయణంలా"

అతికడం. ఇల్లాగే విషాదాంతాలు సుఖాంతాలు గాను సుఖాంతాలు విషాదాంతాలు గాను మార్చి శృంగారంలో భీభత్సం, వేదాంతం, భక్తి, వీటిల్లో తా స్టోరీసు చేర్చి ఎవరి యిష్టం వొచ్చినట్లు వారు చేసి నాటకాలకి పేరు బలవంతాన్ని లాక్కొస్తున్నారు. కొసకి గంటలోనూ గంటన్నరలోనూ ఆడెయ్యడానికి తగ్గట్లు నాటకాలుండాలని స్పెషల్‌గా కవుల చేయి పట్టి రాయించుకుంటున్నారు. ఇల్లాటి పరివర్తనం నాటక కళని ఉద్ధరించడమంటారో నట్టేట్లో దింపడమంటారో సహృదయులు నిర్ణయించండి.........

ఇంక పాత్రధారణాల విషయం చూస్తే గంపెడు రాయవలసి వుంది. ఈ విషయాలు చాలామంది ఎప్పటికప్పుడే రాస్తున్నారు. ఐనా రెండు మాటలు. పిలకజుట్టుతోనూ పిడికెడు జంఝాలతోనూ గోచీతోనూ వీణబుఱ్ఱ పట్టుకుని పురాణాల్లో తిరిగే నారదమునీంద్రుడు ఉంగరాలు తిరిగి చెవులమీద పడే కటింగ్ జుట్టుతోనూ సైకిల్ కట్లతోనూ నాభిపర్యతం వేలాడే రకరకం పూలదండలతోనూ ప్రవేశం. సంసారికళా, పతివ్రతాతత్వం నినదించే సావిత్రీ చంద్రమతీ పాత్రల్లో వంకర పాపిళ్లు, బోసికాళ్లు జబ్బలు తెగ్గొట్టిన రవికెలు, పవిటె పిన్నీసులు, నాజూకైన డాలర్ గొలుసులు, బర్మా సిగలతోటీ, కలకటా స్లిప్పర్లతోటీ ప్రత్యక్షం. ఆ ఫేసుపౌడరు మొహానికి బొట్టుండదు. ఇల్లా వుంటే ఆమె పతివ్రతో పచ్చిబోగందో ఆలోచించండి. ఐతే యీ చిక్కు పౌరాణిక నాటకాల్లోనే గాని సాంఘికాల్లో ఎల్లా వేసినా ఎంత ఫేషనబుల్‌గా వున్నా చిక్కులేదనుకోకండి. సర్వసామాన్యంగా నటులందరికీ ఫ్రెంచికట్టింగు, క్రాపు, తప్పనితద్దినాలవడం చేతనూ, పైన చీరకట్టినా లోపున తొడిగే లాగో యీజారో సగం సగం కనిపిస్తూండడం చేతనూ, అక్కడా యీ బాధ తప్పలేదు. అభినయించేది తురక పాత్రైనా గడ్డం నున్నగా వుండక తీరదు. కొత్త గెడ్డాలు కట్టడం అసహ్యం గదా! "చింతామణి"లో బిల్వమంగళుడు లాటి పండితుడికి గూడా పై వాతావరణం చేత, నూనూగుమీసాలు మోచేతులు దాటిన సిల్కుషర్టు, నుగ్గులు దేరిన క్రాపు, నడుస్తోంటే రోడ్లన్నీ బాగుచేసే బారగోచీ, చేతికి రిస్టువాచీ, చేతులో న్యూసుపేపరు, కాలికి స్లిప్పర్లు, పైమీద గుడ్డలేకపోవడం, మొదలైన లక్షణాలు అవశ్యాలవుతున్నాయి. ఇల్లా వున్నాయి పాత్రాభినయాలు...

ఇంక భాషావిషయంలో కవులు కూడా పాత్రల్ని ఎల్లా పోషిస్తున్నారో కొంత అనుకుందాం. ఈ విషయం మనం సంస్కృతంలోంచి తీసుకోవలిసుంది. అందులో

"ప్రాకృతం సౌరసేనీ చ నీచపాత్రస్య చ స్త్రియః
పైశాచం మాగధం వా స్యాత్ పిశాచాత్యన్త నీచయోః
యద్దేశ్యం నీచపాత్రం స్యాత్తద్దేశ్యం తస్య భాషితం
భాషా తు సంస్కృతం ప్రోక్తం అనీచానాం కృతాత్మనాం"

అని ఆయా పాత్రలకి ఆ భాషలు వాడాలని చెప్పుగున్నారు. కాళిదాసాదులల్లాగే వాడేరు. ఇది తెనుగు వారిలో మాత్రం బాగా అంటలేదు. గ్రామ్యం గాని వ్యావహారికం గాని వింటేనే తప్పని రకంలో చాలా మంది మన నాటకకర్తలున్నారు. ఇదీ సంస్కృతం పెద్దలు

"అపశబ్దం ప్రయుంజానో రౌరవం నరకం వ్రజేత్
ఏకశ్శబ్దస్సమ్యక్ జ్ఞాత్వా స్వర్గే లోకే కామధుగ్భవతి"

అని మప్పి పెట్టినదే. కనకనే చాలా మంది పాత్రయొక్క పాత్రాపాత్రత తెలియకుండా నాటకాల్లో మాట్లాడించి స్వభావం చెడ గొట్టేరు. వీరిలో ముఖ్యులు వీరేశలింగం పంతులు గారు. వీరి శాకుంతలంలో బెస్తవాని పాత్ర ఆరోజుల్లో అధమం "విద్వాన్" ప్యాసైన మనిషిలా మాట్లాడేడు. కాళిదాసు మాత్రం ఆ విషయం జాగ్రత్తగా వున్నా ఆపరిణామంలోకి వీరు దిగకపోడానికి కారణం మన పెద్దల వాసనే అనుకుంటాను.

రెండో వారు చిత్రనళీయకర్తలు కృష్ణమాచార్యులవారు. వీరు ప్రథితులైన నాటకస్రష్టలు. ఈ నాటకంలో అరణ్యంలో తిరిగే ఎలకలవాళ్లని, దాసదాసీజనాలని మంచి యమకంగా గ్రాంథికంలో మాట్లాడించేరు. వాడికి కవిత్వపరిచయం కూడా వుందని తెలియడానికి ఒకటి రెండు పద్యాలు కూడా చెప్పించేరు. ఇంకా వంటింట్లో బాహుకునిచేత ఒక్కొక్క మాటుగా ౨౦-౨౨ పద్యాలు వరసకూ చదివించేరు. ఇదంత యిబ్బంది చెయ్యదు గాని దీనివల్ల ప్రదర్శనానుకూలసృష్టి కవిగారికి లేదనొచ్చు. మొత్తం మీద గ్రాంధికంగానే అన్ని పాత్రలినీ మాట్లాడించేరు.

ఇహ వడ్డాదివారి నాటకాలని పరిశీలిస్తే వీరి "చండకౌశికం"లోని చండాలురు కూడా కవులు గ్రాంధికవాదులూ అయేరు. ఇల్లాగే వీరి "వేణీ సంహారం" "మల్లికామారుతం"లో నూను. భట దాసీదాసులకైనా గ్రామ్యం లేదు.

జయంతి భావనారాయణగారి రచనలు కూడా యింతే. వీరి "సంగీతసభ" లో ప్రాతిగామిన్ని "సౌందర్యసతీమణి" లో చేడెలున్ను "ప్రత్యక్ష నారసింహం"లో రాక్షసచారులున్నూ వ్యాకరణ శుద్ధంగా భాష పఠించినవారే.

ధనూరి శివశంకరకవిగారి "జలజాసౌధద్రీయం"లో కరిబలుడు పింగళుడు అనే రాక్షసులు కూడా గ్రాంధికభాషలోనే మునిగి తేలేరు.

ఇంకా చూపించాలంటే కోపల్లి వెంకటరమణ గారి "శ్రీరామవిజయం"లోని కంచుకి, త్రిజటలున్ను, పానుగంటి వారి "సారంగధర" లోని లవిత్రా కంటకులు తలారులున్ను, వేరి కాశీవిశ్వనాధవిద్వత్కవిగారి "పూర్వశాకుంతల" లోని సఖి, భటాదులున్ను, ద్వివేదివారి ప్రద్యుమ్నానందంలోను, పాతాళభేది సుబ్రహ్మణ్యకవిగారి "శ్రీరామపట్టాభిషేకం" లోని శూర్పణఖాదిరఘునాసలున్ను, బులుసువారి "కోసలసామ్రాజ్యం" లోని బాలుకు, శూర్పణఖారాక్షసాదులున్ను, వుప్రమే ఆలీషా గారి "చంద్రగుప్త" లోని చేటీసామాన్యులున్ను, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి "సాహసిక రాజపుత్రం" లోని తురకసైనికులు, భటాదులున్ను, గూడ పాత్రోచితభాషల్లో మాట్లాడలేదు. ఇంకా శ్రీనివాసరావుగారు "హరిశ్చంద్ర" లో కాటికాపరి వీరబాహుని నోట గ్రాంధికంగా పలికించేరు. అందువల్ల కొంపలు మునగలేదు గాని, వాడు చూస్తే మాలాడు. వేషభాషలు చూస్తే ఐదారు నెల్ల దాకా అన్నహితవు తప్పుతుంది. శ్మశానం, శవాలూనూ, వాడు చూసే ప్రకృతి. అల్లాటి వాడు తెగతాగి కుండలు బుజాన్నేసుకుని వచ్చే టప్పుడు. గ్రాంధికంగా మాట్లాడితే ఏమేనా సహజంగా వుంటుందా? అప్పుడు శ్రీలక్ష్మీకాంత కవిగారు పోషించిన వీరభాహుడులా వుండాలి చూడండి.

"తొలిగి పో నిండయ్యా! దొరలు పెద్దింటోణ్ని
తెలిసి సెప్పాపోతే। పలువా పొమ్మంతారు॥తొ॥
పబులు మీకుక్కాల। కట్టి యేస్కొండయ్యా
గభగాభ భొభొ మని। కరవవత్తుం డయ్యి ॥తొ॥
వాచ నం తారూ మా। దోచ మంతారు నే
కాచెంత సరుకేస్గు। కాటి కల్తా వుంటె॥తొ॥"

ఈ పాట పాడుతూ జానెడు చుట్ట నోట్లో పెట్టుగుని తూలుతూ రంగం మీది కొచ్చిన వీరబాహుడే అందంగా వుంటాడో పైవారి వాడే గు

ర్శనిపిస్తాడో చూసే వాళ్ళకే తెలుసు—కస్తూరి నరసింహంగారు కూడా తమ "నవహరిశ్చంద్ర"లో చక్కగా వీరబాహుడిచేత నటింపించేరు. ఇల్లాటి దృష్టి వుండి ఏపాత్రని ఎల్లా నడపాలో తెలిసినవారు కూడా వున్నారు. వీరిలో పెద్దలు గురజాడ అప్పారావుగారు. వీరు "కన్యాశుల్కం" రాసేరు. ఇందులో కథ నిత్యం జరిగే మనుష్యసంపర్కమైన సాంసారిక గాథ లాటిదే కనక అన్ని పాత్రలూ వ్యావహారికాన్నే మాట్లాడతాయి. ఇప్పటి వున్న నాటకాల్లో దీని కొచ్చినంత పేరు దేనికీ లేదు గదా!

రెండో వారు వేదం వేంకట్రాయశాస్త్రిగారు. వీరు "శాకుంతల్లో" బెస్తవాడిచేత.

"బెస్త నోట్టరాపిన బువ్వేదో। బెమిసి పోను గదా
దమ్మిమె గాని కమ్మెమె గాని। తప్పరాముగందా
మేకలు మింగే బేపన రొయ్యకి। మెత్త మణుసు గందా!
ఏకలి సేసిన ఆకలి కోసం। యీాస్రు డొప్పుగం దా!"

ఈ రీతిగా నడిపించేరు. ఇది నిజంగా వినే సరికి ఎంతో జాలిగా వుంటుంది.

ముట్నూరి మంగిపూడి వార్ల "పుష్పవేణి" నాటకంలో భీముడు అనే దొంగ గ్రామ్యంగా గజదొంగలా మాట్లాడేరు. భాషకి తగ్గ భావాలు. కొచ్చెర్లకోటవారి "అపవాదతరంగిణి" లోని సేవకులు దాసీలు కూడా గ్రామ్యంగానే మాట్లాడేరు.

కాళ్లకూరి నారాయణరావుగారి "చింతామణి" లో నీచపాత్రలు గ్రామ్యంగానే మాట్లాడేయి. ఇది కూడా ప్రసిద్ధిలో వున్న నాటకమే అని అందరికీ తెలుసు.

ఇంకా ఇల్లాటిది బలిజేపల్లివారి "బుద్ధిమతీ విలాసం" లోనూ కనిపిస్తుంది. కేశవదాసుగారి "కనకతార" లోనూ వుంది.

/ ఐతే పాత్రోచితభాష వుండా లంటే ఏ వేవా కథల్లో సాయీాబు పాత్ర వస్తే తురకంలోనూ ఇంగ్లీషుపాత్ర వస్తే ఆపాత్రలని ఆభాషలలోనే మాట్లాడించా లనిన్ని ఇవన్ని అర్థం చేసుకునే పాండిత్యం లోకుల కందరికి నటులకి కూడా ఉండా లన్న మాటా? అని ఎవరేనా అనొచ్చు. అయితే యిప్పు డున్న గ్రాంధికభాషా, పద్యాలు, సంపూర్తిగా తూచా తప్పకుండా మనవాళ్ళందరికీ అర్థం అవుతోం దని పైవా రనగలరా? ఇప్పుడందులోనూ పాటలలో రాగాలు, కళలు, సంగతులు చూసి సంతోషించేవాళ్ళే గాని అర్థం సరసంగా గ్రహించే సామాజికు లేరీ? అల్లా అర్థం గ్రహించేవారే సామాజికులైతే "భమిడిపాటి కామేశ్వరావు"గా రన్నట్లు ఓమూల హరిశ్చంద్రుడేడుస్తోంటే శ్రీరాగా లెందుకు కాంభోజి లెందుకు? ఆరునొక్క రాగం ఎత్తక. ఆద్రెస్సుతో వున్న శకుంతల మోకాళ్లు మణిచి కూచుని సడెన్‌గా నాటకం నడుమ అవ్వాలపాట లెందుకు? అప్రసక్తాలైన గ్రామఫోనురికార్డెందుకు? ఇంకా యిల్లాగే పెద్దపెద్ద ఫీలింగ్సు చూపించి నాయకా నాయికలు మూర్ఛపోయేటప్పుడూ "దళమా పర్యాదలో నడంగియు" అనే పద్యం ఆఖరని హరిశ్చంద్రుడు చంద్రమతీ తాము భార్యాభర్తల మని తెలుసుకుని దభాలుని స్టేజి మీద పడేటప్పుడూ గొంతుక చించుకుని ఆ "నన్నుమోర్లు" ఎందుకు బాబూ? ఇదంతా అర్థం చేసుకునే ఆడే భాగోతమే ఐతే నటులు కూడా

"హాతాళమున కేగి బ్రతుకవచ్చు నటన్న"

అనే పద్యం చదివేటప్పుడు రెండు చేతులు పైకి చాపి ఆకాశాన్ని చూపించి "యాక్షన్" చేయడం గూడా అర్థజ్ఞానంతో కూడిందే అనొచ్చు. కనక తెనుగులో ఏసాయీాబు పాత్రేనా పెట్టదలుచుకుంటే వాళ్ళ భాషలో వున్న పదాలనే మన తెనుగు పదాలతో కలుపుతూ తెనుగు ప్రత్యయాలు చేరుస్తూ మాట్లాడిస్తే అందం, ఇహ నీచపాత్ర లేవైనా పెట్టా లంటే ఏజాతికా యాస, మాటలో వచ్చేలా గ్రామ్యంగా నడిపిస్తే సొంపు. అదే ఆడే

టప్పుడు అద్భుతానందాన్నిస్తుంది. చూడండి కవిరాజుగారి "బొబ్బిలియుద్ధం" అందులో హైదరుజంగు గారి ప్రసంగం కథుర్లు. వేదంవారి "ప్రతాపరుద్రీయములో" సుల్తాన్ పోకు మాటలు చూస్తే సందర్భం గోచర మవుతుంది. ఎందుచేత నంటే.

"భావా యే ఉత్తమానాం తు నతాన్ మధ్యేషు యోజయేత్
తే భావా శ్చైవ మధ్యానాం నతాన్ నీచేషు యోజయేత్"

అన్నాడు కనక. ఇల్లాగే ఉత్తమభావా లుత్తములకి నీచభావాలు నీచపాత్రలకి పెడుతూ నీచభావాలకి సాయం భాష కూడా ఉత్తమం కాని దాన్ని పెడితే అప్పుడు మరీ బాగుండొచ్చు కాదూ? ఎంకి పాటలు ఈవుద్దేశంతోనే బయల్దేరేయి. మరిన్ని

"యో దేశభాషారహితం కావ్యం ప్రయోజయేదుష్టం
తస్యా పృథిలేఖ్యః స్యాత్ ఘాత సత్జ్ఞైహి దోషజ్ఞైః"

అన్నట్లు దేశభాష అనగా సార్వజనీనంగా వాడబడుచున్న వ్యావహారిక భాష, అది లేని కావ్యము దుష్టమని గదా పైదాని భావము. కనక పాత్రోచితభాష నాటకాలకి అందం తెస్తుంది.

అల్లా అయితే రాసే నాటకమే మ్లేచ్ఛులది గాని ఇంగ్లీషు పాత్రలతో ఇంగ్లీషు నాటకం గాని అవుతుంది. అప్పుడు మొదటె నించీ తురకభాషతోటీ ఇంగ్లీషుతోటీ రాయా అన్న మాటే. లేకపోతే ఉచితభాష కాక పోతుంది. అలా రాస్తే అది ప్రదర్శించడంలో అందమెల్లా వుంటుంది? అప్పుడు అనువాదాలకి ఫలితం ఉండదే! అన కూడదు. ఆగాధలోనే ప్రధానపాత్రల విషయానికి గ్రాంధికాంధ్రం రాసి తక్కువ పాత్రలకి మాతృకభాషలో వుండే యాస కలిగేలా రాయడమే మంచిది. ఇల్లా రాసిన నాటకాల్లో "ఖిల్జీరాజ్యపతనం, దుర్గాదాసు" మొదలైన వున్నాయి. ఇందులో మొదటిది మ్లేచ్ఛగాధ. రెండోది హిందీ గాధ. ఈరెంటిలోనూ నేను చెప్పినట్లే పాత్రలు నిర్వహించబడ్డాయి. ఆంధ్రులకి కూడా అర్థం అయే లాగ నీచపాత్ర భాష వుంది. ఇల్లా రాసినందువల్ల నాటకం స్వభావసిద్ధంగా వుండి సామాజికులకు రసోత్పత్తి కలగచెయ్యడంలో అభ్యంతరం లేదు. "బొబ్బిలియుద్ధం"లో బుస్సీదొర యింగ్లీషు మాటలు విసురుతూ చక్కగా మాట్టాడేడు. కనక నాటకకర్త అందరూ భాషలో పాత్రపోషణం చూచుకుంటూ ప్రదర్శనానుకూలంగా ఏగాధలు రాసినా అందము తప్పి ఉండదని నా మనవి—

ఇంకో మాట. మన లక్షణకర్తల్లో సరసులు కూడా గ్రామ్యాన్ని పాత్రోచితంగా వాడవచ్చని చెప్పేరు.

"అధమప్రకృతిషు గ్రామ్యోక్తి ర్గుణః"
"గ్రామ్యం తత్ర ద్విధా సాధు"
"గ్రామ్యంబు తత్తజ్జాతివర్ణంబులం బ్రయోగార్హంబగు"

పైవాటిని పట్టి శిష్టప్రయోగాలు లేనిదే వారల్లా చెప్పరు గదా? ఆసూత్రాలకింద ఉదహరించిన ప్రయోగాలు కూడా పెద్దవాళ్లవే. చూడండి.

"నూనిసినా మేలు బాగెము, సేసినాము"

ఇది యయాతి చరిత్రలోది. గ్రామ్యజనం రాజుగారి దర్శనం చేద్దాం మనే సందర్భంలో అనుకుని మాట లివి. ఇల్లాగే మనుచరిత్రలోనూ వెంకటాచలమాహాత్మ్యంలోనూ సారంగధరచరిత్రలోనూ కూడా ఈపాత్రోచితభాషే వాడబడింది. వారు రాసే రనే కాకుండా ఏపాత్రని నాటకాల్లో ఎల్లా మాట్టాడిస్తే బాగుంటుందో ఎవరికి వారే ఆలోచించొచ్చు. దానితో పాటు కాలపరిస్థితిని జనుల రుచిని అనుసరించి అందులో అనుచితాన్ని బహిష్కరించి నాటకాలు రాస్తే అవి లోకంలో ప్రసిద్ధికెక్కి ప్రదర్శింపబడి నాటకత్వానికి సార్థకత్వం సంపాదిస్తాయి. ఇంతే నా వుద్దేశం—

కొత్త పాత కవిత్వాలు

దువ్వూరి సూర్యనారాయణమూర్తిగారు

"గుణదోషౌబుధా గృహ్ణన్ ఇందుక్ష్వేళా వివేశ్వరః
శిరసా శ్లాఘతే పూర్వం పరం కంఠే నియచ్ఛతి"

అన్నట్లు ఓ గ్రంథాన్ని గాని ఓ వాఙ్మయవిషయాన్ని గాని ఓ సాంఘికవిషయాన్ని గాని నిష్పాక్షికంగా విమర్శించవలసివస్తే అందులో గుణదోషాల్ని రెండింటిని తీసుకొంటూ గుణాలనే చాటుతూ. దోషాలని మనస్సులో పెట్టుకుని వూరుకోవడమే పండితలక్షణం. అయితే నిష్పాక్షికానికి అర్థం ఏమిటని అంటే కుండ బద్దలుకొట్టినట్లు మొహంమీదే చెప్పమని గాను. మొహమాటాలు మోక్షాలూ వదలుకొని దోషైకదృక్కుతో రంధ్రాలనే యేరి ఆవిష్కరించమని కాదు. కొంత కాలానికైనా ఎవరి తప్పు వారే దిద్దుకో మంటుంది. కనక "నొప్పించక తా నొవ్వక తప్పించుక తిరుగువాడు ధన్యు"డనే రకంలోకి వస్తే లోకానికి విరుద్ధంగా వుండదని నా వుద్దేశం. ఒకరి ఆశయాల్ని ఒకరి నియమాల్ని ఒకరి రుచుల్ని పట్టి లోకం అంతా అల్లాగే నడవాలంటే అది అస్వాభావికంగా వుంటుంది. "లోకో భిన్నరుచిః" కాదు మరీ!

ప్రబుద్ధాంధ్రలో పడ్డ "తెలుగువారిదేశ భాషాభిమానం" అనే వ్యాసం రెండుమూడు సార్లు చదివేను. అది వ్రాసినవారు బులుసు వెంకటరమణయ్యగారు. వీరు నాకు చిరపరిచితులు. స్నేహకోటిలోవారూ అవడంచేతనున్ను, వారి ఊహల్లో నాకు అభిప్రాయభేదాలుండడంబట్టిన్ని దానిమీద మామిత్రులతో కొన్ని విషయాలు చెప్పదలచుకొన్నాను. లోకానికి మాత్రం కాదు సుమండీ! ఎందుచేతనంటే ఎవడి స్వేచ్ఛకి ఎవరు శాసకులు. మాటవరసకి మనం అనుకోవలసిన మాటలు గాని యివన్నీని—

ఓదాన్ని పూర్తిగా నిరసిస్తున్నామంటే ఆ బాపతు పుస్తకాలన్నీ బాగా చదవాలి. వాటిల్లో భావాల పొందిక మనస్సుకి అందచేసుకోవాలి. అప్పుడు పూర్వానుభూతాల రుచి ఈకొత్తరుచికన్న వెగటా తియ్యనా అనేది ఆలోచించుకోవాలి. అప్పుడు ఈవిషయాల్లో పాతవి బాగున్నాయి, ఈ విషయాలు కొత్తలో బాగున్నాయి అని నిరూపించాలి. అంతేగాని ఎవడో పుల్లాయి రాసేడని ఒకథ మరో యెల్లాయి రాసేడని మరో ఘట్టం చమ్చువి ఏరి వాటిని పట్టి వాఙ్మయానికి కవులకీ బలాదూరెట్టడం అదో మోస్తరు దాంపత్యం లా వుంటుంది.

ముఖ్యంగా ఈపాతక్రొత్తకవిత్వాల్లో మార్పు దేశకాలపాత్రాల్ని, మనవంటి వాళ్ల రుచిభేదాన్ని అనుసరించి బయల్దేరుతోంది. అందుచేతే అందుల్లో కొన్ని విషయాలు విరుద్ధా లయినా మామిత్రుల వుపన్యాసంలోని నాల్గవ పేరా మొదలు తొమ్మిదో పేరా వరకున్న కొన్ని సంగతులు నిజాలే. పరిచయం మనకి తక్కువవడంచేత మన కవి అసంభవా అవచ్చు.

అసలు వీరి మొదటి విసురు. "ఉదారాదర్శంగా సంస్కృతాన్ని గ్రహించి దాన్లోలాగ రసప్రధానగ్రంథాలు తెనుగులో లేకపోవడం లోటే" అనే దానిమీద పడింది. కొన్ని విషయాల్లో ఈ మాట నిజమే గాని అంతకన్న రసప్రధాన మైన గ్రంథాలు తెనుగులో ఉన్నా యని అనాలి. పాండిత్యప్రకర్షే కనపరుచుకోవాలి. కవిత్వం అంటే అదే అనే దృష్టితో సంస్కృతం వాళ్ళూ వాళ్లని అనుసరిస్తూ తెనుగువాళ్ళూ కూడా పడడం చేత రసదృష్టి తగ్గి కథాప్రధానంలోను శబ్దాడంబరాల్లోను విచిత్రయమకబంధాల్లోనూ పడి కాఠిన్యానికి తావిచ్చేరు.

ఇహ తెనుగువాళ్లు ఆశ్రితుల వంశాలు అతిశయోక్తులతో నింపకపోతే యెల్లాగ? వీరు రాయడం గూడా కొంత స్వలాభాపేక్షతోనే. ఏపోతన మహాశయుడో తక్క మిగిలిన మహాత్ము లంతా పెళ్ళాంపిల్లల్ని పోషించుకోడానికే కవిత్వాన్ని చిల్లరక్రింద మార్చుకుని వాడుకొనేవారు. నాటనించి నేటికి ఏ వుద్యోగంకోసమో ప్రయత్నిస్తున్నా మంటే ప్రసిడెంటుగారి మీద "నీకళ్ళు చిన్నవి నీముక్కు పెద్దది ఉద్యోగమిప్పించవోయి దేవ!" అని "నాకు డబ్బీయవోయ్ నలిననేత్ర! అని గాని పొగడడం చాలామందికి అలవాటు. అల్లాటివి పుస్తకాల్లో వుంటేనేగాని కృతిభర్తలకి తృప్తి కలగదు చూడండి. ఇహ ప్రతాపరుద్రీయం లాటి గ్రంథాల్లో లాగ ప్రతీ పద్యంలోనూ గూడా వర్ణించకపోవడం తెనుగుప్రబంధాల్లో ఓసుగుణమే.

ఇహ "అతిశయాలు అంకితాలు షష్ఠ్యంతాలు కాళిదాసాదికవులలో లే వని" అన్నారు. అబ్బో దారితీసిందే కాళిదాసుగారు ఈవిషయంలో. అసలు షష్ఠ్యంతా లంటూ వుంటే దాన్లోనే అతిశయాలు అంకితాలు గర్భితంగా వుంటాయి. రఘువంశం మొదటి సర్గలో—

"సోహ మాజన్మశుద్ధానా మాఫలోదయకర్మణాం
ఆసముద్రక్షితీశానా మానాకరథవర్త్మనాం"
యథావిధిహుతాగ్నీనాం యథాకామార్చితార్థినాం
శైశవేభ్యస్తవిద్యానాం యౌవనే విషయైషిణాం
వార్ధకే మునివృత్తీనాం యోగే నాంతే తనుత్యజాం"

ఇల్లాగే ఇంకొను. మచ్చు ఇది—ఇల్లాటివే మన తెలుగువారికి తెన్ను చూపించేయి తప్పకుండాను. అన్నీ నిజాలు కాకపోబట్టి మామిత్రుల వ్యాసంలో ఐదో పేరాలో చెప్పినట్లు కోతలు పరమకోతలూ కూడా పైషష్ఠ్యంతాలలో వున్నాయంటాను. ఇహ సప్తమ్యంతాలు మాత్రం ఎక్కడా లేవు. షష్ఠ్యంతా లైనా కాళిదాసుగారు ఐదంటే మన తెనుగువారు మరో నాలుగు రాసి స్వతంత్రించేరు. ఎత్తి పారెయ్యడం ఎవ్వరికీ తప్పలేదు. ఈ విషయాలు మాత్రం ఆధునికకృతులలో ఎక్కలేదు.

"ప్రత్యేకత్వం కోసం దేవులాడుతున్న ఇప్పటి రకంవారీలచే భావం ప్రధానంగా" అని వ్రాసిన దాన్లో నాలుగుపాదాలూ ఒకే అనర్థసంస్కృత సమాసంగా వున్న ఆధునికకృతులలో పద్యాలని తీసి మామిత్రులు చూపిస్తే పేరున్నవాట్లలోంచి వాట్లలో భావం ఉన్నదీ లేనిదీ కొంత తంటాలుపడి తెలుసుకొని ఐనా చెప్ప సాహసిస్తాము. అప్పటికీ "నలనాలీకమృణాలనాలలతికానవ్య ప్రణాళీమిలల్లల నాలాపకథాసుధానురసలీలాలోలచేతస్క" లాంటిసమాసా లుంటే మేము మాత్రం తప్పకుండా నిరర్థకపదాలు చాలా వున్నా యని వప్పుకోమూ? అంతేగాని పూర్తిగా భావం లేదనిమాత్రం అనడానికి సాహసం చాలదు. ఎంచేత నంటే "నహి సర్వ

స్వర్వం జావాతి'' కనుక. అల్లాటి దీర్ఘ సమాసాలున్నా అచ్చతెనుగే బాగా నేటి వాఙ్మయంలో వుందని చెప్పడానికి వెనకడుగు పడదు. అయోమయమైన భావానికే ప్రాధాన్యం ఆధునికు లిచ్చేరంటే ఆ అయోమయం మనబుద్ధిలోని కాదు గదా? అని కొంత ఊహ ఉండాలి. తప్పదు. ఆ తరవాత అడిగి తెలుసుకోవడం ముఖ్యం—

ఇంక అతిశయోక్తుల విషయం మాట్లాడితే మామిత్రుల దృష్టి ఆధునిక కావ్యాలలో విసుగు కలిగించేలా వుందని ఫలితంగా చెప్పేరు. కావ్యానికి సొగసు తెచ్చేదే యీ అలంకారంట. ఇది పాతలోనే వుందనడం చాలా పొరపాటుట. అసలు అతిశయోక్తిని రెండు రకాలుగా విభాగిద్దాం. వ్యక్తిగతం ఒకటి, ప్రకృతిగతం రెండూను. ఈ రెంట్లోనూ పాతలో పాడైనచోట్లున్నాయి. అందమైన ఘట్టా లున్నాయి.

డబ్బే ప్రధానంగా కవిత్వదుకాణాలు పెట్టడం చేత ఏగట్టులంక వేసుగనే రాజుగార్నో తీసుకొని లేనిపోని ఉత్ప్రేక్షలు అతిశయోక్తులు కల్పించి ఆబండితోటే రాజుగారికి శరీరంమీద ఎల్లాగో ధీరోదాత్త లక్షణం పూసి అలంకారపుస్తకాలకి అడ్డు లేకుండా కావ్యప్రశస్తి చెడకుండా. రాయడం ప్రాచీనులలో కొందరి ఆచారం. చేనుకి నీరెట్టుగునేటప్పుడు అడ్డొచ్చిన పదిమంది పంచమసోదర్లని పడతన్నిన కలంధోరగారైనా వారు మహాఘోరసంగ్రామాలు చేసిన చక్రవర్తిశిఖామణులు. వారి కొంపలు పర్ణశాలలైనా అవి చేసే పని "లిఖంతి విధుమండల" మే. తిండితిప్పలేక చావడానికి సిద్ధంగా వున్న రెండేనుగులు మూడు కంచరగుఱ్ఱాలు వుంటే చాలు ఇహ వాటి మదధారలతో కొత్తగా కాలవ విడిచిపెట్టినప్పుడు భూమి అంతా తడిసినట్లు తడిసి అంబలైపోయి ఆబాడి మార్గస్థులని దించుకుపోయాలా చెయ్యడమే.

శతం నాశం లేని పదిమంది నౌకర్లు పనిపాటలుం చేయడానికి కొంపలో వుంటె వాళ్లే మహాసైన్యాలయిపోయి వాళ్ల నడకలకి రేగిన బూడిది సూర్యచంద్రమండలాన్ని కప్పడమే. ఏమష్టివాడి కేనా గుప్పెడు బియ్యం పెడితే యీ బకశబ్దం లేకుండా ఇహ ఆయన భూమి నుద్ధరించే రాజే. వారు పరుండేది దూడిపరుపైనా అది బంగారందే. వారు తినేది అన్నమైనా సువర్ణద్రావకమే. లేకపోతే డబ్బెల్లా వస్తుంది బాబూ?

ఇంక ప్రకృతిగతాతిశయోక్తులని చూస్తే పైవాటిని మించిపోవలసిందే. మేడవిషయం చెప్పేను గాదు? ఇల్లాగే తోటలు వర్ణించాలంటే ప్రపంచకంలో మహారణ్యాల్లోను దేశాంతరాల్లోను గాని బతకని "సరళతమాలతాలహారిచందనచంపకనారికేళకేసరకదలీలవంగపనసక్రముకార్జునకేతకీలతాగురుఘనసార" తుమ్మ వెలగ బూరుగ మఱ్ఱి జిల్లేళ్లు మొదలైన అద్భుతమైన తుక్కూ ఆ తోటలో నాటవలసిందే. ఇవి ఆనాటివారికి రుచించినట్లు మన ఇప్పటి వారికి రుచింపవు. వీళ్ల కెంతసేపూ ప్రేమతో పెంచుకొన్న సంపెంగ పొదలు, ఉల్లమిడి పెంచుకొన్నట్టి మల్లెతీగలు బిళ్లగన్నేరు వకుళ కేతకి రేరాణి గులాబి చేమంతి మొదలైన అందమైన మొక్కలే పాతుకుని సంతోషిస్తారు. ఇల్లా అన్నానని చెప్పి ఇల్లాటివి ప్రాచీనాల్లో లేవనడం కాదు. కాళిదాసు పువ్వులతోటలు కమ్మగా వుంటాయి. విజయవిలాసాన్నైనా తారాశశాంకవిజయాన్నైనా తీసుకుని ఇహ ప్రబంధాలన్నీ ఇదే రకం అని తిట్టడం చాలా తప్పుమాట. మొత్తం సకటు మీద మాట వ్యక్తిగతంగా కూడా భావకవుల అతిశయోక్తులు మానవత్వాన్ని అతిక్రమించవు. అల్లా రాయకపోయినందువల్ల వీరికిబ్బందులు లేవు. వీరిపుస్తకాలు స్నేహధనమును గాని ప్రేమధనాన్ని గాని ఫలంగా అపేక్షిస్తాయి కనక ఒహర్ని "ఏతావానస్య మహిమా" అనడం గాని, కోపంవచ్చిన

మహాత్ములను పడబూతులు తిడుతూ శతకాలు దస్కాలు రాయడం గాని వీరికి అనవసరం. ఒక వేళ సంప్రాప్తించినా యెదిరివ్యక్తి తన జీవితంలో మెరిసిన రెండు మూడు నిజమైన సంగతుల్నే సహజంగా చెప్పవలె గాని అభూతకల్పన లుండవు ఆయన గుణాల్ని వర్ణించలేక శేషుడు పరిగెత్తడు బృహస్పతి తలొంచుగోవడం గాని షణ్ముఖుడు సన్ముఖుడవడం గాని చతుర్ముఖుడు దుర్ముఖుడవడం గాని వుండదు. చంద్రుడు గుంపిన అప్పలరాజుగారి కీర్తిలతాకుసుమం కాదు. సూర్యుడు తాతరాజుగారి తేజఃపుంజం కాదు. ఇంకా కీర్తులు బయలుదేరి మసిబొగ్గు తారు కాటికలాంటి నల్లవస్తువుల్ని తెలుపు చేయలేదు. ఇల్లాంటిది పెద్దల వాసన. అయితే యివన్నీ తప్పు లనిగాదు నామాట. ఆకాలాని కవ్వి రుచించేయి. రెండు పుంజీల వందల సంవత్సరాల నించి "పాడిందే పాటరా" అన్నట్లు ఆభావాలే ప్రతిదాల్లో చదువుతోంటే వెకటించదు? రెండు రోజులు వరసగా ఇంటోది పెసరపప్పు పచ్చడి చేస్తేనే రోజూ వెధవ పచ్చడేనా? అని చావ తిడతామే? కొత్త వింత పాత రోత అని మనవాళ్లు ఊరికే అన్నారూ? ఎన్నాళ్లు ఆచిరుగుగుడ్డలు కట్టుకోవడం? ఓగుడ్డలో నేనా మానం కాపాడేటంత జాగా వుంటేనా? బట్టబయలు.

మరిన్ని రసవిషయం ఎత్తేరు. ఎత్తి ఆధునికకవిత్వాన్ని తిట్టేవా రని మాటలే మామిత్రులు కూడా అన్నారు. ఆపేరా చివర " శృంగారం ప్రాచీనులలో ఎక్కువ వుం దంటారు. ఇప్పటివారు ఆరసం తప్ప మరోదాన్ని కావ్యాలలో వర్ణించరే! ఇది మహా బాగుంది కామోసు" అని అన్నారు. ఏం? ఎందుకు బాగుండదు? ప్రాచీనశృంగారం ఆధునికశృంగారం ఓలాగే వుంటుందా? నిజంగా ఈవిషయం పుస్తకాలలోంచి ఎత్తి వ్రాస్తే ప్రాచీనులలో ఆడదీ మొగాడు అందుకే పుట్టినట్లున్న అందులో ఆడదాని వర్ణన వస్తే చాలు ఆమె తల్లిలాటి దేవతైనా సరే కచకుచజఘనవర్ణలతో కాళ్లదగ్గరనుంచి వెంట్రుకలదాకా నో తిరగమరగేశో వర్ణించేయ వలసిందే! ఆవర్ణనలోను బాహుమూలరుచులతోను పెనుగబ్బిచనుదిబ్బలతోను క్రంగన వాగు గుబ్బలతోను త్రాచుపాము లాంటి నూగారుతోను ఇసకతిప్పలతోను రంభలతోను ఆవర్తాలతోను నిండిపోవలసిందే. ఈక్రమం ఎవ్వడు తప్పినా ఇహ వాడికావ్యం అధమాధమక్క తన్నమాటే. అక్కడికిగాని అపూర్ణశృంగారరసంలో స్త్రీ తాండవించదు. పూర్వం రాసేవాళ్లు పురుషులే గనక తమ రహస్యస్థానాలని వర్ణించుకోలేదు. అరుదుగా వున్న అప్పటి కవయిత్రులుకూడా కవిరాక్షసులకి జడిసో మరేమో పాపం వారికిమల్లే వీరు తెగించలేరు. తెగించి రాయడం ప్రారంభిస్తే ఆడశృంగారం మొగశృంగారం కలిసి బ్రహ్మనిష్పత్తి కలగవలసిందేమటి. ఇల్లాటిదిగదా పెద్దల ప్రబంధమార్గం—

ఆధునికులది ఇంతకన్న చాలా నాజూకని తప్పక వప్పుకోవాలి. ఎంత సభ్యమో అంతే రాస్తారు. అతి ఐతే రసాభాస జుగుప్స తప్ప మరే ముంది? ఇంక శృంగారమే తీసుకుందికి కారణం ఏమిటంటే? ఇది రసరాట్టు గాదు మరి? అదీగాక అన్నిరసాలకంటె దీంతో మనుష్యుల కున్న సంబంధం ఎక్కువ. దానిలోవున్న హాయి మరోదానిలో లేదు కనక దీనిలోనైనా కశ్మలం తీసి పారేసి సభ్యమైన శృంగారాన్ని రాయడంలో తప్పేమిటి?

" కవితన్నే నాయకుడిలాగ స్పష్టపరుచుగుంటాడు. నాయకుడికి లాగ కవి కూడా శృంగారరసపిచ్చి యెక్కువవుతుంది" నిజమే. అల్లా కవి ఎప్పుడు నాయకుల్లో లీనమయ్యేడో అప్పుడే తద్గతవీరం గాని శృంగారం గాని విషాదం గాని ఫోర్సుగా కవిత్వంలోకి కలంగుండా జారడం. మైలరాళ్లు పాతుకుంటూ రాసే ఛందోబద్ధం మాట లన్నీ కవిత్వం కాదు కపిత్వం గాని. దీనికి తార్కాణం ఏమిటంటే? శృంగారరసపిచ్చికి కాళిదాసుగార్ని శోకరసపిచ్చికి భవభూతిగార్ని గాని తెనుగులో ఈతణ్ణి మించిన కంకంటి పాపరాజు

గాన్ని గాని సైన్యంలో పోతన్న గారి "లానొక్కింతయు లేదు" గాని ఓమాటు తలుచుకుంటే "అపి గ్రావారోది త్యపి దళతి వజ్రస్యహృదయం" ఇల్లాగే క్రోధంలో వేణీసంహారంలో భీమన్న గారి "మథ్నామి కౌరవశతం" ఇల్లాటివి భావిస్తే తన్మయత్వం లేని కవిత్వం తంపటదాలికే లా కనిపిస్తుంది. ఇల్లాటి వాటినే బొమ్మకట్టు కవిత్వా లంటారు. ఏభావం పద్యంలో రాస్తే ఆబొమ్మ కళ్లకి కట్టాలి. అప్పుడు కవి తన్మయు డవడం ఒక విధమైన పాంగు తెచ్చుకోవడం అవసరం. ప్రాచీనకావ్యాలలో లేశాలు గాను విరళం గాను వున్న దాన్ని మజ్జిగ మీద వెన్నపూసలాగ నివిరి పోగేసి అక్కడక్కడ ఇల్లాటి ఘట్టాలు తగులుతే వచ్చే సంతోషాన్ని ప్రారంభించింది మొదలు అనుభవింపచేద్దా మని ఏ విషయం చెప్పేటప్పుడు తద్గతభావాలతో ఐక్యమైపోయి రాయబడే కవిత్వం నేటిది. ఈతన్మయత్వం ప్రాచీనాల్లో అసలే లే దనడం ఆధునికాలని ఆక్షేపించి నట్లే. ఇల్లాటి మాట అదీ యిదీ చదవని అర్థనారీశ్వరులది—

"ఇల్లాటి కవిత్వా లన్నీ వాఙ్మయానికి పురోభివృద్ధికే మూల మంటూ కొందరి యువకుల ఆశయం" అవును. కాకిపిల్ల కాకికి ముద్దు. పుట్టిన పిల్ల లంతా డిప్టీ కలక్టర్లు, డియంవోలు అవుతా రనే తండ్రి పెంచుతాడా? ఏవడ్లగింజో గొంతుకలలో వేసి మర్గయా చేయకూడదు? తుప్పూ ధూళీ పట్టి బూజుకట్టిపోయిన పదరత్నాలనీ భావమణులనీ వృత్త ముత్యాలనీ తీసి మెరుగెట్టేడు. పాతలో యివి నూటికీ కోటికీ గాని దొరకవు. కష్టపడ్డాడు ఏర్చి కూర్చేడు వాఙ్మయోపకారం అయితే ఔగాక. అంతే గాని వాఙ్మయాన్ని పాడుచెయ్య లేదు గదా? ఓపిసరేనా ఉపకారం చెయ్యదా?

"ఇప్పుడు కొంతమంది నెలపిల్లలు కూడా కవయిత్రులు కవీశ్వరుళ్లూ అయిపోయి పత్రికల కెక్కుతున్నారు" తమకా కడుపుబ్బు ఎందుకు మిత్రమా! దినదినము మన సంఘంలో జ్ఞానజ్యోతి అభివృద్ధి అవుతోం దని సంతోషించవోయ్. కవిత్వం రాస్తే నేనే రాయా లని బొడ్డుకోసి నువ్వే పేరెట్టుగున్నావా? బాగుండవచ్చు బాగుండకపోవచ్చు. ఇది రంకూ బొంకూ కాదు గదూ? సమృద్ధిగా పత్రికలున్నాయి. వేనీ ఎడిటర్సుని మేం ఎరుగుదుం. మూకు బంధువులే వారు. "అన ననగ రాగ మతిశయిల్లుచు నుండు" నాయనా విచారించకోయ్. తిట్టకోయ్! అని నాకో మిత్రుఁ డిచ్చిన సలహా. "న ధర్మవృద్ధేషువయః సమీక్ష్యతే" కనక ఏపుట్టలో ఏపాముందో?

"ఒక చిత్రం ఈమధ్య"

తల్లి:—నాన్నా! మంచి వస్తి యిలా పాడిచేస్తే ప్రకృతి శ్మశానం ఐపోదూ?

బాలుడు:—అమ్మా! చమించాలి. ఎరగక చేచేను—

విసుగ్గా తల్లి రుసరుసలాడుతూ వొచ్చి కొడుకుమీద ప్రేమతో చేష్టాకోపం మాటలోకి దింపి ఊతంగా "నాన్నా మంచి వస్తి పాడుచేసే" అనే సరికే పాడుచేసే వస్తువు అక్కడ పారేసి ఉలికిపడి దిగ్గున లేచి పిల్లవాడు పైమాట అనడం స్వాభావికమే. అప్పుడా పిల్లాడికి ప్రకృతి శ్మశానం సంగతి తెలియనక్కర్లేదు. ఎంచేత నంటే చేసేది తప్పు పనిగా? ఆపని చేస్తూ ఏసందునించి అమ్మొస్తుందో అని కని పెడుతూనే ఉంటాడు ఆకుఱ్ఱ. ఇల్లాగే పిల్లలు మనం మాట్లాడే మాటల కన్నింటికి అర్థం గ్రహిస్తారు. చూడండి. కృష్ణుడు నాలుగేళ్ల పిల్లాడే. "నాన్నా! మన ఇంట్లో బోషాణం దగ్గర పుస్తకం పెట్టుగునే వ్యాసపీట మీద నాపెద్ద లావు పుస్తకం భాగవతం ఉంది. ఇల్లా పట్రా" అంటే పైమాటలలో పిల్లాడు గ్రహించేది పుస్తకం పెట్టుగునే పీట పెద్ద లావు పుస్తకంను. అవ్వే కళ్లకి కడతాయి ముందు. పట్రమ్మనే చెయ్యూపులో గ్రహించి దాన్ని తెచ్చి అన్న కిస్తాడు. అంతే కాని ఆపీట వ్యాసపీటో వసిష్ఠపీటో ఆపుస్తకం భాగోతమో తోలుబొమ్మలాటో వాడి కేం తెలుస్తుంది? అల్లాటి

మాటల్ని గాని పనుల్ని గాని చూస్తే మామిత్రులు రాసినట్లు ఆశ్చర్యం పడాలి. ఆనంద పడాలి అంతేనే గాని విచారించడం అనవసరం. ప్రకరణం అది గాను కనక—

ఇంకా మంచి చూపించా లంటే చాలా వుంది. కొత్త కవులలో గాని, వారి గ్రంథాలలో గాని "సరసాగ్రేసరకూచిమంచికుల భాస్వద్వార్ధి రాకాశశిన్ సిరకీర్తిన్ బహుశాస్త్రలక్షణమహాధీమంతుండన్" అని గాని "ఇది శ్లేషయమకచక్రవర్తిత్యనేకబిరుదాంకితచతుర్విధకవితాధురీణ" అని గాని చేసుగునే స్వకుచమర్దనలు ఉండవు. ఏదేనా రాయడానికి ప్రారంభిస్తే దాని కంటె ముందు ప్రతీ ప్రబంధకర్తల కలలలోనూ వాళ్ల తాతలో ముత్తాతలో కనపడి రాయ మని చెప్పడం ఒక అలవాటు. ఇది ముందే భారతకవులకో నిజంగానో కాదో జరిగి ఉంటుంది. ఇహ శతాంధన్యాయంగా అందరూ అంతే. ఇల్లాటి కలత నిద్దర్లు ఇప్పటి వారికి లేనేలేవు.

ముత్తంమీద మంచి చెడ్డలు విమర్శిస్తే రెండింటలోనూ వున్నాయి. అభిమానం గల దాన్ని ఎత్తేసి రెండోదాన్ని తిట్టడం విమర్శకలక్షణం గాదు. ప్రపంచం అంతా మారేటప్పుడు కవిత్వం కూడా మారాలిసిందే. ఐతే కొత్తదారి తయారు చేస్తున్నప్పుడు చెత్త చాలా వోస్తుంది. దాన్ని ఎల్లాగో సహించడం మంచిది. తండ్రి చెప్పినట్లు కొడుకులే వినని కాలంలో నే చెప్పినట్లే మీ రందరూ వినాలంటే వినేవా రుంటారా? వింటే చివరకి స్వరాజ్యం లా తయారౌతుంది లోకం. కనక సాధ్యమైనంతలో మంచినే తీసుగోండి. చెడ్డ చదవకండి. రాస్తున్నా రని తిట్టకండి. కొసకి నిగ్గే నిలుస్తుంది. పూర్వగ్రంథాలిని తిట్టొద్దు. ఇప్పటివాటిని తిట్టొద్దు. కొత్త కవిత్వంలో కొత్త లేదనడం లోటే. ఈ కొత్తచ్ఛాయలు ప్రాచీనులలో అక్కడక్కడ లేవండం లోటె. చూడండి—

"జలకము లార్చి పాండుజల
జచ్ఛదపాళికఁ గప్పి తమ్మిసం
కుల తెలిదేనె లుగ్గలిడి
క్రొందరగల్ కదలించు కల్వలో
కెలల కుమారు కూతురు ఘు
టించి భజించు నదీలలామ కో
మలకుముదాగతాళి కుల
మంజూరవంబున పాటపాడుచున్"

"తనకుం గౌగిలి యీ వోకప్పుడును నా
థా నికరస్పర్శనం
బున గిల్గింతలె యంచు పద్మిని కరాం
భోజంబున న్మందమం
దనటద్వాయుచలద్దళాంగుళులు గ
న్పట్టంగ నవ్వేల్గురా
యని రారా యని బిల్చె నా దగ ద్విరే
ఫాద్యంతదీర్ఘ ధ్వనుల్"

అని వ్రాసేరు. ప్రాచీనులలోని గంపలకొలంది పద్యాలలో ఈ పైలాటివి అన్ని విషయాలలోనూ భేదాన్ని చూపిస్తూన్నాయి—

"త ఏవ పదవిన్యాసా స ఏవార్థ విభూతయః
తదాపి నవ్యం భవతి కావ్యం గ్రధనకౌశలాత్"

అన్నట్లు కూర్పునేర్పు చేతను, హృదయపరిపక్వముల చేతను, దివ్యానుభూతులతోనూ, ప్రతిభావిశేషంతోనూ, నిర్మించిన కవిత్వశిల్పం గుండెను తాకుతుంది. అల్లాటి దాన్ని విన్నప్పుడే సహృదయుడు కంట నీరెట్టడమో, వేడిరక్తం ఉప్పొంగి రౌద్రమూర్తి అవడమో, కరుణామూర్తి అవడమో తటస్థిస్తుంది—

యత్సంరభః కృతివిరచనే
సత్కవీనా మభేద్యో
యచ్చైకాగ్ర్యం తదుచిత పదా
న్వేషణే చిత్తవృత్తేః
లభ్యం తచ్చే దపి కవయతా
మంతత స్త్రీణ్యా హాని
స్యా దేవం కిం సరసకవితా
రాజ్యదుర్భిక్షయోగః

అని ఓమహాత్ముఁడు చాలా విచారించేడు—

రసరాద్ధాంతం

దువ్వూరి సూర్యనారాయణమూర్తి
[శ్రీ నవ్యసాహిత్యమండలి]

యువవై శాఖభారతిలో శ్రీ పాటిబండ మాధవ శర్మగారు ప్రకటించిన కొత్త రసపరిష్కారమును చూచినాను. ప్రబుద్ధాంధ్ర లోని హనుమచ్ఛాస్త్రిగారి ప్రేమతత్వపరామర్శకు ఇది అవమర్శ రూపమైన ఒక వింత వాదము.

దేవగుప్తాపు విశ్వేశ్వరరావుగారు ప్రేమ నిర్వచనమాత్ర సందర్భం తీసుగుని శాస్త్రిగారి విమర్శలేశాలను పోందియే ఉద్ధరించుకున్నారు.

కాని,— శర్మగారుమాత్రం మల్లాది శాస్త్రులవారి వాదప్రకారము నట్లుంచి వారి సిద్ధాంతౌచిత్య భక్తివల్ల ఒక అపోహకు పాలుపడ్డారు.

అసలు సగంసగం తీసుకుని విశ్వేశ్వర రావుగారు శాస్త్రిగారి విమర్శాంశాల ఉద్ధరిస్తే అసలే వారి 'రివ్యూ' చూడకుండా శర్మగారు శాస్త్రిగారిమీద అవమర్శకు దిగేరు. ఇది పరిష్కర్తల మొట్టమొదటి లోపం.

చూడండి. ఇవి ప్రబుద్ధాంధ్రలోనిశాస్త్రి గారిమాటలు: "ఈప్రేమవలన నవరసములు పుట్టునట. ఈ అనుగమము అప్రసిద్ధము. ప్రేమను స్థాయిగానుంచి రసములను సాధింప చూచినారు. కాని బీభత్స, భయానకాద్భుతములందు ముఖ్యముగా నీ యనుగమము కుదరదు......ఇందులో ప్రాబంధికపు టనుగమము సిద్ధింపచెయ్యాలని చాలా ఉబలాటపడ్డారు."

పరిష్కర్తలు హనుమచ్ఛాస్త్రి గారు వ్రాసినవిగా భారతిలో నుదాహరించిన మాటలు "ఇది కావ్య మెంత మాత్రము కాజాలదనియు, రసము లన్నియు ప్రేమ మూలకములను శాస్త్రులవారి సిద్ధాంతము కేవల సత్యదూరమనియు వ్రాసినారు."

దీనినిబట్టి శాస్త్రిగారి వాదప్రకారమును పరిష్కర్తలు గుర్తించలేదని స్పష్టంగా తెలుస్తున్నది. అవిచారిత రమణీయమైన పరిష్కర్తల పరిష్కారం పరామర్శించడంద్వారా శాస్త్రిగారి "వాక్యములందలి శుద్ధిని" నిరూపింప దలచి ఈవ్యాసం వ్రాస్తున్నాను.

వాదమర్యాద ననుసరించి పరిష్కర్తల వాదముయొక్క సూక్ష్మశరీరమును ఇక్కడ చూపుతున్నాను.

౧. నిర్గుణరూప (Neutral) శాంతాపరపర్యాయిక, వినిశ్చల తత్వపు వికారం ప్రేమ.

౨. దీనికి ప్రవృత్తినివృత్తు లున్నవి.

3. ఆ ప్రవృత్తినుంచి నాలుగురసములు, నివృత్తినుంచి నాలుగురసములు పుట్టును.

"ఇట్లు పరిశీలించుటవల్ల శాంతము మూలరసమనియు, దానినుండి బయలుదేరినవే శృంగారాదులగు ప్రవృత్తి రసములు, కరుణాదులగు నివృత్తిరసములు ననియు, సర్వరసములకు కారణము ప్రేమ యనియు తేలుచున్నది."

పరిష్కర్తలు మొట్టమొదట అభినవగుప్త పాదాచార్యుని అభినవభారతి ఉదాహరించినదని "స్వంస్వం నిమిత్త మాసాద్య శాంతాద్భావః ప్రవర్తతే" అనేశ్లోకాన్ని ఉదాహరించి, దానికి 'నావ్యాఖ్యానం'గా పైప్రేమ వాదం ఎత్తేరు.

ఐతే ఏసందర్భంలో అభినవభారతి పై శ్లోకాన్ని ఉద్ధరించింది? దానికిచ్చిన పరిష్కర్తల 'నావ్యాఖ్యానా'నికి ప్రమాణం యేమిటి?

శాంతంనుంచి సన్నిహితవ్యవహితభావరూపరససామగ్రి ఉత్పత్తిల్లుతుందని ఏసంస్కృతసాహిత్యాచార్యులూ చెప్పలేదు. అనుభవానికి దూరంకూడా.

స్త్ర్యాదినిమిత్తములవల్ల సుఖదుఃఖాది భావములు మాత్రమే శాంతాప[illegible]ర్యాయిక నిర్గుణతత్వంనించి పుట్టవచ్చు. ఆభావములు భావుకచిత్తంలో బాగాభావింపబడితే అప్పుడు రససామగ్రి ఏర్పడుతుంది. దీనికి ప్రమాణంగా ఈకారికను చూడండి. "సుఖదుఃఖాదిభిర్భావై ర్భావ స్తద్భావభావనమ్." (రత్నాకరోద్ధృతము.)

మల్లినాథసూరిఅంతటివాడుకూడా తన సంజీవిన్యవతరణికలో "నామూలం లిఖ్యతే కించిత్" అన్నాడు. ఇంక ఈరసపరిష్కర్తలుమాత్రం అభినవభారతి ఇచ్చిన శ్లోకానికి అమూలకమైన 'నా వ్యాఖ్యానము' వ్రాశారు.

ఇక ముఖ్యమైన ప్రేమవాదం —

ముందు ప్రేమఅంటే ఏమిటో చూడవలసివుంది.

"అనురాగః ప్రకృష్టశ్చే దుచ్యతే ప్రేమశబ్దతః,
ప్రేమప్రకర్షం నీతంచే త్సఏవ ప్రణయః స్మృతః"

ఒకవ్యక్తిపై మరియొకవ్యక్తికి కలిగే ఇష్టం అనురాగం. ఇది ఉన్నతమైతే ప్రేమ అని చెప్పబడుతుంది. దీని ప్రకర్షస్థితి ప్రణయం. కాగా మనకు వస్తుమాత్రంమీద కలిగే కోరిక కామం ఔతుందిగాని ప్రేమకాదు. దీనికి పర్యాయంగా వాంఛ, ఇచ్ఛ మొదలైనమాటలు వాడవచ్చు. అంతేగాని కామమాత్రమునకు ప్రేమఅని వాడడం తప్పు. 'నాకు గేదెపెరుగుమీదా, కొత్తావకాయమీదా చాలాప్రేమండీ' అని యెవరేనా అంటే నవ్వుతాంకదూ? కాబట్టి సామాన్యమైన కోరికకు కామమనీ, వ్యక్తిగతమైన ఇష్టమునకు — అనురాగము (రతి)-ప్రేమ అనీ, వస్తుగతమైన ఇష్టమునకు — వాంఛ-ఇచ్ఛ అనీ వ్యపదేశం.

శాంతమనే నిర్గుణతత్త్వపు వికారంగా మొదటపుట్టేది కామమనే సామాన్యభావం గాని ప్రేమఅనే విశిష్టభావం కాదు. ఎప్పుడూ సామాన్యం ముందు, విశిష్టం తరువాతా పుట్టడం సంప్రదాయం. అదీ కాక — వికృతసన్నివేశాలను చూచేసరదానూ (హాస్యము) గొప్పగొప్పపనులు చేద్దామనే కోరికనూ (వీరము) అపూర్వార్థములను చూడడంవల్లకలిగే యిష్టమునూ (అద్భుతము) ప్రేమే అనడం యెంతవరకు ఉచితమో అభిజ్ఞు లూహించండి. కాగా శాంతవికారం కామంగనక రసములు కామమూలకములనవలెనేమోకాని ప్రేమమూలకములు కానేరవు. పోనీ ఆకామమునే వాదమునకు ప్రేమ అనుకొని రసములన్నింటికీ ప్రేమ మూలం ఔతుందేమో చూద్దాం.

ప్రేమప్రవృత్తివల్ల—అంటే తత్తద్విషయాలమీద కోరికకలగడంవల్ల శృంగారం, హాస్యం, వీరం, అద్భుతం ఉత్పత్తిల్లిన వంటే అనవచ్చు. కాని,

ప్రేమ నివృత్తివల్ల— అనగా ఆయా విషయాలమీద ఇష్టరూపమైన ప్రేమ లేకపోవడంవల్ల ఏర్పడే కరుణ, బీభత్స, రౌద్ర, భయానకములకుకూడా ప్రేమే ఎట్లామూలమౌతుంది? ప్రేమాభావంవల్ల కలిగే రసాలకు ఇంకేదో మూలమవాలి. అంతేకాని తదభావం తత్కారణమనడం అవిచారమూలకము. అసాంప్రదాయమునుమాత్రమే.

“ఇట్లు పరిశీలించుటవల్ల శాంతము మూలరసము ”అన్నారు పరిష్కర్తలు. వారు ముందు చెప్పిన నిర్గుణ రూపశాంతము రసమౌతుందా? ఏవికారమూ లేని నిర్గుణమునకు రసత్వం ఎట్లా వస్తుంది? తొమ్మిదవ రసం కూడా సాధించడానికి దుర్బలమైన ఈమాట వ్రాయబడింది.

దేనినైనా తీసుకొని దాని ప్రవృత్తినివృత్తులవల్ల రసాలు పుట్టించవచ్చు. చూడండి. కరుణతీసుగుందాం — ఇదీ శాంతవికారమే. దీని ప్రవృత్తివల్ల కరుణాదిరసములు, నివృత్తివల్ల శృంగారాదిరసములు పుట్టినవి. కరుణ రసస్థాయి శోకము — అనగా కాంక్షితాప్రాప్తిరూప చిత్తక్షోభ. ఇది భయ, మనః ప్రజ్వలన, జుగుప్సాదులందు భాసించుట స్పష్టమేగదా?

ఇక దీని నివృత్తికాంక్షితప్రాప్తి.

అందువల్ల రతి, హాస, ఉత్సాహ, చిత్తవిస్తారాదులు పుట్టిన వనడంలో విప్రతిపత్తి ఉండదుకదా?

కనుక రసములు కరుణమూలకము లంటాం. ఇందుకు ప్రమాణంకూడా ఉన్నది. “ఏకో రసః కరుణఏవ నిమిత్తభేదాత్ భిన్నః పృథక్పృథగివ శ్రయతే వికారాన్” — భవభూతి.

కొన్ని శతాబ్దుల వెనుకనే సంస్కృత సాహిత్యవేత్తలు అపారమైన సాహిత్య చర్చలు చేసి మానవ మనస్తత్త్వమును

(Psychology) తరచితరచి కావ్యము, రసము మొదలైన అగాధ విషయములను నిర్వచించేరు. అప్పుడు పైకరుణవాదమువంటి ఎన్నో చర్చలుచేసి సామాన్యమైన ఒకనిర్ణయానికి వచ్చేరు. వాటిని చక్కగా చదువుకుని అవగతంచేసుకొని వాటిపై వికాసంగా (Development) పరిష్కారములు చేసినా అభిజ్ఞులు హర్షిస్తారు. కాని మన మేదో అనుకుని ఇది సనాతనరసజ్ఞులకు సమ్మతమనడం వట్టి దుర్బలవాదము.

సంస్కృతసాహిత్యం కోటీరంగా ధరించే ఆచార్యాభినవగుప్తాదుల రసోద్దేశక్రమోపపత్తిని శ్రీపరిష్కర్తలు చిత్తగించవలసివుంది.

"అత్ర చతుర్వర్గమధ్యే సర్వప్రాణిసులభస్య కామస్య సర్వహృదయంగమత్వాత్ ప్రథమం శృంగారః. తత స్తజ్జన్యత్వేన హాస్యః. తత స్తద్విరోధిత్వాత్కరుణః. తత స్తన్నిమిత్తభూతోఽర్థప్రధానో రౌద్రః. తతోఽర్థకామయోః ధర్మమూలత్వాత్ ధర్మప్రధానో వీరః. తస్య భీతాభయప్రదానసారత్వా త్తదనంతరం భయానకః. తత స్తత్కారణభూతో బీభత్సః. వీరాత్ప్రభయానకాద్యనంతరం వీరరసఫలభూతో అద్భుతః. త్రివర్గఫలకరసానంతరం మోక్షఫలక శ్శాంతరసః. ఇత్యేవ ముద్దేశక్రమోపపత్తిః."

పై కారణకలాపమువల్ల రసములు ప్రేమమూలకములు అనే అనుగమం అప్రసిద్ధమని శ్రీ హనుమచ్ఛాస్త్రిగారు ప్రబుద్ధాంధ్రలో వ్రాసిన వాక్యములు శాస్త్రసిద్ధములు, పండితైకవేద్యములు, సంప్రదాయబద్ధములు అన వలసియున్నది.

పరిష్కర్తలు అనుద్విగ్నమనస్కులై ఈ వాదౌచిత్యమును గమనించకోరుచున్నాను.

రసవాదోపసంహృతి

దువ్వూరి సూర్యనారాయణమూర్తి
[శ్రీ నవ్య సాహిత్యమండలి]

శ్రీ పాటిబండ మాధవశర్మగారు కార్తికమాస భారతిలో రససిద్ధాంతము అనే వ్యాసాన్ని ప్రకటించేరు. వ్యాసము పరిశీలించితిని. అసలీవాదం శర్మగారు తెనుగుసంఘపత్రికలో సూక్ష్మంగా ప్రచురించినట్టున్నూ, తరువాత అభినవభారతినుండి ఉద్ధరించుకొన్న 'స్వంస్వంనిమిత్త మాసాద్య' అనే శ్లోకంతోనూ, గురుపాదుల పద్యంతోనూ తమ వాదాన్ని పెంపొందించినట్టున్నూ తెలిపేరు. అసలే గహనమైన ఈవిషయం పైవాటితో మరింత నిబిడమై పెరిగి గోదావరంత అయి పాయిపాయిలై విడిపోయి బోలెడు లంకలు వేసి బీళ్లు పెరిగి అయోమయం అయిపోయింది. దీనిమీద ఇంకా వాదోపవాదాలు పెంచి పాఠక లోకాన్ని క్లేశపెట్టడం ఎంతమాత్రమూ ఇష్టంలేక ఈ నా అభిప్రాయాన్ని సూక్ష్మంగానే విశదీకరిస్తున్నాను.

శర్మగారు, దేవగుప్తాపువారొక ఉత్తరం రాసినట్టున్నూ, ఆవెనుక రెండుమూడునెలలకు శ్రీ దువ్వూరి సూర్యనారాయణమూర్తిగారి పేర ఈవ్యాసం ప్రచురింపబడ్డది అనిన్నీ రాసి దేవగుప్తాపువారి రాతకూ నావ్యాసానికీ సంబంధంఉన్నట్టు అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో శ్రీ విశ్వేశ్వరరావుగారికీ నాకూ నేటివరకు ఏవిధమైన పరిచయమూ లేదనిన్నీ వారిని నేనెన్నడూ చూడలేదనికూడా శర్మగారు మున్ముందు తెలిసికొందురుగాక. రసవిషయ జిజ్ఞాసువునైన నేను హనుమచ్ఛాస్త్రిగారివ్యాసం శాస్త్రసిద్ధం అవడంచేతనూ, శర్మగారివాదము నా కనుభవవిరుద్ధంగా కనిపించుటచేతనూ నారసరాద్ధాంతాన్ని ప్రచురించేను. దీని నిర్ణయానికి సహృదయులే ప్రమాణులు.

శాస్త్రసాంప్రదాయం విడిచిపెట్టి రసపరిష్కారానికి దిగిన శర్మగారి ప్రతిభావాద సూక్ష్మరూపం ఇది.

శాంతము మూలరసము. శాంతాపరపర్యాయక నిర్గుణతత్వంనుండి ప్రేమ పుట్టుచున్నది. దీనికి ప్రవృత్తి నివృత్తు లున్నవి. ప్రవృత్తివల్ల నాలుగు రసాలు, నివృత్తివల్ల నాలుగురసాలు పుట్టును.

దీనిపై నేనుచూపినముఖ్యమైన అనుపపత్తు లివి:

౧. శాంతరూపనిర్గుణతత్వజన్యం సామాన్యమైన కామమా? విశిష్టము, లేక ప్రకృష్టమైన ప్రేమేనా?

౨. రతిహాసోత్సాహాద్భుతాలందు సుప్రకాశమైన కామము, లేదా ప్రేమ నష్టమై కరుణబీభత్స క్రోధ భయానకములందు ఎట్లు భాసిస్తుంది?

వీనికి వారి సమాధానాలు—

౧. ప్రేమ సామాన్యము; కామాదులు విశిష్టములు.

౨. వీనివిషయమున నిమిత్తవశమైన ప్రేమ స్వప్రకాశమును పొందుటకు కొంతబాధ అవసరమగుచున్నది.

తమప్రేమవాదాని కుపష్టంభకంగా మనస్సు లేదా, దానినిసగ్గతత్వాన్ని నేను ప్రేమఅంటున్నాను. స్థాయీభావాలందు అనుస్యూతంగా వచ్చుచున్న మనోధర్మము ప్రేమేఅనిన్నీ నాతాత్పర్యము. "ఆత్మనః అహంకారవిశేషః సచేతసా రస్యమానః రసఇత్యుచ్యతే" అని భోజుడు చెప్పినాడు. ఆత్మధర్మమైన ఈ అహంకారమే మనోధర్మమని నాతాత్పర్యము అనే మాటలుగూడా వ్రాసినారు.

ప్రతిభావాదృష్టులగు శర్మగారు కేవలస్వప్రతిభతోనే తెనుగుసంఘపత్రికలోలాగ పూర్వరసపరిష్కర్తలసంబంధం లేకుండా ఏసిద్ధాంతంచేసినా, ఏమిపరిష్కరించుకున్నా మే మందులో కలగచేసుకోవలసిన అవసరం లేకపోయేది. ఇక వారు తమప్రతిభకు పూర్వాచార్యుల అనుమతిని జోడించతలచి పూర్వుల

శ్లోకాలకు వ్యాఖ్యానంచేసి పూర్వాచార్యానురోధత్వం సంపాదించతలచి ఏదోరాయడంచేత మే మిందులో కలుగచేసుకోవలిసి వచ్చింది. అభినవగుప్తుడు అభినవభారతిలో ఇచ్చిన శ్లోకం ఎంతశ్రమపడినా రసప్రసూత్వమునే నిర్ణయించగలుగుతుందిగాని రసాలు ప్రేమమూలాలనే వాదానికి అప్రయోజకమే అవుతుంది. కాగా కేవలప్రతిభాదృష్టితోనే వీరివాదం సాగించవలసి వుంది గాని భోజాదుల రసచర్చలను తడవుట అనవసరమున్ను, వృథాయాసమున్ను.

మా ప్రేమనిర్వచనము దుష్కరము కాదు. ఆ శ్లోకానికి తాత్పర్యార్థాన్నే నేను రాసేను. కేవలప్రతిభావ్యుక్తితో శ్లోకం సమన్వయించు సిద్ధాంతులకు ఇందు బహుళసందేహాలేమో తెలియదు. పశ్వాదులయందలి అనురాగాన్ని ప్రేమ అనవచ్చు; సందేహంలేదు. అయితే వస్తువుపైనున్న కోరికనుకూడా కామమనవచ్చు, కాని ఆపదం లోకంలో అనుమానము, ఆగ్రహము, పాపము, రతి, అనేమాటల్లాగ ఒకవిశేషార్థమందు రూఢాలైనట్లు భాసిస్తూండడంచేత కామమనడం కొంచెము వెగటుగా తోచవచ్చు. సామాన్యమైన కోరికకు తప్పక కామమనే వ్యపదేశం. దానికి సుప్రసిద్ధవాక్యాలే ప్రమాణం.

" ఇచ్ఛాకామః ; సర్వాన్ కామాన్ పరిత్యజ్య, నిష్కామః."

కనుక శబ్దార్థం తెలిసిన విజ్ఞులు మా ప్రేమనిర్వచనాన్ని బహూకరిస్తారు లెండి.

ఇంక రససిద్ధాంతులు పూర్వసాహిత్యవేత్తల సమ్మతి అనుకొని తమవాదానికి జోడించిసాగించిన రససిద్ధాంతమందు అవ్వలికథాక్రమం బెట్టిదనిన :

సిద్ధాంతులు ప్రేమను ప్రకృష్టభావంగా ఒప్పుకొన్నారు. కామం సాధారణభావంగా అంగీకరించేరు. ప్రాథమికావస్థ ఐన సాధారణభావానికి ప్రకర్షస్థితివస్తేనేకదా ప్రకృష్టత సిద్ధిస్తుంది. మొక్కగావున్నదానికి పెరుగవచ్చి చెట్టుగా విజృంభించుట ప్రకృష్టభావము. ఇందు మొక్కగావుండుట సాధారణభావం. మొక్కవంటికామం తత్తన్నిమిత్తాలవల్ల పెరిగి చెట్టువంటి ప్రేమ అవడం సువిదితమేకదా ! ఇప్పుడు ప్రాథమికమైన కామన్నుంచే తత్తద్వికారములు కలుగుతున్నవని ఊహించుటలో క్లేశంలేదు. కనక శాంతంనుండి ముందుపుట్టేది కామం; దానివిజృంభణం ప్రేమ అను మావాదం ఎల్లాఅప్రస్తమైనదో తెలియకున్నది. ఏతావతా, కామ, ఇచ్ఛ, రతి, వాంఛానురాగాదులు సర్వమూ ప్రేమయొక్క రూపాంతరాలవడానికి ఎంతమాత్రం అవకాశం లేదు. కామేచ్ఛాదులు సాధారణాలు, ప్రేమ ప్రకృష్టమున్ను కనక—

భయానకాదినివృత్తిరసాల్లో కామప్రవృత్తి లేమి నిశ్చయం. దీన్నే నేను అభావమన్నాను. అభావమంటే నష్టి అనేయర్థం లేదనుకుని సిద్ధాంతులు " నివృత్తి అభావంకాదు " అన్నారు. అభావం నాలుగువిధాలు. ప్రాగభావం, ప్రధ్వంసాభావం, అత్యంతాభావం, అన్యోన్యాభావం అని. ఇక్కడ కామ ముండి నశించుట ప్రధ్వంసాభావం అవుతుంది. ఇప్పుడెవరు చిరము భావించవలిసివుందో ప్రాజ్ఞులూహించగలరు. ఐతే ఈఅభావరూపంగావున్నా, కామం నివృత్తిరసజనకత్వంలో ఎల్లాప్రయోజకమవుతుందో ఎప్పటికీ చింత్యమే ; జుగుప్సాదులలో నశించినకామం తిరిగి " ఎంతబాధ" పడినా స్వప్రకాశమును ఎట్లాపొందుతుంది? ఒకవేళ రసానుభూతిలో స్వప్రకాశం పొందుతుందన్నప్పటికీ మొదట నశించినది తిరిగీ రాదు. రసానందోపలబ్ధిలో క్లేశం పొందుట సంస్కృతసాహిత్యాచార్యులంగీకరింపరు.

ఒకచో " ఆమనస్సు, లేదా దాని నిసర్గతత్వమును నేను ప్రేమఅనుచున్నాను " అని రాసి మరోచోట " ఆత్మధర్మమైన ఈ అహంకారమే మనోధర్మమైన ప్రేమ యని నాతాత్పర్యము " అని పరస్పరవిరోధముగా నుడివేరు. ఇది స్వమతానిక్కీ, భోజునిమతానికీ జోడించినందువల్ల కలిగిన అనర్థం. భోజుడు " ఆత్మనః అహంకారవిశేషః చేతసా రస్యమానః రస ఇత్యుచ్యతే " అనిచెప్పినాడు. ఆత్మధర్మమైన అహంకారాన్ని రసమునుగా చెప్పినభోజుని మతము వీరిప్రతి

భావమతానికి విరుద్ధం. ఇది యెట్లావున్నదంటే "శాంతాద్భావః ప్రవర్తతే" అన్నచోట భావః అంటే శాంతవికారరూపమైన ప్రేమ అనుకున్నట్టుంది. మనస్సు వేరు. ఆత్మ వేరున్ను.

"సుఖాద్యుపలబ్ధిసాధన మింద్రియం మనః."

"జ్ఞానాధికరణ మాత్మా!"

దీనినిబట్టి మనోధర్మమైన ప్రేమకూ, ఆత్మనిష్ఠమైన అహంకారానికీ చాలాభేదం కనిపిస్తుంది. దీన్ని మాత్రము సిద్ధాంతులు చిరము భావించక తప్పదు.

శాంతం మూలరసమని అభినవ భారతీతరసాహిత్యగ్రంథాలు చెప్పలేదు. కాక అది చాల ప్రాచీన మతం. అది మేమంగీకరించినా సిద్ధాంతుల ప్రేమమూలక రసవాదానికి ఏమీ ఉపయోగంలేదు.

ఇంకొకటి "నాది రసోత్పత్తిక్రమము. ఆచార్యపాదులది రసోద్దేశక్రమము" అన్నారు సిద్ధాంతులు. కాని ఇదికూడా ఉత్పత్తిక్రమగర్భితమైన ఉద్దేశక్రమం గాని కేవల ఉద్దేశక్రమంమాత్రమే కాదు. అదే ఐతే, "ప్రథమం శృంగారః తత స్తజ్జన్యత్వేన" అని జన్యజనకభావం చూపిస్తూ ఆచార్యపాదు లెందుకు నిర్వచిస్తారు? కాగా ఇది ఉత్పత్తిక్రమంకాదనడానికి ప్రతిభావాదులు మరేవిధంగా దీన్ని అర్థం చేసుకున్నారో కదా?

అసలు ఈవాదం మొదట ఆలోచించగా చరిత్రాత్మకమైన వ్యక్తిగత రాగద్వేషాలవల్ల బయలుదేరినట్లు పొడకట్టుచున్నది. ఏమంటారా, హనుమచ్ఛాస్త్రిగారి రివ్యూలోని 'అప్రసిద్ధమన్నదానికి కేవల సత్యదూరమనిన్నీ 'ప్రాబంధికపుటవగమము' అనేదానికి కావ్యమెంతమాత్రము కాజాలదనిన్ని తాత్పర్యాలు రాసి శ్రీశర్మగారే తమ రసపరిష్కారంలో కొన్నివిసురులు విసిరేరు. అప్రసిద్ధమంటే అత్యంతాభావం ఔతుందా? రెండవమాటకు కొంతమాత్రమే కావ్యత్వం సిద్ధించవచ్చు అని గదా భావము.

ఇంతకీ కేవల ప్రతిభావాదమైనా యుక్తియుక్తంగాఉంటే అభిజ్ఞుడు శిరసావహిస్తాడు. ఎంతశాస్త్రవాదమైనా అసంబద్ధమైతే ఖండించడానికే వెనుదీయడు. మావాదమే గెలవాలనీ మాటా, ఆ పట్టుదలా ఎవ్వరికీ పనిలేదు.

ఇప్పటికి భారతీపాఠకులైన సహృదయులకు మావాద ప్రతివాదాల పోకడలు అర్థమయే ఉంటాయి. ఇక దీన్నిగూర్చి అనవసర కార్పణ్యవాదాలు చేసి భారతికి భారంకూర్చుట వ్యర్థము. కనుక మావాదాల ఔచిత్యానౌచిత్య సమీక్షను ప్రాజ్ఞలోకానికి వదలివేస్తున్నాను.

[ఈ చర్చ కింతటు స్వస్తి.—సం. భారతి]

ఆంధ్ర వాచస్పత్యము

[కొన్ని సందేహములు]

(మూర్తి)

-అనిత్య సంధి-

ఈపదమును గూర్చి "పూర్వ స్వరంబు పై పరస్వరంబు చేరకుండుట అనిత్యసంధి" అని అర్థం వ్రాయించినారు. "సీత యేది, అమ్మాయిది, కరుణ యుంచుము, హరయిమ్మ, మాయిల్లు" అని లక్ష్యము లిచ్చినారు. అసలుసంధి అనగా "పూర్వపర స్వరంబులకు పరస్వరం బేకాదేశం బగుట" అనివైయాకరణులు చెప్పేరు. నిత్యం కానిది అనిత్యము. ఈ రెండుపదాలూ కలపగా శాశ్వతముగా నుండనిసంధి అనిఅర్థము లభించును. తద్వారా వికల్పసంధి అని తేలును. పై లక్ష్యములు చూస్తే "స్త్రీవాచక తత్సమ సంబోధనాంతములకు సంధిలేదు" అనే సూత్రముచేత సంధిరాకపోగా యడాగమం చేరింది. ఇదిఅనిత్యసంధి ఎల్లా అవుతుంది? ఉత్వసంధివలె నిత్యముగాని దనిత్యసంధి అంటూరా! అప్పుడు "మా+ అమ్మ, మా+ ఇల్లు" వీటివిషయంలో అనిత్యసంధి ఎట్లా?

-అత్వ సంధి-

ఈపద వివరణాన్ని గూర్చి పా. ఉదా:- అమ్మ+ అడిగెను. అని లక్ష్యమిచ్చి "అత్తున కచ్చు పరమగు నపుడు సంధిబహుళము" అని వ్రాసినారు. ఇదిఅత్వ సంధికి లక్ష్యం ఎల్లాఅవుతుంది? ఒకవేళ బహుళగ్రహణంచేత సంధిగాని రూప మంటూరా! ఇత్వసంధిఅను పదందగ్గర "తలచి+ ఉండి, తలచుండి" అనడంతప్పు. క్త్వార్థేత్వమునకు సంధిరాదు. అనివివరించి నట్లే పైస్థలంలో "బహుళ గ్రహణముచే సంధిరాదు" అని చెప్ప నక్కర లేదా? చెప్పనినాడు "అమ్మ+ అడిగెను" అన్నలక్ష్యమందు సంధి యేమి జరిగినది? దీనికి "మేన+ అత్త, మేనత్త" ఇత్యాదులు సంధిప్రాప్య యోగ్యస్థలాలు కావా?

-ఉత్వ సంధి-

పా:— సంధిదోషములు పదునాల్గింటిలో నొకటి. ఉదా:- రాముడు+ అను బాలకుడు. ఇచ్చట "రాముడుయను బాలకుడు" అనిరాయ కూడదని వ్రాయించినారు. ముందు ఉత్వసంధి దోషమెల్లా అవుతుంది? రాముడుయను ఇత్యాదులు కుసంధి దుస్సంధులగునుగాని ఉత్వసంధి కాదు. ఉత్వసంధి చెయ్యకపోవుట, తత్స్థానంలో అప్రసక్తమైన యడాగమంచేసి వ్రాయుట అనుదానికి ఉత్వసంధిఅని వ్యవహారం ఉంటుందా?

-ఇకారము - ఉకారము-

ఈపదముల వివరణలో అప్రసక్తముగా

ములోకన్న ఈనిఘంటువులో ఇకారయుక్త పదాలు వేలకొలది పెరుగునే ఇవ్వలేదేమి?

ఇబ్బంది:- ఇను + బంది, అని వ్రాయించినారు. ఇరు + పంది, అని ప్రౌఢవ్యాకరణాదుల శాసనం. ఇందులో ఎవరిది ప్రామాణ్యము?

ఇలు సింపడము:- ఇదిఒకపదము, ఇది తినడము. వినడము, వంటిదేనా?

అచ్చు పోడిచిన యాంబోతులు:- జా. స్వేచ్ఛగా తిరుగువారు. దీనికిప్రయోగము. అచ్చుబోడిచిన ఆబోతుల రీతిని విచ్చలవిడిగా విడనాడినచో" అని వ్రాయించేరు. "అనగా ఈలక్ష్యంవల్ల అచ్చుబొడిచినఆబోతులు అనేదానికి తమరు వ్రాయించిన అర్థము చెప్పుకొనవలెనని మీఊహా యేమి? శివశివా! ఈఅర్థానికీ ఆపదానికీ ఏమిసంబంధముంది?

"అక్షరసంధానశాల, అక్షర సంధానోద్యోగి, అద్రిప్రదక్షిణసమయము, అనుక్త విషయస్వరూపోత్ప్రేక్ష, అన్యోన్య బాంధు ప్రవచనము" ఇవన్నీ పదాలే కాబోసు? ఇంకాఇల్లాటి సమాసాలు మరికొన్ని చేర్చలేక పోయేరేమి? "అక్షరసంధాన శాలా ముఖమంటపము, అక్షరసంధానోద్యోగికట్టుగున్నగుడ్డ, ఇల్లాటివింకా పెంపకంచేసి చేర్చవలసింది స్వామీ!

అధోక్షజాయనమః, అనిఒక్క పదమేచేర్చేరేమి? అచ్యుతాయనమః, అనంతాయనమః, అనిరుద్ధాయనమః, ఇత్యాదులు కూడా చేర్చవలిసింది. ఎందుకు మానేరు?

అజాతస్మరాలింగనము, అజాత స్మరాలింగనములు, అనిఏకవచనం, బహువచనం మాత్రమే వ్రాయించినారు. యీపదాలకు ఏడువిభక్తులూ కూడాచేర్చి అకారాది పదాలుగా వ్రాయిస్తే తీరిపోను. ఎందుకు మానేరుబాబూ?

మరిన్నీ అడవి, అనేపదంతో కలిపి కాకర, చిక్కుడు, కంద, చెరుకు, దొండ, నిమ్మ, నువ్వు, పెసర, పత్తి, బచ్చలి, బీర, మామిడి, మొదలైనవిచేర్చి అకారాది పదాలు పెంచినారు. కనిపించే ప్రతీతరుగుల్మలన్నీ అడవిలోనూ వుంటాయి. ఇతరత్రా వుంటాయి. వీటినన్నింటినీ "అడవి" అనేపదంతో కలిపి వ్రాయమానినారేమి? పదాలు పెరుగునే?

ఇల్లాగే జంతువులనుకూడా అయిదారింటినే చెప్పేరు. అల్లాగే, అడవిఆవు, అడవిదూడ, అడవిగేది, అడవిదున్న, ఇత్యాదులు కల్పిస్తే అపారంగా నిఘంటు మరింత లావెక్కును. ఎందుకు రాయలేదు బాబూ?

స॥ శే॥

మురారి

అనర్ఘరాఘవము

(సమాలోచనము)

[శ్రీమాన్ ఈయుణ్ణి వేంకటవీరరాఘవాచార్యులు ఎం. ఏ. గారిచే రచింపబడిన విమర్శ గ్రంథము యొక్క సమీక్ష]

దువ్వూరి సూర్యనారాయణమూర్తి.

కావ్యానికి విమర్శ నికషోపలం వంటిది. అది అభిమాన పురస్సరంగాగాని, మత్సర గ్రస్తంగాగాని విలేఖింపబడితే ఆ కావ్య సువర్ణానికి ధర తాత్కాలికంగా హెచ్చుతగ్గులకు లోనై తీరుతుంది. అప్పుడు విమర్శకుడు కూడా తేలిపోతాడు. పాఠకలోకం దగాలో పడి వంచింప బడుతుంది.

కావ్యాత్మలో ప్రతిఅవయవం చొచ్చి పరీక్షించడానికి విమర్శక భిషక్కుకు అధికారం కద్దు. ఆ సమయంలో అతగాడికి ఏ అంగంలో జబ్బున్నదని తోస్తే అక్కడ శస్త్రచికిత్స చేసి కశ్మలాన్ని పైకితీసి పారేస్తాడు. ఈపనిలో అతడు జంకూ మొహమాటం పడడు. దీన్నే "పరభణితిపరీక్షా యుజ్యతే సజ్జనానాం" అన్నారు అభిజ్ఞులు.

కావ్య పరిసమీక్షలో విమర్శకుడు రసపరామర్శకు అగ్రస్థానం యివ్వాలి. రెండవ మెట్టు పాత్రపోషణ కివ్వాలి. తరవాత దృశ్యశ్రవ్యభేదేనా తత్తన్నియమ సాధనకివ్వాలి. అంతేగాని దండలు మెలితిరిగిన వస్తాదు జబర్దస్తీ శైలి మొదలైన కేవలశాబ్దిక పుటందాలలో సమీక్షక హృదయం చిక్కుకో కూడదు.

కావ్యత్వ సిద్ధిలో కవికన్న విమర్శకకవే ఒక్కొక్కప్పుడు కావ్య పురుషార్థాన్ని సాధించగలుగుతాడు. అందుకు ఉభయుల హృదయాల్లోనూ పరస్పర సన్నిహితసామరస్యం కుదరాలి. కవిగదా తయారుచేయబడక ఎల్లాగ తానై పుట్టునో విమర్శకుడు కూడా ఆరీతిగానే పుట్టాలి. నాలుగు శిథిలశిలాశాసనాలూ, పది పాతతామ్రశాసనాలూ, సమార్జించి ఒకటిరెండు శతాబ్దాల సన్నిహిత వ్యవహితంగా కవికాలాదులు నిర్ణయించినంతలో వారిమీద విమర్శకముద్ర వేయలేం. ఆపరమ ప్రయోజకమైన వైమర్శికసింహాసనంలో ఆహ్వాయంచేసి వార్ని కూర్చోబెట్టలేం.

ఇంతకూ మసిబొగ్గు మాణిక్యమైనా

మాణిక్యం మసిబొగ్గైనా అదిలోకాన్ని అనుగతిస్తుంది. సంస్కృత సాహిత్యం కోటీరంగా ధరించిన ఆలంకారికులు కూడా ఒక్క కావ్యాత్మ విషయంలో ఎవరికివారే యమునాతీరే అన్నారు. సాహిత్య సమారాధనలో వైతండిక స్థానాన్ని ఆక్రమించి బద్ధరాగ ద్వేషులైన కొందరు పరిమర్త్తలు నాడు మొదలు నేటిదాకా లోకంలో తేలికపడుతూనేవున్నారు. ''భిన్నరుచిర్హి లోకః''

విమర్శక కంకణం కట్టుకుని దేశకాలపరివర్తనం గణించకుండా కొత్తఅనగానే మోహంముడిచే పురాణపురుషుల ''వ్రతానాముత్తమ వ్రతం'' లాటి సమీక్షలు నేడువిస్తారంగా బయలుదేరినాయి. బయలుదేరుతున్నాయి. ఇట్టివి ప్రబలునంత కాలం ఏసాహిత్యానికీ మోక్షం లేదు.

ప్రకృతంలో ''అనర్ఘరాఘవము (సమాలోచనము)'' అనే 50 పేజీల గ్రంథం యీ నడుమనే శ్రీయుత ఈయుణ్ణి వెంకటవీరరాఘవాచార్యులవారిచే వ్రాసిప్రకటింపబడింది. వీరినిగూర్చి ఆంధ్రిలోకాని కండించవలసినదేమీ కొత్తగాలేదు. ఈగ్రంథం మురారికవికృతికి విపులవిమర్శనం. ఇందులో అవతారిక మొదలు ప్రకీర్ణకము, వరకూ విషయవిభాగాలు పన్నెండు. ఇక్కడ వాటిలో ప్రతిపాద్యాన్నే రెండేసిమాటల్లో అందించి నాభేదాభిప్రాయ లేశాల్ని సూచిస్తాను.

జన్మాది ప్రసంగంలో భట్టమురారిపదంలోని భట్టశబ్దానికి ఈకవిభట్టరాజని లోగడ వ్రాయబడిన వాదం ఖండింపబడి ఇతడుక్షోత్రియ కుటుంబానికి చెందినవాడని సహేతుకంగా నిర్ణయింప బడింది.

నివాసస్థల ప్రసంగంలో కాశ్మీర నర్మదాతీర వాసిత్వాలు నిరసింపబడి పురాణేతిహాస ప్రసిద్ధమై సూర్యప్రతిష్ఠిత మనీ, దేవమాతృకఅనీ, దక్షిణకాశిఅనీ జగత్ప్రఖ్యాతిపూర్వమే కాంచిన శ్రీదాక్షారామ భీమేశ్వర క్షేత్రానికి తెలుగుదేశంలో రెండుమూడు జిల్లాలలోకంటె ఎక్కువవ్యాప్తిలేదని న్యూనత్వం ఆపాదింపబడ్డ లక్ష్మణరావు గారి వాదాన్ని విమర్శకులు ఆధారంగా గ్రహించి మురారియొక్క ఆంధ్రదేశాధివాసిత్వం నిర్ణయింప బడినది. దీనికన్న నాటకవ్యాఖ్యాతలను పట్టి విమర్శకులు సమర్థించినయుక్తే సౌమ్యంగా కనిపిస్తుంది.

కవికాలప్రసంగ నిర్ణయంలో ఆంగ్లపండితవాదాన్ని జోడించి సహేతుకంగా చక్కనిరిసర్చిచేసి ఒకనిర్ణయంచేయగలిగేరు. ఇదిలోతైన అంతరతమ్య పరీక్షచేసి బాహ్య

భక్యాంతర కాలాలలో క్రీ. శ. 850-880 నడుమ జీవించి ఉన్నాడని స్థిరీకరింప బడినది.

కవిపండితామోద ప్రసంగంలో మహా మహులైన పెద్దలు మురారి మహాశయుని గూర్చి సువ్యక్తీకరించిన విషయ మణులను వాఙ్మయార్ణవంలో నుంచి ఏరిచూపినారు. కాని అవన్నియు చాలవరకు మురారియొక్క శబ్ద ప్రియత్వాన్నే సూచిస్తున్నాయి. ముందుమురారే తనవాక్కులనిగూర్చి "ఉజ్వలకనుస్థకుల ప్రశస్తి సారభ్యస్వర గభీర మనోహరాణి, మురారికవే ర్వచాంసి" అని చెప్పినాడు. అతని వాక్ప్రియత్వం సౌరభ్య నిస్వర గభీర మనోహరత్వాదులు మొదలైన అర్థపుష్టి తక్కువైన పదపరికరం కలదని దీనివల్ల ధ్వనితంఅవుతోంది. ఇల్లాగే అభిమతార్థాన్ని అనవసర పదాలతో పెంపొందించి చెప్పుట ఇతనికి అలవాటు. ఇంకా ఇతరులవి.

"మురారి పదచింతాయాం"

"మురారి పదచింతా చేత్"

'మాధుర్యైక భువాం మురారివచసాం'

"హృదయాకలితా శేషశబ్ద శాసనసంవిదః మురారేః; యేశబ్దశాస్త్ర నిష్ణాతా యేశీలిత నిఘంటవః తేషామేవాధికారోస్తి మురారికృత నాటకే" మొదలైనవి ఈతనిశాబ్దికపు టెక్కుడ నుద్ఘాటిస్తున్నాయి. ఇంకా ఈపరికరణంలో "సాహిత్యమనగా సారస్వతము, సాహిత్య శాస్త్రము అనిఅర్థము, "దేనినిపినిన మాత్రముననే కవిహృదయము సరళమగునో అదియేకవిత్వము" అని రెండు సూత్రాలు వ్రాయబడ్డాయి. పైసూత్రద్వయం చేత చేయబడ్డ సాహిత్యకవిత్వ నిర్వచనంచాలా సూక్ష్మంగా ఉన్నది. ఇంకా విపులం చెయ్యాలి.

తరవాత సుభాషిత గ్రంథాల లోనూ మురారిశ్లోకాలు కొన్ని గ్రహింప బడ్డాయనివాటి సర్గలుసంఖ్యలు చూపించినారు. వైయాకరణులు కూడా యీతని ప్రయోగాలను ప్రమాణీకరించినట్టు చూపించినారు. మరిన్నీ మురారి వ్యాకరణ సాహిత్యమీమాంసా మంత్ర శాస్త్రాదులలో గొప్పవైదుష్యం కలవాడని కావ్యాను సారేణా నిర్ణయించినారు.

ఆవెనకమురారి కృతిస్మృతిలో నాటకంలోవున్న ముఖ్యఘట్టాలను వర్ణించిన శ్లోకసంఖ్య, నామధేయ సార్థక్యం ఇతరానుకృతి, పాశ్చాత్య మతఖండన పురస్సరంగా ఇందున్న లోటుపాటులు, చక్కగా ముద్రింపబడి నాటకరూప శ్రవ్య కావ్యాల్లో ఈనాటకానికి స్థానం యివ్వబడినది. ఇందు

లో విల్సన్ పండితుని ''అనర్ఘము నస్వభావోన్మీలనముగాని, చేష్టితముగాని, హృదయావర్జకములగు కథానన్నివేశములు గాని కౌతుకోద్దీపనము గాని లేకపోవుటచే నాటకీయదృష్టిని పరిశీలించుచో దీనియందుత్కర్ష మృగ్యము. కావ్యదృష్టిని జూచిన ఎక్కడనోగాని కవితా కల్పనములు కానరావు'' అనేగంభీరాభిప్రాయంతో విమర్శకులు ఏకీభవింపక పోయినా తాత్వికాంశాన్ని నిర్మోహమాటంగా చెప్పిన పై సంగతులన్నీ శిరోధార్యాలనక తప్పదు.

ఇంకా ''ఔచిత్యం రససిద్ధిస్య స్థిరం కావ్యస్య జీవితం, అనౌచిత్యా దృతే కావ్యం రసభంగస్య కారణం'' అనే అలంకార వేత్తలలో పైన ఔచిత్యానౌచిత్యపదప్రయోగం విమర్శకులు ''కటికుచాది వర్ణన, అశ్లీలము'' అనే అర్థసూచకం అనిమాత్రం అనుకున్నారు. అంతేకాదు. రసోత్తరమైన కావ్యనిర్మాణ కృత్యంలో, శాబ్దికంగా, ఆర్థికంగా, రసమయంగా, దృశ్యశ్రవ్య నియమమయంగా ఏస్వల్పంలోటులు కనిపించినా అదంతా అనౌచిత్యమనే చెప్పాలి. దీన్నిబట్టి మురారి కృతిలో కటికుచాదులు వర్ణించిన ఏడుశ్లోకాలే కాకుండా, విశ్వామిత్రుని శిష్యుని పేర్లలోని అశ్లీలార్థమే కాకుండా, కావ్యత్వనాటకత్వదృష్ట్యా ఇంకా అనౌచిత్యాలున్నాయని అంగీకరించాలి. ఇంతకూ కవికి రససిద్ధే దొరకనప్పుడు తద్రస భంగహేతువులుపై వెళ్లాడతాయి? ఇది ఆశ్రయాసిద్ధి.

ఈపైన అధికరణాల్లో పరస్పరతారతమ్యాలు చూపిస్తూ ప్రకీర్ణకంలో ముద్రితప్రతులు, మురారివ్యాఖ్యలు, వ్యాఖ్యాకర్తలు, పరివర్తన కర్తలు, విమర్శకులు పరిశీలించిన ప్రతులు, వీనినిగూర్చి పట్టిక వ్రాసియున్నారు.

మొత్తంమీద ఈవిమర్శక పూజ్యపాదులు సంస్కృతాంధ్ర ఆంగ్లభాషా త్రియులోనూ పరిణత ప్రజ్ఞులు, అందులోనూ సంస్కృత వాఙ్మయంలోవున్న ముద్రితాముద్రిత కావ్యాలు యావత్తూ వీరిహృదయభాండాగారంలో భద్రపరుప బడ్డాయి. కావలసినప్పుడు వారిమనః కవాటిక తెరిచి జ్ఞానదీపం వెలుగున దివ్యచక్షుస్సుతో తేరిపారచూసి ఏవిషయాన్నైనా ఎదటపెట్టగలరు. స్వదేశ స్వభాషాకవులన్నా వారికృతులన్నా అత్యంతాభిమతవిషయం. ఏదైనా విమర్శదొరికించుకుంటే ఆకవి పుట్టింది మొదలు నేటిదాకా చేసినసమస్త చరిత్రాలవలేశాలు కూడా విడవకుండా తమవిమర్శక దర్పణాలో ప్రతిఫలింప చేయడంలో విశ్వాఖిల ప్రజ్ఞ, ప్రతిభలు కలవారు.

ఈసమాలోచన గ్రంథంలో విపులంగా రసచర్చ, పాత్ర పరామర్శ, నాటకీయతత్వం, కవిత్వభాగం, ఈవిషయాలు నాలుగూ రసమయ దృష్టితో విమర్శించి చూపించవలసి వుందనిమాత్రం నాఅభిప్రాయం.

"మురారేస్తృతీయః పంథాః"

ఉభయభాషాప్రవీణ దువ్వూరి - సూర్యనారాయణమూర్తి గారు,

మురారిమహాశయుఁడు ప్రసిద్ధికెక్కిన దృశ్యకావ్యకర్తలలో నొకఁడు. ఈతఁడు "అనర్ఘరాఘవము" అను నొక నాటకమును రచించెను. ఈతని యప్రతిమ కవిత్వ ధారాప్రవాహము ముల్లోకముల ముంచెత్తి తేల్చినది. ఇతివృత్తము రామాయణగాథనే గ్రహించి

"చతుర్వేదసముద్భూతం రసాభినయభూషితం
ధర్మ్యమర్థ్యం యశస్యం చ నాట్యంకోనాభినందతి?
న తచ్ఛాస్త్రం నతచ్ఛిల్పం నసావిద్యా నతాః కలాః
న తత్కర్మ న యోగోసౌ నాటకే యన్నరస్యతే"

అను పద్ధతి ననుసరించి నాటకమే సర్వోత్కృష్టమైనదని యూహించి సహృదయుల కానందమగు రీతిని విరచించి యున్నాఁడు. అట్టి యీనాటకమును గూర్చి కొన్నివిషయముల నాకుఁ దోఁచినరీతిని విమర్శించి చూపెదను.

కూర్పునందలి నేర్పుచేతను, నార్ద్రహృదయము లందలి భావోద్రేకముచేతను, వ్యక్తిగతమైన దివ్యానుభూతులచేతను, ముఖ్యముగా కవియొక్క ప్రతిభాశక్తిచేతను నొకని హృద్గతమైన భావకల్పనముల కన్న మఱియొకని సూక్తులు క్రొంగ్రొత్తలు కావచ్చును. నవ్యానందమును గలిగింపవచ్చును. దానితో నతని కావ్యము నవ్యమై సరసుల కానందము నీయఁగల దనుటలో సందేహ ముండదు. అట్లే వాల్మీకి మొదలగు గొప్పవారుగూడ నీరామాయణమును కావ్యముగా వ్రాసియున్నను తనకావ్యముగూడ సహృదయాహ్లాదియగునను నూహను మురారి.

"వాల్మీకివాగమృతకూపనిపానలక్ష్మీ
మేతాని బిభ్రతి మురారికవేర్వచాంసి"

అని ప్రస్తావనలోఁ జెప్పియున్నాఁడు. పైఁ జెప్పిన కావ్యశోభ యనునది పలువిధములు. అయ్యది భాషావిషయకమైగాని కల్పనావిషయకమైగాని, రచన ననుసరించిగాని వస్తువునుగూడిగాని యుండును. ఇవన్నియుం గూడిన కావ్య మున్నచో బంగారమునకు తావి కలుగుటయే.

నాటకమనఁగా కొంతమంది నటులచే కావ్యోపనిబద్ధులగు నాయకాదిపాత్రలు ధరింపఁబడి యేనాడో జరిగినగాథ నేడుప్రత్యక్షముగ జరుగుచున్నట్లు మనకండ్ల ముందర అభినయించి చూపుట. అందుల కనుగుణముగానే కవులు నాటకముల వ్రాయుచుండవలెను. అట్టి నాటకభాష వాడుకభాషవలె సర్వజనసామాన్యముగా నర్థబోధ యగురీతిని నుండవలెను. లేనినాడు దాని యభిప్రాయమును దెలిసికొని సంతోషించువారరుదయి పోవలసి వచ్చును. ప్రకృతమున మురారికవి భాషావిశేషమును పరిశీలించిన దృశ్యకావ్యమార్గమును జూపక శ్రవ్యకావ్యమార్గమును జూపుచున్నది. ఇది సహృదయానందదాయి కాదు సరిగదా పండితులకు సైత మర్థమగుట దుర్ఘటము. ఇట్టి భాషతో నాటకముల వ్రాయుట మంచిదికాదు. చూడుము.

"తత్తాదృగుజ్జ్వలకథ్నమలప్రశస్తి
సౌరభ్యనిర్భరగభీరమనోహరాణి"
"కుముదాకరమశరన్నిశానిశాతనిస్తుషోషితుషారకిరణః"
"చకోరప్రణయినీ రసజ్ఞా పాండిత్యప్రకరశశిధామ
[భ్రమభరాన్",
"ఉద్దామద్యుమణిద్యుతివ్యతికర ప్రక్రీడదర్కోపల
జ్వాలాజాలజటాలజాంగలతటే నిష్కూజకోయష్ట
[యః

"భా మోహన్మ్లవమాన"

"పారస్త్రైణేయ ప్రత్యయ"

"పాంసుపాల్యం సస్పృజే౽రాం పరోరజోభిః"

శస్త్రాశస్త్రికథా, "విష్వద్రీచః"

"సాఖప్రసుప్తిక మధువ్రతనిస్తమస్క"

ఈ రీతిగా నీతనిభాషయు దానితో పాటు సామాసిక క్లిష్టమును జోడించి నాటకభాషగా వ్రాయుట వింతగానున్నది. ఇట్టి భాషతో నటకులు రంగముపై మాటలాడుచున్న నాకాలీనులకైన నర్థబోధ సులువుగాఁ గలుగుననుట సందేహమే. అచ్చటచ్చట విరళముగా నున్నదనుకొన్నను ప్రతిశ్లోకమందును ప్రతివాక్యమందును గూడ నిట్టి కష్టతరమగు మెలికలు తప్పవు. ఇట్టి బొమ్మరాళ్లభాష నాటకశైలి కననుగుణము. కాళిదాసభవభూత్యాదులలో నిట్టిరచన యుండదు. వీరి హృదయములు నవనీతపేశలములు. మురారికవిహృదయముక్కు తునుకయని గ్రంథము ననుసరించియే చెప్పవచ్చును. కావుననే యతఁడనినట్లు "జనికర్తుః ప్రకృతితా" ఐనది. రాపై మొలుచు తృణాదికముగూడ తన్మూలభూమిష్ఠములే యగును. ఇట్టి కఠినభాష శ్లోకములందేగాక మాటలాడుకొనునపుడు కూడ మెలికలు చిక్కులుగానే రచించు నలవాటు గలవాఁడు. కాన నిది శ్రవ్యకావ్యభాషయే యనఁదగును గాని నాటకభాష కాఁజాలదు.

ఇఁక రసానుగుణరచనఁ జూచినచో నిదిగూడ చాలినంత లేదు. విశ్వామిత్రుఁడు శ్రీరామునితోడ్కొని పోవునపుడు గాని, లేకలేక పుట్టినగారాబుబిడ్డను పిన్నవయసువానిని రాకాసిమూఁకలతో యుద్ధము చేయఁ బంపవలసి వచ్చినందులకుగాని గొప్ప యుత్కంఠ ప్రేమ, చూపించు శైలితో దీనమైన మాటలతో వ్రాయవలసినది. మఱియు సీతావియోగదుఃఖితుఁడైయుంటిగానున్న రాముఁ డరణ్యప్రదేశములఁ జూచి విచారించునపుడు చప్పగాఁ జెప్పియున్నాఁడు. చూడుఁడు.

"వత్సలక్ష్మణ ! ధరయమాం
ఇయమవిరల శ్వాసా సప్యన్ముఖీభిదురస్వరా
తనురవయవైః శాంతస్సృస్త్రైరుపైతి వివర్ణతాం
స్ఫురతి జరతా బాష్పాయేతే దృశౌ గలతస్స్మృతిః
మయి రసతయా శోకో భావశ్చిరేణ విపచ్యతే."

అనియు మఱియొకచోట "ఇయం తే విశ్వవిస్రంభ మర్మవేదినీ నిచులనికుంజరేఖా. ఇహహి.

స్వవపుషి నఖలక్ష్మ స్వేనకృత్వా భవత్యా
కృతమితి చతురాణాం దర్శయిష్యే సఖీనామ్.
ఇతి రహసి మయా తే భీషితాయాః స్మరామి
స్మరపరిమముద్రాభంగ సర్వంసహాయాః."

అని యసహ్యముగా నేడిపించినాఁడు. ఇందలి యుద్దీపనములన్నియు తెచ్చిపెట్టుకొనినట్లున్నవి గాని నిజమైన ప్రేమోద్రేకమువలన గలిగినవానివలె లేవు. వానిలో గొప్పహృదయస్పందనము గాని బాధగాని కనుపడదు. ఇట్టి పట్టుల కవి తానాయవస్థను మానసికముగా ననుభవించుచు వ్రాయవలెను. లేనిచో నట్టి భావస్ఫోరకత్వము మృగ్యమగును. ఇట్టి వియోగస్థానముల భవభూతి వ్రాసిన యొక్కమాట చాలును. జన్మజన్మాంతములవఱకును గుండెను నాటి స్మృతికివచ్చునపుడెల్ల హృదయకుహరమున మెలుకుఁగ మానదు. పరిశీలింపుఁడు.

"హా హా దేవి స్ఫుటతి హృదయం ధ్వంసతే దేహబంధః
శూన్యం మన్యే జగదవిరళజ్వాల మంతర్జ్వలామి
సీదన్నంధే తమసి విధురో మజ్జతీవాంతరాత్మా
విష్వఙ్మోహః స్థగయతి కథం మందభాగ్యః కరోమి."

ఇచ్చట పొగులు హృదయము పగులుచుండ దేహబంధములన్నియు జారిపోవుచుండ నేదో యనిర్వాచ్యమైన మంటలు హృదయ దందహ్యమానము లగుచుండ మోహము ముప్పిరిగొన్న రాముని శూన్యమై చిమ్మచీక

టులు గ్రమ్మి కీచురాళ్లగీగీరవముల చే నదించి పోవు సముద్రమధ్యమున ముంచివేసినాడు. కవిత్వమన్నను రసానుగుణరచనమన్నను నియ్యది. మఱియొకచోట

"దలతి హృదయం గాఢోద్వేగా ద్విధాతు న భిద్యతే
వహతి వికలః కాయో మోహం నముంచతి చేతనామ్
జ్వలయతి తనూమ తర్దాహః కరోతి న భస్మసాత్
ప్రహరతి విధిర్మర్మచ్ఛేదీ నకృంతతి జీవితమ్."

అని యతిదారుణ దుఃఖభారమును వెలిబుచ్చుచు నన్నిన్నివిధముల బాధించుచున్న యీ పాపిష్ఠిదైవము నాయసువుల తీసి జీవితము లేకుండ చేసిన బాగుండు ననియు నతి నిష్ఠుర శోక విరహ కేలికీలా దంద హ్యమానుడై పలికినాడు. కవి తాదృశుడై పలికించినాడు. ఇట్టి రసఘట్టము లనేకము లున్నవి. ఇట్టివి మురారిచే సృజింపబడిన రాముడనుడు. ఆతని హృదయము భవభూతి సృజించిన రామునియెడదకన్న కఠినము. ఇట్టి యార్ద్రహృదయము కాళిదాసునికిం గూడ కలదు. శకుంతల తనభర్తగారియూరున కేగునపుడు పెంచుకొనిన తండ్రి హృదయమెంతగా విచారింపవలసినదో యల్లే చిత్రింపం గలిగినాడు!

"యాస్యత్యద్య శకుంతలేతి హృదయం సంస్పృష్టము [త్కంఠయా
కంఠః స్తంభిత బాష్పవృత్తికలుషఃచింతాజడందర్శనమ్
వైక్లబ్యం మమ తావదీదృశశ మహో స్నేహాదర [ణ్యౌకసః
పీడ్యంతే గృహిణః కథంను తనయావిశ్లేషదుఃఖై [ర్నవైః.

బాల్యమునుండియు నుగ్గుపాలం బోసి పెంచి పెద్దదానినిగాం జేసికొనిన తన శకుంతల నేడత్తవారింటికి కరుపటుచు కణ్వుని హృదయము ప్రేమప్లావిత మయిపోయి పొమ్మనిచెప్పుటకైనను మాటరాక డగ్గుత్తికపడ నక నీ కండ్లతో నిన్నుచూచి సంతసించి మురిసిపోవు భాగ్యముచెల్లిపోయెనని కంట తడిపెట్టుకొని నికరముగా నాడబిడ్డల కన్నవారిగతిని స్మరింపజేసినాడు. కవి స్మరింపజేసినాడు. నిజముగా మరల నాచుభాగ్యము కన్నను కడుపులోని పొంగు నాపుకొనజాలక కవియే తాదృశబాధను వెలిబుచ్చినాడు. ఇట్టి యావేశము గల పట్టులనేకములున్నవి. చవికైనను మురారిహృదయమున నియ్యవి మృగ్యములు. వారలకున్న సుఖదుఃఖలీనత యీతనికి లేదు. ఈతనిదృష్టి యెంతసేపును వాగాడంబరమందును శాస్త్రప్రసిద్ధపదములనే యేరి వేయుట యందును మగ్నమైనది. పాత్ర సుఖదుఃఖములయందు లీనుడై వ్రాయునంతటి చాతుర్య మీ కవికి లేదు. కావుననే యీతని శృంగారరచనయు వీరమందలి రచనము సమముగానే యుండును. చూడుడు.

"తదాత్వోత్ప్రేక్షిన్నీ లన్నిద్రిడమరమణీయాత్కలితనతాం
నిచిత్య ప్రత్యంగాదవ తరుణభావేన ఘటితా
స్తనా సంబిభ్రాణాః క్షణవినయ వైయాత్యమసృణ
స్మరోన్మేషాః కేషాముపరి సరసానాం యుక్తయః"

పైశ్లోకమందు కంచుకిచే శృంగార రసచ్ఛాయలు గల భావము నెట్లు గడబిడగా చెప్పించినాడో? కాళిదాసభవభూతులలో నిట్టి ఘట్టముల రచనయే భేదముగా నుండును.

"కిమపి కిమపి మందం మంద మాసత్తియోగా
దవిరళితకపోలం జల్పతోరక్రమేణ
అశిథిల పరిరంభవ్యాపృతైకైకదోష్ణో
రవిదితగతయామా రాత్రిరేవ వ్యరంసీత్.

(భవభూతి)

ఇందు రామునకు గల సీతావిషయిక ప్రేమాధికమును ప్రతిపదస్రవదమృత సంభాషణములనురీతిని ప్రకటింపం గలిగినాడు. ఇందాపదముల నేదియో యనిర్వాచ్యమగు జీవకళ తాండవించి ప్రముగ్ధులం జేయుచున్నది. ఇది చదువునప్పుడు సీతారాము లిద్దఱియందు నొకరిదరి నొకరు చేరి చిరునవ్వు పెదవులతో నుత్కంఠాధిక్యముతో నేవేవియో ప్రేయోలాపముల

సెపమున స్పర్శసుఖ మనుభవించి మురిసిపోవు నూతన దంపతుల ప్రేమోల్బణము పాఠకుల దృష్టికి కట్టక పోదు. మురారిశ్లోకమును చదివిన ముందుగా నదెట్లన్వయము? ఈ పదమున కేమి యర్థము? ఈ కల్పన యేమి? అని వాచస్పత్యముపైనో యే శబ్దరత్నాకరముపైనో మనదృష్టి ప్రసరించును. ఇఁక కాళిదాసు రచన పరిశీలించిన

"అనాఘ్రాతంపుష్పం కిసలయమలూనం కరరుహై
రనావిద్ధం రత్నం మధునవ మనాస్వాదితరసం
అఖండం పుణ్యానాం ఫలమినచ తద్రూప మనఘం
న జానే భోక్తారం కమిహ సముపస్థాస్యతి విధిః"

అనుచు వ్యంగ్యమర్యాదతో కోమలవర్ణ బంధముతో సులలితపదములతో రచించు నలవాటుగలవాఁడు. ఈ మాత్రపు పదపేశలమైన నుమురారికవి చూపిన పట్టులు లేవు. ఇఁక మురారిలోని వీరరసశైలిని చూతము.

"కల్పాంతకర్కశ కృతాంతభయంకరం మే
నిష్ఫ్రిఘ్నతః క్రతువిఘాతకృతా మమీషామ్
నీరాక్షసాం వసుమతీమపి కర్తుమద్య
పుణ్యాహమంగళమిదం ధను రాదధాతు"

ఇందు క్రోధమందు జూపఁదగిన వీరలక్షణములును పరుల ఝళిపించు పదబంధమును నుండుటచే పూర్ణముగా వీరరస మున్నది. కాని యిదివఱకు చూపిన శృంగారచ్ఛాయా రచనకును దీనికిని భేద మంతగా లేదు. దానియందు "తదాత్వతోప్రినీన్మల న్మ్రదిమ, కఠినతాం, క్షణవినయమైయాత్యమసృణస్మరోన్మేషాః" అనెడి పరుషాక్షరములు శృంగారరసభంజకములు. ఇట్టి పదములలో నొకవిధమగు నుద్రేకము పుట్టించు గుణమున్నను గాని, యాహ్లాదగుణము లేదు. ఇట్టి వనేకరచనా విశేషములు ఈతని యన్నిరసముల యందును సమముగానే యుండును. కాళిదాసభవభూతులలో నట్లు గాదు శృంగారమును జెప్పునపు తద్విషయక హావభావాదులు, పదములు, మార్దవము, బంధమాధుర్యము కలసియుండును. ఇఁక వీరి వీరరసమునందలి రచనను పరిశీలింతము.

"అయంహి శిశురేకకో మదభరేణ భూరిస్ఫుర
త్కరాలకరకందలీ జటిలశస్త్రిజాలైర్బలైః
క్వణత్కనకకింకిణీ ఝణఝణాయితస్యందనై
రమంద మదదుర్దిన ద్విరదడామరైరావృతః"

"ఆగర్జద్గిరి కుంజకుంజర ఘటాని స్తీర్ణకర్ణజ్వర
జ్యానిర్ఘోష మమందదుందుభిరవైరాధ్మాయము [జ్జృంభయన్
వేల్లద్భైరవరుండఖండనికరైర్వీరో విధత్తే భువం,
తుష్యత్కాసకరాలవక్త్రవిఘసవ్యాకీర్యమాణా [మివ"

ఇత్యాదిశ్లోకములచే పండిపోయిన వీరరసమును వెదలఁ గక్కింతురు. వీరి శృంగారవీరరచనా విశేషముల సుకరముగా తెలియవచ్చును. ఇట్లే కరుణరసస్థానముల

"అపిగ్రావారోది త్యపిదళతి వజ్రస్యహృదయమ్"

అని చెప్పి మెప్పింపఁగలఁడు. మఱికొన్నిచోటుల రసానుగుణరీతి వృత్తులు లేక అనవరసమగుచోట మహాస్రగ్ధరాదులు ప్రయోగింపఁబడినవి. ఈ గుణమికకాళిదాసభవభూతులలో ముఖ్యముగా నుండదు.

ఇఁక వర్ణనలవిషయమున నీతని మించినవారు లేరు. పైవారి నాటకములందుగూడ హృద్యములగు వర్ణనలున్నను కొన్నికొన్ని విషయములు నీతని యభూతకల్పనలు హృదయమునను పట్టిపోవలసినదే. చూఁడుడు. సూర్యవర్ణన—

"ప్రౌఢధ్వాంతకరాళితస్య వపుషశ్ఛాయాచ్ఛ [లేన క్షణా
దప్రక్షాలిత నిర్మలం జగదహిర్నిర్మోకమున్మంచతి"

ఇందు చీఁకటిచే నిండిన జగత్తనెడి సర్పము కాంతియనెడి మిషచే పొరను విడుచుచున్నదని క్రొత్తపోకడగాఁ జెప్పియున్నాఁడు. మఱియొకచోటఁ జెట్ల

నీడల సూర్యాస్తమయ మగుచున్న కొలఁదిని పొడవగు చుండ నెవఁడో వానినీడలను నా మాలముగా దిగ లాగు చున్నట్లు వర్ణించియున్నాఁడు. మఱియు సూర్యోదయ సమయమున పద్మ మొక్కొక్క రేకును విడచు చుండ నది వికాసముకాదనియు సహస్రకిరణుని యంశువుల నొకటి రెండు మూఁడని లెక్కించుటకై ముడిచిన వ్రేళ్లను విడచుచున్నదో యన్నట్లున్నదనియు మరల సూర్యుఁడస్తమించుచుండ మరల నొక్కొక్క కిరణమును లెక్కించుచు ముడుచుకొను చున్నట్లున్నదనియు చక్కఁగా వర్ణించియున్నాఁడు. ఇట్టివి కవి యొక్క లోఁతుదృష్టిని దెలుపుచున్నవి. మఱియు వెన్నెల వృక్షముల యాకులనడుమ నుండి తెల్లనిబిళ్లల వలె నేలపైఁ బడుచుండ నా ప్రకృతిని జకోరములు చెట్టుకొమ్మపై గూర్చుండి వెన్నెలయనెడి వస్తువును దమ ముక్కులతోఁ బొడుచుకొని తినుచుండగా నడుమ జారిపోయిన ముక్కలవలె నున్నదని యుత్ప్రేక్షించి నాడు. మఱియు కలఁకనీరనెడి చీకటి సముద్రమందలి నీరు తేరుటకై యిందుగుతీసి యందు గలుపగా చంద్రకాంతిగూపము స్వచ్ఛమైన తేటనీరు పైకి తేరెననియు నిందుగు తీసిన నీటిబిందెలో నడుగున మాలిన్యము తేరినట్లు చీకటియందలి మాలిన్యమంతయు భూరుహచ్ఛాయ యనెడి మిషచే క్రిందుగా భూమిపై నిలిచెననియు వర్ణించియున్నాఁడు. మఱియొకచోట పురుగుపట్టిన కఱ్ఱలనుండి రాలెడి చూర్ణములరీతి చీకటియనెడి పురుగులచే నాకాశమనెడి కఱ్ఱ కొట్టఁబడి నక్షత్రములనెడి చిల్లులుపడి కిరణములనెడి పరాగములు రాలుచున్నవని చక్కఁగాఁ జెప్పియున్నాఁడు. ఇట్లనేకము లీతని నవీన భావనావిశేషములున్నవి. స్థాలీపులాకముగాఁ జూపఁబడినవి. ఇట్టి క్రొత్త యూహలు కవియొక్క ప్రతిభాశక్తిని కల్పనాచాతుర్యమును తెలుపుచున్నవి. సామాన్యులకిట్టి కల్పనలు తట్టుటయే దుర్ఘటము.

ఇఁక నలంకారముల విషయము పరిశీలింతము. ఈతని యొక్క మాటమైన నలంకారవిహీనముగా నుండదు. అందును స్వభావోక్తి యీతని సొమ్మని చూడుఁడు.

"బాలే సుతండులవిలోలకదర్శితాసి
రేతాభి రగ్నిశరణేషు సధర్మిణీభిః
ఉత్త్రాసహేతుమపి దండముదస్యమాన
మాఘ్రాతుమిచ్ఛతి మృగీ మునయో హసంతి."

ఆ ముగ్ధహరిణశాబకము కొట్టుట కాకఱ్ఱనెత్తిరో? తినుమని చెప్పుటకెత్తిరో? తెలియకయే దానిని తిను వస్తువనుకొని వాసనచూచుచున్నదఁట. ఇది చాల స్వభావోక్తిగా నుండి లేడిపిల్లకు ఋషులయందు గల నమ్మకము చనువును తెలుపుచున్నది. మఱియొక లేడి ఋషులపాపలచే నందీయఁబడు నివ్వరిధాన్యపుఁ బిడికిళ్లను తినుచు నిన్ననో మొన్ననో యీనిన తనపిల్ల నొకకంటను జూచుచునేయున్నదఁట. మఱియు నివ్వరి తండులముల తీసికొనిపోవు చీమలబారులు ప్రాకుచుండ నా యాశ్రమభూములన్నియు పిపీలికాపంక్తుల నలుపుతోడను పచ్చికపసిమితోడను తండులముల తెలుపుతోడను విచిత్రవర్ణములుగా నున్నవని చెప్పినాఁడు. మఱియు పాదులకై చేయఁబడిన పిల్లకాలువలు మెల్లన పాఱుచుండనవి కేరళదేశకాంతల యుంగరపు ముంగురులవలె కుటిలములై యున్నవనియు నిట్లనేక స్వభావోక్తులఁ జూపి యాహ్లాదముగా వర్ణించి యున్నాఁడు. ఇంక నిట్టివనేకములు గలవు. వానిని చదువుచున్న నపూర్వమగు దర్శన కౌతుక మావహింపక మానదు.

ఇంక నుపమాచిత్రములఁ జూచినచో నవ్వియు క్రొత్తగానే యుండును. కాని యిట్టివి కొన్ని కవిలోకప్రసిద్ధములు గాకపోవుటచే నంతరుచిగా నుండవు. చూడుఁడు.

"అయమపి ఖరయోషిత్కర్ణకాషాయమీషత్."

అస్తమించుచున్న సూర్యకాంతి యాఁడుగాడిద చెవులలోని యెరుపువలె నున్నదని చెప్పినాఁడు. ఇచ్చట నొక వ్యాఖ్యానకర్త "అత్ర న్యూనోపమా దోషః త్వ స్తన్యః" అని వ్రాసియున్నాఁడు. ఏదోష మున్నను నియ్యది యప్రసిద్ధమగుటచే నందము చెడినది. మఱియు నొకటి ప్రాంతములయందు కొఱుకఁబడినట్లుంట నల్లని రోమములతో గూడిన మేకతోలువలె నున్నదని చెప్పియున్నాఁడు. మఱియొకచోట "జాతాః పక్వపలాండుపాండు మధురచ్ఛాయాకిర స్తారకాః ప్రాచీమంకురయంతి" అనఁగా సూర్యకిరణములు పండిన యుల్లిగడ్డయొక్క కాంతులవలె సుందరముగాఁ దెల్లగా నున్నవట. ఇట్టి యప్రసిద్ధోపమ లింక ననేకములున్నవి. "లూతా తంతు వితానవర్తులమితో బింబం దధత్" ఇచ్చట సూర్యబింబమును సాలెపురుగుగూడువలె నున్నదని చెప్పినాఁడు.

"నిర్ముక్తశేషధవలై రచలేంద్రమంథ
సంక్షుబ్ధదుగ్ధమయ సాగర గర్భగారైః
రాజన్నిదం బహులపక్ష చలన్మృగాంక
చ్ఛేదోజ్జ్వలై స్తవ యశోభి రశోభి విశ్వమ్"

ఇందు కీర్తులను పాములకుబుసముతోడను చంద్రుని ముక్కముక్కలుగఁ జేయఁగా వానికాంతివంటి వనియు చమత్కరించినాఁడు. మఱియు

"ప్రత్యాసన్నసురేంద్రసింధురశిరస్సింధూరసాంద్రా[రుణా
యత్తేజ స్త్రిసరేణవో వియదిశః ప్రాచీన మాతన్వతే"

అప్పు డుదయించుచున్న సూర్యకిరణములు దేవేంద్రుని వాహనమైన యేనుగుయొక్క శిరమందలి సిందూరకాంతివలె నున్నవట. ఇవన్నియు గొన్ని న్యూనోపమలు గొన్ని యప్రసిద్ధోపమాఖ్య దోషములునై యున్నవి. ఇట్టివి సామాన్యముగా గ్రంథోపనిబద్ధములు కాఁగూడదు.

మఱియు నీతని భాషా కౌటిల్యముతోఁ బాటు మఱింత కుటిలగతి గలిగిన యభిప్రాయములున్నవి. అవి బిఱుసులౌక్యములతో నిండియున్నది. అట్టి భావము వాడుకలోఁ గొంచెమున్నను నీతఁడు చూపినంత కుటిలముగా నుండఁగూడదు చూడుఁడు. విశ్వామిత్ర వామదేవ సంభాషణమందు.

"సఖే వామదేవ! ఇయమనేన పీయూషతుషారసీకరాసారవర్షిణీ సుజన సంవాదకౌతుక మేఘరేఖా పౌరస్త్యేనైవ మరుతా లోకనాథేన సహస్రీక్రియతే"

స్నేహితునితో మాటలాడుట యనెడి యుత్సాహమున కెన్ని యారోపణలు తగిలించి యున్నాఁడో?

"దిలీపకులకుశలకర్మ కల్పలతానవాంకురగ్రంథిభిరుదీర్యంతే కిసలయాని"

అనియు, దేవతలందఱు నీకు నమస్కరించుచున్నారనుటకు

"త్రాసోత్కంపత్రిదశపరిషన్మౌలి మాణిక్యమాలా
బాలాదిత్య ప్రకరకిరణస్మేర పాదారవిందే"

అనఁగా భయముచేత గడగడవడఁకుచున్న సమస్త దేవతల శిరస్సునందలి కిరీటములయందున్న మాణిక్యసమూహమనెడి లేతసూర్యుల సమూహముయొక్క కిరణములచే చిరునవ్వుతోఁ గూడిన పాదపద్మములు గలవాఁడనియు, సమస్తరాక్షసులను జయించినవాఁడ వనుటకు.

"సమస్తాసురవధూకచాకృష్టపీడా ప్రసభసుభగంభావుకభుజః" అనఁగా సమస్తరాక్షసస్త్రీలను బలాత్కారముగాఁ గొప్పులఁబట్టి యీడ్చుటనెడి యాటలయందు మనోహరమైన భుజములు కలవాఁడనియు మఱియొకచోట "విషమైరాహ్రియమాణస్య లోచనద్వయద్విపస్య కోపి జనో వివేకమంకుశయితుం నేష్టే" అనియు జటిలముగా నలంకారభూయిష్ఠముగా నారోపణలతోఁ జెప్పుట యీతని కలవాటు. ఇది మాటలలోను పద్యములలోను గూడ నిండి నిబిడీకృతమైనది.

ఇట్టిపద్ధతి నాటకశైలి కంత యనుగుణముకాదని నా యభిప్రాయము.

ఇఁక నాటకీయలక్షణ మెంతవఱకు దీనికి సరిపడియున్నదో విచారింతము. సామాన్య నాటకలక్షణములన్నియు సరిపడియే యున్నవి. నాందీసూత్రధార ప్రవేశమును, వారిమాటలలోఁ గావ్యార్థసూచనయు సంపూర్ణముగాఁ జేయఁబడినది. విష్కంభాదులచే నసారమైనట్టియు "దూరాధ్వానం వధం యుద్ధం రాజ్యదేశాదివిప్లవం" అనెడి నియమముచే నిషేధకర్మ ప్రదర్శనపరిత్యాగమును జేయఁబడినది. విష్కంభములు చాల విపులముగా నుండియున్నవి. ఇట్టి విపులత్వమితరనాటకములలో లేదు. ద్వితీయాంకముననున్న శునశ్శేఫపశుమేధ ప్రసంగముతో నిరువదిపేజీల విష్కంభము వ్రాయఁబడినది. నాల్గవయంక ప్రారంభమున నిరువదిశ్లోకములతో దానికి రెట్టింపు గద్యతో శూర్పణఖామాల్యవంతుల ప్రసంగముగల విష్కంభము వ్రాయఁబడినది. ఇట్లే యయిదాఅంకముల మొదట నిరువదిశ్లోకములకు తక్కువగాని విష్కంభములు నిలుపఁబడినవి. అంకాదుల విష్కంభములన్నియు కలిపిన నాటకమునకు మూఁడు రెట్లుండును. ఇట్టి రచన చాల విసువుగా నుండుటయేకాక ప్రదర్శనానర్హతయు వస్తున్యూనతయు తద్ద్వారా నాటకాభిరుచి తగ్గుటయు గూడఁ గలుగును. కాన నీతని విష్కంభ దైర్ఘ్యశైలి మంతశోభాదాయకము కానేరదు.

"యత్తత్రానుచితం కించిన్నాయకస్య రసస్యవా
విరుద్ధం తత్పరిత్యాజ్య మన్యధావా ప్రకల్పయేత్"

అను న్యాయముచొప్పున నాయకునికీర్తి భంజకమగు కథనుగాని హాస్యాస్పదమగు దానినిగాని మఱియొకరీతిని మార్చి తద్విషయకమగు నాయకాపకర్షను పరిహరింపవలెను. కావుననే రామాయణమందలి సప్తతాళవృక్షముల చాటునుండి రాముఁడు చేసిన వాలివధను నాయకాపకర్షహేతు వనియే యీతఁడు దక్కఁగా మార్చి ప్రత్యక్షముగా సగర్వముగా సరోషముగా రాజవిద్వానుకు తగునట్లుగా వాలి రామలక్ష్మణులచే సంభాషణఁజేయించి రంగముపై యుద్ధము చూప రాకుండుట రణభూమికి రాముని వాలినిగూడ పంపించి వాలివధను గుహునిచే ప్రకటించినాఁడు. ఇది యుక్తియుక్తముగా నున్నది.

"నచాతిరసతో వస్తు దూరం విచ్ఛిన్నతాం నయేత్
రసంవా నతిరోదధ్యాత్ వస్త్వలంకారలక్షణైః"

అనఁగా కథాభాగమును దూరముగాఁ జేసి శాబ్దబోధ కలుగకుండ నడుమనడుమ పెద్దవర్ణనలచే పాడు చేయరాదు అను నియమమున్నను ప్రథమాంకమున దశరథవిశ్వామిత్రుల ప్రసంగముచే వస్తు దూరమైనది. అట్టి ప్రసంగము చాలవఱకు తగ్గించిన వస్తు దూరము కానేరదు. ప్రథమాంకమంతయు దానితోనే నిండినది. ఇట్లే సప్తమాంకమునకూడ సీతారాములతో విభీషణాదులు పుష్పకారూఢులై యయోధ్య కరుగుచు మార్గమధ్యమున కనుపడిన వానినెల్ల వర్ణించుట వారు వేసిన శంకలకు రాముఁడు సమాధానము ఈరీతి విశ్వగుణాదర్శముగా నంకాంతమువఱకు వర్ణించి నూటయేబదివరకు శ్లోకముల నితివృత్తమున కనుకూలింపని వ్యర్థమైన గాథ వర్ణింపఁబడినది. దీనిచే రసాదికము దూరముగాఁ జేయఁబడి మనము చదువునది రామాయణమా? లేక దేశవర్ణనమా? అనెడి సందేహము కల్పించుచున్నది. ఇది యింత విస్తృతిచేయుట కళంకాధాయకము. నాటకీయచ్ఛాయయే దీనిలోఁ గనుపడదు. శ్రవ్యకావ్యములలో సైత మింతటివర్ణన లుండవు. ఇట్టి విషయములైన సంభాషణల వలనను దీర్ఘవర్ణనల వలనను కవి తన పాండిత్యము ప్రకటించుకొనుట తప్ప వేరు లాభముండదు. ఇవన్నియు నభినయానర్హములు. రంగముపైపఠనానర్హములని గూడ ననవచ్చును. దీనినిబట్టి కవికి తాను వ్రాయునది నాటకమను దృష్టియు దీనిని ప్రయోగానుకూలముగా వ్రాయవలె

నను దృష్టియు లేదని తేలుచున్నది. మఱియు నాటకాంకములనతివిస్తృతములుగా నుండవలెను. ఒక్కొక్కపాత్రకు సుమారు ముప్పది లేక నలువదిపద్యములకన్న నెక్కుడుండరాదు. ఈతని నాటకమందన్న పాత్రకు రెండువందల శ్లోకములకు తక్కువగానుండవు. ఇన్నిపద్యముల చదువవలసివచ్చిన పాత్రధారికి ఎంత కష్టమో మనమే తెలుఁగుదుము. కాని నాఁటి కాలమువారట్లు చదువుటకు సమర్థత గలవారేమో? వారినాటకదృష్టికిని మన నేటి నాటకదృష్టికిని చాల భేదమున్నదిగాన నీవిషయమంత చర్చనీయముగా నేరదు.

"పాత్రైస్త్రిచతురైరంకం తేషామంతేస్య నిర్గమః."

అను నియమముచొప్పున మూడునాఁలుగు పాత్రలకన్న నంకమున నెక్కుడుండరాదని శాస్త్రకర్తలు చెప్పఁగా నైదారుపాత్రలనఱకు పెట్టి మాట్లాడించినాఁడు. ఇదంత దోషముకాదు. ఇట్టి బహుపాత్రప్రవేశము శాకుంతలాదులలో గూడ నున్నది. దుష్యంతుని యెదుట శకుంతల మాట్లాడునపుడు దుష్యంతుఁడు, ఆతనిమంత్రులు, శకుంతల, గౌతమి, శార్ఙ్గరవ శారద్వతుల ప్రవేశము కాళిదాసు చేయించినాఁడు. తక్కిన సంధ్యంగాదులు సంధులు, బీజబిందు పతాకాప్రకర్యాదులు సంపూర్ణముగా నున్నవి.

మఱికొన్నిచోట్ల వ్యాకరణసూత్రములకు సూత్రములే పరిభాషలే వ్రాయఁబడినవి. ఇది దారుణకృత్యము. భాషాకాఠిన్యముతోఁబాటు సూత్రప్రాయముగా వ్రాసిన నద్దానిమార్దవము చెప్పనక్కరలేదు. దీనినిబట్టి నాటి సామాజికులందఱు వ్యాకరణ పండితులని చెప్పఁజాలముగదా? కాఁగా నిట్టిరచన మయోగ్యము. చూడుఁడు.

"యదిందోరన్వేతి వ్యసనముదయం వా నిధిరపాముపాధిస్తత్రాయం జయతి జనికర్తుః ప్రకృతితా"

పై నధోరేఖాంకితస్థలమందున్నది పాణినీయ సూత్రము. "జనికర్తుః ప్రకృతిః" అని మూలము. అనఁగా సముద్రుఁడు చంద్రుని యుదయానుదయముల ననుకరించుచు తానుగూడ వృద్ధిక్షయముల నందుచుంటకు జన్యజనకభావసంబంధమే కారణమనుట కింత శ్రమపడినాఁడు. మఱియొకచోఁట "ప్రకృష్టకర్త్రభిప్రాయక్రియాఫలవతోవిధిన్" అని చెప్పియున్నాఁడు. దీనిమూలము స్వరితఞితః కర్త్రభిప్రాయే క్రియాఫలే" అని చెప్పఁబడినది. మఱియు "విశ్వామిత్రోఽయం బ్రాహ్మణోఽపి స్థానివద్భావేన క్షత్రధర్మం నవిజహాతి" అనిస్థానివద్భావ పరిభాషను వాడియున్నాఁడు. ఇట్టివి ప్రయోగించినచో నిదికూడ నొక శాస్త్రగ్రంథమువలె నగును. మఱికొన్నిచోట్ల శ్లేషలు గూఢార్థములు రెండు మూఁడర్థములు వచ్చునట్టి రచనచేసి పెటుకు కావ్యమనిపించినాఁడు. ఇట్లు నాటకభాష కాక శ్రవ్యకావ్యభాషలో వ్రాయుటచేతను, కూర్పుకాఠిన్యముచేతను రసానుగుణవృత్తులు నాటకీయ నియమములు లేకపోవుటచేతను, ఉపమాద్యలంకారము లప్రసిద్ధములుగాఁ జెప్పుటచేతను, జటిలములగు వక్రసంభాషణలచేతను, నాటకాచారము కాని విష్కంభక దైర్ఘ్యములచేతను. వ్యాకరణసూత్రములే చొనుపుటచేతను, ద్వ్యర్థికావ్యమునువలె రెండుమూడర్థములు వచ్చులాగున నచ్చటచ్చట వ్రాయుటచేతను "మురారేస్తృతీయః పంథా" యని పెద్దలనుట వాడుకయైనది.

వ్యాసపరిశీలనము

ఉ. భా. ప్ర. దువ్వూరి సూర్యనారాయణమూర్తిగారు

గడచిన శ్రావణమాస భారతిలో "కవిత్వకళ" అను విషయముపై కపిస్థలం శ్రీరంగాచార్యులవారొక వ్యాసమును వ్రాసినారు. అం "దెట్టివాఁడుకవి? దేనిని కవిత్వమనవలెను? నేఁటి కవులలో నెవ్వరి కవిత్వమునకు భారతి చేతోడీయవలెను?" అను మూఁడువిషయములు నిరూపింపఁబడినవి. వీరి కీవ్యాసము వ్రాయుటకు Richard Aldington గారి వ్యాసము చాల సహాయముచేసినట్లు వ్రాసియున్నారు. ఎవరి యూహలైనను తత్త్వార్థము తెలిసికొని యితరులకుఁ దెలుపుటయే ముఖ్యకర్తవ్యముగదా! ఇట్టివిషయములపై నెవరియభిప్రాయములను వారు నిరాక్షేపముగాఁ దెలుపవచ్చునని నే నీవ్యాసమును వ్రాయ ప్రారంభించితిని.

మొత్తముపై వీరి వ్యాసమందు గద్యకవిత్వమునకే ప్రాధాన్య మీయవలెననియుఁ, బద్యకవిత్వములో మంచి లేదనియుఁ దెల్పినారు. అందు వారు ముందు 'కవి' నిర్వచనములో శైల్యార్జవ ప్రతిభలు కలవాఁడే కవి యని చెప్పుచు కవులనుకొనువారందరికి నట్టి యార్జవాదులు లేవనియు "తమచేతనైన ట్లితరుల భావములను, అనుభవములను, మరల వర్ణించుట వారివాడుక. వారి పదములు ఎరువుతెచ్చికొన్నవి. అది కళకాదు. కవిత్వముకాదు" అని వ్రాసియున్నారు. అక్షరశః "ఇది నిజమేగాని కారణము లేకపోలేదు" అనియు, పూర్వవాసన దురతిక్రమము అనెడి నమ్మికచే వారిలో భావపదైక్యములు కలిగెనని చెప్పవచ్చును.

ఇందుకు కారకులు సంస్కృత లక్షణకర్తలు. ప్రబంధములనుగాని, యుపకావ్య ప్రకరణ భాణాదులనుగాని కవులు వ్రాయువలెనన్న తత్పూర్వకృతుల ననుసరించి వీరు కొన్ని నియమముల పాటింపవలెనని నియమించినారు. అట్లే యొక మహాకావ్యమును వ్రాయవలెనన్న—

"నగరార్ణవ శైలర్తు చంద్రార్కోదయ వర్ణనం,
ఉద్యాన సలిల క్రీడా మధుపాన రతోత్సవాః,
విప్రలంభౌ వివాహౌచ కుమారోదయ వర్ణనమ్"

ఇత్యాదులలో నే రెండుమూఁడు లేకున్న నే దోషము లేదుగాని మిగిలినవన్నియు తప్పకుండ నుండవలెనని నియమించిరి. ఈ వర్ణనలఁ దప్పి వ్రాయుచో దోషమున్నదని గదా మనపూర్వకవుల యాశయము. ఇఁక భారత కాలమునుండియు నొక విషయమునే పదుగురు వర్ణింపక తీరదప్పుడే యిద్దరుముగ్గురు కవుల భావములు స్వతంత్రముగా నుండునో గాని మిగిలినవన్నియు ననుకరణములు కాక తీరదుగదా? ఇట్లే యొక స్త్రీని వర్ణింపవలెనన్న కేశాది శిరఃపర్యంతమున్ను వర్ణింపవలెననియు, నందు నుపమానరూపకాది భావనలలో నప్రసిద్ధ, న్యూనాధిక దోషముల దొరలనీయక వర్ణింపవలసినదిగా నియమముగదా? దీనిచే నింక—"ముఖచంద్రులు, ఉత్పలాక్షులు, దృక్చంద్రికలు, అలికుంతలాలు, బింబోష్ఠాలు, కుందరదనాలు, కంబుకంఠాలు, కోకిలస్వరాలు, చెక్కుటద్దాలు, భ్రూచాపాలు, నవ్వువెన్నెలలు, హరిణేక్షణాలు, కుచాద్రులు, మృణాలబాహువులు, గగనమధ్యాలు, హస్తకమలాలు, తిలపుష్పనాసికలు, ఆవర్తనాభులు, సైకతశ్రోణులు, రంభోరులు, పాదపద్మాలు, లతాంగాలు, తటిల్లతాంగాలు, వలిసోపానాలు మతంగజగమనాలు, ఇట్టివన్నియు తత్తత్ప్రసిద్ధములగుట నందలి కవిత్వమందును దొరఁవలసినదే! అందువలననే నేఁడిట్టిపదములు వాని యారోపణమందలి యందమునుగూడఁ బోఁగొట్టు

కొని యుపమేయార్థము మాత్రమే చెప్పుకొనవలసినంత యసహ్యములోనికి దిగిపోయినవి. ఇందువల్ల ప్రదైక్యము తప్పదుగదా!

ఇట్లే గాలిని వర్ణింపవలెనన్న శైత్యసౌరభ్య మాంద్యములను గుణత్రయము వర్ణించి తీరవలెను. దానికై సంవిధానైక్యము కవులలో రాకమానునా? మఱి యొక పురవర్ణన చేయఁదలచిన బ్రాహ్మణాది చాతుర్వర్ణములను వర్ణించుటయు, నావెనుక మేడలు, వేశ్యలు, గుఱ్ఱములు, నేనుగులు మొదలగునవి తప్పక వర్ణింపవలె ననుచుండ గుఱికలవా రెవ్వరి నిబంధనములు మానఁగలరు? ఇట్టిపట్టుల నెవ్వరైన స్వతంత్రించి క్రొత్తపోకడగా నవ్యోపమాన రూపకములు కల్పించి వ్రాయుచో నాకావ్యము దుష్టమే. దాని నిండ దోషములే! వాఁడు కుకవియే! ఇంక దానినెవరు చూచి సంతోషింతురు?

ఇట్లే కావ్యమున నాయకుఁడు ధీరోదాత్తుఁడే కావలెనన కృతిభర్తలనందఱను ధీరోదాత్తులను జేయు భారము కవులు వహింపక మానుదురా? అప్పు డాతని గుణద్యోతనకై కల్పించు సంఘటలన్నియు సమములు కాకుండునా? ఈ విషయములు బాగుగా నాలోచింప originality ఒక భగవంతుని యందుఁ దప్ప మరెవ్వరికిని లేదనవచ్చును. లోకమున మహాకవియని పేరుగన్న కాళిదాసుని కవిత్వమునఁ గూడ నగ్నిపురాణానుకరణము లెన్నియో యున్నవని విమర్శకులు చెప్పుచునేయున్నారు. ఇంతకును నట్టి యనుకరణము స్వప్రతిభావిశేషభూషితమై యానంద మిచ్చునప్పుడు కళ కాకపోదు. మార్పులేక పూర్వకవులభావముల నే యనుకరించిన, అతఁడు కవి కాకపోవచ్చును గాని యనుకరణము పూర్వులదగుటచే ననఁగా (పూర్వకవిభావమే) కాన నది కవిత్వము కాకపోదు. మఱియు—

"తపేన పదవిన్యాసాస్తఏవార్థవిభూతయః
తథాపి నవ్యంభవతి కావ్యంగ్రథన కౌశలాత్"

అన్న లాక్షణికుల ననుసరించి క్రొత్తపదముల సృష్టించుటగాని "అస్మాత్పదాదయమర్థో బోధవ్య ఇతీశ్వరసంకేత శ్శక్తిః" అను నియమము ననుసరింపక పెడగ్ర్రములుదీయుటగాని నవ్యతకు లక్షణముగాదు. నేటి కరుదుగా వాడఁబడిన పదముల నేర్చి మృదుసమాసములతో సార్థకముగా నుపనిబద్ధించుచో నదియే కూర్పులో క్రొత్తఁదనము. అట్లనుకొనిననాఁడు "బాణోచ్ఛిష్టం జగత్సర్వం" అన్నమాటనే యనుసరించి యుచ్ఛిష్ట భాష వ్రాయనేల యని మానినచో వాఙ్మయమే మగునో? ఇట్టి దృష్టిలేకనే శ్రీరంగాచార్యులవారు- "మన హిందూదేశమంతటను ప్రఖ్యాతిగాంచిన కావ్య మొక్కటేని మనయాంధ్రభాషలో నున్నదా? వేలుమడిచి చెప్పుడు చూతము?"—అని దబాయించినారు. దీని రూఢ్యర్థము గ్రహించిననే భాషలో వీరిట్టిగ్రంథమును జూపగలరో? అన్నివిధముల నూతన మార్గములు మనోహర భావములుగల కవిత్వము పూర్వకవులలోఁ గూడ నుండుటచేతనే యమూల్యములైన నియమములతో బయలుదేరిన నేటి కవిత్వము పైకిరాకుండుట తటస్థించినది. మన ప్రాచీన కవుల పెద్దపెద్దగ్రంథములలో కథాభాగము విడిచిన నక్కడక్కడ వ్యాసకర్తగారు నిర్వచించిన సరియైన కవిత్వము లేకపోలేదు. కాని కవిత్వభాగ మొకవంతును గణయతిప్రాసబద్ధమగు కథాభాగము నూరువంతులుండుటచే వీరిట్లు పైమాట ననఁగలిగిరి. గణయతిప్రాసబద్ధకథాభాగమంతయు కవిత్వమే యను దృష్టి మనపూర్వకవులకు నేటికవులలో తత్సదృశులకు గూడ నుండుటచేతనే చీపురుపుల్లమీదను పాదుము కాయలమీదను జెప్పెడి యాశుధార యంతయుఁ గవిత్వమైపోవలసి వచ్చినది. ఇందువలననే రవ్వంత యాలోచించినగాని భావాదులు గోచరింపని కవిత్వము

క్రొత్తమార్పులతో దిగిన నట్టిదానిని పైవారు "ఇదేమి కవిత్వము? ఇదేమి వృత్తము! దీనికేయుప్పుకవియు లక్షణము చెప్పలేదే? దీని కర్థమే లేదు" అనెడి రకములోనికి దిగిపోయినారు. ఇందులకును కారణము లేకపోలేదు. నేటి కవిత్వమునకూడా వీరన్న కవిత్వపుసంపద గలిగిన కవిత్వము చాల తక్కువ, అర్థములేని భావకవిత్వ మెక్కుడగుటచేతనే యీ వాడుక పడినది. కాని చిరకాలమునుండి వెజిగిపోవుచున్న కవితారణ్యమందు క్రొత్తదారి వేయవలెనన్న తుక్కెక్కువ రాక మానునా? కాగాఁ ప్రాచీనకవులలో "కవిత్వమే లేదు" అను వీరి యభిప్రాయము నాకు నచ్చలేదు.

మరియు వ్యాసకర్తగారు పండితదొరల యభిప్రాయముల వ్రాయుచు "వారు గణములనే ప్రతిబంధకములన మనకు గణయతిప్రాసలన్నియుఁ గలిసి భావప్రకటనకు ప్రతిబంధకములని వేరె చెప్పనక్కరలేదు" అని వ్రాసినారు. ఇది వీరి స్వంతాభిప్రాయము కాఁబోలు! కాని మరల వీరు "యతిప్రాసలు మనోహరాభిప్రాయముల కడ్డువచ్చునెడ విడువవచ్చును" అనెడి రాజగోపాలరావుగారి మంచిసలహానుగూడ తా మంగీకరించి యుదహరించిరే? ఇట్లు మరల పోయి పోయి "గణ యతి ప్రాసలున్నయెడల పనికిమాలిన కావ్యముకూడ మనలను తల యాడింపఁజేయును" అనియు వ్రాసినారు.

వీరి యీ మూడభిప్రాయములనుబట్టి చూడ మొదట యతిప్రాస లనవసరమని, రెండవసారి యభిప్రాయ ప్రకటన కడ్డువచ్చునపుడు విడువవచ్చుననుకొని, మూడవసారి యతిప్రాసలలో సొంపు కొంచెమో గొప్పో ఉన్నదని మూడురకములుగాఁ దేల్చినారన్న మాట. యతిప్రాసలలోఁగూడ స్వల్పానంద ముండగా వీరనిన *Vers libre* అనెడి పూర్ణానందదాయకమగు కవిత్వమున నీ స్వల్పానందముగూడ పాటించిన నీ రెండును గలసి బ్రహ్మానందము కలుగఁజేయునేమో? అప్పుడు యతిప్రాసల పాటించి యర్థవంతైన కవిత్వము చెప్పుచు పద్యకవిత్వమునకుఁగూడ కొంత తావిచ్చిన బాగుండును గదా! అదియుఁ గాక యిందు సత్యము పరిశీలింపక గణములే యభిప్రాయబోధన కడ్డు వచ్చుచున్నవి కనుక వానిని త్యజింపవలె ననెడి దొరగార్ల యభిప్రాయము శిరసావహించి వానితోఁబాటు యతిప్రాసలనుగూడ విడిచి పద్యకవిత్వమునే గంగలో కలుపుటకంటె భావప్రకటన కడ్డువచ్చునపుడే యతిప్రాసలనుమాత్రము విడిచిన దోష ముండదను గోపాలరావుగారి మతము నాశ్రయించిన సమంజసముగా నుండునని నా యూహ. అట్లే కవులందఱును జాగ్రత్తతో వ్రాయుచున్న పేరైన గ్రంథము లుదయించుటలో సందేహ ముండదు. మఱియు వీరు "సంస్కృత గ్రంథములు ప్రపంచమందంతటను పేరు మ్రోయుటకు కారణము యతిప్రాసల నిర్బంధము లేకపోవుటయే" అని చెప్పినారు. ఆంధ్రమున నున్నట్టి యక్షరసాజాత్య రూప యతులు మాత్రమే సంస్కృతమున లేవు గాని యతియే లేకపోలేదు. ఏయే వృత్తముల కేయే స్థానముల నెన్నెన్ని పట్టుల సంధి విరుగవలెనో యచ్చట తప్పక సంస్కృతమున విరిగి తీరవలయును. దీనినే వారు "యతి ర్విచ్ఛేదసంజ్ఞకః" అని చెప్పుకొనినారు. ఇది నిర్బంధమే. ఇఁక ప్రాసలుగూడ నక్షర సాజాత్యమునే సూచించును.

'అంత్యప్రాస, అనుప్రాస, ఛేకానుప్రాస, సత్యనుప్రాస అని యింక ననేకములున్నవి. కాని, యిట్టివి తప్పక వేయవలసినవి గాదు. తెనుఁగులోని యతి కివియే దారి చూపియుండవచ్చును. కనుక నివి లేకపోవుట చేతనే సంస్కృతగ్రంథములకు పేరు వచ్చిన"దనుట మాత్రము వింతగా నున్నది. అంతకన్న ప్రథితులైన గ్రంథకర్తలకు శ్రీ రంగాచార్యులుగారు చెప్పిన

ట్లార్జవ ప్రతిభాశైలులు పుష్కలముగ నుండుటచేత నే వారు మహాకావ్యముల వ్రాసిరనుటయు తన్మూలమున తద్గ్రంథములు లోక ప్రథితము లగుటయు సంభవించిన దనుట చాలమంచిది. మఱియు—"ఆంధ్రదేశమున నింటింటను కవులే. ఇట్టి కావ్యముల పెచ్చుపెరుగ కుండఁ జేయుటకు దివ్యామృతమువంటిది *Vers liber*" అనికూడ వ్రాసినారు. ఇందు రంగాచార్యులవారు సత్యమే పలికినారనవలెను. అందభిప్రాయమేమన నమృత మెట్లు చావు లేకుండఁజేసి బలమునొసంగునో యీ *Vers liber* యింటింటఁబుట్టిన కవిత్వమునట్లే యభివృద్ధి నందించును. ఏమందురా? ఇప్పుడు గణ యతి ప్రాస వృత్తాది నియమము లనేకము లున్నపుడే కవితా ప్రవాహము వెల్లివిరియుచుండ తన్నియములు లేకుండ భాషా ప్రాశస్త్యములేకుండ కవిత్వము వ్రాయ వచ్చునన్నచో నప్పుడు కవు లింటింటనే గాక యన్ని రోడ్లమీదను, నన్ని షాపులలోను, బజారులలోనుగూడ బయలుదేర వలసినదే. అప్పుడు పుల్లమ్మ వెంకమ్మలు గూడ పుష్కల కవయిత్రులే. ఆ రోజులలో కవితా కాంత పదివేల యనుపపాదములలో చిందులు ద్రొక్కిన దన్నమాటే. అప్పుడితరులు తాము కవులమే యని వ్రాయుదురో స్వప్నమందుగూడ కవులము కామని మానుదురో శ్రీవారే విన్నవింతురు గాక.

మఱియు "తాను తలచినదానిని తాను చూచిన దానిని స్పష్టముగ తనకు దోచినట్లు వర్ణించుటే శైలి" అని శైలి స్వరూపమును చెప్పినారు. ఇయ్యది చాల లోకవిరుద్ధముగా నున్నది. యథేచ్ఛావర్ణనము నకును శైలికిని చాల దూరమున్నది. దీని సరియగు స్వరూపమేమన- "యా పదానాం పరాన్యోన్యమైత్రీ శయ్యేతికథ్యతే. రీతిర్నామ గుణాశ్లిష్ట పదసంఘటనా మతా" అనెడి శయ్యారీతుల సాంకర్యమే శైలిస్వరూపము. అనఁగా పద మైత్రి. కవికూర్పులోని నేర్పు. ఒక కావ్యమున శైలి పరిశీలింపవలెనన్న "అందలి పదములు కుంటుచున్నది లేనిది, గణగన్నుకమున్నది లేనిది, దాంపత్య విరహితపద సమాసములున్నది లేనిది, మార్దవమున్నది లేనిది" చూడవలెనే గాని పై వారి యుద్దేశమే శైలి; దానినే పరిశీలింపవలె ననుట యసంభవము. మఱియు- "కవిత్వము పద్యరూపముననయినను వచన రూపమునైనను నుండనగునది మనలో చాలమందికి తెలిసినట్లు లేదు." అని వ్రాసినారు. ఈ విషయ మందరకును దెలిసినదే. తెలిసియు గద్యమందుకంటెఁ బద్యమందు చెప్పరాని సుఖమెద్దియో యుండుటచేత లోకులు గద్యముకన్న పద్యమునే యాదరించుచున్నా రనవలెను. చక్కని యొకపాట పాడునపుడే యేడ్చెడి బిడ్డ హాయిగా నిద్రించుచున్నాఁడు. ఒకపద్యమును జక్కగా నూదునపుడే పాము తలనెత్తి యాడుచున్నది. పద్యముతోఁబాటిందు హాయి కలిగించు సంగీతమున్నను, నయ్యది పద్యముతోగాని పాటతోగాని కలిసినప్పుడెట్టి యానంద మీయఁగలదో యట్టి మహానందమును గద్యముతోఁ గలసిన నీయ జాలదు. ఇట్లా బాలగోపాలమునకు స్వేచ్ఛగా తిరుగు నపుడు వారినోళ్లనుండి యెద్దియో గణప్రాసల ననుసరించిన పాటలే వచ్చునుగాని గద్యఁ జదివి సంతసించువారరుదు. వేయేల, ప్రకృతిని చూచి ప్రముగ్ధులైన వేదర్షులందఱును నాదిని పద్యరూపముననే ఋగ్వేదమును పాడుకొనిరి. అదిగాక గద్యముకూడ కవిత్వమే యని యిప్పటికుదయించిన లక్షణ గ్రంథములన్నియుఁ జెప్పుచుండ నేయక్షరనైరాశ్యులకో తెలియక పోవచ్చును గాని, మిగిలిన వారందఱకుఁ దెలిసియే యుండును. కనుక నాటినుండియు తెగుతెంపులు లేక బయలుదేరిన పద్యకవిత్వము నణఁగద్రొక్కి గద్యమే వ్రాయవలెను. అదే కవిత్వమన నెన్నటికిని జెల్లదు. అదియుఁ గాక వీరు చెప్పిన ట్లార్జవప్రతిభాశైలి పారి

శుద్ధ్యము గల కవిత్వ ముండవలెనుగాని యది పద్యమైన నేమి? గద్యమైన నేమి? ఎట్లున్న నప్పుడు సహృదయులు సంతోషింప వలసినదే !

మొత్తముపై నాధునికులలోఁ గూడ గొప్పవారుండవచ్చును. వ్యాసకర్తగారికి నచ్చినవారిని వారు జూప నితరు లితరులను సూచింపకపోరు. మనము ప్రాచీన కవులలో నేమాత్రము కవిత్వమే లేదని వారిని విడిచి శ్రీవారు చెప్పినవారే కవులని శిరసావహింతుమా? ఇట్టి విషయముల నిష్పాక్షికముగా నాలోచించి వాఙ్మయమంతయుఁ బరిశీలించి యుదారాదర్శములతోడను, మంచిమార్గములతోడను బయలుదేరుచున్న ఆధునిక కవిత్వమును, తద్వారా తత్కవులను మన్నించి బుఱ్ఱ నెత్తుసరికి వాళ్లపై రాళ్లు రువ్వక, బుఱ్ఱబద్దలు కొట్టుకొన్నను నర్థము తెలియని భావకవిత్వమును తద్వారా తత్కవులను నిరసించి సంతోషించుటయే సరసమని నా మనవి.

శ్రీ శంకరాచార్యులు — మండన పండితుడు

ఉభయభారతి

[మూర్తి]

[భట్టపాద, పద్మపాదాది శిష్యబృందము పరివేశించి]

శ్రీ పరమగురు చరణారవిందయుగళ చిరవరివస్యా సమాసాది తాద్వైత
వేదాంతప్రవీణ ధురీణా !! జై, జై,
సమస్త దుర్మత విజయ త్రిజగ ద్రంగస్థలీ నృత్యన్నిజకీర్తి నటీకర్ణకుండలీకృత
రవి శశి మండలా !! జై, జై,
నిఖిలానర్థనివృత్తి పూర్వక పరమానందా విర్భావలక్షణ పరమ పురుషార్థానన్య
సాధనాద్వైత జ్ఞానవిజయ పర్యవసన్నా !! జై,,
శ్రీమత్పరమహంస పరివ్రాజ కాచార్య శంకరగురో !!

విజయస్వ, విజయస్వ,

[విజయదుందుభులు, దేవదుందుభులు మ్రోగును ,శంకరు డాకాశమార్గ
మున ప్రయాగనుండి మాహిష్మతీపురము చేరును]

శంక:— ఆహా! ఏమి యీ ఉద్యానవనముల అందము? ఇట్టి రమణీయప్రదేశముల శిష్యబృందముతో కలిసి కూర్చుండి వేదాంతగోష్టిలో మునిగి మహానంద మనుభవిం చువానిదిగదా జన్మము. ~~ఇట్టి సౌభాగ్యమే మున నా భాగ్యవశమున ఒక్కసారి సేవించి తరించెదను.~~

[[redacted] మాధ్యాహ్నిక కృత్యము లు నెరవేర్చికొని మండనపండితుని గృహమునకు పోవుచుండును]

శంక:— [పోవుచు దారిలో] అమ్మా! మీరెవ్వరు?

దాసీలు:— అయ్యా! మేము మండన పండితుని దాసీలము నీరములు తెచ్చుటకు పోవుచున్నాము.

శంక:— ఆ పండితవర్యుని గృహ మెక్కడ తల్లీ !!

దాసీ:— అయ్యా! ఆతనిగృహము ఇది అని చెప్పనక్కరలేదు. ఈ వీధినిపొండు. పోగా ఏగుమ్మమువద్దర గూండ్లు కట్టుకొని సర్వకాల సర్వావస్థలయందు చిలుకలు "వేదము ప్రమాణమా? ప్రత్యక్షజ్ఞానాదులు ప్రమాణమా? ఫలము నిచ్చునది కర్మా? లేక పరమాత్ముడా? ఈకనుపిం

చు జగత్తునశించునదా? స్థిరమైనదా? అను వేదాంతచర్చ లెక్కడనల్లుచుండునో అదే మండనపండితుని గృహము గా నెరుంగుదు స్వామీ!!

శంక:—అమ్మా సెలవు. [అచ్చటకు బోయి] ఆహా! ఏమిదీని వాక్చాతుర్యము? ఓహో! తలుపు తీసిలేదే ? ఎట్లు లోపల ప్రవేశించుట? - - - ఆ - - సరే-- నా యోగశక్తిచే లోపల ప్రవేశింతునుగాక [ప్రవేశించి]ఆహా! భూతలమండనుడగు మండనపండితుని గృహమాయిది? ఇంద్రభవనమును మించినదే?

[ఇంటిసొగసు చూచుచుండును]

[ఆనాడు మండనపండితుని యింట పైతృకము. అందు భోక్తలు వ్యాసజైమినులు. వారిరువురకును మండనుడు]

"చరణం పవిత్రం వితతం పురాణం
యేన పూతస్తరతి దుష్కృతాని
తేన పవిత్రేణ శుద్ధేన పూతా అతి
పాప్మాన మరాతింతరేమ.
శుక్రమసిజ్యోతిరసి తేజోసి దేవోవః
సవితోత్పునా త్వచ్ఛిద్రేణ పవిత్రేణ
వసోస్సూర్యస్య రశ్మిభిః,,

[అని పఠించుచు తల వంచుకొని కాళ్ళు కడుగుచుండును]

శంక:—[వారిని జేరి] ఓహో! వ్యాస జైమినులా? నమో గురుభ్యో నమో గురుభ్యః

వ్యాసజైమినులు:—ఓహో. శంకరుడా! విజయీభవ, నాయనా! యిటురమ్ము ఆ ఆసనముపై కూర్చుండుము.

మండనుడు:—[కొఱకొఱ చూచుచు] ఎక్కడనుండి ముండీ! నాకిప్పుడే దాపరించితివేమి?

శంక:—కంఠమువరకే ముండితినయ్యా? నేను.

మండ:—నాచేత నీదారి అడగబడినది గాని, నీ ముండన విషయ మడుగబడలేదు,

శంక:— [వెకిలినముగా] అట్లనా! ఐతే దారియేమైన నీతో చెప్పినదా? చెప్పువరకు దారినే అడుగుము!

మండ:—[మండిపడుచు] ఏమిపొగరురా! దారి నీయమ్మమండ అని చెప్పినది. తెలిసినదా?

శంక:—[చిరునవ్వుతో] ఓహో!అదా కథ? నీవు దారిని అడుగగా ఆదారి నిన్ను గూర్చి చెప్పుచు 'నీయమ్మముండ, అని నీతో చెప్పినదట య్యా! చెప్పవైతివి? అట్లనా?

మండ:—[నిప్పులు కక్కుచు] పశో,

"అహహా! పీతాకీముసురా?"

శంక:—[సగర్వముగా] సురా, పీతా, అనుచున్నావా? అబ్బెబ్బే! కల్లు పచ్చగా ఉండదయ్యా వెర్రిబడా? తెల్లగా ఉండును ఈమాత్రము తెలియదా?

మండ:—ఓరీ దొంగసన్యాసి! కల్లురంగు కూడా నీ వెఱుంగుదువురా?

శంక:—ఆయ్యో బాబు, నేను రంగే కాదటయ్యా ఎఱిగినది. నీవో రుచికూడా ఎఱిగినవాడవు. చాలా ఘనుడవు.

మండ:—అయి! "మత్తో జాతః కళంజాశీ!" లేకున్న ఈ పేలాపనలేమిరా?

శంక:—మత్తః=నావలన, కళంజాశీ, ఉల్లిపాయలు తినువాడు జాతః=పుట్టినాడు, అని అనుచున్నావా? నిజము చెప్పినావయ్యా! తప్పేమున్నది? నీవు ఉల్లిపాయలు తినువాడవు గాన నీకూ అట్టివాడే కలిగినాడు? "ఆత్మా వై పుత్రనామాసి" కాదటయ్యా మరి?

మండ:—ఓరీ పశువా! పెద్దగాడిద కూడా మోయలేని బొంతను మోయుచు, శిఖాయజ్ఞోపవీతములను తీసివేసితివేమిరా? ఈ రెండును బరువయ్యెనా యేమి?

శంక:—ఓరీ దుర్బుద్ధీ! నిజమే. నా బొంత గాడిదే కాదు నీతండ్రి కూడా మోయునే లేదురా పశువా! శిఖా యజ్ఞోపవీతములు నాకు బరువని త్యజింపలేదు. వేదమునకు బరువని తీసివైచితిని, తెలిసినదా?

మండ:—పోషించుకొనలేక పెండ్లామును వదలిన నీ బ్రహ్మజ్ఞాననిష్ఠ వచ్చినట్లున్నది లే, ఈ జ్ఞానము కేవలము శిష్యులకు పుస్తకభారము కల్పించే కొరకే గదా? అట్టిదాని నింకను చెప్పుకొనవలెనటరా?

శంక:—ఓస్, అలసుడవై గురుశుశ్రూష చేయలేక కొంపకు చేరి స్త్రీలను సేవించుచున్న నీ కర్మనిష్ఠముందు నీవన్నట్లు నా బ్రహ్మనిష్ఠ యెంతలే?

మండ:—ఓరీ మూర్ఖుడా! తొమ్మిదినెలలు స్త్రీ గర్భమునుండి వారు కనిపెంచగా పెరిగి తిరిగి వారినే నిందించుటకు నీకు నోరెట్లాడుచున్నదిరా పాపీ?

శంక:—ఒరే! దానికేమిగాని పుట్టినది మొదలుకొని యెవరి స్తన్యము పీల్చుచు ఏ స్త్రీ స్థానమునుండి పుట్టితివో ఆస్థానమునే కామించుచు, మాతృకలగు స్త్రీలను పశువవలె ప్రేమించుచుంటివేమిరా? కర్మజడుడా!

మండ:—[సిగ్గుపడి తాంచువల] ఓరీ కర్మభ్రష్టుడా! ప్రయత్నపూర్వకముగా శ్రౌతాగ్నులను త్యజించిన నిన్ను "వీరహా

భట్లో శంకర మండను లిరువురు నుభయభారతి మధ్యవర్తిత్వమున మహాచర్చలు సలుపుచుందురు.]

ఉభయభారతి:---[ఒకనాడు లేచి] మహాత్ములారా? నాదొకమనవి. నేనిట్లు తమతో పాటుగా నుండిపోవుచున్న నా గృహకృత్యములు అడ్డుచున్నవి. కాన నేను మీ యిరువుర మెడలలోను రెండు పూలదండల నుంచెదను, ఎవరిమెడలోదండ వాడిన వారు గెలిచినవారనుకొనుండు, నేను వేళకు మీకిరువురకును వంటచేసి మిమ్ము పిలిచి తీసికొని వెళ్ళెదను.

శంకరుడు:---అమ్మా! మీచిత్తము.

[ఉభయభారతి పూలదండలు వేసియింటికేగును]

ఇరువురకును చాలకాలము వాదోపవాదములు జరిగెను. మండనపండితుని మెడలోని దండ వాడిపోయెను. సభ్యులు, జయము శంకరునిదనిరి. దేవతలు పూలు చల్లిరి.

మండ:---శంకరా! వాదభయంకరా! ఉభయభారతి విషయపరికారము నేనోడితిని, నేటినుండియు నీదాసుడను.

కాని నాదొకమనవి, నేనోడితినని విచారపడనుగాని నాగురువగు జైమిని మహాత్ముల సూత్రముల నీవు ఖండించితివను విచారము నన్ను బాధించుచున్నది.

శంక:---(నవ్వి) మండనా! విచారింపకుము. ఆ సూత్రములకెంతమాత్రము నీవు గ్రహించిన యర్థముకాదు, అవియు నాచెప్పు సిద్ధాంతమునే ప్రతిపాదించునుగ నికర్మబ్రహ్మనే ప్రతిపాదించునవిగావు.

మండ:---ఏమైనను నాకాబాధ పోవుటలేదు మహాత్మా! నిష్కారణముగా నపార్థములను కల్పించి నా గురుసూత్రముల ఖండించితివిగదా? [కన్నుల నీరునించును]

శంక:---మండనా! విచారింపకుము. ఇదిగో నీసందేహ నివృత్తి చేసెదను. జైమిని మహాత్మా! ~~[కన్నులుమూసి జైమినినితలచి ప్రత్యక్ష మొనర్చి]~~ మహాత్మా! నమస్సులు, తమ సూత్రములకు నా సిద్ధాంతములకేమైన మతభేదమున్నదా?

జైమిని:---మండనా! నాయభిప్రాయమే శంకరుని యభిప్రాయము. ఆయన ననుసరించుము. నిస్సందేహము.

మండ:---ధన్యోస్మి, మహాత్మా, ఇక తమ చరణ శరణము పొందితిని. ఇక నీశిష్యుని శాసించి తరింపచేయుము.

[ఉభయభారతి ప్రవేశించును. శంకరుడు మండనునికి సన్యాసమిప్పించు దృష్టితో నామెవైపు చూచును]

ఉభ!—[ఆయన అభిప్రాయము గ్రహించి] శంకరా! తెలిసినది, ఇదంతయు నేను పూర్వమెఱింగినదే, నీవు కేవలము శంకరుని యవతారమవు. ఐనను నీకిప్పుడు పూర్ణజయము లేదు. అర్ధాంగిని జయించనిదే నీజయ మర్ధజయమేగదా? నన్ను జయించి నాభర్తనప్పుడు శిష్యునిగా చేసికొనుము.

శంక:—అమ్మా! నీవుమాత్రము సామాన్యురాలవా? సరస్వతివే కాదా? ఐనను కీర్తికాములు స్త్రీలతో వాదించుట అసభ్యమని పెద్దలు చెప్పుచుందురు. కాన సందేహించుచుంటిని.

ఉభ:—శంకరా! ఎంత వెఱ్ఱివాడవు. పూర్వము యాజ్ఞవల్క్య గార్గితోడను, జనకుడు సులభతోడను వాదించి తమ మతములు నిలుపుకొనలేదా? నీ మతప్రతిష్ఠ నిలుపుకొందమను నాశయున్నచో నన్నోడించి అప్పుడు నాభర్తను నీయిష్టానుసారము చేసికొనుము. అంతవరకాయనను తాకుటకు నీకు తాహతు లేదు.

[ఆమాటలువిని తిరిగి సభలో శంకరుడామెతో పదునేడు దివసములు ఎడతెరిపిలేక దివారాత్రములు వాదించెను]

ఉభయ:—[ఈతడు బాల్యముండే సన్యసించిన మాట తలచి] శంకరా! అన్నిటికన్నియు చెప్పి ఖండించితివి, ఇదిగో ఇది చివరిప్రశ్న. ఇది చెప్పి పూర్ణజయమునందుము. మన్మథకళలెన్ని. అవియే స్థానములందుండును. వానికి శుక్ల కృష్ణ పక్షములందు స్థితియెట్లు, స్త్రీయందెట్లుండును, పురుషునియందెట్లుండును?

శంక:—[తనలో] ఓహో! గట్టిచిక్కు తెచ్చిపెట్టినదే? ఇది చెప్పిన ఆశ్రమ భంగము. చెప్పకున్న జయభంగము అని ఆలోచించి] అమ్మా! ఈప్రశ్నకు నాకు సమాధానమిచ్చుటకు ఒకనెల గడువు కావలెను. దయయుంచి యిమ్ము.

ఉభ:—సరే! ఇచ్చితినిపొమ్ము.

[అందరు నిష్క్రమింతురు]

....

వ్యావహారికాంధ్రము కూడ కృతకమే యగుచున్నది

రచయిత:

దువ్వూరి సూర్యనారాయణమూర్తి

[‘నేటి వ్యావహారికభాష యొక్క నియమములేక బయలుదేరుచున్నది... నియమములేక వెలువడుచున్న నీ వ్యావహారికమువలన విలక్షణమైన యొక్క కృతకాంధ్రము తయారగుచున్నది... నియమరహితభాషనుండియే తద్రూపమైన సంకరభాష, కృతకపదజాలము పెచ్చు పెరుగుచున్నది...’]

నేడు భాషావిషయమై పండితులనేకు లనేకమార్గములను త్రొక్కుచున్నారు. ఆంధ్రభాషావల్లి వేయితలలెత్తి ప్రాకు రోజులలో భాష కేవలగ్రాంథికవ్యావహారికములలో నేదియో నొకరీతి నడువవలెనన్న నది యెన్నటికిని చెల్లుబడికానిదే. అవసరమును బట్టి వాడుకొనుటకు రెండుభాషలును ఉండి తీరవలయును. అందు ముఖ్యముగా రూపకములు, కథలు వ్రాయుటకు వ్యావహారికము లేకున్న నేటి పత్రికాయుగము పలువురకు సుబోధముకానేకాదు. పరమార్థమాలోచింప రమణీయార్థస్ఫూర్తి యున్నపుడు భాష యెట్టిదైనను బాధలేదు. పాత్ర వెండిదైనను బంగారుదైనను పాత్రలోని పదార్థము యొక్క మంచిచెడ్డలనే భోక్త పరిశీలింపవలెను. తాను భుజించునది పదార్థముగాని పాత్ర కాదుగాన. దీనినే ‘చమత్కారజనకభావనావిషయార్థప్రతిపాదకశబ్దః కావ్యం’ అని పెద్దలు చెప్పినారు. అనగా కావ్యత్వసిద్ధికి భావనోల్లిఖితమైన యర్థముగల శబ్దమునకే యర్హతకలదుగాని యనర్థవత్తుకు తావులేదు.

ప్రస్తుతము నేటి వ్యావహారికభాష యొక్క నియమములేక బయలుదేరుచున్నది. దేశభేదమునుబట్టి వ్యవహారభేదముండుట సహజమే యైనను భిన్నదేశప్రయుక్తపదస్వరరూప వ్యావహారికభేదము నటుంచి తక్కిన నియమములలోనైన సారూప్య ముండుటలేదు. ఒక జిల్లాలోని లేఖకుల భాషయైన నొకతీరున నుండదు. నియమములేక వెలువడుచున్న నీ వ్యావహారికమువలన విలక్షణమైన యొక్క కృతకాంధ్రము తయారగుచున్నది. ఇది వ్యావహారికగౌరవమును న్యూనతపఱచుటయే గాక తన స్వాభావికత్వమును చెఱుపుకొనుచున్నది. కనుకనే గ్రాంథికవాదులచే పరిహాసపాత్రమగుచున్నది.

ఈమధ్య ప్రబుద్ధాంధ్రలో ‘శాస్త్రి’ అను పేరున నెవరో గిడుగువారినిగూర్చి వ్రాయుచు:

‘వ్యావహారికభాషకి హక్కుభుక్తాల్లోంచి తప్పిపోయిన గురుపీఠాన్ని మళ్ళీదఖలుపరిచిన వారీయిద్దరే. (రెండవవారు గురజాడ అప్పారావుగారు)’

‘రామమూర్తిపంతులుగారు భాషయొక్క పూర్వోత్తరాలన్నీ క్షుణ్ణంగా తెలిసిన పండితులు.’

‘పంతులుగారి సింహగర్జనలు భాషాతత్త్వాన్ని బోధపరిచాయి’ అని యుదాహరించినారు.

కాని వీరిరువురరచనలను పరిశీలింపగా నంత విశిష్టత వీరిలో గనబడలేదు. ప్రథమోపదేశికులగుటచే నిట్లు వ్రాసిరేమో యనుకొంటిని.

గిడుగువారి వ్యావహారికము

అసలు వ్యవహారమనగా మనము నిత్యము వాడుకొను జీవభాష. ఇది రెండువిధములు: శిష్టజనవ్యవహారము, పామరవ్యవహారమని. ఈవ్యవహారత్వమన్నది గ్రాంధికభాషను ప్రత్యయ, వ్యాకరణకార్యయుక్తముగా నుచ్చరింపకపోయినంతమాత్రమున నలవడునది కాదు. వ్యావహారికమందు చక్కని యర్థస్ఫూర్తి, యొకవిధమైన యౌపచారికము గలదు. ఈ భాషాస్వరూపమునుగూర్చి శ్రీ గిడుగు రామమూర్తిపంతులుగారే 'వ్యావహారికభాష అనేది శిష్టజనులు వ్యవహారమందు, సంభాషణలోనున్న వాడుకొనే భాష' అని నిర్వచించినారు. వీరి మతానుసారము వీరి వ్యావహారికము పరిశీలింపనందెంతయో యస్వాభావికత్వము కనుపించును. వీరి యప్పకవీయపీఠికయు, సీతాపతిగారి ఛందోదర్పణ పీఠికయు వీరిసిద్ధాంతమునకు లొంగనివి. ఇం దుభయభాషాసాంకర్య మెక్కువగా నున్నది. గ్రాంధికమే వ్రాయనెంచి పొరపాటున నడుమనడుమ వ్యవహారపదములను వాడినట్లు పాఠకులకు తోచక మానదు. అసలు శాస్త్రవిషయములను కథలువ్రాసెడివ్యావహారికములో వ్రాయలేకున్నను తత్సాంప్రదాయములు పూర్తిగా పాటింపవచ్చునుగదా? అట్లుగాక వీరు గ్రాంధికమే వ్రాయుచు నడుమ నీక్రింది పదముల జొనిపినారు—

'కనబడుతున్నది, వ్రాస్తూ, వ్రాసుకొన్న, తిరిగీ గద్దెక్కించడము, ఉంటుంది. చెప్పితే, వచ్చేది.'

ఇత్యాది పదములు కలిపినంత మాత్రమున వ్యావహారిక మనజాలముగదా? వారి సిద్ధాంతప్రకారము చూడ నందు తత్సాంప్రదాయములే కనబడవు. పై వంటి పదములు నూటికి, కోటికి జొనిపినంత మాత్రముననే దానికి సంభాషణలోని వాడుక సిద్ధింపదు. మొత్తముపై వ్యావహారికభాషకు వీరిభాషలో నే మాత్రము తావులేదనవచ్చును. అట్టిస్థితిలో వీరిభాషకు త్రిశంకుస్వర్గమేగతి—

గురజాడవారి వ్యావహారికము

గురుజాడ అప్పారావుగారు దిద్దుబాటు అను కథను వ్యావహారికములో నడపినారు. కవిభాషితములు మాత్రము శుద్ధగ్రాంధికములోనే యున్నవి.

'ఎంత ఆలస్యముచేస్తిని? పోకిరీమనిషివలె'—ఇందు గీసిన పట్టుల వ్యావహారమందు మార్పుండి తీరును. ఇట్లే మఱికొన్ని: 'గట్టిగా పిలిచితే కమలిని లేవగలదు.' పిలిస్తే, లేవగల్దు అనియు 'పిలుస్తే' అనియు వాడుక. వీరు 'పిలిచి'వరకు గ్రాంధికమును, ఆ వెనుక వ్యావహారికమును జోడించినారు. 'రాముడిని లేపగల్గితినా వేషము వెయ్యవచ్చును' ఇది 'రావుణ్ని లేపేనంటే... వేషం వెయ్యొచ్చు - లేక - వెయ్యవచ్చు' అని స్వాభావికోచ్చారణ.

ఈ కథయందలి పామరోచ్చారణగూడ తబ్బిబ్బులుగానే నడచినది.

'పుట్టినారింటికి యెల్తానంటే లెంపలాయించి కూకోబెట్టాలిగాని మొగోరిలాగ రాతలూ కోతలూ మప్పితే ఉడ్డోరం పుట్టదా బాబూ! యీపు—నానంతాను.'

అని యింతయాసగా మాటలాడు దాసీ రాముడు మఱికొన్ని పట్టుల 'నాకేంబోధ కాదు, అనను బాబూ! అలకచేస్తే, అంత వారుకారనా? చెప్పలేనుకాని, శెలవిస్తారు, వీధితలుపు' అని గ్రాంధికోచ్చారణ చేయును. శ, చ, స, భేదమువిడిచి మాటలాడు వానికే నడుమ నిట్టి యుచ్చారణ మస్వాభావికము గదా? టకారముచ్చరించుటకు తకారము

పలుకునోరు కొన్నిచోటుల టకారమదేపనిగా పలుకును.

వీరి 'పేరేమిటి' అను కథలోగూడ నడుమ నడుమ గ్రాంధికాచారముతోడనే పదములు పలికినవి.

'క్షేత్రంగలదు. కొండలనంతటను, ఇవి చూచుటకే మేం వెళ్ళేం, వుండెను, ప్రాణములనయినా యిత్తుముగాని దానిని యివ్వజాలము, ఒకనాటిరాత్రి.'

ఇట్టి వ్యావహారికవిరుద్ధసంప్రదాయములు ఎక్కువగా నున్నవి.

వీరిముత్యాలసరములలోగూడ వ్యావహారికము మృగ్యము. చూడుడు.

'మెచ్చునంటూ వీవు
నీవిక మెచ్చుకుంటే మించిపాయెను
కొయ్యబొమ్మలె మెచ్చు
కళ్ళకు కోమలుల సౌరెక్కునా ?'

ఇందు స్వభావసిద్ధమైన శిష్టవ్యవహారమెంతకలదో గ్రాంధికభాష యెంతకలదో సహృదయు లెరుగకపోరు. ఇట్లే వీరి లవణరాజుకథ, డామన్‌పిథియస్, మొదలగు పద్యఖండికలు తొంబదివంతులు గ్రాంధికము తోడను, పదివంతులు వ్యవహారభాషతోడను నడచినవి. ఆడపిల్లలపాటలు, దేశభక్తి ఈ రెండు నెక్కుడు వ్యావహారికమున నడచినవి. ఒకచోట 'గల్ను, మాట్నిజం,' అని ప్రయోగించిన నోరు మఱియొకచో 'కలను, కలదు, మాటనిశ్చయం' అని పలుకుచుండును. ఈ గ్రంథమందలి వ్యావహారికభాషకన్న వీరి కన్యాశుల్కమందలి భాష న్యాచురల్‌గా నుండును. దూరదూరముగా నస్వాభావిక పదప్రయోగముకలదు.

చింతా దీక్షితులుగారి వ్యావహారికము

దీక్షితులుగారు శబరి యను నాటకము వ్యావహారికభాషలో వ్రాసినారు. భాషలో మృదువు, తన్మయత పొడకట్టును. కాని గ్రాంధికవాసన పూర్తిగా విడువలేదు.

'అవునమ్మా అవును, ఇది—ఔనమ్మా ఔను, అని మారవలెను.

అయిపోతున్నావు—ఐపోతున్నావు.

నేర్చుకొంటవి—నేర్చుకొంటాయి, ఇట్లే: పారిపోతాయ్.

వెళ్లుతాను—వెడతాను.

పధ్నాలుగేళ్లు—పద్ధానుగేళ్ళు.

ఇట్టిమార్పు వాడుకలోని సాంప్రదాయము. కొన్నిచోట్ల 'వ్యాజము, దూరము, ఆకాశము అని మువర్ణకముతో వ్రాసి 'ఆరాధించడం, కోపం, సహాయం, కోసం, చిత్రకూటం, వనవాసం' అని వాక్యాంత పదాంతములయందు సున్నగా వ్రాయుదురు. 'పరుగెత్తును, వాడుతావా, ఇదుత్వమును, పెట్టుకొన్నది.' ఇందొత్వమును గ్రాంధికములు, 'చెప్పుతావు, చెప్పితే' అన్నచోట 'చెబుతావు, చెబితే, చెపుతే' అని వ్యవహారము. ఇది శ్రీపాదవారు వాడుదురు. మొత్తముపై వ్యావహారికనియమములు సరాసరిగా నడువలేదు. ఇది పాత్రలభాష, వీరిసొంతభాష చూడుడు.

'జింకలకున్న చురుకుదనము ఆమెకు కద్దు, ఆమెకళ్లు యౌవనమదమును వెళ్ళగ్రక్కుతున్నవి.'

ఇందు గీచిన పదములు శిష్టోచ్చారణవ్యవహారమున వేరుగా నుండును. దీనిని బట్టి వీరి భాషలోకూడ నెగుడుదిగుడులు కలవనియే నానమ్మకము.

శ్రీపాదవారి వ్యావహారికము

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు పెక్కు కథలు వ్రాసినారు. వ్యావహారికము వ్రాయుటలో స్వభావ ముట్టిపడుచుండును, అందొకమాట

యు శిష్టవ్యవహారమును దాటదు. పాత్రలో లీనమై వ్రాయు పరిణతప్రజ్ఞులు. కనుకనే చక్కని భాష వీరికలవడినది. వీరిభాష చదువునప్పుడు పాత్రలు సాభినయముగా కండ్లయెదుట నిలుచును. కథాభాషలోనేగాక శాస్త్రీయవ్యాసములలోగూడ వీరిభాష పొల్లుపోదు. వీరివలె వ్యావహారికము వ్రాయువారు చాల తక్కువ. నోరు, చేయికూడ బాగుగా తిరిగినవి.

వీరి వడ్లగింజల కథనుండి :—ఈ కథయందే సకృత్తుగా వ్యవహారమునకు పనికిరాని గ్రాంధిక సాంప్రదాయములు దొరలినవి. అవియైనను చాల తక్కువ.

'స్నానపుగది, అంగాస్త్రపుగుడ్డ' ఇందు పుగాగమము వ్యాకరణసాంప్రదాయము. 'స్నానాలగది. అంగాస్త్రంగుడ్డ' అనిన బాగుండును. ఇట్లే 'భూమిమీద—భూమ్మీద

చేతిలో—చేతులో

కబురుచేస్తాములే— . . చేస్తాంలే.

అనిగదా వ్యావహారికసాంప్రదాయము. ఇంతకు వీరిభాషలోని సుగుణము పైవారి భాషలోవలె శబ్దములుగాని క్రియలుగాని గ్రాంధిక ప్రత్యయములలో నుండవు. అట్లని నియమము లేకపోలేదు. ఏపదము నెట్లుచ్చరింతురో యట్లే యెన్నిచోటులనైన వాడుదురు. తామొకసారి పలుకుకొని వ్రాసినట్లుండును. ఈభాష కొకవిధమగు స్టాండర్డు వీరిలో దొరకును.

ఇక్లైవరియిష్టము వచ్చినట్లు వారు వ్రాయుచున్నారు. ఇట్టి యస్వాభావికపుభాష పెరిగి యిది విలక్షణమైన కృతకాంధ్రమును పుట్టించుచున్నది. భాషలోని గ్రాంధికవ్యావహారికసంకరము పదములలోనికికూడ దిగినది. అట్లు వ్రాయుట యందమనియో లేక యెవరియిష్టానుసారము వారు వ్రాయుటే ఏతద్భాషాలక్షణమనియో వారి యాశయమై యుండును. కొందఱి రచనలనుండి—

'చూచుతోంది.' ఇందు 'చూచు'వఱకు గ్రాంధికము : తోంది వ్యావహారికము. ఇట్టి పదములు వినుసరికి కటువుగానుండును. ఇట్టివే 'ముందుపనిచూచుగుందూ!, మాకుతోచుతోంది' మొదలగునవి. 'విచారింపతగ్గ విషయం ఏమిటంటే' ఇందు గ్రాంధికత్వము ప్రయోగింపబడినది. వ్యావహారికదృష్టితో జరుగునో రీపదమున కుంటువడితీరును. 'కనబరచేరు' ఇది 'కనపరిచేరు' అని వాడుక, ఇందు సరళాదేశము రకారముపై నత్వము గ్రాంధికయుక్తములు, ఇట్టి పదములనుండి 'కనంబరుస్తే, కనంబరుస్తా' ఇత్యాది రూపములుగూడ మున్ముందు పుట్టును. 'పారిపోతవి, ఉంటవి' ఇట్టివి గ్రాంధికభాషలో నున్న 'రామునివి, నావి, తిన్నవి' మొదలగు 'అవి' కలసినవానిలోని యెనాలాజీ ఐయుండును. ఇది వ్యవహారోచ్చారమందు ప్రసిద్ధముకాదు. 'వ్రాసును' ఆహా! ఏమి వ్యవహారము. 'రాస్తాఉంటుంది' అనినబాగు. దీనినిబట్టి 'వ్రాసుచున్నది' కూడ బయలుదేరవలసినదే. అసలు 'రాత' తప్ప 'వ్రాత' వ్యావహారికములో లేనేలేదు. వీనినిబట్టి ఉంటది, వెళ్తది ఇత్యాదులును 'త్రోసును, మోసును' మొదలగునవియు శిష్టవ్యవహారమున బయలుదేరవచ్చును. 'చేస్రీ, వేస్రీ, ఊర్కోను' గూడ నిట్టివే.

మఱియు నిందు కొన్ని సంధులుచేసిన పరుల కర్థబోధ కానేరదు. అట్టివి చేయకుండుట మంచిది. 'మాపిల్లింటికి వెళ్ళింది, మా అప్పిచ్చింది' వీనివలన పాఠకులు చదువునపుడు సరిగ నర్థముగాక, పిల్లి, అప్పు, అను

నభిప్రాయములు తీసికొందురు. ఇట్టి సంధులున్న పెద్దలే చేసినారు.

అన్యదేశ్యపదములు వ్యావహారికమున వచ్చునపుడు వానిని సంస్కరించి వ్రాయుచున్నారు. గ్రాంధికమందైన నీసంస్కార మవసరముగాని వ్యావహారికమం దనవసరము. ఆపద వ్యవహారము మనమెట్లు చేయుదుమో తద్రూపముననే దింపుట మంచిది. లేనిచో దానియందలి యందము మందగించును. చూడుడు :

‘ఖాతరీ, ఫకీరు, ఫిర్యాదు’ మొదలగునవి ‘కాతరా, పకీరు, పిర్యాదు’ అని వ్రాసిననే సొంపు. అంతేగాని వాని నిజరూపములతో వ్రాయకూడదు. మన వ్యవహారములో ‘కిరసనాలు, మేరేజి’ అనియే యుచ్చారణగలదు. దీనినిట్లే వ్రాయవలెనుగాని తద్భాషాసాంప్రదాయప్రకారము. ‘కెరోసిన్ ఆయిల్’ ‘మేరియేజి’ అని వ్రాయుచున్న స్వాభావికత్వము కిట్టునా? మఱియు ‘లాంత రిల్లాపట్రా’ అన్నదానికిని ‘లేంట్రెన్ పట్రా’ అన్నదానికిని భేదములేదా? ఇందేది స్వాభావికోచ్చారణకు సరిపడునో సులువుగా తెలియును. ఇట్లే ‘ఖులాసా. ఖూనీ’ శబ్దములు.‘కులాసా, కూనీ’ అని వ్రాయవలెనేగాని మార్చరాదు.

ఇంక లేఖనమందుగూడ కొందఱు ‘చేసాను’ అని వ్రాయుదురు. అంతకన్న ‘చేశేను’ అనుట మంచిది. ఇట్లే యితరములగు పదములందు ‘తిట్టేను, అడిగేను, ఇచ్చేను’ అని వ్రాయుటలోనే యుచ్చారసామీప్యము సిద్ధించును. ‘కోరసాగారు’ అని వ్రాయుటచే ‘ఖిలేదారుగారు, దివాన్‌జీగారు’ వలె నీ ‘కోరసాగారు’ కూడ క్రియగా భాసింపక నొకవ్యక్తిగా తోచి యర్థముకుదురక యాలోచించువారు గలరు. అనునాసికోచ్చారణగల పదముల కర్ధానుస్వారముచేర్చి గురజాడవారు వ్రాయుదురు. ‘ఏఁవేవ్,’ వలె. ఈయాచార మితరులలో నుండదు. ఉచ్చారణకు తగిన వ్రాత యదే.

నియమరహితభాషనుండి యేతద్రూపమైన సంకరభాష, కృతకపదజాలము పెచ్చుపెరుగుచున్నది. ఇది కేవలము కృతక మనక తీరదు. ఇట్టి పరిస్థితులలో వ్యావహారికభాషావాదులు. ‘అల్పజ్ఞానముగల పండితమ్మన్యులు వచ్చీరాని ప్రాచీనకావ్యభాషలో, నిర్దుష్టముగా కావ్యభాష వ్రాయగలవారు మిక్కిలి అరుదు. వ్రాయబూని చేతకాక కృతకభాష సృజించి ఆంధ్రభాషకున్నూ వాఙ్మయమున కున్నూ హానికలుగజేస్తూన్నారు.’ అని వ్రాయుచు నియమములేని కృతకపదశిలల నెగుడుదిగుడుగా నమర్చి నియమసుధాబంధనములేకనే యీ వాఙ్మయమహోన్నతసౌధమును నిలబెట్టుచున్నారు. కొందఱుత్సాహవంతులీసౌధ మింద్రభవనమే యనియు, నీ శిల్పచక్రవర్తులు కిరీటమాంధాతలనియు పొగడుచున్నారు. నిర్మితి పూర్తి కాకమునుపే కొంద రంతస్థులలోని కెక్కుచున్నారు. పండితపూత్కారములచే సౌధ మల్లలాడుచున్నది. ఇప్పటికైన కర్తవ్యమూహించి ఈ వ్యావహారికమునకు నియమబద్ధమైన పునాదులు నిలిపి సాధ్యమైనంత యభివృద్ధిలోనికి తెచ్చి నియమరహితభాషయను తప్పుపేరును తప్పించివేయుదురని నేటి శిల్పప్రభువులకు మనవిచేయుచున్నాను. ఆంధ్రు లొకరి నొక రతీతముగా పొగుడుకొనుచు కార్యసాఫల్యమును గూర్చి యర్ధకుశిలోనే పూర్ణానంద మొంది యిష్టమున్న వ్యక్తుల నెత్తివేయుట సర్వకళానాశనహేతువని గ్రహింతురు గాక!